
Damage Book

UNIVERSAL LIBRARY
OU_206106
UNIVERSAL LIBRARY



టెరెన్సు మెక్‌స్వినీ

# అంకితము

భారతదేశ స్వాతంత్ర్య సంరంభమున

తమ సర్వస్వము నర్పించిన వీరపుంగవులకు

భక్తిపూర్వకముగా

నంకితము నొసంగుచున్నాను.

—అనువాదకర్త.

మనకు స్వాతంత్ర్యము ఆడంబరమునకై గాని, యిరుగు పొరుగు రాజ్యములవలె పరాక్రమవంతుల మగుటకుగాని, మనస్థితి పొగడుకొనుటకుగాని కాదు. ఇంతకన్న గొప్పకారణములు మనలను పురిగొల్పుచున్నవి. అవి యాధ్యాత్మికములు. స్వాతంత్ర్యమునకై మనయంతరాత్మలు పరితపించుచున్నవి. ఆత్మస్వాతంత్ర్యమునకై ప్రయత్నించని వ్యక్తిగాని, జాతిగాని కలుగబోదు.

— టెరెన్సు మెక్స్వినీ.

# ఉపోద్ఘాతము

ఈ గ్రంథరాజమును తొలుదొల్త సుప్రసిద్ధ స్వాతంత్ర్యవాదియగు మెక్స్వినీగారు ఆంగ్లమున లిఖించిరి. ఐరిషు స్వాతంత్ర్య సమరమున తనప్రాణములను బలియొనర్చిన ఈ మహామహుఁడు లోకమున కెల్ల పరిచితుడు, స్మరణీయుడు. ఐరిషు విప్లవము దౌర్జన్య సహిత మార్గములపై నాధారపడియున్నను ఆవిప్లవనాయకుల హృదంతరాళముల పాదుకొనిన ధర్మాసక్తి యీపొత్తమునందు విశదీకరింపబడినది. ఉత్కృష్ట ధర్మావలంబనముచే గాక ఆశ్చర్యకరమగు త్యాగము సాధ్యము కాదని యిందు ధ్రువమగుచున్నది. దౌర్జన్య రహిత అసహాయోద్యమాభిమానులకు మనోరంజకములగు మహాత్ముని బోధలు, ఉపన్యాసములు, ధర్మసూత్రములు యీగ్రంథమునందు అచ్చటచ్చట పొడసూపును. ఆయాభాగములందు గ్రంథకర్త నామము మఱపునకువచ్చి, మహాత్ముని సరస్వతి ప్రత్యక్షమైనట్లుండును.

అనుభవశాలురును విజయవంతులు నగు మెక్స్వినీగారి పరిశీలనము దేశస్వాతంత్ర్యముఁగోరు ప్రతిమనుజునికి ఉపయోగకరముగా నుండును.

ఈ శ్రేష్ఠమైన పుస్తకమును నామిత్రుడు ఓగేటి వెంకటసుబ్బయ్య శాస్త్రిగారు ఆంధ్రములోనికి అనువాదము చేసిరి.

వీరి తెలుగు గ్రాంథికముగాక, గ్రామ్యముగాక, అప్రయత్నముగా వాడుక భాషయై మంచినీళ్ళప్రాయముగా సాగుచు బాలురకు కూడ తెలియగల సులభశైలిలో నిమిడియున్నది. తేటతెలుగు మాటలలో గంభీరభావముల నీయనగారు పొందుపరిచి యున్నారు. ఆంగ్ల విద్యాధికుడై, దానిఫలితముల పొందుచు, గాంధిగారి స్వరాజ్యాహ్వానము పొంది, వానిని త్యజించి సురల వాసికై యాశపడక కారాగారమును కూడ రుచిచూచి, తన శక్తిసామర్థ్యముల ననారతము దేశమాత సేవయందు వినియోగపరచ స్థిరసంకల్పుడైన యీయన ఆ గ్రంథమును భాషాంతరీకరించుట కర్హుడు.

ఈయన మొదట మెక్స్వినీగారి చరిత్ర తెలుగున వ్రాసెను. ఇది రెండవయత్నము. ఆంధ్రభాషయం దుత్తమ గ్రంథములు లేని కొరత దీరుట కీయన సాయపడుచున్నాడు. ఆంధ్రులు యీయన కృషికి చేయూత నొసంగుదురు గాక!

రేపల్లె పుష్య బ ౯ బుధవారము,
౩౦—౧—౧౯౨౮ } గొల్లపూడి సీతారామశాస్త్రి.

# పీ ఠి క.

ఈవ్యాసములను సాధ్యమైనంత త్వరలో పుస్తకరూపమున ప్రకటింపదలచితిని. ఇందునిమిత్తమై వానిని శైపుచేయించి సిద్ధముగా నుంచితిని. ఈ వ్యాసములను సరిచూచుటకైనను నాకుతీరిక దొరకలేదు. మూలములోనుండితిరిగి వ్రాయునప్పుడు చేసినపొరబాటులను దిద్దుకొనుటకును, కొన్నిపదములుమార్చుటకును మాత్రము వీలయ్యెను. 'మానసిక స్వాతంత్ర్యము' అనువ్యాసమును ఇతరవ్యాసములతో వ్రాసితిని గాని, అదివానితో ప్రకటింపబడియుండలేదు. దానినిప్పుడు మొదటిసారి ప్రకటించుచున్నాను.

## మ త ము.

ఇతరదేశస్థులమనములయందు పొడముదురభిప్రాయము నొకదానిని తొలగించుటకై యీముఖ్యవిషయమునుగురించి కొంతచెప్పవలసియున్నది. ఐర్లండునందు మతవైషమ్యము లేదు. మతావేశము గలదు. వివిధమతశక్తులవారికిని విరోధము పొందించుటకై, యాంగ్లేయ రాజనీతివిదులు, ఉత్తర ఐర్లండువారిలో భేదభావము వృద్ధిచేసిరి. క్యాథలిక్ మతశాఖవారు బలవంతులైనయెడల ఇతరుల కుపద్రవము కలుగునని బోధించిరి. పూర్వముగాని, యిప్పుడుగాని, మనదేశములో నిట్టియుపద్రవము లేనేలేదు. ఐరిషుప్రజలసంఘీభావము భగ్నముచేయుటకును, వైషమ్యములను వృద్ధిచేయుటకును, ఉత్తర ఐర్లండునందు ఆంగ్లేయాధికారులు విషబీజములనాటిరి. ౧౭౯౮ లో సంవత్సరమున ప్రజాస్వాతంత్ర్యమునకై ప్రయత్నములు జరిగినప్పుడు క్యాథలికులు ప్రొటెస్టెంట్లు కలిసియుండిరి. బెల్ ఫాస్టు

నగరము రిపబ్లికన్ భావములకు పుట్టినిల్లయి యుండెను. ప్రస్తుతము ఐర్లండులోనున్న మత వైషమ్యము అస్వాభావికమైనది. ఐర్లండునకు శత్రువులైనవారీభావములను వృద్ధిచేసి మనలను లోబరుచుకొనజూచుచున్నారు. స్వాతంత్ర్యములభించగానే యీభేదములన్నియు నశించును.

ఈమతవైషమ్యము మనలో నొక నష్టముకలుగ జేసినది. 'హైబర్నియానిజమ్' అను క్రొత్త శాఖయొకటితలచూపినదిగాని యిదికొద్దిరోజులు మాత్రమే జీవించి, మనయదృష్టవశమున రూపుమాసినది. ఇదిమిక్కిలి సంతోషకరము. ఆంగ్లేయాధికారులు తమరాజ్యమునుస్థిరపరచుకొనుటకై ఆరంజ్ మెనులను లోబరుచుకొన తమశక్తినంతయు వినియోగించిరి. వారికుద్యోగములను ధనము నొసంగి 'అల్ స్టరు' మీదనే గాక దక్షిణమున నింకకొన్ని స్థలములయందుగూడ వారికి పలుకుబడిని గౌరవమును కలుగ జేసి, తమకొక బలిష్ఠమగుపార్టీనికలుగ జేసికొనిరి. ఇట్టిస్థితి దుస్భరమగుటచే, ఉత్తరమున మతావేశపూరితులగు క్యాథలిక యువకులు కొంతమంది హైబీరియను సంఘము నొకదానిని స్థాపించిరి. ఆరంజ్ వారి రాజకీయ దుర్నయములను విఘాతముచేయుటకై యీశాఖయేర్పడియుండెను గాని, దీనికిమతముతో నేమాత్రముసంబంధమును లేకుండెను. ఐరిషు పార్లమెంటరీ యుద్యమముయొక్క చివరరోజులలో, దేశము నందంతట 'హైబర్నియానిజమ్' రాజకీయసాధనముగా నుపయోగింపబడుచుండెను. కార్కునగరమున కొన్నిసంవత్సరముల వరకు నీభావము రాజకీయజీవితమును సంపూర్ణముగా లోబర

చుకొనెను. ప్రజాస్వామికమునకై యాందోళనప్రబలినకొలది ఈశాఖయొక్క బలము క్షీణింపసాగెను. ప్రస్తుతము దీనికి కొంచెమైనను పలుకుబడిలేదు. ఈయుద్యమములో పనిచేసినవారిలోననేకులు, ప్రజాస్వామికమునకైన యాందోళమునందు చేరియున్నారు. దీనివలన వివిధశాఖలవారికిని వైషమ్యములను బెంచు నుద్యమములయందు, ఐరిషువారికి కొంచెమైనను సానుభూతిలేదని స్పష్టమగుచున్నది. 'హైబర్నియనిజమ్' రాజకీయసాధనముగా సృష్టింపబడెనని సూచించియుంటిని. కొలది కాలములోనే ఐరిషుప్రజ లీమార్గమునునిరసించి యితరసాధనములచే, ఐరిషు జాతీయవిముక్తిని సాధించుకొనుచున్నారు. ఐర్లండుదేశమునందు కొంతకాలమువరకు హైబర్నియానిజమ్ సాంఘిక వైషమ్యములను వృద్ధిచేసి, అస్వాభావిక పరిస్థితులను గలుగజేసినదనుట సత్యము. మనయదృష్టవశమున ఈపరిస్థితులు మారిపోయినవి. 'మతము' అనువ్యాసము వ్రాయు సమయమున యీహైబర్నియను భావములు వృద్ధియందుండెను. అందువలన నావ్యాసములో నిస్థితినివర్ణించుట తప్పదయ్యెను. ఈగ్రంథమును ప్రచురించుసమయమున నీవ్యాసమును మరల పరిశీలించగా నీప్రకరణమును తీసివేయవలయునని బుద్ధిపొడమెను గాని మతప్రతిష్ఠాపనలకు భౌతికభావములు చేయుచున్న ప్రమాదము విశదముగా నిందువర్ణింపబడియుండుటచే దీనినికూడ ప్రచురింపించితిని. లోకములో ప్రతిమతశాఖకును యీప్రమాదము కలదుగనుక నెల్లరకు నిదియుపయోగకారిగా నుండగలదు.

— టెరెన్సు మెక్స్వీనీ.

# విషయసూచిక.


| | | పేజీ |
|---|---|---|
| ౧. | స్వాతంత్ర్యతత్వము. ... ... | ౧ |
| ౨. | ఆంగ్లేయ సామ్రాజ్యమునుండి విడిపోవుట. | ౧౨ |
| ౩. | ధర్మబలము. ... ... | ౨౬ |
| ౪. | మిత్రులు—శత్రువులు.... ... | ౪౩ |
| ౫. | బలము—దానిరహస్యము. ... | ౫౮ |
| ౬. | కర్మయోగము. ... ... | ౭౨ |
| ౭. | భక్తి. ... ... | ౯౮ |
| ౮. | వీరపత్ని. ... ... | ౧౧౪ |
| ౯. | హాలిమీర. ... ... | ౧౩౨ |
| ౧౦. | సారస్వతము—స్వాతంత్ర్యము. (ప్రచార సంబంధమైన నాటకకర్త.) ... | ౧౪౪ |
| ౧౧. | సారస్వతము—స్వాతంత్ర్యము. కళకొఱకుకళ | ౧౫౫ |
| ౧౨. | మతము. ... ... | ౧౬౫ |
| ౧౩. | మానసికస్వాతంత్ర్యము. ... | ౧౭౯ |
| ౧౪. | సైనికవ్యవస్థ. ... ... | ౧౯౧ |
| ౧౫. | సామ్రాజ్యము. ... ... | ౨౦౦ |
| ౧౬. | యుద్ధము—(ఉపోద్ఘాతము.) ... | ౨౧౪ |
| ౧౭. | యుద్ధము-శాసనముయొక్క నిజమయినయర్థం | ౨౨౪ |
| ౧౮. | యుద్ధము—ఆక్షేపణలు. ... | ౨౩౨ |
| ౧౯. | ముగింపు. ... | ౨౪౦ |

# స్వాతంత్ర్య లక్షణము

## ఒకటవ ప్రకరణము

### స్వాతంత్ర్య తత్వము

స్వాతంత్ర్యమునకై మనమేల పోరాడవలయును? ఇట్లు ప్రశ్నించుటయు, దీనికి ప్రత్యుత్తర మొసంగుటయు నవసర మగుట మిక్కిలి వింతగా దోచక మానదు. చిరకాలమునుండియు మన మీపోరాటమును కొనసాగించితిమి. ఇరుకక్షల వారును పోరాటమును విరమింపలేదు. కాని యీపోరాటముయొక్క మూలతత్వమును స్వాతంత్ర్యముయొక్క ముఖ్యావసరమును నెవ్వరును గమనించుటలేదు. ఇందువలన ప్రజల మనములయందు కొన్ని దురభిప్రాయములు గలుగుచున్నవి. తమ యాదర్శములయందును, పద్ధతులయందును విశాలము లగు సమానాభిప్రాయములు గలవారు, ఒకపక్షమునకు జెందిన వారివలె నగుపడుటయు మన మనుకొనునంతటి భేదాభిప్రాయములు లేనివారు శత్రుపక్షములయందు చేరి పోరుచుండుటయు తప్పకున్నది.

ఐర్లండు దేశమునందంతటను (ఇతర దేశములలో స్థితి యింతకంటె హీనముగా నున్నది) గమ్యస్థానము చేరుటకు పద్ధతుల పవిత్రతతో నిమిత్తము లేదను దురభిప్రాయము ప్రబలియుండుటచే ఈప్రశ్న యిచ్చట చర్చించుట యవసరమైనది. ఒకపక్షము వారు, తమ శత్రువులు అక్రమపద్ధతుల నవలంబించుచున్నారని నిందింతురుగాని, తామా యక్రమపద్ధతులనే యవలంబించి జయముగాంచ వెనుదీయరు. కావున నీవిషయమై నాభావములను స్పష్టముగా వెల్లడిచేయుట యవసరము. క్రమమయిన పద్ధతులమీద నాధారపడియుండని జయము పరాజయముకన్న నవమానకరము. ఆంగ్లేయ సామ్రాజ్యముతో మన కేమాత్రము సంబంధ మవసరము లేదనియు ఐర్లండునందు నిరంకుశాధికారమును రూపుమాపుటకు వీలైనయెడల పరరాజ్యములతో సంధిచేసికొనవలెననియు, మన మెవరితో మైత్రిచేసికొనుచున్నామో వారు తమకు లోబడియున్న ప్రజల నస్వతంత్రులుగా చేసినను మనకు దానితో నిమిత్తము లేదనియు వాదించువార లనేకులుండుట శోచనీయము. ఇట్టి యభిప్రాయములు వెలిబుచ్చువారికి తగిన ప్రత్యుత్తర మొసంగుట మనవిధియై యున్నది. ఇతర దేశప్రజల స్వాతంత్ర్యము నడంచుటకు సహాయభూతులమై మనస్వేచ్ఛ సంపాదింపగడంగితిమేని యనేక సంవత్సరములనుండియు, నిరంకుశాధికారమును రూపుమాపుటకు మనము చేసిన ప్రయత్నములన్నియు నిరర్థకమగును. అక్రమపద్ధతుల నవలంభించుటవలన ఐర్లండునకు స్వాతంత్ర్యము లభించునని నాకు దెలియును. కావుననే

నాసిద్ధాంతములను స్పష్టముగా తెలియబరచుచున్నాను. భౌతిక జయమునకై, పరమోత్కృష్టమయిన యాధ్యాత్మిక సిద్ధాంతముల నాహుతిజేయుట తగనిపని. అట్లు చేయువారితో నా కేమాత్రము సంబంధ మవసరములేదు.

మనము స్వాతంత్ర్యము కోరుటకు నిజమయిన కారణములేవియో యిప్పుడు విచారింతము. ఈవిషయమును రెండు విధములుగా నాలోచించవచ్చును. మొదటి యవస్థ తరుణవయస్కులగువారు చూపెడి యుద్దేశము. కళాశాల నప్పుడే వదలిన యువకుడు ప్రతివానితోడను వాగాడంబరము చూపుచు చర్చించుచున్నాడు. తన భావములను చాతుర్యముగా వెల్లడిచేయుట యొక్కటియే యతని కవసరము. అతని యుద్దేశములు రోమనుల యుత్సవముల బోలి యుండును. సేనల జయఘోష, సేనాసమూహముల జయారావము, పతాకముల యట్టహాసములను బోలి క్షణభంగురములై యుండును. అతడు త్రికరణశుద్ధిగా నమ్మిన సిద్ధాంతముల నాచరణయందుంచుటకు ప్రయత్నింపడు. ఈ వయసునందు స్వాతంత్ర్యముయొక్క ఆధ్యాత్మికావసర మతనికి గోచరించదు. కొంతకాలము గడచిన తరువాత యావనోద్దేశము నశించును. లోకానుభవములవలన నిజస్థితుల నతడు గుర్తెరుంగును. జీవయాత్రయందు అతనికి గలిగిన కష్టములు, అనుభవములు, దుఃఖములు అతని మార్చివేయును. ఆధ్యాత్మికవిషయములయం దాతని హృదయము లగ్నమగును. ఆడం

బరముగా నగుపడినంతమాత్రమున యాతని యాత్మకు సంతృప్తి గలుగ నేరదు. స్వాతంత్ర్యభావము లాతని హృదయమునందు గాఢముగా నాటుకొని కార్యసాధనకు గడంగ జేయును. ఇట్లు కానియెడల అతడు త్యాగము బూనుటకేమాత్రము నవకాశము లేదు.

ఆధ్యాత్మికాభివృద్ధికై స్వాతంత్ర్యము మానవుల కవసరము. భౌతిక విషయములు రెండవ పక్షము. జీవయాత్ర గడుపుచున్న ప్రతివ్యక్తికిని, భౌతిక, ఆధ్యాత్మిక సంబంధములగు శక్తులు భగవంతునిచే ప్రసాదింపబడినవి. ఈ శక్తుల నభివృద్ధి చేసికొనుటకును, తన ధర్మమును చక్కగా నెరవేర్చుకొనుటకును తగిన సదుపాయముల గలుగజేయుట ప్రభుత్వమువారియొక్కయు, సంఘముయొక్కయు, కర్తవ్యమై యున్నది. స్వాతంత్ర్యరాజ్యము సంపూర్ణమగు ఆత్మాభివృద్ధికి స్వాభావికమగు స్థానము. అస్వతంత్రరాజ్యములయందీ యభివృద్ధి కలుగనేరదు. ఈప్రజలు భౌతికముగను, యాధ్యాత్మికముగను క్షీణదశకు వచ్చుట సహజము. ప్రజలను పీడించి ధనము లాగుటచే దేశదారిద్ర్యము హెచ్చును. తమ పరిపాలనమును స్థిరపరుచుకొనుటకు పాలకు లనుదినమును పన్నుచున్న కుయుక్తులవల్లను, తంత్రములవల్లను, ప్రజలను నీతిబాహ్యులనుగా చేయుటకు చేయుచున్న ప్రచారమువలనను నైతికవినాశము గలుగుచున్నది. ప్రజలను నీచస్థితికి దెచ్చునదగుటచేతను, అధర్మమును పెంపొందించునదగుటచేతను, పారతంత్ర్యమును ప్రతిఘటించుట మన విధియై యున్నది.

అధర్మమును, పాపమును మనకు పొడగట్టినప్పుడు వాని తో పోరుటకన్న వేరు కర్తవ్యము లేదు. ధర్మమునకును, అధర్మమునకును పొత్తు గలుగనేరదు. స్వతంత్రరాజ్యములు ప్రజాభివృద్ధికై పాటుబడును. విదేశీయ ప్రభుత్వములు తమకు లోబడియున్న ప్రజలయందు నీచగుణముల పెంపొందింప జేయును. ఐర్లండు దేశమునం దిట్టి ప్రయత్నము లనేకములు జరిగినవని యందరికిని తెలిసినవిషయమే. ఆంగ్లేయ ప్రభువులు తమ యధికారమునకు సహాయభూతులగువారికి బిరుదులును, ఉన్నతోద్యోగములును నొసంగుట సామాన్యమై యున్నది. కాని మిక్కిలి యున్నతస్థానములును, రాజ్యాధికారమునకును, ధనమునకును, వైభవమునకును, ఆస్పదము లైన గౌరవములును, తమ్ము విశ్వాసముతో గొల్చువారికిగాక ఐరిషుజాతికి ద్రోహము చేయ సమకట్టిన నీచవ్యక్తుల కొసంగబడుచున్నవి. స్వతంత్రరాజ్యములయందు మహామహులుగా పరిగణింపబడు వారు పరరాజ్యములయందు తిరస్కారభావముతో చూడబడుచున్నారు. నీతిలేని రాజకీయవేత్తలయందును కొన్ని యుత్తమగుణములు లేకపోలేదు. స్వతంత్రరాజ్యము సద్గుణముల నభివృద్ధి పరచును. పరరాజ్యము హీయవగుణముల పెంపొందించును. అనుకూల పరిస్థితులయందుగూడ గొప్ప కార్యములు చేయుట కష్టతరమైనపని. అధర్మమార్గముల యందు నడుచుకొనుటకు సావకాశములు గలిగినప్పుడు నైతిక పతన మవశ్యముగా సంభవించును. మనలో ననేకులిట్టి యధర్మమార్గములకు లోబడకుండుట సంతోషకరము. కాని యిట్టి

యధర్మరాజ్యములయందుండు ప్రజలకు గొప్ప యాదర్శముల యందు గల నమ్మకము చెడును. నిరుత్సాహము ప్రబలును. వారి శక్తులన్నియు బీడుపడును. ప్రజ లెల్లప్పుడును ఉన్నతాదర్శములను, ధర్మచింతనమును గలిగియుండవలెను. కాని యన్యదేశీయులపాలనలోనుండి శుష్కించి శల్యావశిష్టమయిన భూమి కిట్టి భావములు గలుగుట యసంభవము. కాన ఆత్మనాశము గలుగకుండుటకై మనకు స్వాతంత్ర్యము ముఖ్యావసరము.

ఈయాధ్యాత్మికాదర్శములే మనమనస్సుల నాకర్షించి కార్యసాధనకు పురిగొల్పుచున్నవి. కనుకనే యీచక్కని గమ్యస్థానముచేరుటకు మన మనుసరించు పద్ధతులును పవిత్రములుగా నుండవలెను. మనల నుత్సాహభరితులనుగా జేయునది మనమాతృభూమియెడలప్రేమగాని, శత్రువుల యెడలద్వేషమును, యిదివరకు మనకుజరిగిన యన్యాయములకు ప్రతీకారమును గాదు. ప్రేమతత్త్వముమీద నాధారపడియున్న మనకార్యసాధనములు కష్టములను జయించుటకు బలవత్తరమైనవికావని కొంతమంది పరిహసించినప్పుడు మనకు కోపమువచ్చుట సహజము. నిష్కళంకమగుప్రేమ యితర నీచసాధనములవలెగాక శత్రువులను జయించుటకు బలవత్తరమైనసాధనము. ఒక నిదర్శనము చూపినయెడల యిదిస్పష్టము కాగలదు. షెల్లీమహాకవిచే చిత్రింపబడిన ప్రిన్‌సెస్‌నావలెట్టు (Princess Novelette) హాస్యరసప్రధానముగా నున్నంతమాత్రమున, ప్రపంచమును సంతోషమునందును, ఆశ్చర్య

మునందును ముంచిన చక్కనియాదర్శములను దూషించు
వారి నేమనవలెను! బుద్ధిమంతు లిట్టిదూషణముల కెడమీయరు.
పవిత్రత ప్రపంచమునకంతటికిని కావలిసినదే. మనోరంజక
మగు వస్తుసంచయమును జూచుటచే, మనస్సున కమితా
నందముగలుగును. మనోహరమగు వేణునాదము, ప్రవాహ
ములలోని తరంగముల గంభీరనిస్వనము, సాయంసమయము
నందలి పశ్చిమదిక్కామినియపూర్వసౌందర్యాతిశయము,
ప్రభాతకాలము నందలి ప్రశాంతత, మనకు పరమానందము
గొల్పి, మనయందు లీనమైయున్న పవిత్రభావములను పురిగొ
ల్పును. మాతృభూమియెడల మనకుగల ప్రేమయే, చిక్క
శల్యావశిష్టమయిన భూమిని సకలాంగసుందరియనియు, సమ
స్తసుఖముల కాకరమనియు వర్ణించుటకు పురిగొల్పుచున్నది.
దీని తత్వము నందరును గ్రహించవలయును.

పూర్వమునుండియు మనకు జరిగిన యన్యాయములకు
పగదీర్చు కొనవలయుననిన మనము ప్రస్తుతస్థితియందే యుం
డుట యుత్తమము. ఐర్లండుప్రస్తుతస్థితి, ఇంగ్లండునకు ఎక్క
లోని బల్లెమువలె నున్నది. దీనిని చర్చించి కాలహరణము చేయ
నవసరములేదు. మనలను తృప్తిపరచుటకు, ఇంగ్లండు చేయు
చున్న మూఢప్రయత్నములవలన, ఇంగ్లండే యీవిషయము
నొప్పుకొనుచున్నట్లు వెల్లడియగుచున్నది. మనలను లక్ష్యపెట్ట
కుండుట దానికి శ్రేయస్కరమయినచో నది యట్లుచేసియుం
డెడిదే. ఆంగ్లేయసామ్రాజ్యముతో విడిపోవుటకు మనముచే
యుచున్న ప్రయత్నములు సఫలమయినచో, నుభయపక్షము

లవారికి లాభము సమానమే. ఇది వింతగా నగపడవచ్చును. కాని యిదిసత్యము. ఆంగ్లేయు లీసత్యము నిప్పుడు గ్రహింపజాలరు. ఇంగ్లండుమీదికి నితరరాజ్యములు దాడి వెడలిరాకుండ, ఐర్లండు కాపాడగలదను వారియుద్దేశ్యములు హాస్యాస్పదములు. ప్రస్తుతస్థితియం దిట్లు జరుగనేరదు. ఐర్లండు స్వాతంత్ర్యము బడసినతరువాత నిదివీలగును. మనవైపుననుండి, ఇంగ్లండునకు భయములేకుండ కాపాడుట కిప్పుడు మనము శక్తివంతులమై యుందుము. మనముస్వతంత్రులమైనయెడల,ఇంగ్లండునకుగాని, యితర దేశములకుగాని, స్వాతంత్ర్యభంగమొనర్తు మనువారివి మూఢాభిప్రాయములు. ఏస్వతంత్రరాజ్యమును తమకుసంబంధించని తగాదాలలో ప్రవేశించునని తలచుట బుద్ధిహీనత. మనము తటస్థముగా నుందుము. లోకజ్ఞానమును, ధర్మనిష్ఠయు, యీపద్ధతినే పురిగొల్పుచున్నవి. ఒకస్వతంత్రజాతి, యితరుల స్వాతంత్ర్యమునకు భంగముకలిగించకుండుట మిక్కిలి యావసరము. స్వతంత్రజాతులన్నియు, నొకరి స్వాతంత్ర్యము నొకరు కాపాడుకొనవలయును. ప్రపంచమునందు నిరంకుశప్రభుత్వములున్నయెడల, వానినితొలగించుట యొకజాతికిమాత్రమే శక్యముకాదుగాని, తమవ్యవహారములను స్నేహముమీదను స్వేచ్ఛమీదను నాధారపడియుండునట్లు చూచుకొనుట ముఖ్యము. సంపూర్ణస్వాతంత్ర్యమే మనకును, ఆంగ్లేయులకును, నిత్యమగుస్నేహభావ మొనగూర్చును. ఆంగ్లేయులతో నెల్లప్పుడును యుద్ధముచేయవలయునని చెప్పువా రెవ్వరునుండరు. మనస్వాతంత్ర్యము, మనశత్రువులకు ద్రోహముచేయుట

యుందుగాక, వారికి మేలుచేయుటకుతోడ్పడవలయును. ఇంగ్లండుకు కీడుచేయదలచినయెడల ప్రస్తుతస్థితియందే యుండుట మంచిది. పగదీర్చుకొనుటకు మనకనేక సావకాశములుదొరకును. కాని యవి మనలను సంతోషపెట్టజాలవు. స్వాతంత్ర్యమనిన కొన్ని స్వతంత్రరాజ్యముల నేర్పరచుట మాత్రమే గాదు. అన్నిజాతులవారికిని స్నేహము పెంపొందింపజేసి, లోకకళ్యాణమునకును, శాంతికిని దోడ్పడుటయై యున్నది. ఇందుకే మనజాతికి స్వాతంత్ర్యము ముఖ్యావసరము.

ఈభావముల నన్నిటిని పాఠకులు చక్కగా గ్రహించులాగున యీప్రకరణమును మిక్కిలి శ్రద్ధతో వ్రాసితిని. ఈ వ్యాసమును చదివినవారలందరకును తనువిధి స్పష్టముకాక మానదు. ఈకార్యము కష్టములతోగూడినదైనను ఫలములతి సారవంతములు. మనకుస్వాతంత్ర్యము ఆడంబరమునకై గాని యిరుగుపొరుగు రాజ్యములవలె పరాక్రమవంతులమగుటకు గాని, అనగా అంతదుర్మార్గులమై యుండుటకుగాని మనస్థితిని పొగడుకొనుటకుగాని కాదు. ఇంతకంటె గొప్పకారణములు మనలను బురిగొల్పుచున్నవి. అవి యాధ్యాత్మికములు. స్వాతంత్ర్యమునకై మనయంతరాత్మలు పరితపించుచున్నవి. ఆత్మస్వాతంత్ర్యమునకు ప్రయత్నించని వ్యక్తిగాని, జాతికాని కలుగబోదు. మన మిప్పు డున్న స్థితియందే యుండుటకు వీలులేదు. అభివృద్ధి చెందవలెను. లేదా యధోగతికిబోవలెను. మనజాతి పురోభివృద్ధికిని, మనదేశమునకు స్వాతంత్ర్యము నొనగూర్చు కార్యమునందును, మన మందరము కలిసి పనిజేసినయెడల

మనము కృతార్థుల మగుదుము. జయము కరతలామలక మగును. కాని యల్పసంఖ్యాకులే యీ పోరాటమును నల్పుటకు నిలిచియుండి లేని వారు ద్విగుణీకృతోత్సాహులై పనిజేయుట మిక్కిలి యవసరము. వారు తమ జన్మహక్కగు వ్యక్తిస్వాతంత్ర్యము నకై పోరాడుచున్నారు. అధిక సంఖ్యాకులీ హక్కును నాశము చేయజాలరు. నిరంకుశాధికారు లీవీరుల ననేక కష్టములకు లోనగా జేయుదురుగాని యీ భావమునశింపజాలదు. దీనిని రక్షించుటకు సేనలుగాని, పొగడుటకు కవులుగాని యవసర ము లేదు. కాని సర్వసాధారణముగ సేనలును, కవులును దీని యుత్కృష్టతను గ్రహించియే యున్నారు. ఒకవ్యక్తియే దీనిని రక్షింపవచ్చును. ఈ దివ్యపురుషుడు పరాజయము నెరుగడు గనుక యీ భావము నశింపజాలదు. ఐర్లండులో నిట్టి దివ్య పురుషు డొక్కడే యున్నాడనిగాదు. ఇటువంటిదురవస్థ మనకు సంభవించ నేరదు. ఇన్నిసంవత్సరముల నుండియు, శత్రువులు మనల నోడించ లేకపోయిరి. ఇప్పుడు మన మోడింపబడుదు మనుమాట కల్ల.

స్వాతంత్ర్యముయొక్క ఆధ్యాత్మికావసరము, స్వాతంత్ర్యము సర్వమానవకోటికి స్నేహము పెంపొందించుట కను గంభీరభావము, స్వాతంత్ర్యము లేనిది స్వధర్మ మాచరింపబడ నేరదను నిశ్చయము, ప్రతివ్యక్తిని తనధర్మము నిర్వర్తించు టకు ప్రోత్సహించవలయును. ఈకార్యమునందు అధిక సంఖ్యాకులతో ప్రతిఘటించి పోరవలసియుండును. అది కష్ట మగు కార్యము. కాని యధిక సంఖ్యాకులతో పోరువాడు,

జయము తమను మిక్కిలి యున్నతస్థానమునకు గొనిపోవునని దృఢముగా విశ్వసించి యనేక కష్టములకు లోనయ్యు గమ్యస్థానము చేరును. అతడు ప్రజలచే పరిహసింపబడి వారి దూషణ, భూషణ, తిరస్కారములకు లోనుగావలసివచ్చును. ఎన్నికష్టములు సంభవించినను అతడు ధైర్యము వీడడు. జయమును బొందుటకై ప్రతిసావకాశము నతడు వినియోగించుకొనును. తన యనుచరులును, తానును మిక్కిలి ధైర్యముతో హృదయదార్బల్యమున కెడమీయక ఉత్సాహముతోడను, సంతోషముతోడను ప్రయత్నింతురు. ఈ సంరంభమున యీ యల్పసంఖ్యాకులు నశించినను, యీ యాదర్శముల గొప్పతనమును, పవిత్రతయు వెల్లడియగును. వారు తమ స్వాతంత్ర్యమునకై ప్రాణత్యాగము చేసియుండుటవలన, దేశప్రజలు వారియాదర్శములను గమనించి యుత్సాహముతో వారు తొక్కిన మార్గమును ద్రొక్కుదురు. ఈ యల్పసంఖ్యాకుల యాదర్శములు సఫలములగును. తమ జాతియంతయు నుద్ధరింపబడును. నిద్రాణమైయున్న జాతినంతయు ప్రతిఘటించి యొంటరిగా పోరుసలిపిన వీరుడు తనమార్గమొక్కటియే సత్యపథమని జాతికంతయు చాటుచున్నాడు. మృత్యువువాతబడియు దేశోద్ధారకు డగుచున్నాడు.

---

# రెండవ ప్రకరణము

## ఆంగ్లేయ సామ్రాజ్యమునుండి విడిపోవుట

శ్లో॥ యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ!
సిద్ధ్యసిద్ధ్యో సమోభూత్వా సమత్వం యోగ ఉచ్యతే॥

—భగవద్గీత ౨-౪౮.

ఆంగ్లేయసామ్రాజ్యమునుండి విడిపోయిననేగాని మన దేశము సంపూర్ణాభివృద్ధినొందదనియు, ఆంగ్లేయులతో నిత్యమగు శాంతి గలుగనేరదనియు మనము వాదించినప్పుడు మన ప్రతిపక్షులయందు భిన్నాభిప్రాయములు పొడగట్టుచున్నవి. కాని యీప్రశ్నను మనతో బాగుగా చర్చించి, అవసరమైన యెడల మనసిద్ధాంతములను ఖండించు విశాలబుద్ధి వారెవ్వరియందును గానరాదు. ఒకడు మన సిద్ధాంతముయొక్క తత్వమును గ్రహించలేక తమ పక్షనాయకులగు, రెడ్మండు (Redmund) ఓబ్రియన్ (O'Brien) గార్లను నిరసించుచున్నామని తలచును. మరియొకడు మన యాశయములను తిరస్కారభావముతో జూచును. రెడ్మండు, ఓబ్రియన్‌గార్ల యనుచరులతో వాదించి లాభములేదు. వీరందరును కొంతకాలమునకు తమ యభిప్రాయములను మార్చుకొనకతప్పదు. ముందుముందు వారి దేశభక్తి, ప్రస్తుతము వారి నావరించియున్న నిరుత్సాహమును, నిస్పృహాయతను తొలగించి, మహాత్యాగ

మునకును, ఘనకార్యసమాచరణకును, పురిగొల్పి, ఆనంద దాయకమగు స్వాతంత్ర్యగమ్యస్థానమునకు చేర్చుననుటకు సందియము లేదు. ఇట్టి సమయమునకై మనము దేశమును సిద్ధముచేయవలయును. తరువాత మన యాశయములను విరసించువానికి ప్రత్యుత్తర మొసంగవలయును. మన వాదముల నతడు శ్రద్ధతో వినవలెను. మనము పూర్తిచేసిన తరువాత మనతో నతడు కొన్ని విషయములయం దేకీభవించవచ్చును. లేదా యన్ని యంశములయందును భేదించవచ్చును. కాని యీ ముఖ్యవిషయమునందు తిరస్కారభావమువలన భేదభావములు వృద్ధియగుటయేగాని లాభమేమాత్రమును లేదని యాతనికి తెలియ జెప్పుచున్నాను.

ఈత డిట్టి యభిప్రాయములను వెలిబుచ్చుట కొంత వరకు మనలోపమనియే చెప్పవలయును. అతనితో మన సిద్ధాంతములను దెల్పి, యాంగ్లేయ సామ్రాజ్యమునుండి విడిపోవుట శ్రేయస్కరమని మనమెన్నడును నిరూపించియుండలేదు. ఎవరేమి తలచినను, విడబాటుకై ప్రయత్నించుట మన హక్కని తలచి దానికొరకై మహాత్యాగము నొనర్చియుంటిమి. మహాప్రయత్నములు చేసియుంటిమి. ఎన్ని యిబ్బందులు గలిగినను సంపూర్ణస్వాతంత్ర్యము గడించెదమని ప్రతిజ్ఞబూని యుంటిమి. కాని మన సిద్ధాంతములకు సర్వజనాంగీకారము సంపాదించి యుండలేదు. మన స్నేహితుడీ సమస్యను గురించి బాగుగా నాలోచించలేకపోయినను, దీని యావసరమును సూచించియే యున్నాడు. మనమిప్పుడు దీని

తత్వమును వానికి చక్కఁగా బోధించుట యావసరము. వేదాంతము, శాస్త్రము, ప్రపంచముయొక్క ఐక్యమును, పూర్ణత్వమును విశదీకరించినవి. మరియు ప్రజల శాస్త్రజ్ఞాన మభివృద్ధి యగుకొలది యీ విశ్వముయొక్క క్రమమును, పూర్ణత్వమును ధృవపరుచుటకు శాసనముల కనిపెట్ట వీలగునని వ్యక్తమగుచున్నది. కావున మన యీ సిద్ధాంతము నిలుపవలెనన్న, అది మన జాతీయ జీవనము నభివృద్ధిపరచి, మనలో మనకు శాంతి గలుగజేసి, సర్వజాతిసమితియందు మనకు గౌరవస్థానము నొసంగి, మన జాతీయధర్మమును చక్కఁగా నిర్వర్తించుటకు సావకాశములు గలుగజేయునని మనము నిరూపించవలెను. మనమెన్నికష్టముల నొందుచుండినను, మన దేశమున కిట్టి యున్నతస్థానము లభించునను నాశయే మనలను కార్యసాధనకు పురిగొల్పినది. ఇట్లు కానియెడల సంవత్సరముల పర్యంతము కష్టములను—అవసరమయినయెడల చావును—నెదుర్కొనవలయుననియు, ఆత్మసమర్పణము చేయవలెననియు, మనలను కోరుచున్న యీ సిద్ధాంతమునకు మనము సమ్మతిజూపజాలము. కావున మన సిద్ధాంతములను పరీక్షించుటకు గడంగుదము. ఈ పరీక్షయొక్క ఫలితము, ఉత్సాహమును, హృదయసంచలనమును గలుగజేయకమానదు. కాని మన మనస్సులయందు గాఢముగా నాటుకొనియున్న దురభిప్రాయములను వీడవలయును. ఇట్లు చేయనియెడల సత్యము గోచరించదు. స్వాతంత్ర్యముయొక్క ముఖ్యోద్దేశము మన జాతికి మాత్రమేగాక, ప్రపంచములో నన్నిజాతులవారి సుఖ

మునకును, ముక్తిని సాధించుటకును నై యున్నదని మనము గమనించిన యెడల, యీ సత్యవిచారమునందు మనము ముందుకు నడచినకొలది మనధైర్యము హెచ్చును.

ఈ రూపములో నుండెనేని, యీ సమస్య కార్య శూరులందరిమనస్సుల నాకర్షించక తప్పదు. తిరస్కారభావ మును జూపినవా రిప్పుడు, యీప్రశ్నను చర్చించుటకు సంసిద్ధులై యుందురు. ఇంకను వారు మన సిద్ధాంతముల నొప్పుకొనక పోవచ్చును. మనదేశము మిక్కిలి దుర్బలస్థితియం దున్నదనియు, ప్రతిపక్షులతో పోరాడుటకు, ఆయుధములు గాని, బలముగాని లేదనియు వారు చెప్పవచ్చును. మనదంతయు అనాచరణీయమగు వేదాంతమని వారు పల్కవచ్చు ను. ఇట్లు పలికినను, యీ సమస్య వారిబుద్ధి నాకర్షించుట సంతోషకరము. ఇప్పుడు గాకపోయినను, కొంతకాలమునకైనను మన సిద్ధాంతముల సత్యమును వారు గ్రహించునట్లు చేయవచ్చును.

తనజీవితకాలములోనే తాను దేశమునకొనర్చిన కృషి ఫలవంతము గావలెనను దురభిప్రాయ మతని వేధించుచున్నది. ఇట్లు తలచుట పొరపాటు. మానవుల జీవితము సంవత్సరముల చేతను, జాతీయ జీవనము శతాబ్దములచేతను పరిగణింపబడును. ఇట్లగుటచే జాతీయసేవకు ఫలితము భవిష్యత్కాలమున గాని పొందజాలము. కావున దేశసేవకులందరు తమసంతతుల కాల మున పరిపక్వము కాగలఫలమునకై, ప్రస్తుత కాలమున పాటు

బడుటకు సంసిద్ధులైయుండ వలయును. మనుష్య జీవితమువలెనే జాతీయ జీవనమును మూడవస్థలుగా విభజింప వచ్చును. బాల్యము, యౌవనము, వృద్ధాప్యము, యౌవనము మిక్కిలి సుఖప్రదముగాను, ఆనందదాయకముగాను నుండ గోరిన యెడల, బాల్యావస్థయందు గొప్పయాదర్శములును, దూరపు టాలోచనలును గలిగి ధైర్యము తోడను, ఉత్సాహముతో డను కృషిసల్పవలయును. బాల్యావస్థయం దెంత కృషిచేసిన యౌవనమునం దంతయున్నతస్థానమును బొందుట కవకాశ ములు గలవు. జాతీయ జీవనమునందును నిట్లే. దేశ మున్నత స్థానమును జెందవలెనన్న బాల్యమునందు చక్కగా దున్ని విత్తనములు చల్లవలెను. కాని ఫలితము మనజీవితకాల మునందు సంప్రాప్తమగు నని తలచగూడదు. ఇతరులు అనుభవించుటకు మనము ప్రయత్నము చేయుచున్నామని గమ నించుట ముఖ్యము. నిస్సహాయులమై, నిరుత్సాహముతో మనము ప్రయత్నించవలసి వచ్చునని నాయుద్దేశ్యముగాదు. మనయాశయములు సఫలమగునాసలుగాని, సంతోషముగాని, యుత్సాహముగాని మనకు లేకపోలేదు. మన జీవితకాలము లోనే మనము కోరుఫలితము మనకు గలుగవచ్చును. కాని దానివింతలు, విచిత్రములు మనకిప్పుడు గోచరము కాజాలవు. ఆసుఖములను మనవారసు లనుభవించెదరు. మనస్వాతంత్ర్య సంస్థాపనసందర్భమున, నుత్సవములలో పాల్గొనుట కనేక మందివీరులు బ్రదికియుండక పోవచ్చును. ఐనను వారికి ఫలితము లేకపోలేదు. స్వాతంత్ర్యము యొక్క అవసరము గమనింపబడి

నపుడు, నిరంకుశాధికారు లెంతబలవంతులైనను, స్వాతంత్ర్య
భావమును నిర్మూలము చేయలేరను సత్యము వారికానందము
గలుగజేసినది. తమ దేశాభివృద్ధికి పాటుబడితిమిగదాయను నా
నందమును, ఆత్మసంతృప్తియు వారికి మెండుగా గలిగినది.
తమ దేశౌన్నత్యమును, స్వాతంత్ర్యమును, ఆచంద్రార్కముగా
నుండగల వనునాసలు వారికి గలిగినవి. ఈ విధులలో ప్రతివా
నికిని వ్యక్తిస్వాతంత్ర్యము లభించినది. తన్నుగురించి ప్రజలేమి
తలంచినను సరే, అతడు తానుద్రొక్కుడు మార్గమే సత్య
పథమని గాఢముగా నమ్మి, దృఢసంకల్పముతో కార్యాచరణకు
గడంగును. చిట్టచివర కతడే బుద్ధిమంతుడని ఫలితమువలన
నిర్ధారణ యగుచున్నది. చరిత్రచూపు గుణపాఠముల నతడు
బాగుగా గమనించి ప్రస్తుత స్థితిగతులను చక్కగా విమర్శించి
తన కార్యములను ప్రపంచానుభవములకు వ్యతిరేకము
గాకుండ చేయుచుండును. అతనియాశయములు నెరవేరును.
అతడు పాతిన బీజములు వృద్ధి బొంది, పుష్పించి, కాయలు
గాచి ఫలములగును. అతడు చేసిన ప్రయత్నములకు వేయి
మడుంగులు ఫలసాధకమగును. ఇదంతయు జరుగుటకు కొంత
కాలముపట్టును. అతడుమరణించినను, అతని ప్రతిభ లోకమున
వెల్లడియగును. అతని జీవితము మిక్కిలి పూజ్యమును,
పవిత్రమునునై యున్నది. ముందు దేశసేవజేయువారి కతె
డాదర్శప్రాయుడుగా పరిగణింపబడుచున్నాడు. అతడు చేసెడి
త్యాగము స్థిరమైన మానవసేవగా పరిగణింపబడుచున్నది.
అతడు మనపిలెరుల సాంగత్యమునుండి సర్వకాల సర్వావస్థల

యందును స్మరణీయుడై యున్నాడు. అతడే నిజమయిన కార్య
శూరుడు. కార్యవాదినని డంబములు కొట్టుకొను వ్యక్తి మరి
యొకడు గలడు. అతడీ విషయములన్నిటిని బుద్ధిహీనము
లని తలచును. సమయోచితములగు, ఉపాయములకొరకతడు
ప్రయత్నించుచుండును. అట్టివాని యుద్దేశ్యము లెన్నడైన
నెరవేరినవా? లేదు. సర్వమానవులలోను అతడు అధముడు.
చరిత్రానుభవమును యీసత్యమునే చాటుచున్నది. సమ
యానుకూలముగ తన సిద్ధాంతములను మార్చుకొనువాడు
కార్యము సాధించినట్లు మానవచరిత్రయం దొక్కనిదర్శన
మైనను గానరాదు.

ఐనను ప్రజలు ప్రస్తుతస్థితిగతులనుజూచి భయపడి
'బ్రిటిషు సామ్రాజ్యముయొక్క బలముచూడుడు, మనదౌ
ర్బల్యస్థితిజూడుడు. మీయాశలన్నియు నిరర్థకములు,' అని
చెప్పుచుందురు. వారు బాగుగా నాలోచించినయెడల యీ
భావములు నిస్సారములని వారికి తెలియకమానదు. సామ్రా
జ్యములు శాశ్వతములుగావు. జాతులు శాశ్వతములు. పూర్వ
మునుండియు ప్రపంచమున వెలసిన సామ్రాజ్యములన్నియు
నేమైనవి? ప్రస్తుతసమయమందున్న సామ్రాజ్యములు నట్లే
విచ్ఛిన్నమగుటకు విషబీజములు దట్టముగా నాటుకొని
యున్నవి. పూర్వకాలమున గ్రీసు, రోమక సామ్రాజ్యము
లును, ప్రస్తుతసమయమున జర్మనీ, రషియా, ఆస్ట్రియా
సామ్రాజ్యములును విచ్ఛిన్నములగుట కన్నులార జూచియే
యున్నాము. క్రమాభివృద్ధినొంది, బలిష్ఠములగు సామ్రాజ్య

ములు నిర్మించుకొనిన జాతులు తమసామ్రాజ్యములను గోలుపోయి, యాకలు దీసిన కోళ్ళవలె నుండుట మనమెరిఁగియు, యిట్లు పల్కుటతగదు. ఐరిషుజాతి శాశ్వతము. ఆంగ్లేయ సామ్రాజ్య మెప్పటికైనను విచ్ఛిన్నముగావలసినదే. మనయున్నతస్థానము, మనము చూపగలుగు కార్యదీక్షమీఁదను, మన ఆత్మవిశ్వాసముమీఁదను నాధారపడి యుండును.

ఐర్లండు దేశములో నన్నికక్షులవారును మనల చాల కాలమునుండి పీల్చిపిప్పిజేయు పోరాటము నాపుజేసి, గౌరవమగు సంధియు, నిత్యమగు శాంతియు సమకూరుటకై యాశించుచున్నారు. శాంతికలిగినగాని ప్రజలు సుఖించ నేరరు. అప్పుడుగాని, అనేక సంవత్సరములనుండియు ప్రజలస్వతంత్రులై యుండుటచే గలిగిన దీనభావము వదలి ఉత్సాహముగలుగ నేరదు. అప్పుడుగాని జాతీయహృదయముప్పొంగి, పొరలి, కవిత్వమునందును, సంగీతమునందును, చిత్రకళలయందును సారస్వతమునందును, ప్రతిఫలించి మనకు పేరుప్రతిష్ఠలు గలిగింపజాలవు. అప్పుడుగాని మనయాత్మలకు బ్రహ్మానందము గలుగజాలదు. ఇట్టియుత్కృష్టస్థానము చేరుటకు మనము గాఢముగా ప్రయత్నించుచున్నాము. కాని మనస్వాతంత్ర్యములో నేమాత్రము కొదువబడినను యీ నిత్యమగు శాంతి గలుగ నేరదు. ఆంగ్ల సామ్రాజ్యముతో నేమాత్రము సంబంధము మనకు గల్గినను మన మస్వతంత్రులమే యగుదుము. కొన్ని విషయములయందైన నాంగ్లసామ్రాజ్యముయొక్క ఉత్తరువులకు విధేయులై యుంట తప్పదు. ఇట్టియస్వతంత్రస్థితి

యందు మనము బ్రిటిషు పార్లమెంటు సభలో ప్రతిఘటించుట యనవసరమై యుండునని చెప్పుటకు సాహసించువారెవ్వరుం దురు? ఇట్టివారెవ్వరైనను నున్న యెడల వారు చరిత్రకును, అనుభవమునకును ప్రతికూలముగా మాట్లాడుచున్నారనుట సత్యము. ఈ రెండు దేశములును కలిసియుండెనేని, యాంగ్లేయులు తమ క్షేమమునకై కొన్ని శాసనములు చేయవలసివచ్చును. ఐరిషువారు తమలాభమునకై ప్రయత్నించుచుందురు. ఇంగ్లండుకు క్షేమమయినవి, మన కనర్థదాయకముగా నుండవచ్చును. కావున నీరెండు దేశములకును పరస్పర వైరుధ్యము తప్పదని వేరుగా చెప్పనవసరము లేదు. ఒక దేశములోనే, వివిధకక్షల వారికిని, వైరుధ్యము గలుగుచున్నది. యూరపుఖండమున ప్రతిదేశమునందును పూర్వాచార పరాయణులకును అతివాదులకును, అతివాదులకును మితవాదులకును అభిప్రాయ భేదములు గమనింపదగును. పూర్వాచారపరాయణుల యభిప్రాయములు కృత్రిమములనియు, అపాయకరములనియు అతివాదులు తెలతురు. అతివాదులు యభిప్రాయములును యిట్టివియే యని పూర్వాచారపరాయణులు తెలతురు. ఈకక్షలకు సమాధానము కుదురుట యసంభవము. ఒక్కొక్కసారి, ప్రతిపక్షులు తమకు మోసముచేసిరని వారొండొరుల దూషించుకొనుటయు సంభవించును. పార్టీ పోరాటమున కివి నైజలక్షణములు. ఒక దేశమునందే వివిధకక్షలవారింత తీవ్రముగా కలహించుచుండ జాతిభేదముల వలనను, దేశభేదముల వలనను గలిగిన వివాదములు త్వరలో ముగియుననియు, తీక్ష్ణముగా నుండవనియు

తలచునంతటి వెఱ్ఱివా రెవ్వరైన నుందురా! ఈ భేదములు మనము 'గ్రీక్' సంతతివార మగుటవలనమాత్రమే గలిగినవి కావు. మనము వివిధ దేశస్థులమగుటవలనను, మానవజాతియందు వివిధకుటుంబములకు జెందినవార మగుటవలనను యీభేదములు గలిగినవి. మన మాంగ్లేయులమైనను యీ భేదములు నశింపజాలవు *అమెరికాసంయుక్తరాష్ట్రము లనిదర్శన మీసత్యమును వెల్లడిచేయుచున్నది. ఇది గ్రహించుట మిక్కిలిసులభము. ఒకని పుత్రులు పెద్దవారయినప్పుడు, వారు తమకుటుంబములను స్వతంత్రముగా నిర్వహించు కొనుచుందురు. వారికి తల్లిదండ్రులయెడల అమితానురాగముండును. కాని వారు తమ గృహవిషయమై జోక్యము కలుగజేసికొనినయెడల మనస్పర్థలు గలుగుచున్నవి. వారిశాంతికి భంగము వాటిల్లుచున్నది. ఈ విషయమై విస్తరించి వ్రాయ నవసరములేదు. ఐర్లండు ప్రజలు, ఆంగ్లేయులేయైనను, ఇగ్లండు వీరిని పరిపాలించప్రయత్నించెనేసి యీరెండు దేశములకును కలహము తప్పదు. దీనికి ఫలితము ఎడబాటు గలుగుటయే. మన మేజాతివారమైనను

---

* ఆంగ్లదేశమునుండి ౧౭వ శతాబ్దమున కొంతమంది అమెరికాఖండమునకు బోయి, యాంగ్లేయరాజ్యము నొకదాని నేర్పరిచిరి. ఇంగ్లండు ప్రభుత్వము స్వలాభమునకై, అమెరికాయందు నిరంకుశాధికారము నెరపుటవలనను, అమెరికావార నభివృద్ధికి రాకుండ నణగద్రొక్కుటవలనను, ఆర్థిక రాజకీయ విషయములందు లేనిపోని జోక్యములు కలుగజేసికొనుటవలనను, అమెరికా వారు స్వాతంత్ర్యమునకై యుద్ధముచేసిరి. హోరాహోరిగా పోరుజరిగెను. యుద్ధమునందు అమెరికావారు గెలిచి స్వాతంత్ర్యము సంపాదించిరి. ఈ దేశమే ప్రస్తుతము, అమెరికా సంయుక్తరాష్ట్రములని పిలువబడుచున్నది.

ఆంగ్లేయులతో సఖ్యముగా నుండెడి వారమే కాని ఇంగ్లండు మనలను కపటోపాయములచే ననేక హింసలబెట్టినది. ఇంగ్లండు కొన్ని సందర్భములయందు మనకు జేసిన యపరాధములను నిర్దయాత్మకములైన కార్యములను మరచిపోవుట సాధ్యము కానేరదు. అనేకతరముల సఖ్యసేవలనగాని యీ కార్యములను మరచిపోవుటయు, వారియెడల సద్భావముగలుగుటయు తటస్థించదు. ఆంగ్లేయసామ్రాజ్యముమీద మన మేమాత్రమాధారపడవలసివచ్చినను యీశాంతిగలుగనేరదని నొక్కిచెప్పుచున్నాను. దీనివిషయమై ప్రజల మనములయందు సందేహము లేశయు నుండకూడదు. ఈబంధములను ద్రెంచుటకు మనమోపినంత పురుషప్రయత్నము చేసెదము. సరిసమానత్వమును, సంపూర్ణ స్వాతంత్ర్యమును మనకు సఖ్యత నొడగూర్చగలవు. శాంతిగలుగుటకు యితరసాధనములు లేవు. మానవు లొండొరులతో స్నేహభావమున మెలంగుట యెంత యవసరమో ప్రత్యేకజాతుల యభివృద్ధియు నంతయవసరమే యని మానవచరిత్ర ఘోషించుచున్నది. మన మెంత స్నేహపాత్రులమో యంత భయంకర శత్రువులము. మనబద్ధశత్రువులికముందు మనలను తమపార్శ్వమున నుంచుకొనవీలులేదు. వర్తమానకాలము ఆశను పురికొల్పుచున్నది. భవిష్యత్తు వికాసముపొందు సూచనలు గనుపించుచున్నవి. గమ్యస్థానము చేరువలో నున్నది. ఈమహాఫలము ననుభవించుటకు మన మర్హులముగా నుండవలయును.

ఈయుత్కృష్టస్థితి ననుభవించుటకు మనమర్హులమగుటకు ప్రయత్నములు సలుపవలెను. దీనినిగమనించకపోవుటచే ననేక విపత్తులు గలుగుచున్నవి. స్వాతంత్ర్యపోరాటమున నితర జాతుల పొరబాటులను గమనించక వారివలెనే తప్పుమార్గములద్రొక్కి గొప్పయాదర్శములను మరచితిమేని వారివలెనే మనమును భంగపడుదుము. చక్కగా నాలోచించనివారు మనము పరాజయము పొందితిమనియు, స్వాతంత్ర్యము లభించదనియు పల్కెదరు. మనము పరాజయము పొందలేదు. అనేక తరములనుండియు బలాధికులతో పోరుసలుప గలుగుటయే మనశక్తిని ప్రకటించుచున్నది. మనయీప్సితములు నెరవేరినతరువాత యితరజాతులవలనే మన యవకాశములను వాడుచేసికొని అధర్మమార్గములను ద్రొక్కి సద్గతినొందనర్హులముగామని చాటినగాని మనమోడినట్లు నిర్ధారణకాదు. ఒకప్పుడు మనము యూరపుఖండమున కంటెయు ఆదర్శప్రాయులమై యుంటిమి. స్వాతంత్ర్యము సంపాదించిన తరువాతగూడ నిట్లే యగ్రస్థానము వహింతుమని నమ్మెదను. మనస్వాతంత్ర్యము ఇంగ్లాండు, ఫ్రాన్సు, జర్మనీలవలె పరుల బంధములనుండి తప్పించుకొనుటకు మాత్రమేయని జనుల మనములయందు ప్రబలియున్న దురభిప్రాయమును ఖండించవలెను. మనమేదోయొకవిధమున స్వాతంత్ర్యము సంపాదించిన జాలుననియు, పిమ్మటఘనమగు నీతిధర్మముల ననుసరించెదమనియు, వచించుట సమంజసము కానేరదు. మన మిట్టియూహల గలిగియుండుట ప్రపంచమున కనర్థదాయకము. ఇట్లుతలచి యథ

ర్మమార్గములకు దిగితిమేని శ్రేష్ఠమగు మానవస్వభావ మంత మొంది వ్యాఘ్రప్రకృతి విజృంభించి లోకమును సంక్షోభమున ముంచును. ధనసమస్య (Capital), కార్మికసమస్య మున్నగు వాటిని గురించి తత్క్షణమే మనము పరిష్కారము చేయవలయునని నేను చెప్పుటలేదు. కాని మానవులందరును తమ ధర్మమును విశాలహృదయములతోడను, గౌరవముగను నిర్వర్తించుట యవసరమని హెచ్చరించుచున్నాను. మన సోదరులను బాధలుపెట్టక వారియందు ప్రేమయు వాత్సల్యమును జూపి వారి నున్నతస్థానమునకు గొంపోవ బ్రయత్నించవలయును. మనముక్తి రాజ్యసంపాదనమీదగాని ప్రజాస్వామికముల మీదగాని, సాంఘికరాజ్యముల మీదగాని యాధారపడి యుండదు; మనయంతఃకరణాల పవిత్రతమీదను, గొప్ప యాదర్శములమీదను నాధారపడియుండును. ఈతత్వమును ప్రజలకు బోధించుట యవసరము. మన భావి సౌభాగ్యము, ప్రస్తుతము మన మొనర్చు కర్మలమీద నాధారపడియుండును గాన, యీకర్మల పవిత్రతను మనము మరువరాదు. మన పోరాటమున యధర్మపద్ధతుల ననుసరించితిమేని, మన భవిష్యత్తు అపవిత్రమై యుండును. ఇట్టి పవిత్రధర్మముల యెడ నభిమానము చూపువారు మనలో ననేకులున్నారని నాకు దెలియును. కాని వారు కష్టముల కోర్వలేరు. తమ గమనము లాటంకపరుపబడునవియు, జయ మసంభవమనియు వారికి భయము మెండు. ఈభయమును మన మనముల నుండి పారద్రోలవలయును. పరిస్థితులు మన కనుకూలముగా

మారుచున్నవి. మనశక్తి యభివృద్ధినొందుచున్నది. శత్రువుల పట్టు సడలుచున్నది. దేశమునందు స్థానికప్రభుత్వము లభివృద్ధి యగుకొలది స్వతంత్రప్రభుత్వమున కొకయడుగు ముందరికి నడచుచున్నామనుట సత్యము. ప్రజలకు వాయిదాల తెరబడిని స్వాతంత్ర్య మొసంగబడునను నమ్మకములు పోయినవి. తమ శక్తియందు ప్రజలకు విశ్వాసము హెచ్చుచున్నది. వారు కఠి కరములను సాధనసంపత్తిని తయారు చేసికొనుచున్నారు. మనము చూచుచుండగనే మనదేశ మింతశీఘ్రముగా నభివృద్ధి నొందినది. ఇరువది సంవత్సరములకు పూర్వము ఐరిషుభాష నిరసింపబడుచుండెను. మన మిన్ని సంవత్సరములనుండియు చేసిన యాందోళనవలన మన మాతృభాషకు గౌరవము చేకూరినది. జాతీయ విశ్వవిద్యాలయమునందు గెయిలిక్ భాష నందరును పఠించవలయును. ఈయంశమువలన మనము స్వాతంత్ర్యోన్ముఖులమై యరుగుచున్నామనియు, అతిశీఘ్రకాలములో సంపూర్ణస్వేచ్ఛ సమకూరగలదనియు సందేహము లుండకూడదు. స్వాతంత్ర్యము సంపాదింపగలమని నాకు దృఢనమ్మకములు గలవు. కాని దానిని సరిగా నుపయోగించుకొందుమా యను సంశయము నన్ను బాధించుచున్నది. స్వాతంత్ర్యము ననుభవించుచున్న జాతులు తమ యవకాశముల నెంతనిరర్థకముగా పాడుచేయుచున్నారో చూడుడు. కావున యీస్వతంత్రరాజ్యము లన్నిటికంటె మన భావిచరిత్ర మిన్నయైయుండునట్లు దృఢసంకల్పులమై ప్రయత్నములు సలుపవలెను. సంపత్తు మనకు కావలసినదే, సందేహములేదు. కాని సంపత్తుకొరకై ధర్మ

మార్గమును వీడుటతగనిపని. మనము బలాధికులమై యుండుట పరరాజులను జయించుటకుగాని, మనకు లోబడియున్నవారిని పీడించుటకుగాని కాదు. మానవసోదరత్వమును పెంపొందించుటకును, బలహీనజాతులనురక్షించుటకును నైయున్నది. మనదేశప్రజ లీసూత్రములపై నాధారపడి, స్వేచ్ఛగడించిరేని, పూర్వమువలెనే ముందును యూరపునకు నాయకత్వము వహించెదరు. మన సంస్థాపనలయందు మనకు గౌరవము హెచ్చును. అవి దేశమును శాశ్వతముగా నున్నతస్థానమున నుంచుటకును, దేశీయుల సుఖమునకు కారణభూతులగుటకును సాయపడగలవు. ఆశ, నిరంకుశత్వము, దుర్మార్గము, అధర్మమునందు మునింగియున్న లోకమును మేల్కొల్పి వారికి నూతనాశయముల గల్గించి, ధర్మమార్గములయందు నడుచుటకు ప్రోత్సాహము గలుగజేసెదము. మన మాతృదేశమును శాశ్వతమైన స్వాతంత్ర్యపీఠమున నుంచెదము.

---

# మూడవ ప్రకరణము.

## ధర్మబలము.

శ్లో॥ దుఃఖే ష్వనుద్విగ్నమానా సుఖేషు విగతస్పృహః
వీతరాగభయక్రోధః స్థిరధీ ర్ముని రుచ్యతే॥

—భగవద్గీత, ౨-౫౬.

ఐర్లండునం దేదియైన ముఖ్యవిషయము చర్చించవలెనన్న నొకగొప్పయాటంకము గలదు. పదములను నిజమయిన యర్థ

మునుండి తొలగించి విపరీతార్థములు చేయుటచే విపరీతములగు భావములును, యభిప్రాయములును పుట్టుచున్నవి. మన చర్చకు సార్థకమైన నుండవలెననిన మన ముపయోగించుపదముల కర్థము స్పష్టముగా నెఱుంగవలయును. దేశభక్తి పేరిట ప్రతియధర్మమును, దుర్మార్గమును సాగించవచ్చునని కొందరు చెప్పెదరు. మనోదౌర్బల్యముగలవారును దేశభక్తులుగా పరిగణింపబడుచున్నారు. కాని దేశభక్తులు సందిగ్ధసమయములయందు ఆత్మశక్తిని, ధైర్యమును ప్రకటించనియెడల 'దేశభక్తి' యనుపదమున కర్థమేమియు నుండదు. స్థానికపరిపాలనమును దేశమునందు వ్యాపింపప్రయత్నించు దేశభక్తులు కొందరు 'హోంరూలు'♦ అనుపదమునకు సంపూర్ణస్వాతంత్ర్యము అను నర్థముచేసెదరు. కాని మనకన్న నధికులని యొప్పుకొనబడిన పొరుగురాష్ట్రములవారిచే నిర్బంధము గలుగుటగూడ యస్వతంత్రమనియే తలంచవలయును. ఈసంగతి వారికి తెలిసినప్పుడు వారు తమవాదమును మార్చుకొనెదరు. "మితమైన స్వేచ్ఛ" యనుపదములేదు. మనకు కావలసినది సంపూర్ణస్వాతంత్ర్యము. 'స్వాతంత్ర్యము' అనుపదమునకు విపరీతార్థములు చేయుటవలన మన యుద్యమమూల

♦ 'హోంరూలు' అనగా సామ్రాజ్యస్థ స్వరాజ్యము. ఈపక్షము వారికి లక్ష్యము వలసరాజ్యముల స్వపరిపాలనము. స్వపరిపాలనమునకు సాధనము సక్రమాందోళనము. వారికి ప్రత్యక్షాచరణము పరివర్తనమార్గముగ దోచుచున్నది.

తత్వమునకు విరుద్ధముగా జరుగులయేగాక అనేక దురభిప్రాయములకు గారణమగుచున్నది. తరువాత అతివాదివిషయమై ప్రజ లేమనితలంచుచున్నారు? అతనియాదర్శము లాచరణీయములు గావనియు వెఱ్ఱివాడనియు బుద్ధిహీనుడనియు దూషించుచున్నారు. ఇట్టిదూషణ మనకు కష్టముగా నుండును. కాని యతివాదిధైర్యసాహసములకు సంతసించి యతని పొగడుటకుబదులు, అతనికార్యములు న్యాయబద్ధములనియు ధర్మసమ్మతములనియు సమాధానము చెప్పప్రయత్నింతుము. ఈయతివాదియే నిజమయిన సత్యవాది. స్వాతంత్ర్యవాదులలో ననేకులు నిజమయినస్వేచ్ఛకును, నీతిబాహ్యమగు స్వేచ్ఛకును భేదము గ్రహింపలేకున్నారు. మనకు స్వాతంత్ర్యము లభించినయెడల, ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీలవలెభోగభాగ్యముల ననుభవించెదమని తలతురుగాని పద్ధతులనుగురించి కొంచెమేనియు విచారించరు. ఈ దేశము లనుసరించిన మార్గమును ద్రొక్కి యభివృద్ధినొందుటకంటె యొరులపరిపాలన క్రింద నుండుటయే మేలు. కావున మనచర్చయందు పదముల యర్థమును స్పష్టముగా గ్రహించవలెను. ఒకపదమువిషయమై మాత్రమిచ్చట ప్రస్తావించుచున్నాను. 'ధర్మబలము' లేక 'ధర్మశక్తి' యనుపదమును వాదములోప్రతివాదును నుపయోగించుచున్నాడు. కానియెవ్వరును దీనియర్థమును స్పష్టముగా గ్రహించినవాడు లేడు. అందువలన నీపదముయొక్క అర్థమును స్పష్టముచేయువలసియున్నది.

ఓకానెల్ మహాశయుని కాలమునుండియు 'ధర్మశక్తి' యనుపదము, తన దేశము యొక్క సంపూర్ణ స్వాతంత్ర్యమునకై ప్రయత్నించుటకు భయపడినట్టి గాని, యిష్టము లేనట్టి గాని, రాజకీయ నేతల దౌర్బల్యమును కప్పిపుచ్చుటకై యుపయోగపడుచుండెను. ఇందువలన ననేక దురభిప్రాయములు గలుగుటకు నవకాశములు గలిగెను. ఓకానెల్ మహాశయుని గురించి చర్చ పునరుద్ధరించ నేను తలచుట లేదు. అతడు దేశభక్తి పూరితుడును, అసమాన ప్రజ్ఞావంతుడనుటకు సందియము లేదు. క్లాంటార్ఫ సభయందు జరిగిన గందరగోళములను జూచి సిగ్గుచే తలవంచుకొనువారందరును యీ మహనీయుడు యావనదశయందొనర్చిన దేశసేవ స్మరింతురుగాక! ఆసమయమున అనేక కష్టముల కోర్చి మిక్కిలి ధైర్యముతో నతడొనర్చిన దేశసేవ ప్రశంసనీయము. కాని యీతడు వృద్ధాప్యమునందొనర్చిన కొన్ని కార్యములు ఖండించుట యావసరమై యున్నది. అవి మన తరమువారి కనర్థదాయకములు. ఆకాలమున నైతికబలము బొత్తుగా లేనివారు బలాధికులుగా పరిగణింపబడుటయు, గొప్పయాత్మశక్తిగల వారు పశుశక్తిగలవారని పరిహసింపబడుటయు గలుగుచుండెను. ఈ పదముల యుపయోగమువలన గలిగినభ్రమను తొలిగించుటకై 'ధర్మశక్తికిని' 'నైతికదుర్బలత్వమునకును.' భేదము గ్రహించవలయును. 'ధర్మశక్తి' 'ధర్మబలము' 'ధర్మోత్సాహము' అనుపదములన్నిటికిని యర్థమొకటే. ఈ శక్తులు గలవాడు తనపై యెంతపశుబల ముపయోగింపబడినను యు

జేయుడై యుండును. దీనినే నేను 'ధర్మశక్తి' యని పిలిచెదను. ఇది నాకు బాగుగానున్నది. ఈ శక్తిగలవాఁడు, తాను సత్యమనియు, ధర్మమనియు, అవశ్య మాచరణీయమనియు నమ్మిన సిద్ధాంతములను, ఆచరణయందుంచుటకు వెనుదీయఁడు. ఆ కార్యముల ఫలితము నతఁడు లక్ష్యపెట్టఁడు. అతఁడు వెఱ్ఱివాఁడు కాఁడు. అతనికి సాధక బాధకములయందు గణ్యత లేక పోలేదు. అతని కార్యములవలన జరుగనున్న సంక్షోభము నతఁడు గమనించక పోఁడు. అతఁడు సత్యమార్గమే మంచిమార్గమనియు, యీ మంచిమార్గము నవలంబించుటవలన చెడుగేమియు రానేరదనియు నమ్మును. అతఁడెన్నికష్టములనయినను శాంతతతో సహించును. కొన్ని కఠినపరీక్షలయందతని ధైర్యము చెదరినను, గొప్ప యాదర్శములకును, యుత్కృష్ట ఫలితములకొఱకును, యాత్మవిశ్వాసముతోడను, మనోధైర్యముతోడను, నతఁడు కృషి చేయును. ఒకానొక సమయమందతనికిగలిగిన భయము విడిపోవును. గొప్పయుద్యమములును, అవకాశములును మనుష్యుల గొప్పతనమునకు కారణభూతములైయున్నవి. సంకుచితభావములతో నీయుద్యమముల ప్రవేశించువారును వీరమరణమును బొందెదరు. ఈ గొప్ప యాదర్శములే యీ వీరుల యుల్లాసమునకు కారణభూతములై యున్నవి. సాధారణప్రజలీవిషయములను గ్రహించజాలరు. స్వాతంత్ర్యయోధుఁడు సత్యముమీఁద నాధారపడియున్న యతనిపోరాటము లోకమున కంతటికిని మేలుచేయునని నమ్మియుండును. అతఁడు బాధల ననుభవించవలసివచ్చినను, యితరులను బాధపెట్టవలసి వచ్చినను,

తాను జేయుకార్యమీ యిరుపక్షములవారి పునరుద్ధరణకై యున్నదని యతడునమ్మియుండును. దాస్యమున మునింగియున్న వారందరును విముక్తులగుదురనియు ప్రాణము గోల్పోవు వారు మహోదశ ననుభవింతురనియు ముందుసంతతులవారికి క్షేమమును సౌఖ్యమును గలుగుననియు నతడు దృఢముగా నమ్మియుండును. ఈమహాపోరాటమున ప్రతిదశయందును తనకాశ్రయమై యుండునది తన యాత్మబలమే. ఇదియే 'ధర్మశక్తి.'

ఒక పటాలముతోగూడి యుద్ధమునకు నడచుట కల వాటుపడినవాడు ఒంటరిగా శత్రువుల నెదుర్కొనవలసి వచ్చి నప్పుడు తనధైర్యమును గోల్పోవును. ఐర్లండు ప్రస్తుతము చెల్లాచెదరైయున్న తన సేనాసమూహములను ప్రోగుచేసి, యుద్ధమునకు తయారగులోపల నీయాత్మబలమును ప్రద ర్శించు యోధుల యావశ్యకత మిక్కుటముగా గలదు. ఈ పరీక్షయే మిక్కిలి కష్టమైనది. ఈపరీక్షయందే మిక్కుటమగు ధైర్యమును చూపవలసియుండును. ఇది మనకు తప్పక అస మానమగు జయమునొడగూర్చును.ఒకపదాతి యొక్క సమూ హము నెదుర్కొనజాలదు; ఒకసేన యనేకసేనల నెదుర్కొ నజాలదు; కానిభూలోకములో నన్ని సామ్రాజ్యముల సేనలు కలిసి యాత్మబలముగల యొక్కని నెదుర్కొనజాలవు. ఇట్టి యుత్తముడు శాంతుడు నిరసూయుడగువ్యక్తి యజేయుడై యుండును.

ధర్మశక్తియను పేర ననుదినమును జరుగుచున్న నీచకార్యములను ప్రతిఘటించుట యత్యవసరమగుటచే మనప్రతిష్ఠను నిలువబెట్టుటకు పోరాడుచున్న మహనీయులు పరాక్రమము నెడలగాఢాభిమానము జూపుచు ప్రజలను బాహుబలప్రదర్శనమునకు పురిగొల్పుచున్నారు. ఈనీచస్వాభివృద్ధియగుకొలది మన క్షీణదశ హెచ్చుటచే చిరకాలమునుండియు దౌర్జన్యమార్గములనుద్రొక్కుటకు వెనుదీయుచుంటిమి కాని మనదురభిప్రాయముల నన్నిటిని సవరణచేసికొనుట కిది మంచితరుణము. అజేయుడగు పురుషున కుండవలసినలక్షణములలో బాహుదర్పము ముఖ్యమనియు నిరంకుశాధికారము నడచుటకు యింతకన్న బలవత్తరమైనసాధనము లేదనియు మనము తలచుచుంటిమి. రణరంగమునందలి సంహారమును, రక్తప్రవాహములను కొనియాడుచుంటిమి. యుద్ధమును సంస్తుతించుచు శాంతినెలకొల్పుటకు ప్రయత్నము లేమియు చేయమైతిమి. ప్రసిద్ధిజెందిన సేనానియొకడు యుద్ధము నరకతుల్యమని వర్ణించియున్నాడు. ఇదికొంత యతిశయోక్తిగా వచ్చును. కానిదీనియందు సత్యము లేకపోలేదు. ఈతని హెచ్చరిక నందరును జ్ఞాపకముంచుకొందురుగాక! ఈభావములు సూచించుట మనలో కొందరి కసిష్టముగా నుండవచ్చును. వారు పగదీర్చుకొనుట తమముఖ్యధర్మమని తలతురు. ఇట్టి వారందరును ఆత్మపరీక్ష చేసుకొందురుగాక! ఒక పేరుబడిన రాజద్రోహి కాని, అపరాధి కాని మరణించినప్పుడు వారిమనస్సులో గలిగినభావములేవి? ఆతనిమరణమునకు సంతోషమా? లేక యసహ్యమా? వారిహృదయములయందసహ్యమును, భయమును

ముఖ్యస్థానమువహించినవనుటలో సందియ మేమియును లేదు. మరణము మానవహృదయములయందు కరుణను, జాలిని పురిగొల్పును. మరణముగాక యింకే యుదాహరణము నిచ్చినను, యుద్ధము నెడల నభిమానముగలవారిని మన మొప్పించలేక పోవచ్చును. స్వాతంత్ర్యమనియెదునావను, శత్రువులరక్తప్రవాహమున తేల్చెదమని యతడు డంబముగా చాటవచ్చును. కానిండు! అత డాలోచించుటకు కొంతయు వకాశ మిత్తము. ప్రమాదములుకలిగినప్పుడుగాని, నిర్దయాత్మకములగు వల్లయుద్ధములు జరుగునప్పుడుగాని యతనియాత్మ పరితాపమును బొంది, యుద్ధముల క్రూరత్వము నతడు గ్రహింపకపోడు.

శత్రువుల నెదుర్కొని బాహుదర్పములతో పోరాటయు, రక్తపాతమునకు దిగుటయు మనవినోదమునకైగాక, యత్యవసరములగు సమయములయందు మాత్రమే యొనర్పదగును. ఏలన భౌతికవినాశముకన్న నైతికవినాశ మెక్కుడు ప్రమాదకరము. ఎంతత్యాగ మొనర్పవలసివచ్చినను స్వాతంత్ర్యము సంపాదించవలయును. శరీరము నశించును. ఆత్మ నాశము నొందజాలదు. యుద్ధము నొప్పుకొనుట కిదియే కారణము. తామనుభవించుచున్న స్వాతంత్ర్యమునకు భంగము గలుగుచున్నపుడుగాని తాము పడియున్న బానిసత్వము నందు స్థిరముగా నుండవలసివచ్చినగాని ప్రతి మనుజుడును స్వాతంత్ర్యమునకై యుద్ధముచేయుట యతని ధైర్యమైయున్నది. స్వాతంత్ర్యము లభించుదాక శత్రువులతో సంధిచేసికొనుటకూడదు. యుద్ధములయందు యోధులు పొందెడు శారీ

రక కష్టములకన్న స్వాతంత్ర్యమును గోల్పోయిన ప్రజలను నాశముజేసెడి నీతిబాహ్యత యెక్కుడు ప్రమాదకరము. మన ఆత్మకు గౌరవభంగము గలుగుట దుర్భరము. బానిసత్వము లోనున్నప్రజలను పీల్చిపిప్పిజేసి యధోలోకమునకు ద్రొక్కెడి యవకాశములను దలపోయుడు. ప్రభుత్వము వారు తమ యధికారమును బలపరుచుకొనుటకొసంగెడి లంచములు సమయానుకూలముగ తమసిద్ధాంతములను వీడి గొప్పలక్ష్యములను త్యజించినవారి సంఖ్య హెచ్చుటయు, రాజకీయ జీవితము యొక్క నీతిబాహ్యత, వ్యక్తుల దుర్మార్గప్రవర్తనము, గొప్ప యాదర్శములు గలవారు పడవలసినయిబ్బందులు, దురాచారములు, శాంతము గోల్పోవుట, చిట్టచివరకు తమ కత్యంత ప్రియమగు జాతీయపతాకమునకు ద్రోహముచేయుటయు — వీని నన్నిటిని దలపోయుడు. మరియు దేశము నావరించియున్న నిరుత్సాహము, భీరుత్వము, వైషమ్యము మొదలగు దుర్మార్గగుణములన్నియు చీకటిరాత్రులయందు మొలచు కలుపు మొక్కలవలె స్వాతంత్ర్యహీనమగు దేశమును నాశము జేయును. ఇట్టి దేశప్రజలయాత్మచూచుటకు హేయముగా నుండును. ఇట్టి యవస్థకన్న భూకంపమొకటిగలిగి దేశమును సముద్రములో ముంచినను శ్రేయస్కరమే. బానిసత్వము వలన గలిగెడి నైతిక వినాశమును తప్పించుకొనుటకై, శరీరకష్టములకు సరకుజేయక, ప్రజలు యుద్ధమునకు దిగుదురు. శరీర కష్టములకు భయమంది యుద్ధముచేయ వెరచు వారీభౌతిక నాశమును తప్పించజాలరు. నీతిబాహ్యత ప్రజల శారీరక

శత్రులనుకూడ పాడుచేయును. ఈకార్యము మెల్లగా జరుగవచ్చును. కాని తప్పదు. కావున 'ధర్మశక్తి' నుద్ధరించుటకు, పశుశక్తి యవసరమై యుండును. ఇట్టి యుత్కృష్టధర్మముమీద నాధారపడి యుండనిమొకల పశుశక్తి నుపయోగించుట దుర్మార్గమును, అధర్మమును అగును. 'ధర్మశక్తి'కిని 'పశుబలము' నకును నిజమైన వైరుధ్యము గానరాదు. 'ధర్మశక్తి'కిని నైతిక దుర్బలత్వమునకును నిజమగు వైరుధ్యముగలదు. ఈముఖ్యమగు తారతమ్యమును నేపక్షమువారును గమనించకుండుట శోచనీయము. అత్యవసరమగు సమయములయందును, మంచి తరుణము గలిగినప్పుడును, యుద్ధమునకు సంసిద్ధులగుట యవసరము. కాని యిట్టి సందిగ్ధ సమయములయందు మనము బుద్ధికుశలత్వముగలిగి యుండవలెను. పశుశక్తిని కీర్తించుచు, మనశత్రువుల రుధిరమును ద్రావత్వరపడితి మేని, క్రూరకర్ముల వలె మనముగూడ యపకీర్తి పాలగుదుము. ఇట్లు కాక శత్రుసంహారమున కవసరమైన సమయములయందు పరాక్రమ ధర్మమును నెరవేర్పక వెనుకడుగు వేసినట్లయిన మన యాత్మశక్తిని గోల్పోయి, మన శత్రువులను మరింత క్రూరకర్మముల జేయుట్లు ప్రోత్సహించిన వారమగుదుము. మన యవమానమునకును, నాశమునకును మనమే కారకుల మగుదుము. నిజమైన స్వాతంత్ర్యయోధుడు తన బాహుసత్వమంతయు నుపయోగించి శత్రువుల దర్పమడంప సంశయింపడు. అతని దృఢవిశ్వాసము మీద తన దేశక్షేమమును, స్వేచ్ఛయు నాధారపడియున్నవని యతనికి తెలియును. కాని యతడు, యిత

రుల కసాధ్యమగు మనోనిగ్రహమును ప్రదర్శించును. పురుష నామము సార్థకముకావలెననిన నాత్మనిగ్రహము చూపవలె ననియు, ప్రతీకారము నిర్దయాత్ముల యొక్కయు, బానిసల యొక్కయు, నైజగుణమనియు, ఉదారస్వభావము గొప్పవారికి స్వభావసిద్ధమనియు నతడు జ్ఞాపక ముంచుకొనును. అతడు శత్రునాశమే యాదర్శముగా నెంచక, అతని పాపకార్యమును నివారింపదలచును. ఇట్టి కార్యమునందు అతని స్వాతంత్ర్యమునకు మాత్రమేగాక శత్రువులముక్తికిని కారణభూతుడగుచున్నాడు. ఇట్టి సిద్ధాంతములు మనలో చాలమందికసాధ్యములుగా నగుపడవచ్చును. కాని యీ సమస్యయొక్క మూలతత్వమును గ్రహించి తనజీవితమునందీ సిద్ధాంతముల నాచరణయందుంచ ప్రయత్నించువారి కివి సామాన్యముగానే యుండును. ప్రస్తుత సమయమున శత్రువులుగా నుండువారు ముందుముందటికి స్నేహితులు కాగలరని యాతడు ఘోరమగు సంగ్రామరంగమునందు కూడ నమ్మియుండును. మన మీ పోరాటములోనికి దిగకముందు మనసిద్ధాంతము లేవియో నిర్ణయించుకొనుటయు మన మనుసరించవలసిన మార్గమును నిర్ధారణ చేసికొనుటయు మిక్కిలి యావసరము. ముఖ్యసమస్యలను గూడ తగిన సమయము రాలేదని యాపియుంచుట ప్రమాదకరము. యుద్ధసమయమున పగతురబారినుండి తప్పించుటకును దాస్యశృంఖలములనుండి విముక్తియగుటకును నీ విషయములను పాటించుట యావసరము. బానిసత్వమునందున్న దేశమునందు నీచత్వ మభివృద్ధియగునని యింకను విపులముగా

వ్రాయుట యనవసరము. ఈసూత్రము నొప్పుకొనిన వారం దరు చెడుగును ప్రతిఘటించుట వారిధర్మమని తెల్లమగుచున్నది. స్వతంత్రరాజ్యములయం దనేక పాపములు తలచూపవచ్చును. కాని యవి యపాయకరములుగావు. సూర్యరశ్మియందు రోగము నశించునట్లు స్వాతంత్ర్యభానుని యెదుట పాపమును, అధర్మమును నశించును. అస్వాతంత్ర్య దేశముల యందు ప్రజలు మిక్కిలి హీనదశయందుండుటచే, ప్రతిపాపమును పెరుగుటకు నావకాశము గలుగును. ఇందువలననే, అస్వతంత్రులగు ప్రజల నున్నతస్థానమునకు గొనిపోవ యత్నించువీరులు, ప్రజల లోపములను, దుర్బలత్వమును గ్రహించి వానికి నివారణోపాయముల నాలోచించుట యావసరము. ఏ సమస్యయైనను పొడజూపగానే పరిష్కరించుట మంచిది. దాని నాపియుంచుట ప్రమాదకరము. కాని ప్రజ లీసత్యమును గ్రహించక, జను లీప్రశ్న యెడల నేకీభావము చూపరు. "జనసామాన్యమున కీ సిద్ధాంతము లు తెలిపినయెడల వారు తత్సూత్రవల నడిచెదరు." ఇట్టివి మరియేవో సాకులు కల్పించి మిక్కిలి యావశ్యకములగు సమస్యల నాపివేయుచున్నారు. ఎల్లప్పుడును వారి కేదో యొకసాకు దొరకకపోదు. ప్రతివాడును సత్యములో కొంతభాగముమాత్రమే యొప్పుకొనుట కిష్టపడును. ఎవ్వరును పూర్తిగా నొప్పుకొనరు. కాని మనకు కావలసినది సంపూర్ణమగు సత్యము. ఈ సత్యములో కొంత గ్రహించుటయు, కొంత త్రోసిపుచ్చుటయు వీలుగాదు. దేశసేవ జేయుటకు గడంగినవారును, ప్రజా

భిప్రాయము నడుపగలవారున్ను, నీసత్యమును పాటించిననే గాని వారిధర్మమును సరిగా నెరవేర్చజాలరు. ఒకగొప్పసమస్య పరిష్కరించుట కష్టతరమగుటచేతను, మిక్కిలియాపాయకరమగుటచేతను, నీసమస్యను ప్రాణాధారములగు సిద్ధాంతములనుపేక్షాభావముతో జూచుచున్నారు. ఇది సత్యపథము కాదని వేరుగా చెప్పనవసరములేదు. ఫలితమేమైనను మన విశిష్టముల నొక్కికొనవలెను. ఇట్లుచేయుటవలన కొన్నివిషయముల యందైనను, ఏకాభిప్రాయములుగలవారి నొకపక్షమునకు జేర్చుటకిది సహాకారి గావచ్చును. ఐనను, అనేక సంశయములతో గాని జనలోకపక్షమునకు జేయుట సంభవించను. స్వాతంత్ర్య పోరాటమున లోలోపల రగులుచున్న యీయనుమానములు భయోత్పాతమును గలుగజేసి మనల నాశముజేయును. కాన సంశయము లన్నిటిని తత్క్షణమే యడంచవలయును. అభిప్రాయభేదము లన్నిటిని మిక్కిలి యోర్పుతోడను, ధైర్యముతోడను, గౌరవముగను, చర్చించుట కవకాశము లొసంగి, అందరికిని యనుగుణ్యమగు మార్గముద్రొక్కి, నాయకులయెడ విశ్వాసము గలిగించవలయును. ప్రస్తుతసమయమున మన మెవ్వరికిని విశ్వాసము గలుగజేయుటలేదు. ఈసంగతిదాచిపెట్టుట ప్రమాదకరము. ఇట్లుచేయుటవలన పరిస్థితులు విషమించవచ్చును. వెంటనే జయముపొందుట యసంభవము. కాని మన మీగొప్పలక్ష్యములనువీడరాదు. ఈమార్గ మన్నిపక్షములవారికిని అనిష్టముగా నుండవచ్చును. భోగులును, సుఖాపేక్షగలవారును, తమభోగముల నాసించి యీవిషయముల నలక్ష్యభావము

తో జూచుచున్నారు. వర్తకుడు స్వలాభమునకై యపేక్షించు చున్నాడు. అతని కీవిషయములు తెలచుటకైనను వ్యవధి చాలదు. మితవాది సమయోచితముగా యెత్తులను, తంత్రములను పన్ని కార్యసానుకూల్యమునకై యోచించుచున్నాడు. మరి యొకడు ఏపద్ధతియందును నమ్మకములేక మనము చేసిన ప్రతి కార్యమునందును ప్రమాదముగలదని యూహించుచున్నాడు మనకు మొదటివాని భోగముతోడను, రెండవవాని లాభము తోడను జోక్యములేదు. మూడవవానిని గురించియు, నాల్గవ వానిని గురించియు రెండుమాటలు చెప్పవలసియున్నది. మిత వాది సత్యమునంతయు గ్రహించ భయపడుచున్నాడు. అతడిట్లు పలుకును: "మనమిద్దరము ఆంతరంగికముగా కొన్ని సంగతులు మాట్లాడుకొందము. మన కీవిషయములు బోధకాగలవు. కాని విద్యావిహీనుల కివి బోధపడవు. ఈ సిద్ధాంతములను వారికి బోధించుటవలన ప్రమాదము సంభవించగలదు. ఇట్లుచేయుట సమంజసము కానేరదు." అతని కీవిధమున ప్రత్యుత్తరమిచ్చు చున్నాను: "నీవు సత్యమునంతయు వచింప భయపడుచున్నావు నేను సత్యమును దాచ భయపడుచున్నాను. సత్యమునంతయు వచించుటచే విద్యావిహీనులకు ప్రమాదము కలదని నీవు తల చుచున్నావు. సత్యమును దాచుటచే నాయాత్మసాక్షికి ద్రోహము చేసికొనుచున్నానని నేను తలచుచున్నాను. సత్యము నంతయు ప్రజలకు బోధించుటచే వారిని వివేకవంతులుగా చేయగలననిగాదు. మన ముక్తికై యీసత్యనిర్ణయ మవసర ము." జీవయాత్ర పెక్కులు ఇబ్బందులతోడను, అభ్యంతర

ములతోడను గూడియుండుట జూచి వెరచి మనము పరిష్కరించవలసిన సమస్యల యపారతత్వమును గ్రహించక ముందెన్నడో యీ సమస్యల పరిష్కరించెదమని తలచుచున్నాము. యీ సమస్యలను సరిగా గ్రహించుటయు, కష్టములు సంప్రాప్తమైనప్పుడు అనుభవమువలన తేటపడిన విషయములను భయముగాని, పక్షపాతముగాని చూపక యనుసరించి యీ సత్యములను ప్రజలకు వాస్తవమూలముగా తెలియజేయుట మిక్కిలి యవసరము. విషయము గంభీరమైనప్పుడు, ఆ గంభీరతకు తగిన జాగరూకతయు, ఆలోచనయు గలిగియుండవలెను. కానిసత్యమును స్పష్టముగా గ్రహించినప్పుడు దానిని ప్రజలకు బోధించుట మన ధర్మమై యున్నది. సత్యమార్గమును వెల్లడిచేయుట మాని మన క్షుద్రనమ్మకములను వెల్లడిచేయుట ముఖ్యమని తలచుట నీచకార్యము. ఇట్లు చేయుటకు నే నొడంబడను. తరువాత నాల్గవవానికి ప్రత్యుత్తర మొసంగవలయును. మనము చేయు ప్రతికార్యము నందును, అతనికి నుపద్రవము గోచరించును. అతనికిగల యద్భుత వేదాంత జ్ఞాన మతని నమ్మకముల నన్నిటిని చెడగొట్టినది. మన మతనికి ధైర్యము చెప్పవలెను. మతము, వేదాంతము, స్వధర్మనిర్వహణమునకు సహకారులు గావలయునుగాని, దానినుండి మనలను విముఖులను జేయుటకుగాదు. అతని ధైర్యము వీడవలదని నేను ప్రోత్సాహపరచినప్పుడు, నాకుగల యాత్మవిశ్వాసమును ప్రకటించుచుంటినిగాని, యీసమస్యయందు నాకుగల యలక్ష్యభావమువలన నిట్లు చేయుటలేదు. స్వధర్మము నాచ

రించుటయందుపేక్షాభావము వహించగూడదు. భయము కూడదు. భయమునకును, ఆత్మవిశ్వాసమునకును చాల దూరము. * పర్వతముమీద ధర్మోపన్యాసము తరువాత రెండు వేల సంవత్సరములు గడచినను, మన విధులను గమనించకుండుట శోచనీయము.

ఇప్పటివలెనే, ముందును, మన పోరాటమున బాహుపరాక్రమముకన్న మానసికశక్తి యెక్కువగా చూపవలసియుండును. మనముద్రేకపూరితులమై యుండకూడదని కాదు. బుద్ధి యింద్రియములను స్వాధీనములో నుంచుకొని నడుపవలయును. మనోదౌర్బల్యముచే నిరోధమార్గమును దూషించువారి దుర్బోధనల నాలకించి, మన చిత్తశాంతిని వీడి, సమయాసమయములు లేక, పశుశక్తి నెదుర్కొనకుందుముగాక! ముందుముందు ప్రభుత్వమునకు తిరుగుబాటొనరించుట యొక్క ధర్మమును విశదీకరించెదను. ప్రస్తుతము నేను వ్రాసిన వ్రాతలసత్యమప్పుడు కాగలదు. కాని యిప్పటినుండియు, ప్రతివ్యక్తియు, తన యాత్మశక్తి నభివృద్ధిపరచుకొనుటకు ప్రయత్నములు సలుపవలెను. అప్పుడు ప్రతివాని యాత్మయు భేదింపరాని కోటవలె బలిష్ఠమై యుండును. సేనలోడిపోవును గాని, వాని యాత్మ అజేయమై యుండును. జీవాత్మ కాశ్రయ

* క్రీస్తుచే నొసంగబడిన ధర్మోపన్యాసము (Sermon on the Mount). ఇందు మానవవిధులు పేర్కొనబడియున్నవి. ధర్మము, శాంతము, కరుణ, ప్రేమ, అహింస, పుణ్యము మొదలగు విషయములనుగురించి వివరింపబడియున్నది. బైబిలు క్రొత్త నిబంధనయందు దీని చూడనగును.

మైన శరీరము నశించునుగాని, యాత్మ శాశ్వతముగా నిలిచి యుండును. ఆత్మ యీ కాయమునుండి వీడిపోవుచు, నితరులను తనయుద్యమమును కొనసాగించుట కుజ్జీవించును. ఈతడు చూపిన ధైర్యసాహసములు ప్రజల నుద్రేకపూరితులనుగాజేసి, కార్యసాధనకు పురిగొల్పును. వారు మిక్కిలి యుత్సాహముతో తమ ధర్మమును నెరవేర్తురు. చిట్టచివరకు జయము సమకూరును. ఎవ్వనిమనస్సు నిశ్చలమై, సత్యమార్గమున నడచునో వారికి జయము తప్పక చేకూరును. అతని శక్తిని కుతర్కములు దంపజాలవు. శత్రువులెంతటి దౌర్జన్యమునకు పాల్పడినను, అతడు దుర్మార్గములగు ప్రతీకారములకు గడంగడు. అతడు శాంతమును వీడడు. తన పూర్వీకు లొనర్చిన పోరాటము నతిధైర్యముతో కొనసాగించును. ఆపత్కాలమునందతని ధైర్యము, సాహసము వేయిమడుంగు లధికమగును. అతడొనర్చు ప్రతికార్యమును ఫలవంతమగును. మనమింకను ఆత్మస్వాతంత్ర్యము గోల్పోవకుండుట సంతోషకరము. మన మెంత కష్టస్థితియందున్నను, మనలో నెంత యధైర్యము ప్రబలుచున్నను, మన పూర్వుల పరాక్రమమును, ఉత్సాహమును దలపోసి, ధైర్యము దెచ్చుకొని, స్వాతంత్ర్యపు పోరాటమును దీక్షతోడను, అసమాన ప్రజ్ఞతోడను కొనసాగించుచుంటిమి. మనదేశీయుల హక్కులను రక్షించుటకును, సంపూర్ణస్వాతంత్ర్యము గడించుటకును, మనతరమువారికి కీర్తి దెచ్చుటకును కంకణము గట్టుకొంటిమి. మనకు జయము తప్పక సమకూరును. మన శత్రువులు తమ సేనల బలమును, జలాంతర్గా

ముల సంఖ్యను జూచి సంబరపడియెదరు. ఈ సంబర మెన్నాళ్లు? రోమ, కార్థేజి, గ్రీసు మొదలగు సామ్రాజ్యముల సైన్యము లెచ్చటనున్నవి? అవి నాశముచేయ ప్రయత్నించిన స్వేచ్ఛాభావములు ప్రస్తుతకాలమున ప్రతిజాతిని చైతన్య భరితులనుగాచేసి, నూతనవికాసముతోడను, ఉల్లాసముతోడను నింపుచున్నవి. మనము ధైర్యముగా ప్రవర్తించిన యెడల, మనపోరాటమున జాతీయపతాకముయొక్క గౌరవమును ప్రతిష్ఠించి, ఉన్నతముగాను, స్థిరముగాను స్థాపించెదము. పట్టుదలతోడను, ధర్మయుతముగాను, నిర్భయముగాను మనము ప్రవర్తించినయెడల మనయాత్మలకు తగినశిక్ష చేకూరి ఘనకార్యసమాచరణ కవితగియుండును. ఇట్టి మహాత్ములు శత్రువుల కజేయులై యుందురు. మన స్వాతంత్ర్యముగూడ నీమహనీయులమీదనే యాధారపడి యుండును.

---

# నాల్గవ ప్రకరణము

## మిత్రులు—శత్రువులు

శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ
నిర్మమో నిరహంకార స్సమదుఃఖసుఖక్షమీ॥

శ్లో॥ సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః
మయ్యర్పిత మనోబుద్ధి ర్యో మద్భక్త స్సమే ప్రియః॥

—భగవద్గీత ౧౨ అధ్యాయము ౧౩-౧౪ శ్లోకములు.

మనకు శత్రువు లెవరును లేరు. మనలను శత్రుభావముతో జూచువారును మనకు సోదరులే. కాని వారికిని మనకును కా

త్కాలికవు ఎడబాటుగలిగినది. ఈ మూలసిద్ధాంతమును గ్రహించిననేగాని ఐర్లండులో నన్నికక్షులవారికిని, నిజమగు దేశభక్తియు నింగ్లండుతో నిజమగుసంధియు గలుగనేరవు. మన దేశములో వివిధకక్షులవారును సంపూర్ణ ద్వేషభావము గలవారనియు, ఇంగ్లండుకును, ఐర్లండుకును, ఎన్నటికిని నశింపజాలని యసూయాభావము గలదనియు చెప్పువారివి మూఢాభిప్రాయములని తేలుచున్నది.

ఐర్లండుదేశము బాగుపడవలయుననిన దేశములో నందరును కలసి పనిచేయవలయును. ప్రపంచమంతయు బాగుపడవలయుననిన ప్రజలందరి యందును సౌభ్రాతృత్వ ముండవలెను. ఈ చక్కని గమ్యస్థానము చేరుటకై ప్రయత్నించుట ప్రతివ్యక్తికిని, జాతికిని ధర్మమై యున్నది. ఈ యాదర్శముల మరువకుండునటుల మన మెల్లప్పుడును మానవజాతియొక్క యుత్పత్తిని గురించియు, అందరకును అనుభవనీయమగు ప్రపంచ సౌందర్యమునుగురించియు, అందరకును సామాన్యములగుఆశయములను, భయములను గురించియు, వేయేల అందరకును సామాన్యములగు కష్టసుఖములను గురించియు చింతించి మన దురభిప్రాయములను దిద్దుకొనుట మనవిధ్యుక్తమై యున్నది. ఇది గమనించక యే ప్రజలైనను క్రూరాత్ములై నీచకార్యములకు పాల్పడినయెడల తమదేశము నసహ్యకరముగా చేసికొనుట యేగాక లోకశాంతికిని భంగముకలుగజేసెదరు. ఇట్లుగాక

ఉత్తములును ఉదారులును నగు ప్రజలు శత్రువులతో యుద్ధమునకు తలపడి, తమస్వాభావికమగు కారుణ్యమును ఔదార్యమునుజూపినయెడల తమశత్రువులను తమవలెనే పవిత్రులుగాను నిష్కల్మషులుగాను నొనరించుటయేగాక వారి హృదయములను ఉన్నతాదర్శములతో నింపి వారి మూఢహృదయములకలభ్యమగు దివ్యపదవిని సమకూర్చెదరు.

స్వాతంత్ర్య సంపాదనావసరమున రాజకీయసంయోగములన్నియు కఠినపరీక్షలకు లోనుగావలసి వచ్చును. ఆంతరంగిక సఖ్యత సులభముగా చేకూరదు. అంతర్జాతీయ సఖ్యతయు చేకూరుట మిక్కిలి కష్టసాధ్యము. ఒకవేళ చేకూరినను దీనిని భద్రముగా నెంచి యీసఖ్యతను పాడుచేయుట కెన్నియో సావకాశములు గలుగక మానవు. పతాకము చుట్టును జేరి దాని గౌరవమును నిలువబెట్టు వీరుల సంఖ్య చెల్లాచెదరగుటయు సంభవించును కావున మనకెన్ని యభిప్రాయభేదములున్నను, మనల నైక్యముజేసి, కార్యసాధనకు పురిగొల్పు బంధము లేవియో తెలిసికొనుట యావసరము. నిజమయిన సోదరప్రేమగాని మనల నైక్యము చేయజాలదు. దీని నెవరును గ్రహించినట్లు గనుపడదు. తమదేశమునకై, వివిధరాజకీయ కక్షలవారును నేకీభవించి దొరలయెడ సోదరభావము బ్రకటించి కార్యసాధనకు తలపడిరేని, వీరివలె పట్టుదలగాని లక్ష్యముగాని లేనివారు, ఈ సంయోగము ననుమానముతో జూచుచున్నారు. చాలమంది వీరితో చేరక యుపేక్షాభావము జూపుచున్నారు. కొంతమంది చేరినను, అనేకసంశ

యములతో చేరుచున్నారు. ఒండొరుల ద్వేషించుకొనుటకును, చెల్లాచెదరగుటకును, స్వల్పవిషయములు చాలుననియు, నీ సంయోగము శాశ్వతము కాదనియు వా రూహించుచున్నారు. ఈభావములను ఖండించి, మనకు నిజమయిన సద్భావము గలదని నిరూపించవలెను. మన దేశములో మూడు మతశక్తులవారిలో, ఉత్తములును, యితరుల కాదర్శప్రాయులును నగువారిని ముగ్గురి నేరి, వారొండొరులయెడ చూపు భావములను పరీక్షింతము. ఒకడు క్యాథలిక్ మతావలంబకుడు. రెండవవాడు ప్రొటెస్టెంటు సంఘమువాడు. మూడవవాడు యీ రెండుపక్షములకును జెందనివాడు. వీరిలోనే యొకని సంపూర్ణతత్వము రెండవవానికి సరిపడదు. వారివారి సిద్ధాంతములలో కొంతభాగము నొక్కొక్కరొప్పుకొనిన నొప్పుకొందురు. కాని పూర్తిగా నొప్పుకొనరు. వీరందరునుకలిసి యొప్పుకొను విషయములు కొన్ని గలవు. వీరందరును, రాజకీయజీవితమును, వ్యక్తులజీవితమును, ధర్మయుతముగను, పవిత్రముగను నుండవలెనని కోరుచున్నారు. వీరందరును ప్రజలు తమ వ్యవహారముల నెప్పుడు ధర్మబుద్ధితో పరిష్కరింపవలెనని కోరుచున్నారు. సంఘమునకును దేశమునకును గొప్పదశ చేకూర్చుటకు వీ రందరునుకలిసి ప్రయత్నములు చేయుచున్నారు. ఇప్పటికన్న ధైర్యము, సాహసము, స్వేచ్ఛ యుండవలెనను నంశములయందు వీ రేకాభిప్రాయులై యున్నారు. వీరిలో నెవ్వరును తమసిద్ధాంతములను రెండవవాడు ఖండించుట కొప్పుకొనడు. కాని యీ ముగ్గురిని

బంధించునది గాఢమగు సానుభూతి. వీరి కొండొరులయెడ బరస్పర గాఢాభిమానము గలదు. వీరి యనురాగజన్యములయిన కరస్పర్శనములు, సానుభూతులు, నమ్రతలు, పరస్పర ప్రోత్సాహములు, త్యాగములు, ధైర్యస్థైర్యములు, జయకాంక్షలు, వీరి ప్రేమను సూచించుచున్నవి. వీరి సంయోగము సాధారణమగు సమావేశముకాదు. ఈప్రేమను జూచి యితరులు దురభిప్రాయపడుటకవకాశములుగలవు. వీరు వివిధమతముల వారైనను, ఒకమతమునకు జెందినవారివలె ప్రేమను గనబరచుకొనుచున్నారు. ఒండొరులను చంపదలచువారు చేతిలో చేయివేసుకొని తిరుగుచున్నారు. దీనికి కారణమేమియని యడుగవచ్చును. ఎవనిపద్ధతులు మిక్కిలి ప్రశస్తములో వాడే యీప్రశ్నకు ప్రత్యుత్తర మీయ సమర్థుడు. అతడిట్లు వచించును: వారు పాటుబడునంతరములలో వివిధమతముల వారి నైక్యముచేయునది సద్ధర్మమొక్కటియే. వారీ ధర్మమును గ్రహించి యొకసంఘముగా చేరి, పాటుపడుచున్నారు. ఇది మున్ముందు తాముచేయు గొప్ప కార్యములకు త్రోవజూపుచున్నది. ఈ సులభకార్యము నతడు ధైర్యముతోను, ధర్మబుద్ధితోను నిర్వహించెనేని, అతని ధైర్యసాహసములు వృద్ధియై ముందు ఇంతకన్న గొప్పకార్యములు చేయుటకు వీలగును. ప్రస్తుత మతనికి గోచరముగాక, భ్రమవలె దోచు కొన్ని యుత్కృష్టసమస్యల నతడు పరిష్కరించగలడు. ఈప్రత్యుత్తర మందరికిని సంతృప్తి గొలుపజాలదు. అతని ఉత్సాహముగా

దోచునది యితరులకు నిరుత్సాహకరముగా నుండుట గొప్ప యాటంకము. కాని యన్నికష్టముల కతీతమై వారి స్నేహ మల రారుచున్నది. త్యాగముమీదను, ఆత్మవిశ్వాసముమీదను ఓర్పుమీదను నాధారపడియున్న స్నేహము శాశ్వతముగా నుండుటకు సందియము లేదు.

కాని వివిధ రాజకీయ కక్షలకు జెందినవారు కలిసి తమ మాతృభూమికై పాటుబడుట యరుదు. ఇట్టి వా రల్పసంఖ్యాకులైయున్నారు. ఉత్తర ఐర్లండునకును, దక్షిణ ఐర్లండునకును, సంయోగము కుదురుట మిక్కిలి కష్టతరమగు సమస్య. ఇరు పక్షములవారి మనములందును సంయోగాపేక్ష కొంచెమైనను గలుగకుండుట శోచనీయము. వారిలో ననేకు లిట్టిప్రయత్నములను నిరసించుచున్నారు. కొంతమంది యిది సాధ్యము కాదని తలచుచున్నారు. బద్ధశత్రువులు కొంతమంది పగనుజూపుటయే శ్రేష్ఠమని తలంచి పగను వృద్ధిజేయు కార్యములను చేయుచున్నారు. సంయోగమునందు నమ్మకములేని వారందరు, ఉత్తర ఐర్లండునకును దక్షిణ ఐర్లండునకును, స్నేహ మొనగూడదని తలచుచున్నారు. ఇట్టి యభిప్రాయములను సూచించుట మనలో కొందరికి కోపము గలిగించక తప్పదు. ఐర్లండంతయు ఐక్యము కాగలదనియు, స్వాతంత్ర్యమునకై ఉత్తరము, దక్షిణము, క్యాథలిక్ ప్రొటెస్టాంటు, మితవాదులు, అతివాదులు. అందరును కలిసి పనిచేయగలరనియు. మన బోటి కొంతమంది తలచుచున్నారు. తమ మూఢాభిప్రాయముల యెడ నమ్మకముగల్గి, ఆత్మనిగ్రహమును గోలుపోయి

శత్రుత్వము నభివృద్ధిచేసెడు కార్యములను చేయువారికి నోర్పు, శాంతము, సోదరభావము, దయ గలిగియుండుడని మనము చేసెడి బోధ లెట్లు చెవికెక్కును? ఇవి దుర్బలుల బోధలని వారు చెప్పెదరు. మనము క్రిస్టియనులమని పిలువబడుచున్నాము. కాని యాక్రీస్తుమతసిద్ధాంతముల నొప్పుకొనము. వానిని పరిహాసముచేయుటకు గూడ వెనుదీయము. క్రీస్తుమతస్థులుగానివా రనేకమంది యీబోధనల నాలకించుచుండగా, మనమిట్టి దురవస్థయందుండుట శోచనీయము. షెల్లీ మహాకవి యిట్లు వ్రాయుచున్నాడు: 'యాంటికా రాజ్యమును, మార్డోనియస్ (Mardonias), జర్సీసు (Xerxes) అను పరిషియాదేశపు చక్రవర్తులు కొల్లగొట్టిరి. కొంతకాలమునకు గ్రీకు చక్రవర్తియగు నలెగ్జాండరు పరిషియాదేశమును కొల్లగొట్టి గొప్ప సామ్రాజ్యము నంతముచేసెను. మొదట పరిషియాచక్రవర్తులు చూపిన మార్గమునే గ్రీకు చక్రవర్తి యనుసరించెను. ఈ యుదాహరణవలన, పగవలన పగ నశించనేరదనియు, అభివృద్ధి నొందుననియు తేటపడుచున్నది. మనము చూపగలుగు ప్రతినిదర్శనమువలనను పగవలన పగయడంగనేర దనుసత్యమే వెల్లడియగుచున్నది. దీనిని షెల్లీ మహాకవి నిరర్థకమైన మూఢత్వమని వర్ణించియున్నాడు. దౌర్జన్యము ప్రతివాని హృదయమునందును, అసహ్యమును పురికొల్పక మానదు. మాజినీమహాశయుఁ డీవిధముగా వ్రాయుచున్నాడు. 'మనము చేయవలసినది దౌర్జన్యమువలన నొక క్రొత్తపద్ధతి స్థాపించుటగాదు. ఇట్లు స్థాపితమగు మార్గము

పూర్వముకన్నను మంచిదయినను, క్రియత్వముమీదను, అధర్మముమీదను నాధారపడియుండును.' బాయన్ నది కిరువైపుల నుండువారు (ఉత్తర ఐర్లండు-దక్షిణ ఐర్లండువారు) యీ మహాశయుల వాక్యరత్నములను స్మరింతురుగాక! రెండు పక్షములవారును, కయ్యమునకు కాలు ద్రువ్వుటయు, 'పగవారికొక గుణపాఠమును నేర్పుటకు' సంసిద్ధులగుటయు, నీచకార్యమని తెలవవలయును. మనపూర్వపు శత్రుత్వమును పునరుద్ధరించుటకు ప్రోత్సాహ మధికముగా నుండును. కాని యీ సమయామందు దృఢమనస్కులమై, శాంతమును, ఓర్పును జూపవలసియుండును. దీనియందే మనబల మిమిడియున్నది.

మనము జయముపొందగల మనునాసచే నల్పసంఖ్యాకులమైనను మనయుద్యమమును కాపాడుకొనుచున్నాము. ఫలములేకయే జనులు పోరాడుట యసంభవము. వారికే నభివృద్ధి పొందుచున్నామనియు, జయము సమకూరుననియు, ఆశలున్న యెడల ద్విగుణీకృతోత్సాహముతో పనిచేసెదరు. మనము బాగుగా పరిశీలించి చూచినయెడల మనము పడినకష్టము ఫలోన్ముఖ మగుచున్నదని మనకు తెలియుగలదు. పూర్వపు మనస్పర్ధలును, కడుపుమంటలును మనకు జ్ఞాపకమువచ్చును. యుద్ధమునకు పురిగొల్పువారిని, ద్వేషపూరితులగు జనసమూహమును మనముచూతుము. కాని వీరిసంఖ్యయు, వీరి ద్వేషమును చాలమట్టుకు తగ్గినవి. ఇరువది సంవత్సరములకు పూర్వమున్న వైషమ్యము లిప్పుడులేవు. నూతనాదర్శములతో నిండియున్న యువజనసమూహ మీద్వేషమునకు విముఖత్వము

జూపుచున్నారు. వారికే పక్షమునెడలను సానుభూతిలేదు. వారికి సద్బోధనలు చేసినయెడల మిక్కిలి యుత్సాహముతో కృషిసల్పెదరు. వారికి దురభిమాన మున్నమాట సత్యమేగాని వారికిసరియైన శిక్షనిచ్చుట మనవిధియైయున్నది. వారిని సరియైన మార్గమున నడిపినయెడల, ధైర్యమును, ఉత్సాహమును జూపి చాకచక్యముగా పనిచేసెదరు. కావున మనము నిరుత్సాహపడనవసరము లేదు. అనేక సంవత్సరముల కృషివలన మనము ప్రస్తుతస్థితియం దున్నాము మన తండ్రులకాలమున రాజకీయజీవిత మనేకబూటకములతో నిండియుండెను. కాని మన కాలమున యీబూటకములన్నిటిని మిథ్యలని త్రోసివేసితిమి. ఇట్లనుటవలన మనతండ్రులను నేను తప్పుపట్టుటలేదు. వారు ధైర్యముతో పాటుపడినందుననే మన మిప్పటియున్నత స్థితియందున్నాము. వారికి మనప్రేమయు, కృతజ్ఞతయు జూపవలసియున్నది. కాని వారు చేసినపొరబాటులు మనము దిద్దుకొనవలయును. వారు మొదలుపెట్టినకార్యమును మనము కొనసాగించవలెను. అసంపూర్తియైన కార్యక్రమమును పూర్తిచేసి తమపుత్రుల యనుభవము నిమిత్తమై యొసంగుట ప్రతితరమువారికిని విధియై యున్నది. ఈ సత్యమును యువకులు సులభముగా తెలిసికొనగలరు. ప్రతితరము వారును, తమపూర్వులకన్న నభివృద్ధి యగుచున్నారనుటకు సందియము లేదు. పూర్వులయభిప్రాయములు మారి, మనము సత్యమునెడల నెక్కుడు అభిమానము చూపుచున్నామనుట నిశ్చయము. ప్రతివ్యక్తియు తనస్వానుభవమువలన నీసంగతి

తెలిసికొనుచున్నాడు. కావున ద్వేషమునకు పురిగొల్పినవారు ముసలివారగుచున్నారనియు, శీఘ్రకాలములో మరణించెదరనియు, తెలియనగును. మూఢనమ్మకములు బొత్తుగానశించవు. ప్రతితరమువారికిని కొన్నివిశ్వాసము లుండుట సహజము. కాని ప్రస్తుతము విరోధములకు కారణమై, మనయభివృద్ధికి నాటంకము గలిగించెడి మూఢనమ్మకములు త్వరలో నదృశ్యమగును. ఈప్రాతశత్రుత్వములవలన మనమొక నీతిగ్రహించవలయును. దేశముయొక్క క్షీణదశకు శత్రుత్వము కారణమగుటచే ముందుముందుకు కలహములు పుట్టకుండ జాగరూకులమై యుండవలయును. మనకు తగినంత యాత్మవిశ్వాసముండి, ధైర్యమువదలక పాటుపడితిమేని, పూర్వమునుండియు మనలను పీల్చి, పిప్పిజేసిన మనస్పర్థలు నశించుననుటకు సందియము లేదు. కాని మన మసమానమగు ధైర్యముజూపవలసి యుందుము. ప్రజలందరును ఈయాదర్శముల సత్యమునుగ్రహించి మాతృభూమినున్నత స్థానమునకు గొనిపోయెదముగాక.

ఐరిషువారిలో సోదరభావ ముండవలెనని కోరుటలో నూతన మేమియు లేదు. ఐర్లండుదేశస్థుల యాంతరంగికసఖ్యత యెంతయవసరమో యితరదేశములతో సఖ్యతయు నంత యవసరమేయని మనవారు గ్రహించకుండుట శోచనీయము. ఇరుగు పొరుగువారిలో స్నేహభావముండుట సహజము. ఒక పట్టణములో గాని వీధిలోగాని నివసించుప్రజలయందీభావము వ్యక్తమగుచునే యున్నది. మిత్రులకేదైన మేలు జరిగిన యెడల తమకు జరిగినట్లే సంతసించెదరు. వారికేదయిన యాపదగలిగిన

యెడల ఆకష్టముల తొలగించ ప్రయత్నించెదరు. శుభాశుభ సమయములయందు వారొండొరుల కష్టసుఖములయందు సహాయభూతులయ్యెదరు. ఈ మిత్రత్వము శత్రుత్వముగా మారినపుడు వా రెట్టిభావములను గనుబరచు చున్నారో తెల పోయుడు. వారిద్వేషమునకు మితిలేదు. వారొండొరుల దర్శించినప్పుడు అది బయటపడును. ప్రతివిషయమునందును వారొండొరుల బాధించుకొన ప్రయత్నించు చుందురు. వారి జీవితములు దుర్భరమగుచున్నవి. మానవ స్వభావమునకు వ్యతిరేకమగు నీద్వేషభావము నడంచుటకును సఖ్యతను వృద్ధి చేయుటకును వారియంతరాత్మలు పరితపించు చుండును. వారొండొరులకు చేసిన కీడు వారికి సఖ్యత కుదురనీయదు. కాని వారి హృదయములయందు ప్రేమభావము ప్రతిష్ఠితమై వీలైనపుడు సఖ్యము చేయ జూచును. మనము శాశ్వతసుఖముల నొందవలెనన్న నీభావము ప్రతివాని హృదయము నందును వర్ధిల్లవలయును. వ్యక్తులెట్లో జాతులును నట్లేయని మనము గ్రహించి పూర్వము చేసిన పొరబాటుల నికముందు చేయకుందుముగాక! శాంతియనగా ప్రతిజాతికిని భౌతికవికాసమునకును ఆధ్యాత్మికాభివృద్ధికిని కారణభూతమైన స్వాతంత్ర్యము బొందుటయై యున్నది. ముఖ్యాంశములయందు మానము లొంగిపోతిమేని మనము నెలకొల్పెడు శాంతి నిజమయినశాంతి గానేరదు. అది బానిసత్వమనబడును. ఒకజాతిని బానిసలుగా జేసి యధర్మరాజ్యము నెరపుచున్న రెండవజాతిని తనదుర్మార్గకార్యములనుండి తప్పించుటయే నిజమయిన శాంతియనబడును.

ఆత్మయొక్క ప్రశాంతత్వమును ప్రతిష్ఠించుటకు సోదరప్రేమ యవసరము. స్వాతంత్ర్య పోరాటమున దయాదాక్షిణ్యము లుండుటవలన మనబలము తగ్గునని కొంతమంది చెప్పెదరు. కాని యేది తగ్గినను మనబలము మాత్రము తగ్గదు. తండ్రికిని కుమారునకును, అన్నకును తమ్మునకును అభిప్రాయ భేదములు కలిగినపుడు వారు యుద్ధమునకు గడంగుదురు. వారి బాంధవ్యములును ప్రేమలును వారిబలము నెంతమాత్రమును తగ్గించుట లేదు. కావున మనశత్రువులు మనకు ఆత్మబంధువులని చెప్పినపుడు వారిని ధర్మమార్గమునుండి మరలించుట లేదు. వారు తమవిధులను ద్విగుణీకృతోత్సాహముతో నెరవేర్చి తమగమ్యస్థానము చేరుటకు ప్రోత్సాహపరుచు చున్నాము.

వ్యక్తిస్వాతంత్ర్యమునకును, జాతీయ స్వాతంత్ర్యమునకు మాత్రమేగాక, మానవ సోదరత్వమునకును పాటుపడవలసియున్నది. ఈ యంశము ఐహిక రాజ్యమున కతీతమని తలచకూడదు, ఈ గమ్యస్థానము చేరుటకు గాఢముగా ప్రయత్నించవలెను. ఈలక్ష్యమును వీడక స్వధర్మ నిర్వాహణమునకు గడంగితిమేని గమ్యస్థానము చేరగలము. మనము త్రోవదప్పుట కనేక సావకాశము లుండును. కాని మన నిష్కల్మష హృదయములు మన మార్గమును స్పష్టము చేయవలయును. ఆంతరంగిక సఖ్యతకై పాటుపడుటయందు, అధిక సంఖ్యాకులు, స్వల్ప సంఖ్యాకుల ననేక విధముల బాధలుపెట్టి హింసింపుడని మూఢావేశపరవశులగువారు ప్రోత్సహింతురుగాని, మన వివేకము మనలను వీడకూడదు. మనము స్వల్ప

సంఖ్యాకులయెడల సానుభూతి గనుబరచితిమేని, వారును మన సద్భావమును గుర్తెరింగి కొంతకాలమునకైనను మనలో చేరి మన యాశయములకొరకు, ఉత్సాహముతో పాటుపడెదరు. అంతరంగిక సఖ్యత సమకూరును. ఇది సమకూరినప్పుడు, స్వాతంత్ర్యము చూపుమేరలో నుండును. మన మాంగ్లేయుల యాధిపత్యము నొప్పుకొనిననేగాని, వారు మనతో సంధి చేసికొనుట కిష్టపడరు. 'అట్టి స్థితియందు వారితో సంధికొరకై యేల కోరెదరు?' అని కొంతమంది యాక్షేపించవచ్చును. దీనికి ప్రత్యుత్తర మొసంగుట సులభము. ఆంగ్లేయుల యాధికారము నొప్పుకొనవలసి వచ్చినట్లయిన మనము సంధి చేసికొననే చేసికొనము. మనము లొంగిపోదు మనుభయము నాకు లేదు మనము స్వాతంత్ర్యము నతిశీఘ్రకాలములో సంపాదింపగలమను నమ్మకము నాకు గలదు. మనము స్వాతంత్ర్యము పొందవలెనన్న, శత్రువులయెడల ప్రేమ, కరుణ మొదలగు భావములను గనుబరచుచు, మనము చేయుచున్న పోరాటమును మిక్కిలి తీవ్రముగా కొనసాగించవలెను. మనకు శాంతి కావలెనన్న యుద్ధము చేయవలయును. మనకు శాశ్వతమగు స్నేహభావముండవలయుననిన, నీ యుపద్రవకరమగు సంబంధమును త్రెంచివేయవలయును. ఇంగ్లండుతో మనకుగల రాజకీయ, సాంఘిక, వాణిజ్య సంబంధములన్నియు త్యజించి, యావసరమైనయెడల సంపూర్ణ స్వాతంత్ర్యము లభించిన తరువాత వానిని పునరుద్ధరించుకొనెదము. కొన్ని సమయములయందు దీ ప్రయత్నములవలన స్నేహభావము కుదురు

టకు వీలులేదని మనకు నిరుత్సాహము పొడమును. కాని యీ నిరుత్సాహమును తొలగించివైచి మన ప్రయత్నములను కొనసాగించవలెను. స్వాతంత్ర్యము ముఖ్యావసరము. స్వాతంత్ర్యము లభించనిచో, ఇంగ్లండుతో స్నేహము కుదురుననుట కల్ల. కావున మనపక్షమువారియందీ యాశయమును పురిగొల్పవలెను. దేశమునందంతటను నీ యాదర్శమునెడల సానుభూతి గలుగుచుండుట సంతోషకరము. మన ప్రతిపక్షులయందును నిట్టి యాశలు గలుగును. మొట్టమొదట వారివి భ్రమయని తలతురుగాని యెుకానొక సమయమున వారీసత్యమును గ్రహించక తప్పదు. అప్పుడే నవయుగ మారంభమగును. అధర్మము, ద్వేషము నశించి సఖ్యత వృద్ధిబొందును. మనకు స్వాతంత్ర్యము లభించెనేని యాంగ్లేయుల స్వాతంత్ర్యమునకు భంగము కలుగజేయుదుమేమో యను భయమనేకమందిని బాధించుచున్నది. ఈ దురభిప్రాయము తొలగి మన మస్వతంత్రులుగా నున్నప్పటికంటె స్వాతంత్ర్యమనుభవించుచున్నపుడు ఇంగ్లండు ఎక్కుడు నిర్భయముగా నుండవచ్చునని వారికి తెలియగలదు. వారిమనస్సులయందు సందేహములన్నియు నివృత్తియగును. మనశత్రువులును మనవలెనున్న యాదర్శములు గలిగి యుండిరేని, పరమోత్కృష్టమగుస్థితి శీఘ్రముగా చేకూరును. కాని యింగ్లండునకుగల సామ్రాజ్యకాంక్షయు కేవలభౌతికాదర్శములును, ప్రస్తుతస్థితియందు, ఆధ్యాత్మికోన్నతిని, యుదారత్వమును గలుగజేయుటకు సహాయభూతములు గాకున్నను, మనయాదర్శములు వీడకుండ ప్రయత్నములు చేయవలయును.

ఆంగ్లదేశీయుల క్రూరత్వమును, నీచత్వమును, మనకోరికలు సఫలము కాగలవను నాసను భగ్నముచేయుచున్నను, మనము ధర్మమార్గము ననుసరించుచున్నామని మనకమితసంతోషమును, తృప్తియు గలుగుచున్నవి. షేక్స్పియరు మహాకవి నాటకముల వలనను, షెల్లీచే రచియింపబడిన గీతములవలనను, టర్నర్ చే చిత్రింపబడిన పటములవలనను మనకుగలిగిన యానందముకన్న వేయిరెట్లు బ్రహ్మానందము మన కీయాశయములవలన గలుగుచున్నది. మనశత్రువుల హృదయాంతరాళముల నుండి కూడ సోదరత్వము, స్వేచ్ఛనుద్దీపించు భావములు వెలువడు చుండుట మిక్కిలి సంతోషకరము. ఈమహాపురుషులు వెలి బుచ్చిన భావములే మనల నుత్సాహభరితులనుగా జేసి స్వేచ్ఛ కై ప్రయత్నింప బురిగొల్పుచున్నవి. ఈకార్యములో నగుపాట యెంతకష్టమయినను మనము సత్యపథమును వీడరాదు. జాతీయ తయొక్క మూలతత్వ మిదియే. మన మీయుత్కృష్టధర్మము కొరకును, లోకకళ్యాణముకొరకును, ఉత్సాహముతో కృషి సల్పితిమేని, మనయుత్సాహమును లోకములో ప్రజలందరును గ్రహించి యుత్సాహముతో ననుకరించెదరు. ఈయాదర్శమున కై పాటుపడుట యానందకరమై యుండుటయేగాక, ఫలముగూడ సమకూర్చును. ధైర్యముతో పోరాడువారికి జయముతప్పక చేకూరును. తమధర్మమును నెరవేర్చితిమిగదాయను సంతృప్తియు, నానందమును వారికి గలుగును. సంశయాత్ములును నీమార్గము నవలంబింతురు. లక్ష్యములు గొప్పవయినయెడల కొంత ఫలమై నను సమకూరక తప్పదు.

# ఐదవ ప్రకరణము

బలము—దానిరహస్యము.

స్వాతంత్ర్యము సంపాదించుటకు మనము బలవంతులమై యుండవలెను. బలమనగా నేమి? పశుబలమా, ఆత్మబలమా? శత్రువులను జయించుట కేది యుత్తమమయినది? శత్రువులను జయించుటకు శక్తి మన కెట్లు గలుగును? ఈవిషయములు చక్కగా గ్రహించినగాని, యీసమస్యయొక్క తత్వము మనకు బోధపడదు. ఈసమస్యను బాగుగానాలోచించి తేలినపర్యవసానము మీాద మనజీవితముల నాధారపడియుండునట్లు చేసికొనవలయును. ప్రతివ్యక్తియు తనజీవితమును క్రమపరచుకొనిననే గాని మనజాతి యభివృద్ధినొందనేరదు. జాతీయజీవనముయొక్క పవిత్రతయు, నుత్కృష్టతయు, వ్యక్తులజీవితముపైని నాధారపడి యుండునని మనమెఱుగవలయును. అధికసంఖ్యాకులు స్వల్పసంఖ్యాకులను జయించు కాయికశక్తియే బలమని ప్రస్తుతసమయమున తలచబడుచుండుటచే నీసమస్య నిచ్చట చర్చించుట యావసరమైనది. ఈసత్యమును స్పష్టముగ గ్రహించుటకు ఓర్పు, తెలివి, విద్య, యావసరమగుచున్నవి. మనయాదర్శము గొప్పది. మనము చేయవలసినపని చాలయున్నది. యుద్ధరంగమును పరీక్షించుటయు, శత్రువుయొక్క స్వభావ మరయుటయు, మనబలమునకును, శత్రుబలమునకును తారతమ్యము కనిపెట్టుటయు, క్రమక్రమముగా మనబల మభివృద్ధిచేసికొని యజేయులమగుటయు మిక్కిలి యవసరము.

నిజమయిన శక్తియేదియో మనకు తెలియవలెనన్న మన మొకభేదము గ్రహించవలయును. రెండుసేనలున్నవనుకొనుడు. మొదటిది బలవంతమగుసేన, నడుపగల నాయకులు; ఉత్సాహముతోడను, జయకాంక్షతోడను వైరులమీదికి దూకుచున్నది. రెండవది, సేనయోడింపబడి చెల్లాచెదరైన తరువాత నిలుచువీరులు; వీరు స్వల్పసంఖ్యాకులే, కాని యధికసంఖ్యాకులవలె పిరికివారుకారు. ఈరెంటికిని భేదము తెలియనగును. ఈస్వల్పసంఖ్యాకుల యాత్మలు కష్టసాధ్యములగు కార్యముల సాధించుటయందు స్థిరమైయున్నవి. సేనయొక్క ధైర్య మీకొలదివీరుల ధైర్యమువంటిదికాదు. ఈసేనయొక్క బలము దేనియం దిమిడియున్నది? దాని శిక్ష, తర్ఫీదు, ఏకీభావము, పదాతులు తమనాయకులకు చూపువిధేయత, దాని బలమునకు కారణములు. ఇంతియకాదు, అధికసంఖ్యాకులు కలియుటచే కలిగినధైర్యము, ఉత్సాహము, గొప్పశక్తులుగల సేనానులయందు విశ్వాసము, యీసేనకు ధైర్యము పురిగొల్పుచున్నవి. ఈసేన కొకవిపత్తు సంభవించుననితలచుడు. ఒక గొప్ప సేనానిచావు, ఒకయుక్తి విఘాతమగుట, మరియొకవిపత్తయినను సేనయొక్కబలము నాశముచేయును. భటులు చెల్లాచెదరగుదురు. అపజయము గలిగినది. మొదటినుండియు, యీసేన పొందినశిక్ష కొంతకాలమువరకు వారిని చెల్లాచెదరు కాకుండ నుంచును. కాని క్రమముగా వారు భీతచిత్తులగుచున్నారు. సేనపలాయన మగును. వారికొసంగబడిన బాహ్యశిక్ష వారికి కష్టకాలమునందు మనోనిగ్రహము, ఆత్మబలము లేకుండ

జేసినది. వారి కాత్మశిక్ష యొసంగబడి యుండలేదు. వారి సంఖ్య తగ్గినప్పుడు వారిబలమును తగ్గి వారిని నిస్సహాయులుగను భీతచిత్తులుగను జేసినది. ఇప్పుడు హతశేషులయిన వీరులసంగతి యాలోచింతము. ఈవీరులధైర్యము మిక్కిలి శ్రేష్ఠమయినది. ప్రతివారికిని, శత్రువు నతిధైర్యముతో నెదుర్కొను శక్తిగలదు. వారికార్యముల ఫలితము వారెఱుగకపోలేదు. వారు తమ యాత్మశక్తిని ప్రదర్శించి యపజయమును జయముగా మార్చుటకు ప్రబలప్రయత్నములు చేయుదురు. వారు తమసేనకు జయము నొడగూర్చలేకపోయినను, తమమీదపడుచున్న సేనాసమూహమునాపి చెల్లాచెదరైన తమసేనలను కూర్చెదరు. సందిగ్ధసమయములయందు, ఆత్మశక్తిగలవాడు తనయధికారుల యాజ్ఞలకొరకు వేచియుండడు. తానుచేయుకార్యముల ఫలితము నాలోచించడు. తానుచేయవలసినకార్యము నొకక్షణములో నిర్ధారణచేయును. పటాలముల పలాయనము, పతాకమున కవమానము, మీదబడుచున్న సేనాసమూహములు పారిపోవుటయో, చావో, యివన్నియు సామాన్యచక్షువుల కగుపడునవి కాని యాత్మశిక్షణము పొందినవారల కీయవస్థయందును తమకు జయముగలుగునను నాశలు వదలలేదు. ఈ వీరులు పలాయనమున కొప్పుకొనక, శత్రువుల నతిధైర్యముతో నెదుర్కొని, వారి కపజయము గలిగినయెడల తమప్రాణముల నాహుతిజేయుదురు. మనకు విమోచనము గలిగించు గుణమిదియే. మనదేశచరిత్రయం దిట్టియసమానధైర్యముచూపుట సాధారణముగనుకనే మనము జయముపొందెదమను నాశలు

నాకుగలుగుచున్నవి. మనదేశస్థు లనేక యుద్ధరంగములందస మానమగు ధైర్యమును జూపియుండిరి. ఇతర దేశము లయందును, నపారమగు ప్రజ్ఞజూపి తమమాతృభూమికి కీర్తిదెచ్చిరి. మన పుణ్యభూమియందే యనేకపవిత్రస్థలములయందు మన వీరులు గనుబరచిన ధైర్యము, సాహసము, త్యాగము, మన భూమి జయింప శక్యముగానిదని లోకమునకు చాటించినది. మధ్యగలిగెడి మహోజయములకన్న చివరచూపెడి త్యాగము, ధైర్యము హృదయసంచలనము గావించును. వీటినిగురించి మనము తలచుకొనినప్పుడు మనధైర్య మినుమడించును; మన స్సునకు వికాసము గలుగును; యింకొకయుద్ధమునందిట్టి ధైర్యముజూప మనకు ప్రోత్సాహముగలుగుచున్నది.

కావున ప్రతివాడును, ధైర్యము, ఓర్పు, స్థిరత్వము నభ్య సింపవలెను. మనమిది గ్రహించినపుడే మనపని ప్రారంభ మగును. ముందుముందు మనము స్వాతంత్ర్యమునకై పాటు పడవలసి యుండుననియు ప్రస్తుతసమయమున చేయునదేమియు లేదనియు కొంతమంది దురభిప్రాయ పడుచున్నారు. ఇట్లు తలచుట పొరబాటు. ఈ నడుమ మనధైర్యము వృద్ధిచేసికొన వలయును. జనులమనములయం దింకొక దురభిప్రాయము గలదు. రాజకీయ విషయములకును సాంఘిక విషయములకును మతవిషయములకును సంబంధము లేదని తలచుచున్నారు. ఇట్లు తలచి రాజకీయకార్యములకు కొన్ని ఘంటలు నియమించు కొని తక్కిన కాలమంతయు వృథా పుచ్చుచున్నారు. కాని మధ్యాహ్నకాలమునకును ఉదయమునకును సంబంధమున్నట్లే

తా నేవిషయములను గుఱించి పాటుపడుచున్నాడో దానికిని, యితర సమస్యలకును సంబంధము కలదని గ్రహించవలెను. స్నేహపాత్రులును మంచిపౌరులును దేశభక్తులును యోధులును నగుటకు సావకాశముగలదు. ఒకడు కొన్ని విషయములయందు యోగ్యుడుగను, నితర విషయములయం దయోగ్యుడుగను నుండజాలడు. తమ దేశమునకై పాటుపడువారు గౌరవనీయులుగను, ఉత్సాహవంతులుగను నుండవలయును. తమయాంతరంగిక జీవనములయందు దయాసత్యశౌచాదిగుణములును, పవిత్రతయు నభివృద్ధి పరచుకొనవలయును. అతని నడత నిష్కల్మషముగా నుండవలెను. జాతీయముగను, రాజకీయముగను, అనవసరముగా నగపడు అనేక సమస్యల నతడు పరిష్కరింపవలసియున్నది. ప్రతిదినమును నతడు చేయుచున్న కార్యములయందు తన యభిప్రాయములను స్థిరపరచుకొంచు ముం దట్టిసమస్యలు వచ్చునప్పు డత డెట్లు ప్రవర్తించవలయునో దృఢపరచుకొనవలెను. ఒక లౌకికునియొక్కగాని వర్తకునియొక్కగాని యుదాహరణము తీసికొనుడు. వారు తమ మిత్రులతో చాలకాలము గడుపవలసి యుందురు. వారి తీరిక సమయమును వారెట్లు గడుపుచున్నారో యాలోచించుడు. వారి సంబంధములు పరస్పరప్రేమమీద నాధారపడి యుండుట యవసరము. కాని వారు దినమంతయు కలహించుట యందును, పౌరుషములయందును గడుపుచున్నారు. క్షుద్రవిషయములను గొప్పజేసి వా రనేకతగాదాలు పడుచున్నారు. వారు రొట్టెకై కీచులాడుకొను పిల్లుల విధమున

తము కాలమును గడుపుట మనయందరకు విదితమే. పురుషులయం
దును, స్త్రీలయందును యీ యోర్వలేనితనము, స్వలాభాపేక్ష,
కొట్లాడుకొనుట, ఒకరిమీఁదనొకరు నిందలు మోపుకొనుట
మనకు గనఁబడుచున్నవి. ఇందువలన విషయమెంత స్వల్పమో
వ్యక్తులెంత నీచులో మనకు తెలియుచున్నది. విశాలభావము,
ధార్మికస్వభావము, వీరియందు గానరాదు. ప్రజ లీయంశము
లను గమనించి తమ ధర్మమును నిర్ధారణ చేసికొనవలయును.
నేను ప్రతిపాదించుచున్న యీ సిద్ధాంతము చక్కఁగా నగు
పడునుగాని యనుష్ఠానమునం దంతి సులభసాధ్యము గాదు.
దురహంకారముచే నొక డొకపనిని చేయుటచే రెండవవానికి
కోపము వచ్చును. వీరు పోట్లాడుకొనెదరు. వీని కేసిద్ధాంత
మునకై కోపమువచ్చినది? ఇట్టి స్వల్పవిషయములను గొప్ప
జేసి తమ జీవితకాలమంతయు కీచులాడుకొనుట తగదు. మను
ష్యులకు తారతమ్యజ్ఞాన ముండవలెను. సరసత్వముచేతను,
కొన్నివిషయముల నలక్ష్యభావముతో జూచుటచేతను కోపము
రాకుండ జేసికొనవచ్చును. నీచుల యెడల నుదారత్వము
జూపుటవలన కోపము శాంతించును. కాని యిది సులభమైన
పనికాదు. బుద్ధి యింద్రియములను వశము చేసికొనులోపల
కోపము బయటికి పొంగును. దీనినడంచుట కష్టసాధ్యము.
ఇంద్రియవ్యాపారము బుద్ధి కతీతమైనది. క్రమక్రమముగ
నింద్రియములను వశము చేసికొనవలయును. అభ్యాసమువలన
నిది చేకూరును. కొంతకాలమైన తరువాత తనకు స్వల్పవిష
యమునకై కోపము గలిగినదిగదాయని నవ్వు పుట్టును. ఈ

కోపము నశించుటవలన జీవయాత్రను గడుపుటకు ధైర్యము తగ్గునని యెవరును తలచకూడదు. శాంతము ధైర్యమును వృద్ధిచేయును. ఆత్మనిగ్రహమునకై మనము చేసెడి ప్రతి కార్యమును ముందు మనలను గొప్పకార్యములు చేయుటకు ప్రోత్సాహపరుచును. స్వల్పవిషయములయందు శిక్షితులమైన యెడల గొప్పకార్యములను జేయుటకు ధైర్యముగలుగును. యుద్ధరంగములయందును, రాజ్యకార్య నిర్వాహణమునందును మనము చూపవలసిన ధైర్యము, వివేకము, ఓర్పు కచ్చేరీలలో తగాదాలయందును సాంఘిక పోరాటములయందును నేర్చుకొనవలసి యుండును.

ఇంతదనుక లౌకిక వ్యవహారములనుగురించి విచారించుచుంటిమి. ఇప్పుడు రాజకీయ రంగమును ప్రవేశింతము. అచ్చటగూడ నీపరిస్థితులే కనబడుచున్నవి. అనవసరములగు విషయములకై ప్రజలు పోట్లాడుకొనుచున్నారు. ఇట్లు చేయుట తగదు. ప్రజలు తమయాత్మనిగ్రహమును గోలుపోవకూడదు. ఆత్మనిగ్రహము గల వారిని ప్రజలు బలహీనులని యాక్షేపింతురు. కానిండు! ప్రస్తుత సమయమున నొక రాజకీయ సభయందుకూడిన మహాశయులందఱుచేయునట్టి యాలోచనలేవి? అచ్చట చేరినవారందఱు కార్యసాధకులని మనము తలంచుచున్నాము. 'కార్యసాధకులు' అను పదమునకు సాధారణముగాచేయు నర్థమేమి? వా రాచరణయం దుంచవలసిన సిద్ధాంతములనుగూర్చి యాలోచించక, క్షుద్రవిషయములకై పోరాడువారని యర్థము. మన మనేకోదాహరణములలీయ

గలము. ఒక సభనుగురించి యాలోచింతము. అధ్యక్షుడు మెత్తనివాడు. అతడు సభవారిని వశముచేసికొనజాలడు. సభవారి ధర్మమును సూచించుటయేగాని అల్లరి చేయువారిని కఠినముగా మందలించి శాంతి నెలకొల్పజాలడు. సభికులొండొరులతో ప్రసంగించుకొనుచు సభాకార్యక్రమమున కడ్డమువచ్చెదరు. ఇది సక్రమమాయనువారును, సమయము మించి మాట్లాడువారును, అసలు సంగతినిగురించి మరచి యేదో మరియొక విషయమై వాగువారును, మనకు గోచరించుచున్నారు. ఒకడు, సభవారి యెదుట చర్చింపబడు నంశ మేమియని యడుగును. సభయొక్క యుద్దేశ్య మేమియని మరియొక డడుగును. మన కందరికి నీతమాషాలు విదితమే. మన దురదృష్టవశమున, నీసభయందు మాత్రమే యిట్లు జరిగెనని తలచగూడదు. ప్రతిసభయు నిట్లేయుండును. ఈదుఃస్థితి మన సిద్ధాంతముల నాచరణయం దుంచుట కిష్టములేక కాలహరణము చేయదలచుటవలన గలిగినది. మనము గ్రహించిన సత్యమును, ఆచరణయం దుంచుటకు ధైర్యము లేక యిట్లు చేయుచున్నాము. ఇట్లుగాక, మన సంఘము ధైర్యముతో కార్యము సాధించవలయు ననిన, మనము సుశిక్షితులము గావలెను. అప్పుడుగాని మనకు రాజకీయ రంగమున పనిచేయుటకు శక్తిచాలదు. మనయుద్యమము యొక్క నిజతత్వము, దాని గంభీరత గ్రహించి, క్షుద్రాంశముల యెడలను, కుయుక్తుల యెడలను నిరసన భావమును గలిగి యుండవలెను. ధైర్యమును, నిశ్చల హృదయమును, ధర్మబుద్ధియు, గలిగి

యుండవలెను. మనలో ప్రతివాడును తన కర్తవ్యమును బాగుగా విచారించి, తనకర్మల నిభావమున కనుగుణ్యముగా చేయువలయును. వ్యక్తులు తమయాంతరంగిక జీవితములయం దిట్టి సుగుణసంపత్తిని యలవరించుకొనుట యెంత యవసరమో, జాతీయజీవనమునందును, నిట్టి యున్నతాదర్శములును, పవిత్రతయెడల గణ్యతయు గలిగియుండుట గూడ నంతే యవసరము.

ఒక యుదాహరణము చూపుటవలన నీ విషయమింకను విశదము కాగలదు. మనచరిత్రయందు రాజకీయవేత్తలు తమకు ప్రియములగు సిద్ధాంతముల నాహుతిజేసి శత్రువుల మాయలలో జిక్కి వలలోదగులుకొనిన చేపల చందమున కొట్టుకొని తుద కాత్మనాశము బొందినవా రెందరనో చూపగలము. వారు దేశద్రోహులనియు దుర్మార్గులనియు ప్రజలు దూషించుట మనమెరిగినదే. అతడు స్వతఃగా దుర్మార్గుడు కాడని మనము గ్రహించము. అతనికి మానసిక దౌర్బల్యము హెచ్చు. చిన్నప్పటినుండియు నతనికి నాత్మశిక్ష లేకపోవుటచే నాతడు అధర్మమునకు లొంగి పోవుచున్నాడు. ఆంగ్లేయసార్వభౌముని పట్టాభిషేక మహోత్సవ సందర్భమున కొంతమంది మేయరులు (అనగా పురపాలక సంఘాధ్యక్షులు) చేసిన కార్యముల వలన ఐర్లండంతయు కోపము వహించినది. మనరాజధానిపట్టణమగు డబ్లినునందును ఉద్రేకము హెచ్చుగానుండెను. ఆసంగతు లిప్పుడు విశదమగుచున్నవి. కాని యాంతరంగిక విషయము లెవ్వరు గ్రహింతురు? ఒక యుదాహరణ

నిచ్చెదను. ఈయుదాహరణము వలన నొకసత్యము వెల్లడికా గలదు. ఎంతధీరులైనను, యెంతమనోధైర్యము గలవారయినను నధికారుల మాయలలోను కపటోపాయములలోను దగులుకొనుట కెన్ని పావకాశము లేర్పరచ బడియున్నవో వ్యక్తమగును. ఒకపురపాలక సంఘాధ్యక్షుడు సంపూర్ణ స్వాతంత్ర్యవాదియని తలపోయుడు. ఈతడు న్యాయాధిపతిపదవి నలంకరించినపుడు ఆంగ్లరాజునకు రాజభక్తి ప్రమాణము చేయ వలసియుండును. కాని యతడు ఐర్లండుకు దేశభక్తి ప్రమాణము నిదివరకే చేసియున్నాడుఆతనియాశయములకిది మొదటియడ్డంకి. తరువాత ఈ యుద్యోగియుని చుట్టు, అతని రాజకీయ పక్షము వారు, అతనితో పనియున్నవారు రాజనీతివిదులు అనేకమంది గుమిగూడుచున్నారు. వీరందరును నీమేయరుగారిని ప్రధాన న్యాయాధిపతిగా నెన్నుకొనుటకు ప్రయత్నించు చున్నారు. ఇతడాపదవి నలంకరించిన యెడల వారికి లాభము. అతని నాపదవియం దుంచుటకు వారే యాటంకములను లెక్క చేయురు. ఏ యధర్మమున కైనను దిగెదరు; ఏ సిద్ధాంతముల నైన నాహుతి జేయుదురు. ఆతని న్యాయాధికారిగా చేసిన తరువాత, అతనియాత్మమీద నధికారము గలవారివలె ప్రవర్తింతురు. అతడు ధర్మమని తలచు కార్యములను గాక, వీరియిష్టానుసారముగా నతడు చేయువలసి యుండును. వారతని నొక్క కార్యమునకు ప్రోత్సహింతురు గాని, ధర్మనిష్ఠ గలయాతడాకార్యమును చేయుట కిష్టపడడు. తన పూర్వుల ధైర్యసాహసములింకను నతనియందు నశించలేదు. ఈ సందర్భమునం

దతడు ఆత్మశక్తిని ప్రకటించెను గాని యాతని నీతిబాహ్యునిగా జేయుటకు ప్రయత్నములు జరిగియు లేదు. ఈతని కార్యములు డబ్లినులో న్యాయాధికారులకు దెలిసినవి. ఈయన పద్ధతులు వారికి రుచింపవు. వా రతనికార్యములను తీవ్రముగా ఖండించెదరు. 'మేయరుగారు ధర్మవిరుద్ధముగా చేయుచున్నారు. ఇట్టి కార్యము లతడు చేయగూడదు. న్యాయాధికారి చేయవలసిన పను లవిగావు. ఈవిధముగా చేయవలెను. అతడు రాజభక్తికి ప్రమాణమును చేయలేదు' మొదలగు నంశములను కూర్చి యొక జాబు వ్రాయుచున్నారు. ఈయుద్యోగులు మేయరుగారిని తమపక్షమునకు ద్రిప్పుకొని, స్వదేశమునకు ద్రోహము చేయింప నెంచుచున్నారు. అతని హక్కులను క్రమక్రమముగా తగ్గించుచున్నారు. అతని పలుకుబడియు తగ్గుచున్నది. అతని నాశ్రయించిన వారి కాశాభంగము గలుగుచున్నది. ఇంకను మేయరుగారు తమపట్టును వీడలేదు. న్యాయమార్గముననే సంచరించుచున్నారు. కాని యాతని కాపదవియందుండుట కష్టముగదోచుచున్నది. చిత్తభ్రమణము గలుగుచున్నది. అధికారుల వంచనలకు మితిలేదు. లండన్ నగరమునుండి యధికారులయొద్దనుండి విందులుగుడుచుట కతని కాహ్వానపత్రములు వచ్చుచున్నవి. డబ్లిను నగరములోగూడ నధికారు లతని విందుల కాహ్వానించుచున్నారు. వీనికన్నిటికిని ఖర్చులియ్యబడును. అతని కన్నిచోట్ల గౌరవము గలుగుచున్నది. అతని కేదో యావసరమగు పనియుండుటచే నతడచ్చటికి పోవుటకు వీలు కలుగలేదు. కాని యధికారులప్రేమ యాతనిచిత్తమును భ్రమ

పరిచినది. అన్నివైపులనుండియు అధికారుల బాణము లతని మీఁద వచ్చిపడుచున్నవి. అధికారు లతని బుజ్జగించుచున్నారు. ప్రీతిపూర్వకముగా మాటలాడుచున్నారు. ఈ కపటమునకు లొంగకుండు టెట్లు! కాని యతఁడింకను లొంగిపోలేదు. అధికారు లింకొకపన్నాగము పన్నుచున్నారు. ప్రజల యారోగ్యము వృద్ధిచేయుట కొక సంఘము స్థాపితమైనది. ఈ సమస్యయందెల్లరు, ఆంగ్లేయులు, ఐరిషువారు, అతివాదులు, మితవాదులు, ధనికులు, బీదలు, కలియవలసి యున్నది. వ్యాధికారణములగు సూక్ష్మజీవుల నాశము చేయుట కందరికిని నిష్టమే. గొప్ప ప్రదర్శనము జరుగుచున్నది. రాజప్రతినిధి ప్రదర్శనము నలంకరించుచున్నారు. మేయరుగా రగ్రాసనాధిపత్యము వహించుచున్నారు. రాజప్రతినిధిగారు, మేయరుగారితో సరససల్లాపములొనర్చుచున్నారు. రాజప్రతినిధిభార్య మేయరుగారిభార్యతో మిక్కిలి హితముగా నుండును. మిక్కిలి యుత్సాహముతో సభ ముగియును. కరతాళధ్వనులు మిన్నుముట్టును. మేయరుగారి వలలో దగుల్కొనినారు. రాజప్రతినిధిగారు వెళ్లిపోయినను మేయరుగారిని మరువలేదు. మేయరుగారు తనకు జూపిన దయ కతఁడు వందనముల నర్పించుచున్నాఁడు. ఇట్లుండగా కొంత కాలమునకు మేయరుగారి యింటిలో శుభకార్యము తటస్థించును. కుమార్తె వివాహకార్య మనుకొనుఁడు, లేక యేదో యొక విపత్తు సంభవించినది. ఈ సమయమున రాజప్రతినిధిగారు తమయభివందనములనో సానుభూతినో తెలియ జేయుచున్నారు. మేయరుగా రుబ్బిపోవుచున్నారు. సానుభూతి తెలి

కోపము నశించుటవలన జీవయాత్రను గడుపుటకు ధైర్యము తగ్గునని యెవరును తలచకూడదు. శాంతము ధైర్యమును వృద్ధిచేయును. ఆత్మనిగ్రహమునకై మనము చేసెడి ప్రతి కార్యమును ముందు మనలను గొప్పకార్యములు చేయుటకు ప్రోత్సాహపరుచును. స్వల్పవిషయములయందు శిక్షితుల మైన యెడల గొప్పకార్యములను జేయుటకు ధైర్యముగలుగును. యుద్ధరంగములయందును, రాజ్యకార్య నిర్వాహణము నందును మనము చూపవలసిన ధైర్యము, వివేకము, ఓర్పు కచ్చేరీలలో తగాదాలయందును సాంఘిక పోరాటముల యందును నేర్చుకొనవలసి యుండును.

ఇంతదనుక లౌకిక వ్యవహారములనుగురించి విచారించుచుంటిమి. ఇప్పుడు రాజకీయ రంగమును ప్రవేశింతము. అచ్చటగూడ నీపరిస్థితులే కనబడుచున్నవి. అనవసరములగు విషయములకై ప్రజలు పోట్లాడుకొనుచున్నారు. ఇట్లు చేయుట తగదు. ప్రజలు తమయాత్మనిగ్రహమును గోలుపోవకూడదు. ఆత్మనిగ్రహము గల వారిని ప్రజలు బలహీనులని యాక్షేపింతురు. కానిండు! ప్రస్తుత సమయమున నొక రాజకీయ సభయందుకూడిన మహాశయులందఱుచేయునట్టి యాలోచనలేవి? అచ్చట చేరినవారందఱు కార్యసాధకులని మనము తలంచుచున్నాము. 'కార్యసాధకులు' అను పదమునకు సాధారణముగాచేయు నర్థమేమి? వా రాచరణయం దుంచవలసిన సిద్ధాంతములనుగూర్చి యాలోచించక, క్షుద్రవిషయములకై పోరాడువారని యర్థము. మన మనేకోదాహరణములలీయ

గలము. ఒక సభనుగురించి యాలోచింతము. అధ్యక్షుఁడు మెత్తనివాఁడు. అతఁడు సభవారిని వశముచేసికొనజాలఁడు. సభవారి ధర్మమును సూచించుటయేగాని అల్లరి చేయువారిని కఠినముగా మందలించి శాంతి నెలకొల్పజాలఁడు. సభికు లొండొరులతో ప్రసంగించుకొనుచు సభాకార్యక్రమమున కడ్డమువచ్చెదరు. ఇది సక్రమమాయనువారును, సమయముమించి మాట్లాడువారును, అసలు సంగతినిగురించి మరచి యేదో మరియొక విషయమై వాగువారును, మనకు గోచరించు చున్నారు. ఒకఁడు, సభవారి యెదుట చర్చింపబడు నంశ మేమియని యడుగును. సభయొక్క యుద్దేశ్య మేమియని మరియొక డడుగును. మన కందరికి నీతమాషాలు విదితమే. మన దురదృష్ట వశమున, నీసభయందు మాత్రమే యిట్లు జరిగెనని తలచగూడదు. ప్రతిసభయు నిట్లేయుండును. ఈదుస్థితి మన సిద్ధాంతముల నాచరణయం దుంచుట కిష్టములేక కాలహరణము చేయదలచుటవలన గలిగినది. మనము గ్రహించిన సత్యమును, ఆచరణయం దుంచుటకు ధైర్యము లేక యిట్లు చేయుచున్నాము. ఇట్లుగాక, మన సంఘము ధైర్యముతో కార్యము సాధించవలయు ననిన, మనము సుశిక్షితులము గావలెను. అప్పుడుగాని మనకు రాజకీయ రంగమున పనిచేయుటకు శక్తిచాలదు. మనయుద్యమము యొక్క నిజతత్వము, దాని గంభీరత గ్రహించి, క్షుద్రాంశముల యెడలను, కుయుక్తుల యెడలను నిరసన భావమును గలిగి యుండవలెను. ధైర్యమును, నిశ్చల హృదయమును, ధర్మబుద్ధియు, గలిగి

యుండవలెను. మనలో ప్రతివాడును తన కర్తవ్యమును బాగుగా విచారించి, తనకర్మల స్వభావమున కనుగుణ్యముగా చేయువలయును. వ్యక్తులు తమయాంతరంగిక జీవితములయం దిట్టి సుగుణసంపత్తిని యలవరించుకొనుట యెంత యావసరమో, జాతీయజీవనమునందును, నిట్టి యున్నతాదర్శములును, పవిత్రతయెడల గణ్యతయు గలిగియుండుట కూడ నంతే యావసరము.

ఒక యుదాహరణము చూపుటవలన నీ విషయ మెక్కుడు విశదము కాగలదు. మనచరిత్రయందు రాజకీయ వేత్తలు తమకు ప్రియములగు సిద్ధాంతముల నాహుతిజేసి శత్రువుల మాయలలో జిక్కి వలలోదగులుకొనిన చేపల చందమున కొట్టుకొని తుద కాత్మనాశము బొందినవా రెందరనో చూపగలము. వారు దేశద్రోహులనియు దుర్మార్గులనియు ప్రజలు దూషించుట మన మెరిగినదే. అతడు స్వతఃగా దుర్మార్గుడు కాడని మనము గ్రహించము. అతనికి మానసిక దౌర్బల్యము హెచ్చు. చిన్నప్పటినుండియు నతనికి నాత్మశిక్ష లేకపోవుటచే నాతడు అధర్మమునకు లొంగి పోవుచున్నాడు. ఆంగ్లేయసార్వభౌముని పట్టాభిషేక మహోత్సవ సందర్భమున కొంతమంది మేయరులు (అనగా పురపాలక సంఘాధ్యక్షులు) చేసిన కార్యముల వలన ఐర్లండంతయు కోపము వహించినది. మనరాజధానిపట్టణమగు డబ్లినునందును ఉద్రేకము హెచ్చుగానుండెను. అసంగతులిప్పుడు విశదమగుచున్నవి. కాని యాంతరంగిక విషయము లెవ్వరు గ్రహింతురు? ఒక యుదాహరణ

నిచ్చెదను. ఈయుదాహరణము వలన నొకసత్యము వెల్లడికా గలదు. ఎంతధీరులైనను, యెంతమనోధైర్యము గలవారయినను నధికారుల మాయలలోను కపటోపాయములలోను దగులు కొనుట కెన్ని యవకాశము లేర్పరచ బడియున్నవో వ్యక్త మగును. ఒకపురపాలక సంఘాధ్యక్షుడు సంపూర్ణ స్వాతంత్ర్య వాదియని తలపోయుడు. ఈతడు న్యాయాధిపతిపదవి నలంక రించినపుడు ఆంగ్లరాజునకు రాజభక్తి ప్రమాణము చేయవలసి యుండును. కాని యాతడు ఐర్లండునకు దేశభక్తి ప్రమాణము నిదివరకే చేసియున్నాడు. ఆతనియాశయములకిది మొదటియడ్డంకి. తరువాత ఈ యుద్యోగియుని చుట్టు, అతని రాజకీయ పక్షము వారు, అతనితో పనియున్నవారు రాజనీతివిదులు అనేకమంది గుమిగూడుచున్నారు. వీరందరును నీమెయరుగారిని ప్రధా న న్యాయాధిపతిగా నెన్నుకొనుటకు ప్రయత్నించు చున్నారు. ఇతడాపదవి నలంకరించిన యెడల వారికి లాభము. అతని నా పదవియందుంచుటకు వారేయాటంకములను లెక్క చేయరు. ఏ యధర్మమునకైనను దిగెదరు; ఏ సిద్ధాంతములనైన నాహుతి జేయుదురు. ఆతని న్యాయాధికారిగా చేసిన తరు వాత, అతనియాత్మమీద నధికారము గలవారివలె ప్రవర్తిం తురు. అతడు ధర్మమని తలచు కార్యములను గాక, వీరియిష్టా నుసారముగా నతడు చేయవలసి యుండును. వారతని నొక్క కార్యమునకు ప్రోత్సహింతురు గాని, ధర్మనిష్ఠ గలవాత డాకార్యమును చేయుట కిష్టపడడు. తన పూర్వుల ధైర్యసాహ సములింకను నతనియందు నశించలేదు. ఈ సందర్భమునం

దతడు ఆత్మశక్తిని ప్రకటించెను గాని యాతని నీతిబాహ్యునిగా జేయుటకు ప్రయత్నములు మఱిగియు లేదు. ఈతని కార్యములు డబ్లినులో న్యాయాధికారులకు దెలిసినవి. ఈయన పద్ధతులు వారికి రుచింపవు. వారతనికార్యములను తీవ్రముగా ఖండించెదరు. ‘మేయరుగారు ధర్మవిరుద్ధముగా చేయుచున్నారు. ఇట్టి కార్యము లతడు చేయగూడదు. న్యాయాధికారి చేయవలసిన పను లవిగావు. ఈవిధముగా చేయవలెను. అతడు రాజభక్తికి ప్రమాణమునుచేయలేదు’ మొదలగు నంశములను గూర్చి యొక జాబు వ్రాయుచున్నారు. ఈయుద్యోగీయులు మేయరుగారిని తమపక్షమునకు దిప్పుకొని, స్వదేశమునకు ద్రోహము చేయించ నెంచుచున్నారు. అతని హక్కులను క్రమక్రమముగా తగ్గించుచున్నారు. అతని పలుకుబడియు తగ్గుచున్నది. అతని నాశ్రయించిన వారి కాశాభంగము గలుగుచున్నది. ఇంకను మేయరుగారు తమపట్టును వీడలేదు. న్యాయమార్గము ననే సంచరించుచున్నారు. కాని యాతని కాపదవియందుండుట కష్టముగదోచుచున్నది. చిత్తభ్రమణము గలుగుచున్నది. అధికారుల వంచనలకు మితిలేదు. లండన్ నగరమునుండి యధికారులయొద్దనుండి విందులుగుడుచుట కతని కాహ్వానపత్రములు వచ్చుచున్నవి. డబ్లిను నగరములోగూడ నధికారు లతని విందుల కాహ్వానించుచున్నారు. వీనికన్నిటికిని ఖర్చులిర్యబడును. అతని కన్నిచోట్ల గౌరవము గలుగుచున్నది. అతని కేదో యావసరమగు పనియుండుటచే నతడచ్చటికి పోవుటకు వీలు కలుగలేదు. కాని యధికారులప్రేమ యాతనిచిత్తమును భ్రమ

పరిచినది. అన్ని వైపులనుండియు అధికారుల బాణము లతని మీద వచ్చిపడుచున్నవి. అధికారు లతని బుజ్జగించుచున్నారు. ప్రీతిపూర్వకముగా మాటలాడుచున్నారు. ఈ కపటమునకు లొంగకుండుటెట్లు! కాని యతడింకను లొంగిపోలేదు. అధికారులింకొక పన్నాగము పన్నుచున్నారు. ప్రజల యారోగ్యము వృద్ధిచేయుట కొక సంఘము స్థాపితమైనది. ఈ సమస్యయందెల్లరు, ఆంగ్లేయులు, ఐరిషువారు, అతివాదులు, మితవాదులు, ధనికులు, బీదలు, కలిసిమెలసి యున్నది. వ్యాధికారణములగు సూక్ష్మజీవుల నాశము చేయుట కందరికిని నిష్టమే. గొప్ప ప్రదర్శనము జరుగుచున్నది. రాజప్రతినిధి ప్రదర్శనము నలంకరించుచున్నారు. మేయరుగా రగ్రాసనాధిపత్యము వహించుచున్నారు. రాజప్రతినిధిగారు, మేయరుగారితో సరససల్లాపము లొనర్చుచున్నారు. రాజప్రతినిధిభార్య మేయరుగారిభార్యతో మిక్కిలి విహితముగా నుండును. మిక్కిలి యుత్సాహముతో సభముగియును. కరతాళధ్వనులు మిన్నుముట్టును. మేయరుగా రీవలలో దగుల్కొనినారు. రాజప్రతినిధిగారు వెళ్లిపోయినను మేయరుగారిని మరువలేదు. మేయరుగారు తనకు జూపిన దయ కతడు వందనముల నర్పించుచున్నాడు. ఇట్లుండగా కొంత కాలమునకు మేయరుగారి యింటిలో శుభకార్యము తటస్థించును. కుమార్తె వివాహకార్య మనుకొనుడు, లేక యేదో యొక విపత్తు సంభవించినది. ఈ సమయమున రాజప్రతినిధిగారు తమయభివందనములనో సానుభూతినో తెలియజేయుచున్నారు. మేయరుగా రుబ్బిపోవుచున్నారు. సానుభూతి తెలి

యఁ జేసినందుల కెవఁడు రోషపడును? ఈ విధమున మేయరుగారి ధైర్యమడుగంటును. అధికారులు మిక్కిలి బుద్ధి కుశలతతో పన్నిన పాలెగూఁడునం దతఁడు తగుల్కొనినాఁడు. ఆంగ్లేయు లతని సంపూర్ణముగా వశము చేసికొనినారు. మన దేశములో మేయరులను వశీకరణము చేసికొను విధమును గమనింపుఁడు. మేయరులను జూచి పరిహసించుట నాయుద్దేశ్యముగాదు. కాని మన మీ విషయముయొక్క ప్రాముఖ్యతయు, దీనివలన మన కపాయమును గుర్తెఱుఁగవలయును. తమవిధిని సరిగా నెరవేర్ప లేని వారెవ్వరును, యీ పదవుల నంగీకరించరాదు. పలుకుబడి, నమ్మకము, గౌరవముగలిగించు ఉద్యోగము లొప్పుకొనినపుడు యెన్నికష్టములు పడపలసివచ్చినను తాము పవిత్రముగా నెంచిన సిద్ధాంతముల నాహుతి చేయరాదు. వారుచేసెడు ప్రతికార్య మునకును వారుత్తరవాదులై యుందురు. యుద్ధసమయము లయం దెవ్వరును దుర్బలత్వము జూపగూడదు. దీనివలన మన కనేక నష్టములుగలవు. ఈ వలలో దగుల్కొనకుండ మిక్కిలి జాగరూకతతో మెలగెదరని సోదరులను హెచ్చరించు చున్నాను.

ఈయుదాహరణవలన ప్రస్తుతాంశము స్పష్టముకా గలదు. ఇట్లు లొంగిపోయిన పురుషుఁడు, బహిరంగముగా యుద్ధము చేసిన యెడల లొంగిపోయెడువాఁడు కాఁడు. బుజ్జగింపు మాటలు, లాలన, దయ, ఆదరము, మందలించుట, బెదరింపులు, యెడ తెగక రహస్యముగా వచ్చుటచే నతనిధైర్యము నశించినది. చిన్నప్పటినుండియు నీపురుషుఁడు క్రమశిక్ష నొందియుండిన

మొదల యీవంచనలకు లోబడకుండెడువాడే. అతనికి ఆత్మవిశ్వాసముగలిగి అధికారుల వంచనలకు మోసములకు లోఁగకుండెడువాడే. ఇట్టిశక్తులు సమయమునకు తోఁచుకొను భ్రాంతులవలె నొక్కసారిగా లభింపజాలవు. కావున ప్రతి వ్యక్తియు శాంతము, కరుణ, ఓర్పు, ధైర్యము మొదలగు సుగుణముల నలవాటు చేసికొనవలయును. తన యాంతరంగిక జీవనమునందియెట్లవసరమో జాతీయ జీవనమునందును నట్లే యవసరము. దైనికకార్యములయందతని యభిప్రాయములు నమ్మకములు దృఢపరుచుకొనవలెను. దీనికి ఫలితము తక్షణమే మనము కనుగొనవచ్చును. గొప్పయవకాశములే యవసరములేదు. ఆత్మశిక్షణము పొందినవాడు స్వల్పవిషయమునకై ప్రజలు కలహించుటజూచి నవ్వుకొనును. ఆతడెట్టిసందర్భములయందును ఆత్మనిగ్రహము గోల్పోవడు. శాంతమును విడడు. అతనిబుద్ధి చలించదు. ఆతనిమనస్సు గొప్పవిషయములయందు లగ్నమగును. జాతీయ జీవనమునకుగాని, తన యాత్మగౌరవమునకుగాని భంగము గలిగినప్పుడు సామాన్యులకంటె మిక్కిలి త్వరితముగా గమనించి శత్రువులను చికాకుపరచును. అతనికార్యములయందు వివేకము, ప్రజ్ఞ, ధైర్యము, వ్యక్తమగుచున్నవి. కావున నౌకపటాలముతో యుద్ధమునకు నడుచులమాత్రము ధైర్యమనబడజాలదు. సైనికులు పొందు శిక్ష ప్రతివానికిని యవసరమే కాని యీధైర్యము మాత్రము చాలదు. సమూహముతోకలసి యుద్ధమునకు నడచునప్పుడు, యిరుపక్షములవారికిని నవకాశములు సమానమై

యున్నప్పుడును నీధైర్యము పనికివచ్చును. స్వాతంత్ర్యపోరాటమున సహజముగా మనము బలహీనులముగను మనశత్రువులు బలాఢ్యులుగను నున్నతరి, మనము శాశ్వతమును, నజేయమునునగు నాత్మబలమును ప్రదర్శించినయెడల, పరిస్థితులనుకూలముగా జేసికొని జయమునొందగలము. ఇట్టి పోరాటమున సేనాసమూహముల ధైర్యముచాలదు. ఏసేనానియైనను, తనయాజ్ఞలకు లోబడియున్న దళములబలమును పరీక్షించ దలచినచో, ప్రతియోధుని యాత్మబలము పరీక్షించి, తానుచేయుచున్న పోరాటములో నెంతమంది వీరు లవసరమో నిర్ణయించుకొనవలెను. తన సేనలయందీయాత్మబలము హెచ్చుగానున్నయెడల, నెట్టి సందిగ్ధతరుణములయందైనను అతనికి భయము లేదు. జయము సర్వసిద్ధము. రెండు పక్షములవారికిని నవకాశములు సమానమయినయెడల జయమతనికే సమకూరును. ప్రతిపక్షుల బలమధికమై తన సేనలకేదైన నాపదసంభవించినేని చెదరిపోయిన సేనలనుకూర్చుకొని యపజయమును జయముగా మార్చగలశక్తి వారికిగలుగును. అనేకాపదలను గడచిన జాతీయపతాక మున్నతస్థానము నలంకరించును. స్వాతంత్ర్యము చేకూరును.

# ఆఱవ ప్రకరణము

## కర్మయోగము.

శ్లో॥ నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్యకర్మణః
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేద కర్మణః.

తా॥ కావున నీవు నిత్యములగు కర్మలను జేయుము. కర్మలను జేయ కుండుటకంటె కర్మలను జేయుచుండుటయే మంచిది. కర్మలను జేయకుండ నుండుటవలన నీకు శరీరయాత్రయు సిద్ధింపదు. (భగవద్గీత ౩-౮)

శుష్క వేదాంతమువలన లాభములేదు. కార్యము నిర్వహించి చూపవలెను. వేదాంత సూత్రములెన్నియైన వల్లె వేయవచ్చును. సిద్ధాంతములు, రాద్ధాంతములెన్నియేని చేయ వచ్చును గాని మన జీవితమునందు వాని ననుకరించనియెడల వానివలన లాభమేమియును లేదు. మన సిద్ధాంతములను గంభీ రముగా నుపన్యసించుటకు గాని, తర్కించుటకు గాని, వ్యాస ములు వ్రాయుటకుగాని యుపయోగించ కూడదు. ఇది మన జీవితములను నడుపుపద్ధతులను నిర్ధారణ చేయవలయును. ఇట్లు కానియెడల మనకాలమును వృథా పుచ్చినవార మగుదుము. ఈ సిద్ధాంతముల నాచరణయందుంచితిమేని, యనేక భిన్న మార్గములయందు శ్రేష్ఠమార్గ మొకదానిని నవలంబించు టకును, మన జీవితములలో పరిష్కరించవలసిన సమస్యల నతి ధైర్యముతో నెదుర్కొనుటకును నవి సహాయ భూతమగును. జనులకును మన సిద్ధాంతములతత్వము బోధపడును. మన కను

కూలురెవరో, ప్రతికూలురెవరో నిర్ధారణయగును. ధర్మపథ మేదియో వ్యక్తమగును.

మన సిద్ధాంతముల నాచరణయందుంచుటకు పూర్వము పరిస్థితుల గమనించవలయును. జీవయాత్రయందు మనకు గలిగిన యనుభవమును బట్టి మనము చేయవలసినకార్యము నిర్ధారణచేయవలయును. మన దేశచరిత్రయందు ౧౭౯౮ సంవత్సరమునుండియు నిప్పటిదాక జరిగిన కొన్ని విషయముల నాలోచింతము. మనదేశచరిత్రలో ౧౭౯౮, ౧౮౦౩, ౧౮౪౮, ౧౮౬౭ *సంవత్సరములు మిక్కిలి ప్రాముఖ్యము వహించినవి.

---

*౧౭౯౮. ఈసంవత్సరమున ఐరిషుప్రజలు ఆంగ్లేయ ప్రభుత్వమునకు తిరుగుబాటొనరించిరి. ఈవిప్లవమునందు టోను మహాశయుడును, అతని యనుచరులును ముఖ్యపాత్రవహించిరి. వారు ఫ్రెంచివారి సహాయముకోరిరి. ఫ్రెంచి ప్రజాస్వామికపు సేనలు ఐర్లండునందు దిగెను. ఆంగ్లేయులకును ఐరిషు వారికిని పోరాటము జరిగెనుగాని యాయుద్ధములో ఐరిషుపక్షమునకు అపజయము సంప్రాప్తమయ్యెను,

౧౮౦౩. నెపోలియన్ ఆంగ్లేయులను లోబరచుకొనవలెనని ఐర్లండులో కలవరము బయలుదేరదీసెను. ఎమ్మెట్ అనువాడు డబ్లిను నగరములో తిరుగుబాటు గావించెను. ఐర్లండులో ఆంగ్లేయప్రధానన్యాయాధికారి చంపబడెను.

౧౮౪౮. మరియొక తిరుగుబాటుజరిగెను.

౧౮౬౭. ఈసంవత్సరమున ఐర్లండు దేశస్థులు మరల నొకతిరుగుబాటు గావించిరి. అమెరికను యుద్ధమునుండి వచ్చినవారు అనేకమంది ఐరిషుసేనలో నుండిరి. ఈసారి ప్రజాస్వామికమును స్థాపించుటకు ప్రబలయత్నములు జరిగెను. ఐరిషువారు లండనులో అనేకదుండగములు చేసిరి. మాంచెస్టరు వద్దనగరములో ఐరిషు ఖైదీలను విడిపించుటకు ప్రయత్నములు జరిగెను ఆంగ్లేయ పోలీసు అధికారి చంపబడెను.

ఈ సంవత్సరములలో మన ప్రజలు, తాముసమ్మిన సిద్ధాంత ములకై మహాత్యాగము నొనరించిరి. ఆ యా సమయముల యందు ప్రజలకు నైతికోన్నతి వాడమి, సత్యమునందును, ధైర్యమునందును, దృఢవిశ్వాసముగలిగి వారు స్వాతంత్ర్యము నకై గాఢప్రయత్నములు సలిపిరి. ఈ సంవత్సరములయందు దేశప్రజల కుద్రేకమును, ఉత్సాహమును గలిగి, నీచత్వము, మోసము, కపటము నుదయించి, యున్నతగుణములు ప్రకటింపబడెను. శతృవుల యధికార మసమానమగు ధైర్యముతో ధిక్కరింపబడెను. ఈయుత్సాహకరములగు సంవత్సరములకు నడుమ, ప్రజలయందు నిరుత్సాహము ప్రబలెను. వ్యసనములు, దురాచారములు, అధైర్యము ప్రజలను పీడింపసాగెను. ప్రజలు అధర్మమార్గములయందు ప్రవర్తింప మొదలుపెట్టిరి. అచ్చటచ్చట ధీరులు లేకపోలేదు. వారు తమసిద్ధాంతములయందు సంపూర్ణ విశ్వాసము గలిగియుండిరి. కాని వారిబలము చెదరి చెదరియుండెను. నాయకులు చేయునదిలేక మిన్నకుండిరి. వారి స్థానమున స్వార్థపరులు, స్తోత్రపాఠకులు, నీచులు, గౌరవ హీనులు, తమ యధికారమును నిరంకుశముగా నెరపుచుండిరి. ప్రజలయం దుత్సాహము ప్రబలి, స్వాతంత్ర్యమునకై ప్రయత్నములు జరిగినకాలమును, నిరాశయు, నిరుత్సాహమును, ప్రబలియున్న సమయమును యీరెండును మన చరిత్రయందు విశ్రమస్థానములని చెప్పదగును. స్వాతంత్ర్య సంపాదనకై మన తండ్రులు చూపిన ధైర్యమును, ఉత్సాహమును, అను

వరించి దీక్షతో కృషిచేసి మనజాతికి సర్వోత్కృష్టమయిన స్థానము నొడగూర్చెదమా? లేక నిరుత్సాహులై తమ యధైర్యమును ప్రకటించినవారిమార్గము ననుసరించియూరకుండెదమా? ఈరెండుపద్ధతులలో నేదియో యొకపద్ధతి నవలంబించవలయును.

ఈరెండు తరములకును స్వాభావిక లక్షణములు మరికొంచెము విపులముగా వ్రాసెదను. ఉత్సాహపూరితమగు సమయమును మొదట తీసికొందము. ఈసమయమున జాతీయ పతాకము నున్నతస్థానమునం దుంచుటకు తీవ్రప్రయత్నములు జరుపబడెను. నూతనోత్సాహ పూరితులగు యువకులు, విదేశములకేగి, యచ్చట నీసిద్ధాంతముల వ్యాపింపజేసిరి. దేశమునం దుత్సాహము ద్విగుణీకృతమైనది. తమ గమ్యస్థానము చేరుదుమను నాసలు పురిగొల్పబడినవి. సత్ప్రవర్తనయందును, పవిత్రభావములయందును, నిలుకడగా పనిచేయుటయందును వారికి విశ్వాసము హెచ్చినది. క్రమక్రమముగా నీచత్వము, జిత్తులు, కుట్రలు, జాతీయజీవనమునుండి మాయమైపోయినవి. తమజాతికి స్వాతంత్ర్యము లభించెడిసమయ మాసన్నమైనది. చైతన్యరహితములగు సమయములయం దప్పుడప్పుడు, ఆవేశముచే నొనర్పబడిన కార్యములయందు నిరసనభావము హెచ్చినది. ఈప్రయత్నములయందు జయము చేకూరకపోయినను, నీపోరాటము* మిక్కిలి గొప్పదనియే యూహించవలయును.

---

* ఈపోరాటములవలన, ఆంగ్లేయుల చూడ్కులైరిషువ్యవహారముల వైపు మరలెను. ప్రధానామాత్యుడు, గ్లాడ్‌స్టన్ ఐరిషు ప్రభుత్వ సంస్కరణకై ప్రయత్నములు మొదలుపెట్టెను.

ఈసమయములు జ్యోతులవలె వెలుంగుచు హేమకాంతులను నల్గడల ప్రసరింపజేసి నిరుత్సాహపూరితులగు ప్రజలకు, గొప్ప యాదర్శములయందు లక్ష్యముగలుగ జేసినవి.

ఇప్పుడు నిరుత్సాహ సమయముల లక్షణముల నాలోచింతము. మన కీసమయములను గురించి యనుభవము చాల గలదు. ఈ లక్షణములను గురించి కొంత వ్రాసియేయుంటిని. విశేషించి వ్రాయ నవసరములేదు. కాని యీసమయముల యందు స్వాతంత్ర్యమునందు గాఢనమ్మకములు గలవారును, తాము దాస్యమునుండి తొలగుటకు కొంత ప్రయత్నము చేయక తప్పదని తలచువారును చేయు ప్రయత్నము లెట్టివో మన మాలోచింపవలయును. తాము సలిపిన పోరాటమునందు వారికపజయము కలుగుటచే, వారికి నిరాశ జనించినది. అధర్మమును అడుగడుగునకు ప్రతిఘటించి, ధర్మ ప్రతిష్ఠాపనము చేయ ప్రయత్నించిన సమయములయందు వారికి గలిగిన నమ్మకము, ధైర్యము, మాయమై పోయినవి. కాని వారు పూర్తిగా నధర్మమునకు లొంగిపోలేదు. తాము నెరవేర్పవలసిన కార్యములయం దుపేక్షాభావము వహించి యుండి, ప్రతిపక్షులు భరింపరాని క్రూరత్వమునకు గాని, నీచత్వమునకు గాని పాల్పడినప్పుడు, తాత్కాలిక కోపావేశ పరవశులై ప్రతీకారమునకు గడంగుదురు. సాధారణముగా నట్టి ప్రయత్నములు ఫలవంతము గానేరవు. ఉత్సాహసమయములయందు చూపబడు పట్టుదలయు, నిరంతర ప్రయత్నమును, వారికి లేవు. వారితరమువారు పనికిమాలిన వారనియు, ప్రతి

పక్షులు బలవంతులగుటచే వారిని పరభ్రష్టులనుగా జేయుటకు తమకు శక్తిచాలదనియు, వారొప్పుకొనెదరు. వారు కార్యసాధనకు గడంగరు. ఎప్పుడైన నొకపనిచేసిరేని, నిస్సారముగను, నిరర్థకముగ నుండును. ఈభీరువులయందు ప్రతిపక్షులకును గిన్యాతి యుండదు. వీరుచేసెడి కార్యములయందు, తమ తరము వారికి కీర్తితెచ్చు కార్యమొక్కటియు లేదు. వీరికార్యములవలన శత్రువులకు మరింత తాపము హెచ్చి, క్రూరకర్మలు చేయుదురు. ఇట్టి కార్యములవలన లాభ మేమాత్రమును లేదని గ్రహించి మన తరము వారికి కీర్తితెచ్చునట్టి కార్యములను జేసి, స్వాతంత్ర్యము బడయ వలయును.

కావున మన కర్తవ్యమేదియో నిర్ధారణ చేసికొనవలయును. మన దురభిప్రాయముల నన్నిటిని తొలగించుకొనవలయును. మనము కొన్నికొన్ని సమయములయందును, కొన్నికొన్ని స్థలములయందు మాత్రమే, మన పతాకమునకు భక్తి ప్రకటించుట యావసరమని తలచకూడదు. మనలో ననేకులు కొన్నిసమయములయందు తాము వెలిబుచ్చిన యభిప్రాయములకు మరికొన్ని సమయములయందు వ్యతిరేకభావములను వెలిబుచ్చుచుండుట శోచనీయము. మనము నమ్మినసిద్ధాంతములను అన్నిసమయములయందు, అన్నిస్థలములయందును ప్రకటించుట యావసరము. వేరొండు మార్గములేదు. సర్వజనాంగీకారము బడసిన సిద్ధాంతములను మనము ప్రకటించుచుండుటలో ఘనమేమున్నది? మనసిద్ధాంతముల నొప్పుకొనని వారియందును, మనల ఖండించుటకు పట్టుబట్టిన వారియందును

మనభావములను ప్రవేశపెట్టుట గొప్పతనము. ఈవిషయము నందు అనుకూలమార్గములేదు. సిద్ధాంతములను సంపూర్ణముగా నొప్పుకొనుటయో, సంపూర్ణముగా నిరాకరించుటయో కర్తవ్యము. ఒకప్పు డొప్పుకొనుటయు మరియొకప్పుడు నిరాకరించుటయు, ఒకచోట తలయొగ్గుటయు మరియొకచోట నిరసించుటయు, పనికిరాదు. నీవెచ్చటికేగిన నీసిద్ధాంతములు నీఛాయవలె వెంట నంటియుండును.

మనమేదియో యొక ధర్మమార్గమును నిర్ధారణ చేసికొనవలయును. ఏదియో అభ్యంతరముచెప్పి యాధర్మము నుండి తొలగరాదు. మనమేదియోపక్షము వహించవలెను. పక్షములు వహించక తటస్థముగానుండుట దుస్తరము. మన మూరకుండినను సందర్భములు మనల నొకపక్షమునకు చేర్చును. పురోహితులు, కవులు, ఉద్యోగీయులు, వర్తకులు, ఉపాధ్యాయులు, రాజనీతివిదులు, మొదలగువారందరును నేదోధర్మమార్గము ననుసరించుచునే యున్నారు. ఏకార్యమునందైనను ధర్మమునకును, అధర్మమునకును సంఘటన గలిగినప్పుడు, ధర్మమును ప్రతిష్ఠించు నంతవరకు మనము పోరుచుండవలెను. విశ్రాంతి సమయములయందు మాత్రము ఈవిషయములను మన మనములయందు వితర్కించుకొనుటవలన లాభములేదు. ఇట్లు చేయుటవలన జయము గలుగనేరదు. ప్రస్తుత సమయమునందు కాలమంతయు, వృథాతర్కములయందు గడుపబడుట శోచనీయము. ఇట్లుగాక మనము నమ్మిన సిద్ధాంతములకై త్యాగముచేసి చూపితిమేని మనలను ప్రజలు గ్రహింతు

తురు. మన మనోనిశ్చయమునకు ప్రజలు వెఱగందుదురు. వారి మనములు మనవైపున కాకర్షింపబడును. దేశమభ్యుదయము జెందుట కవకాశములుండును. స్వాతంత్ర్యపోరాటమున మనలను వారివలలో వేసికొనుటకు శత్రువులెన్నియో ప్రయత్నములు చేసెదరని యిదివరకు వ్రాసియే యుంటిని. ఇంకను ఉదాహరణలీయ నవసరములేదు. జాతీయభావములను చంపువారి కనేక సౌకర్యములు చూపబడును; పండితుల కెక్కుడుధన మొసంగబడును; రాజకీయ వేత్తల కుద్యోగము లీయబడును; ఉద్యోగీయులకు వేతనములు వృద్ధిచేయబడును; వర్తకుల కెక్కుడు వ్యాపారముచూపబడును. ఇదంతయు దేశద్రోహమునకు బహుమతి. ఉత్సాహవంతులును, శక్తివంతులునునగు యువకు లిట్టివలలో దగుల్కొని భ్రష్టులగుటకు మరెన్ని సావకాశములో కల్పింపబడును. పయోముఖవిషకుంభములవలె నధికారులు, యువకులను ధర్మపథమునుండి తప్పించుట కెన్నియో మృదువాక్యములను బల్కెదరు. "మీశక్తినంతయు దుర్వ్యయము చేసెదరేల? ఇట్లుజేసిన మీకేమిలాభము? ఈ కార్యములవలన మీకు పేరుప్రతిష్ఠలెట్లువచ్చును" యిత్యాది వాక్యములను వారుపయోగించెదరు. ఈ మాయోపాయములకు లొంగి యధికారుల యాశ్రయమునకును స్వలాభమునకును, పవిత్రములైన యాశయముల బుగ్గిపాలుచేసి, దేశద్రోహియగుచున్నాడు. ఈకార్యము మెల్లమెల్లగ జరుగవచ్చును. ఐదవ ప్రకరణమునందు వర్ణించిన మేయరువిషయ మందరికి తెలిసియే యున్నది. కొంతకాలము అధర్మముతో పోరాడి గెలువ

లేక యతడు లొంగిపోవుచున్నాడు. తుట్టతుదకు నిష్ప్రహుడును నిరాశజెందినవాడును సర్వవిషయముల భ్రష్టుడగు వ్యక్తి మిగులుచున్నాడు. మన మధికారుల వంచనలకు లొంగక వారిలంచములను తిరస్కరించి మనపతాకమును వీడక రక్షించితిమేని మన కీ నీచస్థితిపట్టజాలదు. మనము సత్యమార్గమును గ్రహించినవార మగుదుము. మన ప్రతిపక్షులు మనలను బుద్ధిహీనులనియు నాదర్శప్రియులనియు తలంచవచ్చునుగాని పరమోత్కృష్టమయిన జయముమనకు గలిగినది. మనకు గలిగిన జయమును ప్రతిపక్షులు గ్రహించజాలరు. మన కాత్మరాజ్యము చేకూరినది. ఈ యుత్సాహవంతుల హృదయమునందు బ్రహ్మానందము తాండవమాడుచున్నది. దేశప్రజలకును, జాతికిని, నుత్కృష్టస్థానమునొసంగి, వారికి శాశ్వతమగు సౌఖ్యమును వార లొనగూర్చగలరు.

మన మొక ధర్మమును సాధించవలె ననిన, నొకరి యనుగ్రహముతో మన కవసర ముండకూడదు. చాలమంది సదుద్దేశ్యములు గలవారు గూడ యీవిషయము నందు తప్పుత్రోవల నడుచు చుండుట శోచనీయము. వారు మన పరాజయమునకు కారణభూతములైన భావములను సమర్థించెదరు. ఈ గ్రహచార మేమో తెలియదు. దీనిని విశదపరచుటయు, గ్రహించుటయు మిక్కిలి సులభము. ఈ స్వల్పవిషయమునుఅలక్ష్యభావముతో జూచినందుకు, తరువాతమన కే యాశ్చర్యము గలుగక మానదు. ఒకానొకడు, కొన్నిస్థలములయందు ఐరిష్ పతాకమునకు చేతులుజోడించి నమస్కరించును. కొన్ని

స్థలములయందుదానికి శత్రువులచే నగౌరవముసంభవించి నప్పుడు దానినతడురక్షించుటకుభయపడును. తనహృదయకోశమున, జాతీయ పతాకము నెడల భక్తిలేకపోలేదు. సమయము వచ్చినప్పుడు, మరల దానిని గౌరవించుట కతడు తయారుగా నుండును. కాని సర్వకాల సర్వావస్థల యందును పతాకమును గౌరవింప ధైర్య మతనికి లేదు. తనజాతికి శ్రేయస్కరమగు మార్గముల నాలోచించు చున్నప్పుడు, తన దృఢాభిప్రాయము నతడు వెలిబుచ్చుట యంతమంచిది గాదని తలచును. అతని యభిప్రాయములను బహిరంగముగా చాటుట కతడు భయపడును. అతడు సభలకు రా వెఱచును. కావలసిన యెడల రహస్యముగా ధనసహాయము చేయును. అతని యభిప్రాయములను చాటుచాటుగా తెలియ జేయును. సాతంత్ర్యమునకై పాటుపడు వారి కతడు రహస్యముగా నాలోచనలు చెప్పును. ధర్మ మగుమార్గమును మన మతనికి బోధించితిమేని, యది తనకు శ్రేయస్కరము గాదని వచించును. తన యుద్యోగమునకు భంగము కలుగుననియు, అధికారుల వలన నుపద్రవము కలుగుననియు, భయ మతనికి మెందు. ఇట్టిప్రవర్తన ధర్మమని యెవ్వరు చెప్పెదరు? తాను బాధలుపడలేక విడిచిపెట్టిన మార్గమును, ఇతరులకు బోధించుట యోగ్యమయిన పనిగాదు. విశ్వాస మేమియు లేనివారిని, భీరువులను, రహస్య ప్రచారము వలన తనమార్గమునకు త్రిప్పుకొన ప్రయత్నించరాదు. వారివారి సిద్ధాంతముల నాచరణయందుంచుటకు వారిని ప్రోత్సహించ వచ్చును. కాని మనసిద్ధాంతముల నేమాత్ర

మును తగ్గించు కొనగూడదు. ఇట్లుచేయుటవలన మన మొప్పు కొనని కొన్నిసంగతుల నితరులకు బోధించినవార మగుదుము. మనము మనస్ఫూర్తిగా నమ్మని విషయముల నితరులకు బోధించితిమేని, యీ యబద్ధములే యలవాటై, ఒకానొక సమయమున హేయముగా దోచిన సంగతుల నిష్పాడభేదభావముతో జూచుట తటస్థించును. మన యభిప్రాయములును, సిద్ధాంతములును మనకు తెలియకుండ మారిపోవును. మన యభిప్రాయములను మార్చుకొని నందులకు, పూర్వస్నేహితులు, మనలను కోపదృష్టితో జూతురు. అందుచే మనమును వారిని కోపదృష్టితో జూచుట సంభవించును. మన యభిప్రాయములను గూఢముగా నుంచుటగాని యసందర్భములగు కొన్ని యభిప్రాయములను వెలిబుచ్చుట గాని తగనిపని. ఇట్లు చేసిన యెడల రేపీయభిప్రాయములు వెలిబుచ్చవలెనో వలదో మనకే సందేహము కలుగును. పరస్పర విరుద్ధమైన మాటలు పల్కకూడదు. మన మనుసరించు పద్ధతి విస్పష్టముగను, పూర్ణముగను అసందర్భరహితముగను నుండిననేగాని, సంశయాత్ములకును, సత్యమును గ్రహించ కుతూహలులైనవారికిని తృప్తి గొల్పనేరదు. ఇట్టివారిని మనపక్షమునకు ద్రిప్పుకొనిన యెడల, వ్యక్తిత్వము లేని సామాన్య ప్రజలందరు మన పక్షముననే యుందురు. ధర్మమునుండి తప్పిపోవుటగాని, యితరులను తప్పించుటకు ప్రయత్నించుటగాని తగదని నిశ్చయముగా గ్రహించవలెను. మన ధర్మమునుండి తప్పిపోవుట వలననే మన కిన్ని యగచాట్లు వచ్చినవి. ముందెన్నడో వీరులయ్యెదమను తలం

పున నిప్పుడు మనము నెరవేర్చవలసిన ధర్మమును మఱచి పోయెదము. ముందెన్నడో యనుకూల సమయము దొరకు నని తలంచి, ప్రస్తుత సమయమున నవకాశము లన్నియు పాడుచేసెదము. యుద్ధ మిదివరకే ప్రారంభ మయినదనియు, జాతీయపతాకమునకు ప్రస్తుతమున్న నీచస్థితి తొలగించి, యున్నత స్థానమున ప్రతిష్ఠించుటకు తరుణ మాసన్నమయిన దనియు, మనము గ్రహించుట లేదు. పోరాటము సలుపవలసి వచ్చినప్పుడు మన హృదయములు దడదడ లాడును. కాని పోరాటము సలుప కుండితిమేని పరాజయము వలన గలిగిన దురాగతముల కన్నిటికిని లోబడవలసినవార మగుదుము. ధైర్యముతోడను, పట్టుదలతోడను, ప్రయత్నములు సలిపితిమేని మన పోరాటమున జయము చేకూరును. ముందురాగల గొప్పదశకు వారసులము గాదలంచితిమేని, మన ధర్మమును చక్కగా నిర్వర్తించ వలెను.

కొన్ని సమయములయందు మన మేపక్షమును పూనక తటస్థభావము వహించవలసి యుండును. ఇట్లు చేయుట మన పోరాటములో నవసరమైయుండును. మనదురదృష్ట వశమున ఐర్లండునకును పూర్వమువలె సంపూర్ణస్వాతంత్ర్యము నొడగూర్చుటయందు నమ్మకము లేనివారు కొందరున్నారు. వీరి యభిప్రాయము లేవో మనము తెలిసికొనుట మంచిది. మన ముద్దేశముచే నున్మత్తులమైత్రోవదప్పకుంటకు వీరి యభిప్రాయములు సహకారులు గావచ్చును. ఈ యుద్దేశ్యములు గలవారిని కలుపుకొనిపోవుట శ్రేయస్కరము. కొన్ని విషయ

ములయందు మనమందరము కలిసి పని చేయవచ్చును. ఇట్లయినను జాతీయపతాకమును వీడరాదు. మన మెచ్చటికేగిన నచ్చట దానిని ప్రతిష్ఠించవలెను. ఇట్లు చేయుట ముఖ్యము. వివిధాభిప్రాయములుగలవారు సమావేశమైనపుడు మనకర్తవ్యమేమి? ఇతరులను సంతోషపెట్టుటకును వారిని మనతో కలుపుకొని పోవుటకును మన యభిప్రాయములను మార్చుకొనుట యావసరమని యనేకమంది తలచుచున్నారు. ఇట్లు తలచుట పొరబాటు. పవిత్రమగుపతాకమును వీడరాదు. మన ప్రతిపక్షులను బలవంతముగా మన యభిప్రాయమునకు త్రిప్పుకొనగూడదు. కాని మన యభిప్రాయముల నేమాత్రమును మార్చుకొనగూడదు. ఇతరులకు లొంగి పోగూడదు. ఇతరుల సిద్ధాంతముల నొప్పుకొనకపోయినయెడల తటస్థభావమునకు భంగము గలుగునని కొందరు తలపోయుట వింతగా నున్నది. ఇతరుల యభిప్రాయములకు మన మడ్డము తగుల గూడదు. వానిని మన మొప్పుకొనగూడదు. ఇదియే తటస్థభావము యొక్క యర్థమని మనము గ్రహించవలెను. తమకు ప్రాణతుల్యమగు సిద్ధాంతములను వీడుట యేపక్షమునకును వీలైన పని కాదు. మన మొండొరుల యభిప్రాయములను గౌరవించుకొనవలెను. ఇది యిరుపక్షములవారికిని గౌరవము తెచ్చును. తటస్థభావమనిన మనకు ప్రియమగు పతాకమును వీడుటగాదు. మనమును, మన పతాకమును పవిత్రవంతముగా నెంచబడవలయును.

మానవజీవితముయొక్క పవిత్రత, సౌఖ్యము, జాతీయ జీవనముమీద నాధారపడియుండుటచే నన్నిసమయములయందును మనముస్వాతంత్ర్యమును సంరక్షించుకొనుట మనధర్మమై యున్నది. ప్రజలీభావమును ఖండించి త్రోసివేయుటకు మాత్రమే దీనిని ప్రస్తావింతురని నేను తలచుటలేదు. కాని వారి సిద్ధాంతములు మన యభిప్రాయముల కేమాత్రమును నెడమీయవు. వారెల్లప్పుడు, నితరులు తమ యభిప్రాయములతో నేకీభవించుటకు ప్రయత్నములు సలుపుచుండెదరు. ఇప్పుడుగాని, ముందుగాని, వారు మనయభిప్రాయములు ప్రబలనీయరు. మన మిప్పుడున్న స్థితియందే శాశ్వతముగా నుండవలయునని వారు తలచెదరు. ఇది యనేక వాదవివాదములకు కారణమైనది. వారి వాదములు ఖండించుటకును, స్వాతంత్ర్యము నెలకొల్పుటకు ముఖ్యకారణములతో వాదించుటకును మన మెల్లప్పుడు సంసిద్ధులమై యుండవలయును. మనవలె దృఢనిశ్చయములు గలవారు ప్రతిపక్షులలో కొద్దిమంది మాత్రమే గలరని మన మెఱుంగవలయును. ఈకొలదిమంది యాంగ్లేయప్రభుత్వమునకు జెందినవారై యున్నారు. వారి కన్నిసమయములయందును విధేయులై యుండు సేనాసమూహములు వారిపక్షముననున్నవి. వీరు నిశ్చితాభిప్రాయములు లేక, యేపక్షము బలవంతులైన నాపక్షముచేరు సామాన్యప్రజలనాకర్షించెదరు. ఈజనసామాన్యమునకు మన యభిప్రాయముల తెలియచేయవలయును. వారికి తమ జాతియందు గౌరవమును, ఆత్మవిశ్వాసమును గలుగజేయవలయును. వారిలో నీయభి

ప్రాయములు ప్రబలినకొలది మన సిద్ధాంతములయందు వారికి నమ్మకము హెచ్చును. ఇట్టినమ్మకములు కలుగజేయుట మనవిధియై యున్నది. అవకాశములకొరకై మనము వెదక వలసిన పనిలేదు. వానియంతట నవియే తటస్థించును. వాని పరీక్షకు మనము తాళవలెను. వివిధాభిప్రాయములుగలవా రొకచోట జేరినప్పుడు వారాలోచించుటకు ముఖ్యాంశము లేవియు వారికి కనబడనప్పుడు వారిలో నొకడు ఆంగ్లేయపరిపాలనము నొప్పుకొనుటనుగురించి ప్రస్తావించును. అతడు స్వార్థపరుడు. తన స్వలాభమునకై ఐరిషు స్వాతంత్ర్యమునకు విముఖుడుగానున్నాడు. ఈ సంఘములో ఐరిషు స్వాతంత్ర్యమునకై పాటుపడుటయందు నమ్మకముగలవారు కొందరుందురుగాని వారికి తమధర్మము సరిగా తెలిసియుండలేదు. తమ హక్కులను బాధ్యతలను గురించి వారికి బాగుగా తెలియదు. వారు నాయకుల యభిప్రాయములనుబట్టి పోయెదరు. ఇట్టి సమావేశమునందు, నీభావము ప్రవేశపెట్టబడి చర్చకు వచ్చినప్పుడు ముఖ్యకారణములతో మనము సిద్ధముగా నుండి ప్రతిపక్షుల యభిప్రాయములు పనికిరావనియు, నీచములనియు, గౌరవహీనములనియు వారి నొప్పించినయెడల వారిని మనవైపునకు త్రిప్పుకొనగలుగుదుము. మనము ప్రతివిషయమును గురించి తెలిసికొని యుండవలెను. అనేకమంది ప్రజలు వ్యతిరేకాభిప్రాయులైనను, తాను నమ్మిన సిద్ధాంతములయెడల నిశ్చలభక్తిగలవాడును, ఉత్సాహపూరితుడు నగు మహాశయుడొక్కడు అనేకమందిని తన యభిప్రాయమునకు దిప్పు.

కొనుట సులభము. తనయెదుటనే జాతీయపతాకమునకు గౌరవ ముగలుగవచ్చును. అట్టి సమయమున దృఢత్వము జూపి దాని ప్రతిష్ఠ నిలువబెట్టవలయును. కొన్ని దుర్గుణములను వీడవల యును. నిశ్చలముగా నుండవలెను. కాని మన యభిప్రాయము లను నితరులపైని బలవంతముగా ప్రవేశపెట్టరాదు. తమ యభిప్రాయములను మనమీాద బలవంతముగా జొనుపువారికి తగిన ప్రత్యుత్తరము చెప్పుటకు సంసిద్ధులమై యుండవలయును. ఇట్లు చేసినయెడల భయస్థులకు మనయందు నమ్మకము పుట్టును. ఇతరులను దూషించకూడదు. ప్రజల మనములయం దేవిధమైన దురభిప్రాయములున్నయెడల మనకు తెలిసిన విషయములతో నాదురభిప్రాయములను తక్షణమే రూపుమాప వలయును. ఇట్లు చేసిననేగాని మన యనుచరు లుత్సాహవం తులై యుండరు. మనలో నెవ్వరైనను శత్రువులమధ్య నొంట రిగా నుండుట తటస్థించి వారు మనలను తమపక్షములకు జెందిన వారినిగా తలచిరేని మన శత్రువుల దురభిప్రాయమును పార దోలవలయును. ఇట్లు నడుచుకొంటిమేని మన మేసమావేశము నందున్నను, మనకు గౌరవము జరుగును. పోరాట మవసరమై నను కాకపోయినను, మన యభిప్రాయములను స్పష్టముగా తెలియజేయుట మనవిధియై యున్నది. పతాకమును పునరుద్ధ రించుటయని దీనిని చెప్పవచ్చును.

గొప్ప యుద్దేశ్యములు గలిగి తానేదియో గొప్పకార్య మును సాధించవలెనని తలచువానికి ననేకాంతరాయములు కలుగును. అతడు భ్రమపడు చున్నాడనియు, ఛాందసు

డనియు, నవివేకియనియు ప్రజ లాతని పరిహాసించు చుందురు. ఇట్టిసందర్భములయందు మనవిమర్శకులు భ్రమపడుచున్నారో, లేక మనమే భ్రమపడుచున్నామో యాలోచించవలయును. మన యవివేకమునకును వారి వివేకమునకును తారతమ్యము తెలిసికొనుట చాల లాభకరము. మన దేశములో కొందరు దేశమునుండి వెడలిపోవుచు తాము చేయునది ఘనకార్యమని చాటుకొనుచున్నారు. ఐర్లండు దేశము మాయమూలలనుండి యితర దేశములకేగి తిరిగి స్వదేశము జేరినవారి స్థితి నాలోచింతము. తిరిగి స్వదేశము చేరుసరికి వారియుత్సాహము నశించినది. వారినిదానము, మితభాషిత్వమునకు బదులు డంబములు కొట్టుట, అమితముగా మాట్లాడుట యలవడినది. కాని యీగుణములు తమకు లాభకారులని వారు తలతురు. ఇట్లుగాక మరియొకవిధమున తలచు వారు గలరు. వారికి తమ మాతృభూమియందే నివసించి భోగముల ననుభవించుట మిక్కిలియిష్టము. ఈ భోగపరాయణులలో నొక్కని విషయమై యాలోచింతిము. అతడు గడబిడ మనిషియేగాని నిజమయిన సంతోషిగాడు. అతని విశ్రాంతిసమయముల మనము పరీక్షించినయెడల అతనియాయాసము వ్యక్తముకాగలదు. గొప్పవారితోడను కొద్దివారితోడను, అతడు చాలకాలము గడుపవలసియుండును. విందుల నారగించుట, నాటక ప్రదర్శనముల కేగుట, యింద్రియసుఖముల ననుభవించుటయం దతని సమయము గడచిపోవుచున్నది. కాని యిది నిజమైన సుఖము గాదు. కొంతకాలమున కతనికి జీవయాత్ర గడుపుట దుర్భర

మగును. అతనియుత్సాహము నశించును. ఆశలు నిరాశలగును. ఈతడును మన కాదర్శప్రాయుడు కానేరడు. ఈ యిద్దరి యభిప్రాయములతో నేకీభవించని వ్యక్తిమరియొకడు గలడు. అత డీవిధముగా బల్కును. "మనమితర దేశముల కేగుట యవసరము లేదు. మన దేశమునందే యుండి కాలమంతయు వృథాపుచ్చుటయు మంచిపని కానేరదు. మన మనస్సులనుండి భ్రమలన్నియు పారదోలవలయును. కార్యశూరులము గావల యును. ముందేమిజరుగునో మనకు తెలియదు. కావున నెంత వర కాచరణీయమో మనము గ్రహించి యంతవరకే మనము చేయవలయును" ఇతడు మనసిద్ధాంతము లనాచరణీయములని యాక్షేపించుచున్నాడు. ఈతనిసంగతి మనకు బాగుగా దెలి యును. ఇతడు మితవాది. ప్రస్తుత సమయమున మన యాశ యములు ఫలవంతములు గావనియు ముందెన్నడో యవి ఫల వంతము లగుననియు, అతడు మనల నాక్షేపించు చున్నాడు. కాని యతని యభిప్రాయములను నిట్టివేయుని యతడు గ్రహించడు. పరిస్థితులు మన కనుకూలములు గావనియు, తమ పక్షమున కనుకూలములనియు నతడు పల్కును. దీని కంటె హాస్యాస్పదమగునది వేరొక్కటి లేదు. పూర్వము మనసిద్ధాం తము లెట్లు ప్రబలియుండెనో ముందును, అట్లే యవిచ్ఛిన్నము గా రాజ్యము చేయగలవు. అతడు మనల నాదర్శప్రాయుల మని యాక్షేపించుటయేగాని తమపక్షమువా రెప్పుడు జయము గాంచిరో తెలుపజాలడు. అందరమును నాదర్శప్రాయులమే

కాని మన యాదర్శములు చక్కనివి. కొంతమందివి హేయము గను అందవికారముగను నుండును.

కావున నూతనోత్సాహభరితులగు యువకు లందరును, నిరుత్సాహమును, అధైర్యమును వీడి, జాతీయ పతాకముయొక్క గౌరవము నిలువబెట్ట ప్రయత్నించ వలయును. ఎంతటి వారికైనను, ఒకానొక సమయమందు హృదయ దౌర్బల్యముగలుగక మానదు. మానవ ప్రయత్నముల యందిట్టి కష్టసుఖములు గలుగుట సహజము. కావున ప్రతివాడును కష్టముల కోర్చుట కలవాటు పడియుండవలెను. ఈకష్టముల నతిధైర్యముతో నెదుర్కొనిన యెడల తన్నావరించిన నిరుత్సాహమును, దుఃఖమును, నూర్యాగమమున పటాపంచలగు దట్టమగు మంచువిధమున విచ్ఛిన్నము గాక మానదు. ఈ నిరుత్సాహమున కనేక కారణము లుండవచ్చును. శరీరమునకు దుర్బలమును, మనస్సునకు వ్యాకులమును గావచ్చును. అనేక సంవత్సరములు తీవ్రముగా ప్రయత్నించినను, లాభము లేకపోవుట యొక కారణము గావచ్చును. కొందివారు గొప్ప యుద్దేశ్యములు లేనివారుగను, దుర్మార్గులుగను నుండుట కావచ్చును. చక్కని జాతీయ పతాకముయొక్క గౌరవమును నిలువబెట్టువారు సకల సద్గుణ గరిష్ఠులుగా నుండవలెనని కోరుదుము. కాని పతాకముచుట్టు జేరువారు నీచులుగను, ఓర్పు లేని వారుగను, నుండుటచే మనలో మన కనేక కలతలు పుట్టుచున్నవి. మనశత్రువుల బల మత్యధికముగ గనుపడుటచే ననేకులు మనకు సహాయము చేయుటకు భయపడుచున్నారు.

వారికి స్వాతంత్ర్యము లభించుట యానందకరమే గాని, వారు నిరాశచేతను, దౌర్బల్యము చేతను, మనకు సహాయము చేయరు. వీనికితోడు, మితవాదులు మనకు నిరుత్సాహము గొల్పెదరు. మనము చేయునది ప్రస్తుతకాలమున ఫలవంతము కాదనియు, యసాధ్య మగునదనియు, వారు మనలను పొడిచి చంపెదరు. వారి పరిహాసములు, ఆక్షేపణలు, మనకెంతో కష్టముగా నుండును. స్వాతంత్ర్యయోధు లీ యనుభవము లన్నిటిని పొందితీరవలెను. కష్టములు కలకాల ముండబోవు. ఈ గాఢాంధకారమును రూపుమాపుటకు సూర్యబింబము తూర్పున నుదయించక పోదు. అనేక సంవత్సరముల నుండియు కష్టములకోర్చి పనిచేసినవారు కొన్నివిషయములను జ్ఞాపక ముంచుకొన వలయును. దేశములో మన సిద్ధాంతముల నొప్పుకొనెడు వారు అమిత స్వల్ప సంఖ్యాకులై యున్నప్పుడు, అపజయము తటస్థించున ట్లగపడ వచ్చును. కాని యెట్టిస్థితియందును వారు సత్యమార్గమును వీడక పట్టుదలతో ప్రయత్నముచేసినయెడల వారిసంఖ్య యభివృద్ధి యగును. సత్యమునకు ప్రజలయం దతిశీఘ్రముగా వ్యాపించెడి గుణముగలదు. మనయభివృద్ధి నిరోధింపబడినప్పుడు జరిగిపోయిన విషయములకు చింతనొందక ప్రస్తుతాంశమును గురించియు, ముందుచేయవలసిన దానినిగురించియు, తలపోయవలయును. కొంతమంది నిరుత్సాహముచే నీకు సహాయముచేయక యూరకనిలిచియుండిరేని, మృదువాక్యములచే వారి హృదయములను కరగించి సత్యమార్గమున ప్రవేశపెట్టవలయును. వారు

మనలో చేర లేదని నిష్ఠుకోక్తులాడుటయు, వారిమనముల నొప్పించుటయుతగదు. ఒకానొక సిద్ధాంతమునకై ప్రాణత్యాగము చేయుటకంటె ధైర్యముతోడను, పట్టుదలతోడను, ఆసిద్ధాంతము నాచరణయందుంచుట కష్టతరమైనపని. సదుద్దేశ్యములుగల కొంతమంది తమ ధైర్యమునంతయు జూపి, యొకానొక సమయమున ప్రాణములనైన నిచ్చుట గొప్పకొనెదరుగాని గమ్యస్థానము చేరుటకై నిరంతరము నిట్టిధైర్యమును చూపుటకు వెనుదీసెదరు. ఈమార్గము మిక్కిలి కష్టము గనుక నేయనేకమంది భంగపడుచున్నారు. ధైర్యముతో ప్రాణముల నర్పించుటకన్న మనకు ప్రియములగు నాశయములకొరకై కష్టములకోర్చి బ్రదికియుండుటయే యుత్కృష్టమార్గమని ప్రజలకు బోధించవలయును. 'ఐర్లండునకై ప్రాణముల నర్పించుటయావసరము లేదు. ఐర్లండుకొరకు బ్రదికియుండవలయును.' అను వాక్యమున కనేక యపార్థములు చేయబడుచున్నవి. ఏదోయొక ధర్మమును సాధించనియెడల బ్రదుకు టేల? పశువులు బ్రదుకుటలేదా? అవి యేధర్మమును సాధించుచున్నవి? మనబ్రదుకు సార్థకము కావలెననిన గొప్పయాదర్శములకై మనజీవితమును గడుపవలెను. కావున నేదోయొకవిధమున కాలముగడుపుటయని యీవాక్యమున కర్థము చేయగూడదు. ఈపనికిమాలిన వేదాంతము ప్రజలలో ప్రబలినయెడల దేశమున కనర్థదాయక మగును. దేశము భీరువులతోడను వ్యర్థులతోడను నిండియుండును. జనుల ధైర్య సాహసములు తగ్గిపోవుటచే మన జాతికి చేటువచ్చును. పైని వర్ణింపబడిన కారణము లన్నియు

మనకమిత నిరుత్సాహముగొల్పుటకు సహాయభూతములగును. కట్టి, నీచత్వము, నిరుత్సాహము ప్రబలిన సమయమున కృశించిన దేహములతోడను వికలత్వము నొందిన మనస్సుతోడను చాలకాలము నుండియు పని చేయుచున్నవారికి తాము చేయుచున్న కార్యము అరణ్యరోదనము వలె నగపడ వచ్చును. జాతీయ పతాకము నున్నతస్థానమున ప్రతిష్ఠించుటకు చేయు యత్నములు నిష్ఫలములగునని నిరాశయు వారికిగలుగ వచ్చును. కాని కొంతకాలమునకు దేశమునం దుత్సాహము జనించక మానదు. జనులు సంతసముతో తమధర్మమును నిర్వర్తించు సమయము రాకపోదు. వేలకొలది సంవత్సరముల క్రిందట నొంటరిగా మహావీరులొనర్చిన సాహసకృత్యములీనాటికి ప్రజల మనములయందు నాటుకొని యుండి మన కుత్సాహము గొల్పుట జనులకు తెలియని విషయముగాదు. సమయోచితముగా తమభావములను మార్చుకొనినవా డిట్టి కార్యముల నెన్నడైన నెరవేర్ప గలిగెనేమో యోచింపుడు. అతని కార్యములు శాశ్వతముగా నుండుటకు వీలులేదు.

ఈ విషయములనుండి మనము నేర్చుకొనవలసిన సారాంశ మేమి? మన వేదాంతసూత్రముల నాచరణయందుంచుటకు నిశ్చయించుకొనవలెను. మన మీకార్యమునకు గడంగినపుడే స్వాతంత్ర్యపోరాటము నిజముగా మొదలిడునని గ్రహించవలయును. ప్రస్తుతము మంచిసమయము కాదనియు ముందెన్నడో తరుణము వచ్చుననియు తలంచుట వెఱ్ఱి. స్వాతంత్ర్యసంపాదనకు గొప్పసేనల నాయత్తముచేసి శత్రువులతో

ముఖాముఖిని పోరాడుట ముందు అవసరము గావచ్చును. ఈ విషయము మనస్సులో నుంచుకొని ప్రస్తుతము మనము చేయవలసిన కార్యము నాపు జేయరాదు. మఱి సాంఘిక విషయములయందువలెనే రాజకీయ విషయములందును కొన్ని యాచారములు పాటించవలయును. ఈ కార్యముల ఫలితమెట్లుండునో మనమూహింప జాలము. మొన్న నాంగ్లేయులు చేసిన చర్చవలన నీ విషయము వ్యక్తము కాగలదు. విదేశములతో యుద్ధము జరుగుచునే యుండగా, యితర యిబ్బందులు దేశము నల్లకల్లోల పెట్టుచునే యుండగా, ఆంగ్లేయ పార్లమెంటుసభ తన స్వేచ్ఛను గురించియు, ప్రభుత్వ స్వరూపమును గురించియు, ప్రభువుల మహాసభను తీసివేయుటను గురించియు, చర్చ మొదలిడినది. ఈచర్చ జరుగుచుండగానే, యేదో యొకమూల పనివారల సమ్మెయొకటి తటస్థించి దేశము నల్లకల్లోలము చేసినది. ఆంగ్లేయులు తమచర్చలను, గిర్చలను మాని, యీసమస్యను మొదట పరిష్కరింప వలసివచ్చెను. ఇంగ్లండంతయు అంతః కలహములతో నిండియుండెను. ఇట్టి యవకాశముల నుపయోగించుకొనలేక, ఐర్లండు వెఱ్ఱిచూపులుచూచుచుండెను. ఆంగ్లేయులు నిస్సహాయులై, తమదేశమును కాపాడుకొనుటకుగాని, మనలను పరిపాలించుటకుగాని శక్తిచాలక యున్నసమయమున మనము స్వాతంత్ర్యమునకై గొప్పప్రయత్నములు చేసియుండిన యెడల మనకు జయము సమకూరి యుండెడిదే. ఆతరుణమున మనమేమియు చేయలేక పోతిమి. ముందేమి జరుగునో మనకు తెలియదు.

ఏదియెట్లు జరిగినను, గాఢప్రయత్నములు చేయుట కిది సు
తరుణమని మనమూహించితిమేని, ప్రతి యవసరమునకును
సంసిద్ధులమై యుందుము. కావున మనము చేయవలసిన
దాని నిప్పుడే నిర్ధారణ చేసికొనవలయును. మనజీవిత మీ
సిద్ధాంతముల మీదనే యాధారపడి యుండవలెను.
ప్రతివాడును తనధర్మమును నిర్వర్తించి, జాతీయ పతా
కమున కెవరడ్డము వచ్చినను, దానిని పీడకుండున గాక!
అప్పుడే స్వాతంత్ర్యము లభ్యమగును. అప్పుడే మనతరము
వారు చేయుపని సువర్ణాక్షరములతో లిఖితమై, శాశ్వతముగా
ప్రశంసింప బడును. మన కీ ప్రయత్నమునం దెన్ని కష్టములు
గలిగినను,శత్రువులకుట్రలకును, సమయోచితముగా తమయభి
ప్రాయములు భగ్నముచేసెడి నీచుల దుర్మార్గములకును
లొంగకూడదు. ఆపదలయందు ధైర్యము వహించవలయును.
భయోత్పాతము వలననేమి, నిజమగు అభిప్రాయ భేదము
లుండుట వలననేమి,అధిక సంఖ్యాకులు మనతో చేరియుండ లేదని
జ్ఞాపక ముంచుకొని, మనసిద్ధాంతముల యెడల గాఢమగు
విశ్వాసమును ప్రకటించి, మనమే నిజమయిన కార్యశూరుల
మని లోకమునకు చాటవలెను. అప్పుడే ప్రజలలో వివేక
వంతులు మనసిద్ధాంతములను గ్రహింతురు. మన భేదాభి
ప్రాయములు నాశమైపోవును. సమయోచితముగా తమభావము
లను మార్చుకొను వారికంటె, ఎన్నికష్టములు సంభవించినను,
తమ సిద్ధాంతములను వీడనివారే ఘనులనియు, దక్షులనియు
లోకము గ్రహించును. తాము తలచిన దానికంటె నధిక

ఫలము సమకూరినందులకు వారే యైశ్వర్యము నొందుదురు. లోకమును వారిని ప్రశంసించును. గమ్యస్థానమునందు వానికి నమ్మకము గలుగును. క్రమక్రమముగా ఉత్సాహము, కార్యదీక్ష యధికమగును. మనభూమి యభివృద్ధి గాంచుట నిజమరి మనకు తోచగలదు. స్వాతంత్ర్యభానుని కిరణములు నలుగడల వ్యాపించును. ఐర్లండు దేశము జయాజయధ్వానములతో నీపోరాటమున బయటబడును. మనకు పూర్వపు ఔన్నత్యమును, ఖ్యాతియు గలిగి, నానాజాతిసమితియందు పేరెన్నిక గన్న జాతిగా పరిగణింప బడెదము.

# పదవ ప్రకరణము

## భక్తి.

స్వాతంత్ర్యమునకై పాటుపడుటకు సామర్థ్యముగల సేన నాయత్తము చేయవలెననిన, ప్రతిసైనికుడును మన యుద్దేశ్యములను బాగుగా గ్రహించినవాడుగా నుండవలెను. అతడు భక్తి శ్రద్ధలతోడను, విశ్వాసముతోడను, ధైర్యముతోడను, కష్టమునకు సుఖమునకు నిరంతర ప్రయత్నము చేసి పతాకమునకు గౌరవము దెచ్చువాడుగ నుండవలెను. మనసేనలో చేరువారికి అట్టిగుణములు లేనియెడల జయము సమకూరుట కష్టసాధ్యము.

— టెరెన్సు మెక్స్వినీ.

తన యుద్యమము ధర్మమునకు విధేయుడైయుండుట ధీరుల లక్షణము. ఐరిషు జాతీయోద్యమముపట్ల గాఢాభిమానము కలిగియుండుట ఐరిషు జాతీయనాయకులకు సహజముగాన దేశభక్తులెవరో, దేశద్రోహులెవరో స్పష్టముగా నెరుంగుటకు సమయ మాసన్నమైనది. ఒక మూఢప్రభుత్వము మన మెత్తదనమును, సుస్వభావమును గనిపెట్టి మన జాతీయనాయకులను దేశద్రోహులని శాసించినప్పుడు, మనమును, వివేకహీనులమై మన నాయకులను పరిహాసించి వారి యుద్దేశ్యములను హేళనచేసితిమి. అధికారుల యుద్దేశ్యములు నెరవేరినప్పుడైనను మననైజమార్గమునుద్రొక్కి మహాపురుషులను గౌరవించి యుండవలసినది. బ్రియాన్‌గారు, షిన్, ఓవన్, టోన్,

మిచ్చెల్, డేవిస్ ధైర్యవంతులును, అసమాన ప్రజ్ఞగలవారును నైయున్నారు. వారందరును సంపూర్ణ స్వాతంత్ర్యవాదులు. వీరి ననవరతము మనము పూజించుచుండవలయును. అధర్మము నడంచి ధర్మమును ప్రతిష్ఠించుటకు గాఢముగా ప్రయత్నము జేసిన యీమహాశయులను మనము గౌరవించకుండు టెట్లుసాధ్యమగును? సాధారణముగా ప్రభుత్వమునకు తిరుగబడు ప్రతివానిని మనము పొగడము. ప్రతినీచుని దేశసేవకుడని మనము పొగడినయెడల, మనము స్వాతంత్ర్యము గడించిన తరువాత, యీతుచ్ఛులందరును మన స్వాతంత్ర్యమునకు భంగముకలుగజేసి, మన శత్రువులను దేశములోనికిబ్రవేశపెట్ట ప్రయత్నింతురు. తమ ధర్మముపట్లభక్తి యుత్తముల లక్షణము. 'భక్తి.' యనుపదముయొక్క భావముసరిగా గ్రహించబడకుండుట మిక్కిలి శోచనీయము. దీనికి పిచ్చిపిచ్చి యర్థములన్నియు కల్పించబడుచున్నవి. ఈ భక్తిగుణము మన జాతీయనాయకులకు సహజలక్షణముగాన, దీని నర్హముగు నున్నతస్థానమున నుంచుట మనధర్మమైయున్నది. ఈవిషయమునుగురించి యాలోచించుటలో మనకు చాలకష్టమును, వ్యథయు గలుగజేసిన కొన్నిసంగతులను గురించి యాలోచించవలసియుండును. మన హక్కులను గౌరవించని యధర్మప్రభుత్వమువారి సంస్థలలో పాల్గొనుట మన యుద్దేశ్యములకు విరుద్ధమని కొంతమంది తలతురు. ఇట్లు పాల్గొనుట ధర్మవిరుద్ధము కానేరదని యీప్రకరణమున నిరూపించెదను. మన యాశయములు ఫలవంతములుగావని మనల నడుగడుగున నిరుత్సాహపరచెడి మితవాదుల . విష

యము గూడ రెండుమాటలు చెప్పవలసియున్నది. భక్తిని గురించి మాట్లాడునపుడు యీ విషయములనుగుఱించి స్పష్టముగా తెలిసికొనవలెను. స్వాతంత్ర్యమును గడించుటకు తిరుగబడినవాడు, లభించిన స్వాతంత్ర్యమును రక్షించుటకు తన ప్రాణము లర్పింప వెనుదీయడు. సమయానుకూలముగా నతడు తనయభిప్రాయములను మార్చుకొనడు. అన్ని సమయములయందు నతడొక సిద్ధాంతమునకు విధేయుడై యుండును. అతడు ప్రేమాస్పదుడు. ఇతరు లతని పశువనియు, మోటువాడనియు, దేశద్రోహియనియు పిలిచినను, అతడు మొదటినుండియు చివరవరకు తానునమ్మిన సిద్ధాంతములకు విధేయుడైయుండును. మన దేశమునకు ఖ్యాతి దెచ్చిన టోను, మిచ్చెల్ ప్రభృతులు, ధీరులు, దేశభక్తులు. మనశత్రువులకు సహాయయము చేయు ప్రతివాడును దేశద్రోహి.

ఈ ముఖ్యసిద్ధాంతములమీద నాధారము చేసికొని మన మీ సమస్య చర్చించ గడంగి నప్పుడు, మన సమయోచితజ్ఞుడు, తన దుర్బలత్వమును గ్రహించి మన మసందర్భముగా మాటలాడు చున్నామని యాక్షేపించును. కావున మన మీసమస్య నాలోచించక పూర్వము, "వాదనకొరకై వాదన" యొక్క ప్రాముఖ్యతను, ఉపయోగమును గురించి తెలిసికొనుట యవసరము. సిద్ధాంతముల యొక్క యుపయోగము వాక్చతుర్యముతో వాగ్వాదములు సల్పుటకు గాదు. ఈ సిద్ధాంతములు యితర గొప్పసిద్ధాంతములను తెలిసికొనుటకు సహాయభూతముగా నుండవలెను. ఈసిద్ధాంతములు, వ్యక్తుల

నుత్సాహమును, మనో వికాసమును గలుగచేయుటయే గాక, విషయములను చక్కగా గ్రహించుటకును, యీసమస్యకును, తక్కిన సమస్యలకును తారతమ్యజ్ఞానము గలుగజేయు శక్తి నొసంగుటకును తోడ్పడవలెను. ఒకసిద్ధాంతమును నమ్మిన వాడు, హేతువాదమున కతీతు డగును. అతని మనస్సునందు సంకోచము లేమియు లేవు. అతనికి భక్తియే ప్రధానము. చాలకాల మతడు వివిధ వేదాంత మార్గములను గురించి వినుచు, దేని నవలంబించవలెనో తోచక తిరుగుచుండెను. అతని కెన్నియో సమయములయందు నిరాశ జనించినది. ఇట్లతడు వ్యాకులతజెంది, మార్గము తోచకయున్న సమయమున, నీజ్ఞాన మతనికి నకస్మాత్తుగా పొడగట్టినది. దాని నెవ్వరును అతనికి నేర్పలేదు. తన యాత్మనుండియే యది వెలువడినది. ప్రతివాని యందును నొకదివ్యశక్తి గలదు. అది యజ్ఞానాంధకారముచే కప్పబడి యున్నది. సత్యపథము గోచరించినప్పుడు, యీయజ్ఞానాంధకారము పటాపంచలై, జ్ఞాన మార్గము గోచరించ గలదు. ఈబుద్ధి తెలిసినవాడు హేతువాదముల కతీతుడని చెప్పియుంటిని. ఇట్లనుటచే నతడు వాదించుటకు గడంగడని కాదు. వాదములో నతడు తనశక్తి యంతయు నుపయోగించి ప్రతిపక్షుల ఒప్పించును. సాధారణ తార్కికులు గ్రహించలేని సత్యమతని యంతరాత్మకు బోధపడినది. అదియే తన యభ్యుదయమునకును, ఆత్మ వికాసమునకును కారణమై యున్నది. ఈజ్ఞాన మతనికి గలిగిన తరువాత నతనికి భక్తిహెచ్చినది. లోకము నెదిరించి గెలువగల శక్తి

యుతనికి గలిగినది. అతని తార్కికునిగా తలంచితిమేని మన కతడు బోధపడడు. మెట్టవేదాంతి యికముందు లోకమును తన మార్గమునకు ద్రిప్పుకొనవలసి యుండును. కార్యాచరణ దక్షుడు తన సిద్ధాంతముల నాచరణాయం దుంచి, లోకమున కాదర్శ ప్రాయుడగును. అతనికి వేదాంతములతో పనిలేదు. అతని మనస్సునకు నిజమయిన కారణములు తెలిసియే యున్నవి. అతనికి సందేశము మెందు. నిశ్చితాభిప్రాయ ములు లేనివాడు వాద వివాదముల యందు నిమగ్నుడై తన మనస్సును, నితరుల మనస్సులను కలవరపెట్టు నంతవర కేదియో వాదించుచుండును. తెలివితేటలు గలవాడు, ప్రథ మమున నొకపక్షమున వాదించి, యింతకన్న రెండింతలు చాకచక్యముతో రెండవ పక్షమున వాదించగలడు. సాధా రణముగా తార్కిక సభలలో నుపన్యాసకులకు వాదవివాదము లు నేర్పుట మన మెరింగిన విషయమే. వాగ్వివాదములను సామ ర్థ్యముతో జరుపుట మనోశక్తిని వెల్లడి చేయుచున్నది. తాను మనస్ఫూర్తిగా నొకవిషయమును నమ్మినవా డిట్లు చేయజా లడు. అతని ముఖమునుండి వెలువడు మాటలన్నియు, అతని యాత్మయొక్క గంభీరతను, సౌందర్యమును వెలిబుచ్చును. అతని వేదాంత మతసిజీవితముయొక్క యుద్దేశ్యమును వ్యక్త పరుచును. అతని యుత్సాహమును, వివేకము నొసంగి యాతని నుద్ధరించును.

మన 'మసందర్భముగా మాట్లాడుచున్నామని' మనల నాక్షేపించు వారి వాదముల నిప్పుడు పరీక్షింతము. మీరు

ఆంగ్లేయుల నాణెములను, కార్డులను, తపాలాబిళ్ళలను మొదల
యినవానినేల యుపయోగించెదరు? ఆంగ్లేయ పార్లమెంటు
సభ యొక్క ప్రభుత్వమును మీరొప్పుకొనరు. అట్లయిన పార్ల
మెంటుచే ప్రసాదింపబడిన లోకలుబోర్డులను, కౌంటీ సంఘ
ముల నేలయొప్పుకొనెదరు? ఈ సంఘములను ప్రవేశించి
చర్చలలో మీరేల పాల్గొనెదరు?' ఈప్రశ్నలు మన మందర
మెరిగినవే. క్రొత్తవిగావు. వీనికి ప్రత్యుత్తర మొసంగుటయు
సులభమే. ఐర్లండు దేశమున ప్రస్తుతము ఫిరంగుల మ్రోత
వినబడకున్నను ఆంగ్లదేశమునకును ఐర్లండునకును యుద్ధము జరుగు
చున్నదనియే మన మెఱుంగ వలయును. మనము మనస్వాతం
త్ర్యమును సంపాదించుటకు పోరుచున్నాము. ఈ యుద్ధమున
లోకలుబోర్డులు, కౌంటీసంఘములు మరియు స్థానిక ప్రభుత్వ
సంస్థాపనలనన్నిటిని ఆంగ్లేయులు మనకు వదలివేసిరి. ఇవి
మనము గెలిచిన యున్నత ప్రదేశములు. వీనిని మనబల మభి
వృద్ధి చేసికొనుటకును, దేశాభ్యుదయమునకును, సంపూర్ణస్వా
తంత్ర్యస్థాపనమునకును, మన ముపయోగించెదము. ఈప్రత్యు
త్తర మందరికిని తృప్తిగొలుప వలయును. యుద్ధరంగమున శత్రు
వులచే నాక్రమించుకొనబడిన స్థానములను పట్టుకొని వానిని
మన జయమునకై యుపయోగించుట సేనానికి గౌరవనీయ
మగు విజయమే. యుద్ధము బాగుగా జరుగుచున్నదని దూర
మునుండి వీక్షించుచున్న దేవతాసమూహమునకును పితరుల
కును నిది సంతసము గొల్పకమానదు. మనపక్షము మోడిపోవు
చున్నదనియు సేనాసమూహములు శత్రువులపతాకము నొప్పు

కొని వారిదేరాలలో ప్రవేశించిరని వినినప్పుడు వారికి మితిలేని దుఃఖము గొల్పును. శతృవులచే వదలి వేయబడిన స్థలముల నాక్రమించుటకు ఆక్షేపణ మేమాత్రము నుండకూడదు. కాని ఒకవిషయమున జాగ్రత వహించవలయును. ఈ సంస్థలను ఐర్లండున కనుకూలముగా గాని ప్రతికూలముగా గాని యుపయోగించవచ్చును. ఈ స్థానిక ప్రభుత్వములయందు ఉద్యోగము లొప్పుకొని తమయుద్యోగములు పోవుసను భయముచే తమ పతాకమును వీడి శతృపక్షమున చేరిరేని వారు దేశద్రోహులుగా నెంచబడుదురు. ఈ విషయ మందరును నొప్పుకొనినదే. ఈయుద్యోగములలో ప్రవేశించువా డెవ్వడును గొప్ప యాదర్శముల వలనను సిద్ధాంతముల వలనను ప్రేరేపింపబడుట లేదని కొంతమంది యనవచ్చును. బహుస్వల్పసంఖ్యాకులకు మాత్రమే యీ భావములు గలవను మాట సత్యమే. ఎట్లయినను స్థానిక ప్రభుత్వము ప్రజాయత్తమయినదనుటకు సందియము లేదు. ఈ ప్రభుత్వములు ప్రజలకు మేలు చేయుచుండి స్వాతంత్ర్యమునకు ప్రజలను తయారు చేయుచున్నవి. స్థానిక ప్రభుత్వ సంస్థాపనలలో ప్రవేశించు ప్రతివాడును, తెలిసియో, తెలియకయో, దేశాభ్యుదయమునకును, పూర్వ ప్రతిష్ఠ, అధికారము సంపాదించుటకును ప్రయత్నించుచున్నాడు. మన పోరాటము యొక్క నిజస్వరూపమును గుర్తెరింగిన వారు, యీసంస్థాపనల లోనికి ప్రవేశించి సమయము వచ్చినపుడు స్వాతంత్ర్యము న_ వీనినుపయోగించుకొందురు. విదేశీయ నిరంకుశ ప్రభుత్వము ఈస్థానములు ప్రజాయత్తములైనవి గనుక ప్రస్తుతము

చేయునదిలేక వానియందు సభ్యులుగా నున్నవారి నిరోధనశక్తిని చూపుటకు వివిధోపాయములు పన్నుచున్నారు. ఈ ప్రజాయత్త శాఖలయందు వారినిరంకుశాధికారమును స్వేచ్ఛగ నెరపుచుచున్నారు. ప్రస్తుతము మనము చేయుచున్న పోరాటముయొక్క నిజస్వరూప మిది. ఒకానొకసమయమున శత్రువులు, స్వాతంత్ర్యోద్యమము నడంచుటకు ప్రయత్నములు చేసెదరు. అందుపై పోరాటము తీక్ష్ణమై ఆప్రశ్న తేలునంత వరకు పోరాటము జరుగుచునే యుండును. మనతరమునందనేక విజయములు మనకు సంప్రాప్తమైనవి. రహితులసంఘములనేకములు స్థాపింపబడినవి. హోంరూలుకై తీవ్రముగా ప్రయత్నములు కొనసాగింప బడుచున్నవి. విశ్వవిద్యాలయములో మనభాషకు గౌరవస్థాన మొసంగ బడవలెనని తీవ్రముగా పోరాడి యుంటిమి. ఈ సందర్భములయందు భూమివిషయమైన చట్టములు, స్థానిక ప్రభుత్వ చట్టములు, విశ్వవిద్యాలయ చట్టములు చేయబడినవి. ఐరిషుభాషకు దేశమునందు ప్రధానస్థాన మొసంగబడినది. మనము చేసిన పోరాటమున మన కనమానమైన జయము గలిగిన దనుటకు సందియములేదు. ఈ పోరాటమునందు మనకుగలిగిన ప్రతివిజయమును మనలను ముందుకు గొనిపోవును. ఐరిషు స్వాతంత్ర్యమును సంపాదించనెంచు ప్రతివాడును స్థానిక ప్రభుత్వ ప్రతిష్ఠాపనలు "ప్రభుత్వశాఖలు" గనుక వానిని పేడవలయుననియు, శత్రువుల హస్తగతము చేయవలయుననియు పలుకువారి యవివేకపు మాటలకెంత మాత్రమును చెవియొగ్గరాదు. మనలనాక్షేపించు వారికి

తగిన ప్రత్యుత్తరము చెప్పుట తప్పదు. కనుక నింతవిస్తరించి వ్రాసితిని. మనము శత్రువుల కందకముల నాక్రమించుకొను చున్నామని తలచవలయును.

ఈవాదమును ఖండించినతరువాత మరియొక ముఖ్యవిషయమును గురించి మనము స్పష్టము చేయవలసియున్నది. స్వాతంత్ర్యమునకై పాటుపడుటకు సామర్థ్యముగల సేననాయత్తము చేయవలెననిన ప్రతిసైనికుడును మన యుద్దేశ్యములను బాగుగా గ్రహించినవాడుగా నుండవలెను. అతడు, భక్తిశ్రద్ధలతోడను, విశ్వాసముతోడను, ధైర్యముతోడను, కష్టమానక, సుఖమనక నిరంతర ప్రయత్నముచేసి, పతాకమునకు గౌరవము దెచ్చువాడుగా నుండవలెను. మన సేనలో చేరువారికిట్టి గుణములు లేనియెడల, జయము సమకూరుట కష్టసాధ్యము. ఒక యుదాహరణము నిచ్చినగాని దీని ప్రాముఖ్యతబోధపడదు. ప్రతియుద్యమమునందును, కొంతమంది గబ్బిలములవలె తమ వీలుప్రకారము పక్షములను మార్చుకొనుట మనమెరిగిన విషయమే. వారికి సిద్ధాంతములతో పనిలేదు. ఏపక్షము జయించునో, ఆపక్షమును వారు చేరప్రయత్నింతురు. తమయుద్దేశ్యములను నెరవేర్చుకొనుటకై వారిరుపక్షులవారిని నాశ్రయించుటకుగాని, ద్రోహము చేయుటకుగాని వెనుదీయరు. ఇట్టి వ్యక్తు లందరకును బాగుగా తెలిసియేయున్నారు. చాలకాలము తప్పుత్రోవలద్రొక్కి, కర్తవ్యాకర్తవ్యముల వితర్కించుకొని, సరియగు మార్గమునకు వచ్చినవారిని మన పక్షమున చేర్చుకొనిన నష్టములేదు. కాని నీతిలేక సమయోచితముగా తమపక్ష

ములన్ను, అభిప్రాయములను మార్చుకొనువారిని చేర్చుకొను
టయు, వారిమాటలు వినుటయు మిక్కిలి యనర్థదాయకము.
ఈతప్పు నాయకులదై యున్నది. వారు తమ యభిప్రాయము
లకు ప్రతివాదిని త్రిప్పుకొనుటకు తొందరపడెదరు. తమసంఖ్య
యెక్కువగా నున్నగాని, జనులకు తమ పక్షమునెడల విశ్వా
సము గలుగదని వారుతలంచెదరు. కాని యీనీతిలేనివారిని
కలుపుకొనుటవలన తమపక్షమునకెంత యనర్థదాయకమో వా
రాలోచించుటలేదు. వీరు వినయముగను, యుక్తియుక్తముగను
మాట్లాడుటవలన నాయకులు మోసపోయెదరు. ఈపురుషులకు
లోకానుభవము మెండుగా నుండుననియు, వారిని కలుపు
కొనుట వలన, తమకున్న పలుకుబడిచే నితరులను గూడ నుద్య
మములో చేర్తురనియు, నాయకులు భ్రమపడెదరు. ఇట్లు
తలచుట గొప్ప పొరపాటు. గౌరవనీయులను మాత్రమే
మనము చేర్చుకొనవలెను. మనపక్షములో చేరి, మనకు
ద్రోహము చేయువారివలన మనకేమి ప్రయోజనము? మన
పక్షమునకు మరియొక గొప్పనష్టము గలదు. జనసామాన్యము
మన కార్యములను గమనించుచుందురు. మన సిద్ధాంతముల
సత్యమును వారు గ్రహించుచుందురు. క్రమ క్రమముగా
మన పక్షమునకు వారు తిరుగవచ్చును. కాని మనమిట్టి నీచు
లను చేర్చుకొనిన యెడల మనమందరమును నిట్టివారమే
యని వారు దూరముగా తొలగిపోయెదరు. వారికేమి తెలిసి
నను, తెలియక పోయినను, యీగబ్బిలముల సంగతి స్వాను
భవమువలన తెలిసినది. ఇట్టివారిని జూచి జనసామాన్యము

భయపడెదరు. కావున మనపక్షమునకు వారు విముఖులయ్యె దరు. "నీస్నేహితు లెవరో నాకుచెప్పిన యెడల, నీవెటువంటి వాడవో నేనుచెప్పెదను," అనుసామెత మనకందరకును తెలిసి నదే. ఇట్టినీచులు మనకు వ్యతిరేకపక్షమున నున్నను భయము లేదు. మనము చేయుకార్యములు పరస్పర విరుద్ధములుగా నుండకూడదు. మనము స్వాతంత్ర్యమునకై పోరాడుట భౌతిక సుఖములకు గాదు. ధనార్జనకుగాని, భోగమునకుగాని కాదు. స్వాతంత్ర్యము ఆధ్యాత్మిక విషయములకై యున్నది. ఆత్మా భివృద్ధికై యున్నది. మానవు లన్నివిధముల నభివృద్ధియగుటకు స్వాతంత్ర్య మవసరము. కాన నిట్టిపవిత్రమగు పోరాటమున మన తోడివారు నీచులుగను, జిత్తులమారివారుగను, స్వలా భాపేక్షకులుగను నుండుట యెంతమాత్రము సమంజసము గాదు. మనము కొద్దిమంది మాత్రమే యున్నామని యధైర్య పడరాదు. మనము విశ్వాసముతో పని చేసినయెడల కార్యము నెరవేరగలదు. నీచులు కోట్లకొలది మనయుద్యమమున చేరియుండుటకన్న సద్గుణసంపన్ను లగువారు కొలదిమంది మాత్రమేయుండుట చాలును. క్రమక్రమముగా నీతిపరుల సంఖ్య హెచ్చును. స్వాతంత్ర్య పోరాటమున వారికి జయము తప్పక చేకూరును.

మన మిత్రాపురుషుల బారినుండి తప్పించుకొనుట యెంత యవసరమో మితవాదుల బారినుండి తప్పించుకొనుటయు, అంతే యవసరము. వారి యుద్దేశ్యములు మంచివేగాని వారు మన సిద్ధాంతముల నొప్పుకొనరు. ప్రస్తుతసమయమున, ఇంగ్లండుతో

నెడబాటు వీలుగాదని వారు తలఁతురు. సంపూర్ణ స్వాతంత్ర్యమునకుబదులు హోంరూలో లేక గ్రాటనుగారి పార్లమెంటో మరేదియో ఒకవిధానము కావలెనని వారు కోరుచున్నారు. ఈయుద్దేశ్యములు బాగుగానున్నట్లు మన కగపడును. మనము వారితో నీమరతులమీద సంధిచేసికొనుటకు పురిగొల్పబడుదుము. మైత్రిచేకూరినదని తలపోయుదు. మనము సంపూర్ణ స్వాతంత్ర్యవాదులము. కొంతమంది ప్రస్తుతము సామ్రాజ్యాన్తస్స్వరాజ్యము చాలుననియు క్రమక్రమముగా సంపూర్ణ స్వాతంత్ర్యము కావలెననియు కోరెదరు. మరికొందరు, అసంపూర్తియగు స్వరాజ్యమే యాదర్శముగా కలిగియుందురు. ఈమూడు పక్షములవారికిని మైత్రియెట్లుకుదురును? ఇది కొద్దికాలమే మనును. అతివాదులు తాము ప్రస్తుతము చేయు ప్రతికార్యమును సంపూర్ణ స్వాతంత్ర్య సంపాదనకు సహాయభూతముగా నుండవలయునని తలతురు. ఈసిద్ధాంతములకు వ్యతిరేకముగా నెవరేమిచేసినను వారు సహించరు. తమ పతాకమును, సిద్ధాంతమును, ఈరెండును వారికి ప్రమాణములుగాని తమతో సంధిచేసికొనినవారిసిద్ధాంతము నొప్పుకొనరు. వారికివి ప్రమాణములు గావు. వీరు అతివాదులు చేయుకార్యములను నిరోధించుదరు. ఇట్టి విరుద్ధభావములను, పద్ధతులను గలవారికెట్లు సమావేశము కుదురును? ఏదోయొక విషయమున కలిసి పని చేయవలయునని వారు తలతురుగాని యేదోయొక యాటంకము చెప్పబడును. దీనివిషయమై చర్చజరుగును. మిక్కిలి తీక్ష్ణముగా వాదవివాదములు ప్రబలును. వారొండొరుల దూషించు

కొందరు. క్రోధము హెచ్చును. వారియొడంబడికకు భంగము కలుగును. ఈమూడుపక్షములవారును చేసికొనిన యొడంబడికవలన వారూహించినట్లు, మైత్రియు, సద్భావము గలుగుటకుబదులు, భేదభావమును, ద్వేషమును హెచ్చినది. ఇట్టి యొడంబడికలవలన లాభమేమాత్రమును లేదని గ్రహించవలయును. తమ యభిప్రాయములయందును, నాశయములందును, సంపూర్ణమైన యేకీభావముగలవారు మాత్రమే కలిసి, తమ కార్యక్రమమును నిర్ధారణ చేసికొనవలయునని దీనివలన స్పష్టమగుచున్నది. ఇతరులతో సంబంధ ముంచుకొనగూడదు. కాని యొకరోదన వినబడుచున్నది. 'దేశమీకక్షలచే పాడగుచున్నది. ఐరిషుప్రజల కైకమత్యము కుదురదు. ఈకక్షలవలన మనలో భేదభావ మభివృద్ధియగుచున్నది;' అని ప్రజ లనుచున్నారు. ఈరోదనములను మనము లక్ష్యపెట్టనవసరములేదు. కాని మనసిద్ధాంతములలో కొంతభాగ మొప్పుకొనినవారితో కొన్ని సమయములయందు, దేశమునకు లాభమని తలంచినయెడల కలిసి పనిచేయవచ్చును. వేరే యొడంబడికలు, సమావేశములు, అవసరములేదు. వీరొండొరులకు చేసికొను సహాయమే యొడంబడికగా పరిణమించును. ఇట్లు చేయుటవలన మనలో సద్భావ మభివృద్ధికాగలదు. ఇంతకంటె ముఖ్యమగు విషయము మరియొకటిగలదు. మన యభిప్రాయములతో నేకీభవించక తమకు సత్యమనితోచిన మార్గము నవలంబించెడువారిని మనము దూషించకూడదు. వారితో మన మేకీభవించలేము గనుక, వారి యభిప్రాయములు తప్పనిచెప్పుటయక్రమము. మనకెట్టి సదుద్దే

శ్యములుకలవో మనకెంత దేశభక్తికలదో వారికిని నట్టిసదుద్దేశ్యములును, దేశభక్తియు నుండవచ్చును. వారిలో ననేకులు మనకంటె నెక్కుడు సేవ జేసియున్నారు. ఇట్టిగౌరవనీయులను మనము తూలనాడుటతగదు. కాని యీతడు దేశక్షేమముకొరకును, ఐకమత్యముకొరకును, కొన్ని సమయములయందితరులతో సంధిచేసుకొనుచున్నాడు. మనమీపద్ధతి నొప్పుకొనజాలము. ఇట్లుచేయుట మన సిద్ధాంతమునకు వ్యతిరేకము. కాని యాతని సదుద్దేశ్యములను మన మాక్షేపించుట యధర్మము. శత్రువులతో పోరి వారిబలము నడంచుటకు మన మొకంబడిక చేసికొని యుంటిమి, గాని దానివలన మనకేమాత్రమును లాభము గలిగియుండలేదు. ద్వేషపూరితులమై యుండువారలతో వృషభములవలె పోరియుంటిమి. శత్రువును జయించుటకు బదులు మనబలమే నశించినది. కావున నీవిషయమును జ్ఞాపకముంచుకొని, మనమందరము కలిసి శత్రువును జయించు మార్గమాలోచించ వలయును. కాని రాజనియు, పార్లిమెంటనియు, వారికి మనము విధేయతజూపవలెననియు, సంపూర్ణ స్వాతంత్ర్యవాదులగువారిని నిరుత్సాహ పరచకుడు. ఈషరతులన్నియు మిక్కిలి కఠినముగా నగపడవచ్చును. మనము చేసెడి ప్రయత్నముయొక్క గంభీరత నాలోచింపుడు. ఒక గొప్ప సౌధమును నిర్మాణము చేయునప్పుడు, శిల్పి యొకవిషయము కష్టముగా నున్నదని యలక్ష్యముచేసి, కట్టడము నేదోయొక విధమున పూర్తిజేసి, భగవంతునిమీద భారము వేసినయెడల, కట్టడమంతయు గూలుట సహజము. ఇట్టి విష

త్తులు రాకుండ, కష్టతరములగు సమస్యలు తలచూపగానే పరిష్కరించుట యావసరము. కావున నిర్భయముగా మన పక్షము వహించి, శత్రువులతో పోరాడవలయును. ప్రజలీసిద్ధాంతముల నాచరణయం దుంచిరేని, పూర్వపు టుత్సాహము జనించి, దేశమంతయు నభివృద్ధి జెందును. నీచుల నీచత్వము మాయమైపోవును. భీరువులు ధైర్యపూరితు లగుదురు. నిర్భయముగా పోరువారి యాశయములు సఫలము లగును. దేశము స్వాతంత్ర్యోన్ముఖమై నడచును.

భక్తియనగా నిదియే యర్థము. దీనినే మనము మన పత్రికల పైని నిర్భయముగా వ్రాసి లోకమునకు వెల్లడి చేయవలయును. ఇదియే సత్యమును, గౌరవనీయమును, నిర్భయమును, నాశములేనిపథమునై యున్నది. ఈరోజు నేను నిర్భయముగను యథార్థముగను వ్రాయుచున్న వాక్యములు, అపజయము గలిగినప్పుడు, సవరణగానిమార్పుగాని యావసరము లేకయే వర్తించును. మనము సలుపుచున్న పోరాటమున, గమ్యస్థానముచేరి, జయభేరి వేయించితిమేని మన 'భక్తి' మధ్యాహ్నమార్తాండునివలె తీక్ష్ణమై ప్రకాశించును. మరియు శాశ్వతమై విరాజిల్లును. అప్పుడు నిరంకుశాధికారవర్గముచేతను, కపట వేదాంతుల తత్వములచేతను కలవరపడుచున్న ప్రపంచమున కొక నూతనమార్గము సూచించినవార మగుదుము. ఇతర దేశముల కాదర్శప్రాయమైన రాజ్యతంత్రము నొక దానిని తయారు చేయగలిగెదము. సంశయాత్మకుడును మనోదౌర్బల్యము వీడనివాడును 'మనము మనుష్యులము, దేవతలము

గాము. ఇది మనము చేయజాలము' అని యధైర్య పడును. సత్యమే! మనము దేవతలము గాము. మానవులకు నైజముగ దుర్బలత్వము గలదు గనుకనే యెంతమనోనిశ్చయముగలవా డైనను తన మనోనిశ్చయమును గోల్పోవును. తప్పుత్రోవల బడును. విసుగుకొనును. ఇట్టి సమయములయందు అతనికి తనసిద్ధాంతములయందు విశ్వాసముండి ధైర్యముతో ప్రవర్తించెనేని, యతఁడే కష్టముల నైన దాటి జయము గాంచును. అతని కీగుణములు లేని యెడల భ్రష్టుడగును. ఆత్మనాశము గలుగును. మన యాత్మసాక్షికనుకూలముగ నున్న సిద్ధాంతముల నాచరణయందుంచక తప్పదుగనుక మనము వాని నాచరణయందుంచు చున్నాము గాని యవి సులభసాధ్యమని కాదు. ఆత్మశక్తియు, ఆత్మవిశ్వాసమును గల దివ్యపురుషు డెన్నడేని భూలోకమున నవతరించిన యెడల నతఁడు సామాన్యవ్యక్తులకు విశ్వాసము గలిగించి వారికి చేయూతనొసంగి యుద్ధరించవలెను. సామాన్య జనులకు ధైర్యమును శక్తియు గలిగించి, యింకొక పోరాటమునకు తయారుగా నుండునట్లు చేయవలయును. అలెగ్జాండరు మహాశయున కిట్టి ధైర్యమును ఆత్మవిశ్వాసమును మెండుగా నుండెను. తానిన్ని రాజ్యములు జయించునని మున్నెన్నడును అతఁడు తలచి యుండలేదు. కాని యీ గుణములుండుటవలన నతఁడజేయుఁడయ్యెను. తన యుద్యమమునందభిమానము, తనశక్తులయందు నమ్మకము మనుష్యులను గొప్పవారినిగా చేయును. నీచాతినీచుడును, తన దేశమునకై సేవజేయ ప్రయత్నించిన యెడల నుత్తమోత్తముడుగా

పరిగణింపబడును. కావున భీరువులవలె, నీచులవలె కాపట్యమును జిత్తులును వదలి మనమందరము గొప్ప యాదర్శములతో నిండియుండవలెను. మనపతాకమునెడల గాఢమగు భక్తి యుండవలెను. మనమందరము దేవతలకుసహజమగు విశ్వాసము గలిగి యుండ వలెను. అప్పుడుగాని మన దేశమునకు గొప్పదశ సంప్రాప్తము కానేరదు.

# ఎనిమిదవ ప్రకరణము

## వీరపత్ని

ఇంకొక డిట్లు చెప్పెను. 'నేను వివాహమాడితిని. ఇల్లు విడిచి వచ్చుటకు వీలులేదు.'

సాధారణముగా తప్పంతయు భార్యమీద త్రోయుట పురుషుని కాచారమైయున్నది. మన తప్పిదముల మనము గమనించము. పురుషులు భోగపరాయణులై తమధర్మమును నిర్వర్తించక, యేదో యొక కారణము చెప్పితప్పించుకొను చుండుట చూచి యూరకుండెదము. ఏమియు నెఱుగని స్త్రీలపై లేనిపోని నేరము లారోపించెదము. కావున నీ ప్రకరణమున

పురుషులును స్త్రీలును పరస్పర మొండొరులయెడ నిర్వర్తించ వలసిన ధర్మములను గురించి విచారణకు గడంగుదము. "నేను వివాహమాడితిని, ఇల్లు విడిచి రాఁజాలను" అని చెప్పి తాను చేయవలసిన కార్యము లేవియు చేయని నీచులను గురించి మఱచితినని తలంచకుడు.

పురుషులు, స్త్రీలవిషయమై మాట్లాడ మొదలిడినప్పుడు, కోమలాంగులును తమనుగురించి పురుషు లేమిచెప్పెదరో యని ముసిముసినగవులు నవ్వుకొనెదరు. మగవారు మగువల విషయమై యంతయు తెలిసికొంటిమని చెప్పుట హాస్యాస్పదముగా నుండును. మగువల రహస్యములను బట్టబయలు చేయుటకు నేనిచ్చట గడంగుట లేదు. వారిధర్మమును వారు చక్కగా నెరవేర్చవలెనని మాత్రము మనవి చేయుచున్నాను. ప్రతి స్త్రీకిని భర్తయో, కుమారుడో, తమ్ముడో యుందురు. ఈ స్త్రీల యభిప్రాయముమీదనే పురుషులు నడుచు చుందురు. కావున ముందురాగల స్వాతంత్ర్య పోరాటమున తయారుగా నుండుటకు ప్రస్తుత సమయమున స్త్రీలకు సరియైన శిక్షయుండ వలయును. స్త్రీలు పురుషులకు సహాయభూతు లయ్యెదరా? లేక వారి మెడలకు గుదిబండవలె నుందురా? మగవారిని గాఁగిలించుకొని వారిని యుద్ధరంగమునకు పోనీయక యడ్డగించెదరా? లేక వారి సత్ప్రయత్నములయందు చేయూత నొసంగెదరా? పురుషులకును స్త్రీలకును నెడబాటు గావించిన యీ పోరాటము వారియాత్మల నైక్యముజేసి, సత్యమును యిందిృ

యాతీతమును నగు ప్రేమను గలుగ జేయునా? లేక శాశ్వత మగు నెడబాటు గలుగజేసి వారియాత్మల నాశము జేయునా?

ఈ తరమువారి కాదర్శప్రాయముగనుండదగిన యొకా నొక స్త్రీరత్నమును గురించి యీప్రకరణమున ముచ్చటించ దలచి యున్నాను. కొన్ని ముఖ్యాంశములు మాత్రము తెలియజేసెదను. మిక్కిలి వివరముగా వ్రాయ నవకాశము లేదు. మనస్త్రీలలో కొంతకాలము నుండియు కలవరము బయలుదేరి, సంఘములో వారిదశ బాగుపరచుకొనుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. స్త్రీల ప్రస్తుతహీనదశ 'బొమ్మరిల్లు' అనుపుస్తకమునందు చక్కగా వర్ణింపబడి యున్నది. వారిట్టి స్థానము నొప్పుకొనక, యింతకంటె నుత్తమ మయినట్టియు, గౌరవనీయ మగునట్టియు, స్థానముకొరకై ప్రయత్నించుచున్నారు. తమ గౌరవమును నిలువబెట్టుకొన ప్రయత్నించు ధీరయువతుల యెడల మనకు గౌరవముగలదు. కాని యిట్టి హీనస్థితికి పురుషులే కారకులనియు, తా మభివృద్ధి నొందుటకు పురుషులడ్డుపెట్టెదరనియు తలచుటపొరబాటు. తమ ధర్మమును వీడి భోగపరాయణులైన పురుషులవలెనే, స్త్రీలును నింద్రిసుఖములకులోనై తమ ధర్మమును మఱచుచున్నారు. ఇట్టి స్త్రీలు కష్టములకోర్వలేరు. అనేకవిధములయిన యాభరణములను ధరించి కులుకుచుండెదరు. నాటకములకును, విందులకును, పోవుటయందు వారికమితప్రీతి. స్త్రీలే గృహమునకు రాణులు; పురుషులు బానిసలు. భార్యాభర్తల సంబంధమువలన భార్యకు వివేకమును ఆత్మవిశ్వాసమును వృద్ధికావలెను. పురుషులకు

మనోధైర్యమును, కరుణను గలుగజేయవలయును. భార్యాభర్త లొండొరుల గౌరవించుకొనుచుండవలెను. ప్రస్తుత సమయమున, భార్యాభర్తల సంబంధములవలన నిట్టి సద్గుణములు పెంపొందుటలేదు. ఈ గుణములన్నియు నశించి, దుర్గుణములనేకములు ప్రబలినవి. మూఢత్వము, అవిశ్వాసము వృద్ధియగుచున్నవి. స్త్రీలను బుజ్జగించి పొగడిననేగాని వారు ప్రసన్నులుగారు. వారు యంత్రిగాని చేతి కీలుబొమ్మలవలె నున్నారు. పురుషుడును, విషయసుఖములను మఱగి స్త్రీలకు వశుడై, అశక్తుడును, వ్యర్థుడును నగుచున్నాడు. భార్యాభర్తల బాంధవ్యము గౌరవముమీద నాధారపడియుండుటకు బదులు పురుషుల పౌరుషమునకును స్త్రీల గౌరవమునకును లోపము దెచ్చుచున్నది. స్త్రీలును, పురుషులును నీచత్వమును వృద్ధిపరచు కార్యములు చేయుచుండుట మిక్కిలి శోచనీయము. మానవ స్వభావముయొక్క గంభీరత, గౌరవము ప్రతిష్ఠించుట పురుషులమగు మనము చేయవలసినపని. ఏవో కారణములు చెప్పి యీ కార్యమును మానకూడదు. స్త్రీలకును నిట్టి బాధ్యతకలదు. పురుషులును స్త్రీలును కష్టసుఖములయందు సమానభాగస్థులే. కావుననే పురుషులకును స్త్రీలకును బాధ్యతలుగూడ సమానములే. రాజకీయ విషయములయందు స్త్రీలు, పురుషులతోబాటు సమానహక్కులను గడించ ప్రయత్నించుటకంటె, తమతోడిస్త్రీలను ఉత్సాహవంతులుగను, ఆత్మవిశ్వాసము గలవారుగను చేయుటయు, కష్టములు వచ్చినప్పుడు వాని నతిధైర్యముతో నెదుర్కొనుశక్తి వారికి

గలుగజేయుటయు, వారి ధర్మమైయున్నది. మన స్త్రీలకిట్టి శిక్షణయొసంగబడినప్పుడు మన దేశస్థులేగాక యితరప్రజలును, వారికి సమాన గౌరవముల నియ్యక తప్పదు.

ముందు జరుగనున్న పోరాటములో నిప్పటినుండియు తయారగుట యవసరము. పురుషులు చేయుచున్న ప్రయత్నమునందు స్త్రీలు తోడ్పడినగాని జయము చేకూరదు. పురుషుడు జీవితము నావరించియున్న నీచత్వముతోడను, అధర్మముతోడను నిరంతరము పోరుచుండును. కొన్ని సమయములయందాయధర్మమునకు లొంగిపోయి భ్రష్టుడగును. ఈ పోరాటమునందు స్త్రీలు పురుషులకు సహాయపడవలయును. అతని యౌన్నత్యమునకు గాని, యతనినాశమునకుగాని వారు కారణభూతులగుదురు. ఈ విషయములు మనస్త్రీలు గమనించిన యెడల, వారికర్తవ్యము నిర్ధారణ కాగలదు. పురుషుడు ధర్మమార్గమున పోవ ప్రయత్నించును. స్త్రీ యెంత దేమిచేయవలయునో నిర్ధారణ చేయును. స్త్రీ పురుషునికంటె సుగుణవంతురాలైనయెడల, అతనికి ధైర్యము చెప్పి తనస్థితికి దెచ్చును. ఇట్లుండుట యరుదు. స్త్రీరుషునికంటె నీచురాలైన యెడల, అతని పాతాళమునకు లాగుకొని పోవును. భార్యాభర్త లిద్దరును సమానమైన ధైర్యసాహసగుణాదులు గలిగియుండిన యెడల వారితరుల కలభ్యమగు దివ్యపదవిని జెందుదురు. వారిద్దరికిని నసమానమగు సౌఖ్యమును, ఆనందమును, శాంతియు గలుగును. ఇట్టిదంపతు లొండొరులకు సౌఖ్యదాయకులయ్యెదరు. వారొంటరిగా నున్నయెడల, జీవితముయొక్క

ఆనందము వారికి తెలియజాలదు. దంపతు లందరును నీ విషయమును గమనించవలయును. వీరిని ప్రభుత్వము వారనేక కష్టములపాలు చేయవచ్చును. ప్రస్తుత సమయమున నిట్టి నీచులే రాజ్యము చేయుచున్నారు. భోగపరాయణులై, సుకుమారులై మోటారుబండ్లమీద పోవుచుండువారి ననేకులను మనము చూచుచునే యున్నాము. వీరికి పౌరుష మేమియు లేదు. పౌరుషము గలపురుషు డిట్టిజీవితమునకు పాల్పడడు. అతడెప్పుడును నిరాడంబరముగానే యుండును. ఈ భోగపరాయణుల హృదయములు "భృత్యుల హృదయము"లని బర్నార్డుషాగారు వర్ణించి యున్నారు. ముందు మనకు మంచిస్థితి రావలెనన్న నీ యధర్మమును ప్రతిఘటించ వలెను. ఈ భోగమును లోలత్వమును మనము వీడవలయును. ఇదియే రేపు జరుగనున్న పోరాటమునకు శిక్ష. స్త్రీలును నీవిషయములను గురించి గమనించవలెను. అనేకమంది స్త్రీలు పురుషుల వలె ననేక కష్టముల కోర్చియైన, తమ యాత్మగౌరవమును నిలువబెట్టుకొనువారు గలరు. తుచ్ఛమగు భోగములను వారాసించుట లేదు. కావున మనస్త్రీలందరు భోగపరాయణులను, తుచ్ఛులను జూచి యసహ్యపడునట్లు వారిని మనము తయారు చేయవలెను.

ఇప్పుడు ఐరిషు యువతులలో శ్రేష్ఠమగునామెను గురించి చెప్పెదను. మనప్రజలకు ధైర్యమును, ఉత్సాహమును గలుగ జేయుట యావసరమైనప్పుడు ధీరులగు పురుషులనుగురించియు, వీరవనితలను గురించియు, స్మరించుట సాధారణమై

యున్నది. వా రనేకకష్టములకోర్చి యుద్ధరంగము నతిధైర్య ముతో బ్రవేశించి జయముగాంచిరి. వారుచేసిన ప్రయత్నముల ఫలితమే ప్రస్తుతము మన మనుభవించుచున్నాము. మన వీరుల విషయమై ప్రజలకేమియు దెలియకుండుట మనకుగౌరవము గలిగించ జాలదు. మన వీరపత్నులను గురించియు, తెలియకుండుట మిక్కిలి శోచనీయము. మనవారు వీరవనితలని పొగడువా రందరునునీగౌరవమునకుతగినవారుగా గనుపడరు. నాట్య రంగమున నెవ్వరేని తగ్గుస్థాయిలో "దూరదేశముల దిమ్మరుచున్నది" అను గీతమును పాడినప్పుడు మన హృదయము నందు పొడము భావము లేవియో యాలోచింపుడు! ఈవనిత యెడల మనకు జాలిగలుగును. మన హృదయములు దయ తోడను, ప్రేమతోడను నిండియుండును. కాని యిట్టియుద్రేకము సరియైనదికాదు. ఈగీతము పాడుచున్నపుడు మన కుత్సాహముగాని, ఆత్మవిశ్వాసముగాని, ధైర్యముతో మన ధర్మమును నిర్వర్తించుశక్తిగాని, పతాకము నున్నతస్థానమున ప్రతిష్ఠించు శక్తిగాని గలుగనేరదు. ఈగీతము మనలను బలహీనులనుగా జేయును. మనము కంపముజెందెదము. నరముల పటుత్వముతగ్గును. సారాకురాన్ అను స్త్రీయొక్క విరహమును గురించియు, ఆమె పడినకష్టమును గురించియు వినిన మన ప్రజలు ధైర్యము నందును, సుగుణసంపత్తియందును, బుద్ధివైభవము నందును, పాతివ్రత్యమహిమయందును, నిమెకన్న గొప్పదియగు టోనుమహాశయుని సతినిగురించి తెలిసికొనుట సమంజసము.

పూబోండ్లకు ప్రేమ, దయాదాక్షిణ్యములు, వివేకము, పతిభక్తి నైజగుణములు. ఈగుణము లేస్త్రీయందైనను మిక్కుటముగానుండి వీనికితోడు పురుషునికి సహజలక్షణములగు ధైర్యము, నిర్భయత్వము, ఓర్పు, యుండెనేని యామె వీరపత్నియనందగును. టోనుగారి సతీమణి యిట్టిగుణములుగలది. ఆమెవంటి వీరవనితలు మనదేశములో గాని, యితరదేశములందుగాని, పెక్కుమంది గానరారు. ఆమె యనేకసమయములయందు కఠినపరీక్షలకు లోనుగావలసివచ్చెను. ఆపరీక్షలకన్నిటికిని నామె తాళజాలెను. తనభర్తయెడల నసమానమగు భక్తివిశ్వాసములు చూపినందులకును, అతని ధర్మకార్యమున నిరంతరము ప్రోత్సహించుచుండినందులకును, మనమామెను ప్రశంసింపవలెను. అతడు వీరస్వర్గము నొందినతరువాతగూడ, అతడు నెరవేర్చుటకు కంకణము గట్టుకొనినకార్యమును శ్రద్ధతో నెరవేర్చి తనభర్తయాత్మకు సంతసముచేకూర్చి, వీరవనితలకెల్ల నగ్రగణ్యురాలని లోకమునకు చాటెను. అతడు బ్రదికియుండగా నామె యతనియెడల జూపిన యనురాగము వర్ణనాతీతము. ఇది సాధారణమేయని మన మనుకొనవచ్చును. స్త్రీకి పురుషునియందుగల మోహ మట్లు చేసినదని తలంతము. అతని కష్టకాలమునందును, ఆమె యతని సాహసమునకు పురిగొల్పెను. తన ధర్మమును చక్కగా నెరవేర్చుమని ప్రోత్సహించుచుండెను. తనభర్త కత్యంతప్రియములగు శిశువులకు మంచి శిక్ష యొసంగుచుండెను. భార్యాభర్తలను బంధించినది సాధారణమగు ప్రేమకాదు. అది మోహముకాదు. అది పంచేంద్రియ

ముల కతీతమైనది. వర్ణన కతీతమైనది. * టోను మహాశయుడు మిక్కిలి నిపుణుడు. అతనికి గొప్పశక్తులుండెను. దూరదృష్టిగల వాడు. ఉత్సాహవంతుడు ఎడతెగని ప్రయత్నము చేయు వాడు. నాయకుడుగా నుండుటకు తగినవాడు. అత డొకానొక సమయమున చిన్నిపాపవలె నానందమున దేలుచు మైమఱచి భార్యామణికి వ్రాసినజాబును పరికించుడు. "పిల్లలమీదను, నీమీదను నా కత్యంతానురాగముగలదు. నాపేరుజెప్పి పిల్లలను పదివేలసారులు ముద్దిడుకొనుము. నా బహిఃప్రాణమగు నిన్ను పరమాత్ము డాశీర్వదించుగాక!" (ఇవి ఫ్రెంచి యొధిస్టుపత్రికనుంచి తీసి వ్రాసినది). ఈవాక్యములనుజూచి యతని దూషించెడు వారందరును సిగ్గుచే తలవంచుకొందురుగాక! ఇట్టివాక్యముల నతడు వ్రాయుటలో నాశ్చర్యమేమియును లేదు. అతడు తన

---

౧౭౯౮ సంవత్సరమున ఫ్రెంచివిప్లవము జరుగగానే ఐరిషు వారిలో కూడ కలవరము బయలుదేరెను. అల్స్టరునందును మరియనేక స్థలములయందు మానసిక స్వతంత్రవాదులలో విప్లవభావములు ప్రబలి జనుల నాకర్షించెను. ఈ విప్లవమునకు నాయకుడు థియబాల్డు ఉల్ఫు టోను (Theobald Wolf Tone). ఇతడు గొప్పన్యాయవాది. విప్లవ సమయమున "అఖిల ఐరిషు జాతీయ సంఘము" నొకదానిని స్థాపించెను. దాని యుద్దేశ్యము పార్లమెంటరీ ప్రభుత్వమునకై యాందోళనము సల్పుటయును, క్యాథలికులకు సమాన స్వాతంత్ర్యముల నొసంగుటకును నై యుండెను. కాని ఐరిషుజాతీయ నాయకులగు టోను ప్రభృతుల యాశయములు వీనిని మించియుండెను. ఆంగ్లేయుల సంబంధమును త్రెంచివేయుటయు సంపూర్ణ స్వాతంత్ర్యము గడించుటయు వారి యుద్దేశ్యమై యుండెను. వారికి ఫ్రెంచి విప్లవమునందు సంపూర్ణసానుభూతి యుండెను. ౧౭౯౬ సంవత్సరమున టోను, అతనియనుచరులు ఆంగ్లేయులకు తిరుగు బాటొనరించిరి. కాని దానివలన లాభము లేకపోయెను.

యుద్యమమును మొదలుపెట్టిన సమయమున తన మహాత్కా ర్యమును సాధించుటకు నమెరికా ఖండమునుండి ఫ్రాన్సుదేశ మున కేగుచున్నపుడు చిన్నిపాపలను గురించియు, భార్యను గురించియు, కొంతఖేదము కలిగినది. ఇట్టిసమయమున అతని భార్య యేమిచేసినదో చూడుడు! సాధారణస్త్రీలవలె నతని కౌగిలించుకొని తనకొరకును, పిల్లలకొరకును, దేశమునువిడిచి పొమ్మని చెప్పినదా? అతని పోవద్దని నిరోధించినదా? లేక కంటతడిబెట్టి దుఃఖించదొడంగినదా! ఈసమయమున టోను మహాశయునికన్న నెక్కుడు ధైర్యముచూపినదనుటలో సందే హములేదు. టోనుగారి డైరీనుండి స్వయముగా నతడువ్రాసిన మాటల జూడుడు:—

"తానిదివరకు పొందినకష్టముల వలన నాభార్య యొక్క ధైర్యమును, ఉత్సాహమును నేమాత్రము చెదరలేదు. నాక్షేమముపట్లను, నా గౌరవము నెడలను ఆమె మొదటి నుండియు చూపుచుండిన శ్రద్ధతగ్గలేదు. తనకొరకుగాని పిల్లల కొరకుగాని, నాస్నేహితుల యెడలను దేశమునెడలను నెర వేర్చవలసిన ధర్మమును విడవలవని నన్నామె ప్రార్థించెను. నేను లేనప్పుడు, కుటుంబబాధ్యత లన్నియు తాను వహించెదనని నాకు అభయ మిచ్చెను. అనేకకష్టములయందు మమ్మురక్షిం చిన యాపరమేశ్వరుడే యీ సమయమునందు గూడ, ఆపద రాకుండ కాపాడగలడని నాకామె ప్రోత్సాహము కలుగ జేసెను." తన భర్తకు ధైర్యముచెప్పుచు నతని సాగనంపుచున్నపు డామె వణకుచుండెను. గజగజలాడుచుండెను. స్త్రీలు ప్రేమ

స్వరూపులు, వారి మనస్సు లతికోమలములు. కాని యీసమయ మున ఆమెముఖబింబము గంభీరమై యెట్టిభీరువులకును ధైర్య మును, ఉత్సాహమును గొల్పునట్టిదిగా నుండెను. ధైర్యములో నీ నారీమణికి ససమానతేజోవిరాజితుడగు టోను మహాశ యుడుతప్ప మరెవ్వరును సాటిరారు. స్వాతంత్ర్యపోరాటమున టోను మహాశయుడు తనప్రాణముల నర్పించిన తరువాత ఆమె బాధ్యత లధికమయ్యెను. అతడు బ్రదికి యున్నప్పటికంటె వేయిమడుంగు లధిక ధైర్యమును చూపవలసివచ్చెను. భర్త మరణించుచు వ్రాసిన యుత్తరము జూడుడు. ఈలేఖ యీమె ధర్మమెట్లు నిర్వర్తించవలెనో తెలుపుచున్నది. మరియు టోను మహాశయుని గొప్పతనమును, అతనికి భార్యయందుగల విశ్వాసమును చాటుచున్నది:—

"ప్రియసీ! సెలవిమ్ము. ఈయుత్తరము పూర్తిచేయుట నాకు వీలుగాకున్నది. మీరికి నా ప్రేమను తెలియజేయుము. తండ్రిలేని పిల్లలు! ఇకమీద వారికి నీవదిక్కు! వారిని పెంచి పెద్దవారిని చేసి వారికి విద్య గఱపుటకొరకే నీవు బ్రతికి యుండుట యని తలంచవలయును. నాయెడల నీకుగల ప్రేమను చాటుటకు వేరొక మార్గము లేదు. భగవంతుడు నిన్నాశీర్వ దించుగాక!"

ఈ యుత్తరము ఆంగ్లేయ న్యాయాధిపతియెదుట స్టీఫెన్ మహాశయుడు పలికిన గంభీర వాక్యములను జ్ఞాపకము దెచ్చుచున్నవి. ఉద్రేకముచే వీరిద్దరును తమభావములను వెలి బుచ్చుటకు వీలులేక పోయెను. కాని లోకమున కంతటికిని

వారియాత్మల గంభీరత వ్యక్తమగుచునే యున్నది. ఈ వాక్యములయందు తనమరణమునకు చింతగాని తనభార్యాపుత్రాదుల వీడిపోవుచున్నానను దుఃఖము గాని యేమాత్రమును గానరాదు. ఇట్లనుట వలన భార్యాభర్తల కనురాగము లేదని కాదు. వారి వియోగమునకు దుఃఖము లేదనిగాదు. వారికున్న గాఢానురాగము, మనజాతీయనాయకులలో మరెవ్వరికిని గానుపించుటలేదు. అత డిట్లువ్రాసెను: "నీకొరకును పిల్లలకొరకును నేనెంత పరితపించుచున్నానో మాటలలో వర్ణించుటకు వీలులేదు. కనుక నేనట్లు చేయుటకు ప్రయత్నించను. నీ వన్యథా తలంచవద్దు." టోనుగారు పిల్లలను తనభార్య చేతి కొప్పగించినప్పుడు ఆమె యాకార్యము నెట్లు నిర్వర్తించు నది యాతనికి తెలియకపోలేదు. ఆమె యీవిధి నెట్లు నెరవేర్చినది చరిత్రయే చాటుచున్నది. టోనుగారి కుమారుడు పెద్దవాడై తమతల్లి తమ చేసిన కృషిని యీక్రింది వాక్యములలో వర్ణించి యున్నాడు: "నా తండ్రిల సిద్ధాంతములను, వారి పవిత్రభావములను, నా తల్లి నాకు ఉగ్గుపాలతో నూరి పోసినది." ఈ వాక్యము చాలును. ఆమె తన విధి నెట్లు నిర్వర్తించెనో తెలియజేయుటకు వేరుగా వర్ణన లవసరము లేదు. ఆమె జీవితచరిత్ర మనము గమనించిన యెడల, పిల్లలయం దామెగనుపరచిన ప్రేమాతిశయమును, తమ స్వాతంత్ర్యమును కాపాడుకొనుట కామె చేసిన కృషియు, మనకు వ్యక్తము కాగలవు. ఐరిషు ప్రజాస్వామికమునకు సర్వసేనాధిపతియై స్వాతంత్ర్య సంపాదనార్థము తన ప్రాణముల నర్పించిన మాహో

శయుని భార్యను గదాయని గుర్తెరింగి, యుద్యోగీయులవంచనలకు లోబడక, వారి పోషకత్వమును నిరాకరించి స్వతంత్రురాలై యుండెను. ఈ సాధ్వివిషయమై ఫ్రెంచిశాసనసభలో లూషియన్ బోనపార్టి యనునతడు గంభీరముగా నిట్లు చెప్పెను: "టోను మహాశయుని దేశసేవ మీకానందమును, ఉత్సాహమును గొల్పుటకు చాలియుండనియెడల, నీతని భార్యారత్నముయొక్క నిశ్చలత్వము, స్వాతంత్ర్యానురక్తి మిమ్ముత్సాహసముద్రమున దేల్చును. ఆమెయును దినమును తన ప్రియునియొక్కయు, తమ్మునియొక్కయు, యాత్మల శాంతికొరకై ప్రార్థనల సల్పుచు, దీనితోబాటు ఐర్లండు దేశ విముక్తికిని, శాంతి స్థాపనమునకును భగవంతునికి ప్రార్థనల సల్పుచున్నది. తమ బాంధవుల మరణమునకై వీరు దుఃఖసాగరమున మునింగియున్నను, తమ దేశముయొక్క నీచదశతొలగుటకు వారు భక్తిపూర్వకముగా ప్రార్థనల సల్పుచున్నను నీవీరవనితలు చూపెడి ధైర్యసాహసము లసమానములై యున్నవి. ఈ ఐరిషుయువతుల ధైర్యము స్పార్టాపట్టణముయొక్క స్త్రీలధైర్యమువంటిది. స్పార్టాయందు స్త్రీలు కష్టకాలమునం దసమానమగు ధైర్యమును చూపియుండిరి. యుద్ధరంగమునుండి తమవారు రాగానే వారందరును తమతమవారిని దర్శించుటకు సేనాముఖమునకుబోయి, యందు తమ భర్తలను, సోదరులను, కుమారులను గానక "తన దేశమునకై యితడు ప్రాణముల నర్పించెను. తన ప్రజాస్వామికమునకై యితడు తన జీవితమును ధారబోసెను" అని పలుకుచు సంత

సించుచుండిరి. ఇప్పుడు ఐర్లండు దేశమున కష్టముల ననుభవించుచున్న స్త్రీలును నిట్టి గుణములుగలవారే. ఐరిషు స్వాతంత్ర్యము సంపాదించుటయందు విఫలమనోరథులై ఐరిషు సేనలన్నియు చెల్లాచెదరై పోయిన సమయమున టోను సతి నెపోలియన్ చక్రవర్తియొద్దకు స్వయముగా నేగి తన భర్తచేసిన సేవ నుగ్గడించి, తనకును తనకుమారునికిని, ఫ్రెంచి దేశపు హక్కుల నొసంగుమనియు, ఫ్రెంచి సేనలో తన కుమారున కొక యుద్యోగమీయవలయుననియు ప్రార్థించెను. నెపోలియన్ చక్రవర్తి యీ ప్రార్థనల సావధానముగా నాలకించి ఆమెను గౌరవించి, ఆమె కోర్కెల నెరవేర్చి పంపెను. ఈవిషయము చక్రవర్తిపరిజనులకు మిక్కిలి యాశ్చర్యము గొలిపెను. తనకుమారునికై యీమె యిన్నికష్టములు పడవలసివచ్చెను. పాపము! ఇద్దరు పిల్లలామెకండ్లయెదుట మరణించిరి. ఇతడే మిగిలియుండెను. ఆమె యాతనివిషయమై మిక్కిలి శ్రద్ధవహించెను. తనభర్తకోరికల విశ్వాసముతో నెరవేర్చెను. భర్తను సాగనంపినట్లు కుమారునిగూడ తనధర్మమును నిర్వర్తించుటకు సాగనంపెను. ఆమె వ్రాసినస్వీయచరిత్రను పూర్తిగా చదివినగాని యామెగొప్పతనము మనకు వెల్లడికాదు. ఒకానొక ఫ్రెంచిమంత్రి యామెయెడల కాఠిన్యమువహించి, ఆమెను దూలనాడినపుడు ఆమె స్వయముగా చక్రవర్తియొద్ద కేగి నిర్భయముగా తన కోరికల మనవిచేసుకొని యాతని గౌరవమునకుపాత్రురాలగుచుండెను. ఒకానొకడు ఆమె ద్రవ్యాపేక్షచే నీకార్యములను చేయుచున్నదను నీచపుపలుకులు పల్కి

నప్పుడు తానెన్నికష్టములు పడవలసివచ్చినను యాచకవృత్తి నవలంబింపలేదని బనులుచెప్పెను. ఆమెకు మాధుర్యము, గాంభీర్యము, సహజమైయుండెను. వీనినెన్నడును ఆమె వీడి యుండలేదు. తనధర్మమును నిర్వర్తించుట కామె శ్రద్ధవహించెను. తనకుమారుని జీవయాత్రను గడుపుటకు పంపునాడును మిక్కిలి ధైర్యము వహించియుండెను. ఇదివరకెన్నడును వారెడబాటునెఱుగరు. ఆమె యతనివిధిని నెరవేర్చుమని మృదువాక్యముల బల్కుచు గజగజవణకుచు సాగనంపెను. ఆమె స్వీయచరిత్రమునం దిట్లువ్రాసియున్నది:—

"ఇంతకుముందు నావిలియమ్ నాపుత్రుడని నేనెన్నడును తలచి యుండలేదు. టోనుగారి పుత్రుడు నాకొసంగబడినట్లును, అతనికి నేను సంరక్షణకర్తగా నున్నట్లును నేను తలంచు చుంటిని. కాని నాపుత్రుని వీడ్కొల్పు సమయమున, సహజమగు మాతృప్రేమ దానిస్థానము నలంకరించెను. నేనొక షాలములో గూర్చుంటిని. నాయెదుట రాచబాట స్పష్టముగా కనుపించు చుండెను. నాకండ్లకు నాముద్దుల పట్టియగు విలియమ్‌తప్ప మరెవ్వరును కనుపడలేదు......నామనస్సు పర్యాలోచనకును జొరదయ్యెను. నేనుపడిన కష్టములు, పొందిన బాధలు నాకెట్టెదుట నగపడి, నన్నావరించి వీడకుండునట్లుగపడెను. నాకండ్లు మూసికొని పోవుటకు నేనుకోరితిగాని యట్లు జరుగకుండుట నాకాశ్చర్యము గొల్పినది. మానసిక ప్రవృత్తులు మిక్కిలి యాశ్చర్యకరములు. ఈవిధముగా నేను చాలసే పాకబొమ్మవలె కూర్చుని యుంటిని. ఇంటికి పోవుట

కావశ్యకత నాకు గోచరించలేదు. ఇట్లు కొంతసేపు గడచెను. నాస్థితి యింకను మారలేదు. ఆసమయమున దగ్గరనున్న పొద లోనుండి యొకభరతపక్షి నాపంకకు వచ్చెను. నాతలమీాద వలయాకారముగా తిరుగుచు మృదువుగాను, శ్రావ్యము గాను, ఉత్సాహకరముగాను పాడజొచ్చెను. నా కట్టిబ్రహ్మా నంద మెన్నడును గల్గియుండలేదు. నేనుపడియున్న దుఃఖసాగ రమునుండి యీా భరతపక్షి తప్పించెను. నాకుత్సాహము గల్గించుటకై, నాప్రియుఁడీపక్షిని పంపినట్లు నేను తలచితిని. తత్క్షణమే యింటికి నడచితిని."

ఈవిషయములు మనహృదయమును కరగించక మానవు. తన ప్రియపుత్రుని బాసి యేకాకియై, ఒకవీరవనిత పచ్చికమీాద కూర్చుండుటయు, భరద్వాజము ఆమెనెత్తిపై తిరిగి తిరిగి, తన శ్రావ్యకంఠముచే యామె నుత్సాహభరితు రాలుగా జేయుటయు, ఆమె తన భర్తయే దీనిని పంపినట్లుగా దలచుటయు మనకు హృద్యముగా నున్నవి. మనకీవర్ణనల వలన గలిగిన యుద్రేకము హీనమైనది కాదు. ఇది మిక్కిలి యున్నతమైనది. ఈయుద్రేకము మనకు మనదేశము నెడ లను దానియందు నివసించు ప్రజలయెడలను ప్రేమ, గౌర వము గలిగించునదై యున్నది. మనల కార్యశూరులుగా జేయుట కీయుద్రేకము మిక్కిలి యావసరము. ఈకథ విను చున్నప్పుడు మనకు దుఃఖము రాదు. మనదేశముకొరకై పాటు పడుటకు మనయంతరాత్మలు పరితపించు చుండును. ఇట్టి వీరవనితల విషయమై ఐరిషు ప్రజలకేమియును దెలియదు

కదా! టోనుమహాశయునివిషయమై కొన్నిసంగతులు మనకు దెలియును. అతనియోగ్యత, నిష్కాపట్యము, ధైర్యము, ఓర్పు, దూరదృష్టి, వివేకము, మన మెఱిగినదే. అతడు పురుషులలో శ్రేష్ఠుడు. సుగుణసంపత్తియందును, ధైర్యమునందును గాంభీర్యమునందును, అతని కీడువచ్చునది యాతని భార్యామణి యొక్కతెయే. అతడు పురుషులలో శ్రేష్ఠుడు; ఆమె స్త్రీలలో శ్రేష్ఠురాలు. ఇట్టి యనుకూలదాంపత్యము కుదురుట మన భాగ్యమనియే చెప్పవలయును.

ఇట్టి వీరవనితల చరిత్రములను స్త్రీలుమాత్రమేగాక పురుషులును స్మరించుచుండవలయును. ఈసాధ్వీచరిత్ర మన కొక గుణపాఠము నేర్పుచున్నది. దేశభక్తి మానవులకు సహజములగు గుణముల నాశము చేయదు. సద్గుణము లన్నిటిని వృద్ధిపరచును. యోధులకు ప్రేమ, దయ, శాంతము, మొదలగు సద్గుణము లుండకూడదని మనలో ననేకులు తలచుట వింతగా నున్నది. ఈగుణములు అతని ధైర్యమును పాడుచేసి, ఆత్మవిశ్వాసమును చంపునని వారు తలతురు. కాని యిది పొరపాటు. మనము మానవులము. కావున మనయుద్యమము మానవస్వభావమునకు వ్యతిరేక మయ్యె నేని అపజయము గలుగుననుట నిశ్చయము. ఐర్లండు దేశమునకై పాటుపడువారు వివాహ మాడకూడదని మనలో ననేకులు తలచుచున్నారు. ఇది యెంతహాస్యాస్పదమో మనము గ్రహించగలము. ఐర్లండుకొరకై ఊపిరిపీల్చుట మానివేయుమనిన నెంతచక్కగా నుండునో నిదియు యింత చక్కగానే

యుండును. భార్యాభర్తలు కలిసి యొకగొప్ప ధర్మమును నిర్వర్తింప వలసియున్నది. దీనికిబదు లొక యస్వాభావికపు జీవితము నెరవుట హేయము. ఇట్లు చేయుటవలన మనకు గృహస్థాశ్రమములోనున్న సౌఖ్యముగాని సన్యాసాశ్రమము లోనున్న బ్రహ్మానందముగాని లభించదు. ఇహమునకును పరమునకును దూరులమగుదుము. ఇంతిదనుక మనము వర్ణించుచుండినమహాశయులచరిత్రలు మనకాదర్శప్రాయములుగా నుండగలవు. పురుషులు స్త్రీలను భృత్యులుగాను, భీరువులుగాను తయారు చేయక వారికి కష్టములకోర్చెడిశక్తి గలుగ జేయవలయును. మనయాడువారును మిక్కిలి ధైర్యముతో ప్రవర్తించి పురుషులకు కీర్తిదేవలయును. మనదేశమందు కొంతమంది తామెన్నికష్టములనైనను సహించెదరు. కాని తమ కాపులగువారికి కష్టములు సంభవించెనేని వారుచూచి సహించ జాలరు. ఈయవ్యక్తమగు కాంక్షయే మనలను పాతాళమునకు లాగుకొనిపోవుచున్నది. మన భార్యాపుత్రాదులను సుఖమున కలవాటు జేసితిమేని వారు మనకు సహాయము చేయుటకుబదులు మనకు గుదిబండ లయ్యెదరు. మనము చేసెడి ప్రతికార్యమునందును వారు మన కడ్డువచ్చెదరు. పిల్లలు పెద్దవారై తమధర్మమును నెరవేర్చలేని యధమాధము లయ్యెదరు. ఎవరును తనభార్యకును, పిల్లలకును కష్టములు సంప్రాప్తమగునని భీతి వహించకూడదు. తనవారికి కష్టముల నతిధైర్యముతో నెదుర్కొను శక్తి గలుగజేసిన యెడల వారియంతట వారే యీపరీక్షయం దుత్తీర్ణులై సత్య

మార్గమును గ్రహించెదరు. భార్యాభర్తల కిరువురకును అసమానమగు జయము గలుగును. వారికి సంభవించు విపత్తులు వారియాత్మల కిదివర కెన్నడును గలిగియుండని సామీప్యమును గలిగించును. వారికి దయ, మృదుత్వము, గాంభీర్యము ధైర్యము గలుగజేయును. వారు జీవితముయొక్క సౌఖ్యమును పొందగలుగుదురు. వారిమనములు వికసించును. వారికి బ్రహ్మానందమును దేశమునకు బానిసత్వమునుండి విమోచనమును గలుగును.

# తొమ్మిదవ ప్రకరణము

## పొలిమేర

మనకు రెండు పొలిమేరలుగలవు. భాష, సముద్రము. మనదేశముచుట్టును అనేకవందలమైళ్ళపర్యంత మాక్రమించుకొనియున్న సముద్రమునుగురించి యేమియు చెప్పనవసరము లేదు. భగవంతుడు మనల నిట్టి గంభీరజలరాశినడుమ బెట్టినందుల కతనికి వందనశతంబు లర్పించ వలసి యున్నది. ఇందువలన మనప్రత్యేకజాతీయత నష్టముగాక నిలిచియున్నది. ఈయపారమగు జలధి మన యనంతమగు జాతివైభవము ననవరతము ఘోషించుచున్నది. కాని భాషనుగురించి కొంత చెప్పవలసియున్నది. ప్రస్తుతసమయమున మనము ఖండించవల

సిన యభిప్రాయములుకొన్ని ప్రబలుచున్నవి. ఐరిషుజాతీయ వైభవమును, ఘనతను చాటి మన దేశములో నన్నిపక్షముల వారికిని గాఢమగు దేశభక్తిని కలుగజేసెడి చక్కని భాషను "ఐరిషుభాష" యని పిలువగూడదని కొందరు చెప్పెదరు. వీరు గేలిక్ భాషకు (ఈ భాష ఐరిషువారి భాష. ఇది సంస్కృతమున కతిసమీపమగు భాష) ప్రధానస్థానము నొసంగరు. రెండవస్థానము మాత్రమే యీయదగునని వచించెదరు. మనదురదృష్టవశమున యీచక్కని వాఙ్మయము ఆంగ్లములోనుండుట తటస్థించినది. అనేకమంది ఐరిషువారు వారి వాక్కులను, ధర్మములను గమనించక దూరము దూరముగా తొలగిపోవుచున్నారు. ఇట్లు చేయుట తగదు. దేశప్రజలందరును 'ఐరిషువారు' అనుపదములోనున్న చక్కని భావములను గమనించవలయును. ఈపదము మన దేశప్రజలందరియందును మాతృభూమియెడల గాఢానురాగము గలుగజేయును. మరియు విప్లవసమయములయందు మనదేశము నితరదేశములవలె నాశముచేయకుండ కాపాడి ధర్మమైనట్టియు, సత్యమైనట్టియు సధకారముయెడల గౌరవము గలిగించును.

ప్రథమమున ఆంగ్లభాషలోనున్న ఐరిషుసారస్వతమును గురించి విచారించితిమి. సారస్వతముయొక్క యుపయోగములనుగురించి ప్రస్తుతమున్న యభిప్రాయములనుబట్టిచూడ తమభావములను లిఖితరూపమున ప్రచురపరచుటయొక్క ప్రాముఖ్యము గమనింపబడలేదని మనకు స్పష్టముకాకమానదు. చెప్పబడునంశములు అవి యేయభిప్రాయముతో చెప్పబడు

చున్నవో వాటికి ప్రాముఖ్యత నొసంగుచున్నారుగాని అవి యేభాషలో చెప్పబడుచున్నవో గమనించుటలేదు. కాని చిర కాలమునుండియు మన మలక్ష్యము చేయుచుండిన విషయము లీసమయమున ప్రాముఖ్యత వహించినవి. కొన్ని సమయముల యందు యీ విషయమునుగురించి యుద్రేకముగలిగినప్పుడీ భావముయొక్క తత్వము మరచుచుందుము. మానవుల భావ ములు, సంకల్పములు గంభీరములై మానవకోటికి లాభ కరము లగునప్పుడు వాటిని భాషారూపమున వ్రాయుట యావ సరము. ఒకభాషకన్న వింకొకభాషలో నీభావములను తెలియ జేసినయెడల జనుల కెక్కుడు స్పష్టముగా బోధపడునప్పుడు గాని అవి జనులహృదయములయందు గాఢముగా నాటు కొని వారి కుత్సాహము, ఉద్రేకమును గలిగించునప్పుడు గాని భాష ప్రాముఖ్యము వహించవలయును. స్వభాషలో నొక విషయము చెప్పినయెడల యీ నుడువుల సంపూర్ణభావమును, సత్యమును ప్రజలకు బోధపడినట్లు పరభాషలో తెలియజేసిన యెడల నర్థముకాజాలవు. కాని మనదేశములో ననేకు లీ క్రమమును గమనింపజాలకున్నారు. కావున సంశయాత్ములగు వారు 'ఐరిష్షుభాష' నేల యొప్పుకొనవలెనో వినగోరెదను. వారిట్లు చేయుట గెయిలిక్ వారియెడల గౌరవము చూపుటకు మాత్రమే గాదు. మన కందరకును పూజనీయమగు మాతృ భూమిని రక్షించుకొనుటకును దేశమునం దభ్యుదయ మతి శీఘ్రముగా గలుగజేయుటకును నిది మిక్కిలి యావసరమై యున్నది. భాషనుగురించి మాట్లాడుచు డేవిస్ మహాశయు

డిట్లు చెప్పియున్నాడు. 'భాషయనునది దుర్గముల కన్నను, నదులకన్నను మెక్కుడు విశాలమగు హద్దుగా పరిగణింపబడవలయును.' నిజముగా భాషయే మన దేశజులందరకును నాశ్రియము. అదియే మన ప్రజలందరు శరణుజొచ్చెడు స్థలము. భాషాసేవకులు కొంతమంది దానినభివృద్ధి పరచిరను నభిమానముచే నిట్లు పొగడుచుంటిరని యనుకొనకుడు. అది మనకందరకును అనుభవనీయమగు పిత్రార్జితము. ఐరిషుభాషయందు ప్రవేశముగలవారందరకును మన భాషాప్రభావము తెలిసియేయున్నది. ఐరిషుభాష మాట్లాడు జిల్లాలకు మనముపోయి యొకనితో నాంగ్లేయభాషలో మాట్లాడితిమేని యాతడు మనలను లక్ష్యముచేయక యేదియో ప్రత్యుత్తరము చెప్పి పంపును. అతనితో ఐరిషుభాషయందు మాటలాడితిమేని యాతని వైఖరి మారును. అతనిముఖము నూతనవికాసముతోడను ఉత్సాహముతోడను నిండియుండును. అతడు మనల ననురాగదృష్టితో జూచి యనేకమృదువచనములు పల్కును. అతని హృదయము విప్పి చెప్పును. అనేక యాశీర్వచనము లిచ్చును. మనల నతడు వీడ్కొల్పినతరువాతకూడ తలని కటాక్షవీక్షణములు మనవెంటనే యుండును. భాషయొక్క చిత్రమగు శక్తిని గ్రహింపుడు. యౌవనులకును ముసలివారికిని యుత్సాహముగొల్పి వారి సామర్థ్యమునందు విశ్వాసము గలుగజేయునది భాషయె. ఇందతిశయోక్తి యేమియులేదు దీనిని మనము గ్రహించముగనుక మనకిది విదితముగాదు. కాని దీనివిషయమై తెలిసికొనగోరువారికందరకును భాషా

పరిభావము సులభముగా తెలియగలదు. విశేషభాష మాట్లాడు జిల్లాలలో నొకచిత్రము గ్రహించదగును. మతబోధకులు, వైద్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, వర్తకులు, గుమాస్తాలు, అందరొకచోటగూడి ముచ్చటించుకొనట సాధారణమైయున్నది. వారందరును ఉత్సాహవంతులు. ఒకానొక సమయమున నొక మతబోధకుడు వర్తకునికి వేదాంతము బోధించును. ఇంకొకసమయమున వర్తకుడు మతబోధకునకు లౌకికవిషయములనుగురించి బోధించుచుండును. కొంత కాలమువరకును వారి తారతమ్యములను, హోదాలను మరచి సోదరులవలె మెలగుచున్నారు. వారొండొరులయెడ ప్రేమాతిశయమును గనబరచుచున్నారు. దీనివలన నొక విషయము వ్యక్తమగుచున్నది. దేశము నూతన జీవము తోడను, నూతనాశయములతోడను, నూతనోత్సాహము తోడను నిండియున్నది. ఇట్టి యుత్సాహసమయమందే నూతన సారస్వతము పుట్టుచున్నది. సత్కవిచంద్రు లుదయించి తమ జాతివైభవమును తమ కావ్యములయందు చిత్రించుచున్నారు. గాయకశిఖామణులు మృదుమధుర గీతములలో నీభావములను గానముచేయుచున్నారు. చిత్రకారులు కళాకౌశలము మెరయ నీనూతనశక్తిని చిత్రించుచున్నారు. భాషయొక్క యావశ్యకత యిదియే. ఇది జనులలో సద్భావము పెంపొందించుననుటలో సందియ మేమియులేదు. భిన్నభాషలు మాట్లాడెడు వారికిట్టి సఖ్యత గుదురుట యసంభవము. డేవిస్ మహాశయుడు సూచించిన యభిప్రాయములు సత్యములే. కాని

భాషయొక్క ప్రభావ మతడు సూచించినదానికంటె యెక్కుడని తెలుప సాహసించుచున్నాను. భాషాప్రభావము మనము సరిగ తెలిసికొనియుండలేదు. ఐరిషుభాష ఐరిషువారిబుద్ధిని వికసింపజేసి యితరజాతులకు లోబడకుండ జేయును. ఇతర భాషలలోనున్న మంచిని గ్రహించి తమ భాషలోనున్న గొప్ప విషయములను లోకమునకు చాటగలశక్తియు దానికి గలదు. ఐరిషువారి సంస్కారము, ప్రతిభయు, ఐరిషుభాషలో వ్యక్తమయినట్లు అన్యభాషలో వ్యక్తము కాజాలవు. కాని కొంతమంది మహాశయులు ప్రతికూలావకాశముల కతీతులై యాంగ్లేయభాషయందసమాన పాండిత్యమును సంపాదించి తమ భావముల నాంగ్లభాషలో విశదీకరించిరి. డేవిస్, మిచ్చెల్, మంగన్ మహాశయులు ఆంగ్లభాషయందనేక గ్రంథముల రచియించిరి. కాని జనసామాన్యమునకీ గ్రంథములర్థముకావు. ఇంతకాలమునుండియు వారంధకారమున మునింగియుండిరి. ఇప్పుడు ప్రజలందరి నుద్బోధించుటకు స్వభాషకై మరలితిమి. ఇట్లనుటచే డేవిస్, మిచ్చెల్ మరియనేకమంది మహాపురుషులు చేసిన కార్యమును నిరసించుచున్నానని తలంచకుడు. నిరుత్సాహము దేశము నావరించిన సమయమున శత్రువులభాషనునేర్చి వారితో యసమాన ప్రజ్ఞతో పోరి, వారి విజృంభణము నాపిన శూరశిఖామణుల వేనోళ్ల వినుతించవలసియున్నది.

ఈ కారణముచే ఐర్లండులో రెండుపక్షములయందు చేరి పోకున్న 'గాలులు' 'గెయిల్లు' యీ విషయమున

సమానబాధ్యతలు వహించియున్నారు. ఈ రెండు పక్షము లలో ననేకు లీ విషయమును గమనించకుండుట శోచనీయము. కనుక దీని నింత నొక్కి చెప్పవలసివచ్చినది. 'గెయిల్' సంతతికి జెందని కొంతమంది ఐరిషుభాషవారికి విదేశీయమనియు యిప్పటివలెనే యికముందును ఆంగ్లమును ప్రధాన భాషగా వాడెదమనియు వచించుచుందురు. వీరు తమస్వలాభమునకు గాకపోయినను ఐరిషుజాతికొరకైనను మనభాష నంగీకరించుట శ్రేయస్కరము. ఐరిషుదేశమునకు సేవ జేయవలయుననిన ఐర్లండుభాష నొప్పుకొనక తప్పదు. ఎవరికైనను ఆంగ్లేయనాగరికత ప్రశస్తమని తోచినయెడల వారు ఇంగ్లండున కేగవలయును. అచ్చటనే వారు ఆంగ్లేయసాంప్రదాయములప్రకారము వృద్ధినొందుట కవకాశములు గలవు. ఐర్లండులో నివసించు ఐరిషుప్రజలు ఆంగ్లేయహృదయమును గలిగియుండుట మిక్కిలి వింతగా కనుపడకమానదు. ఇట్టివారు ఐర్లండుకుగాని, ఇంగ్లండుకుగాని సరిగా సేవ జేయజాలరు. ఈ రెండు దేశములు వారిని పరిత్యజించును. కావున గెయిలిక్ సంతతికి జెందనివారందరుగూడ మనతో గలసి పనిచేయవలయును. వీరి భాషను మిక్కిలి అయిష్టముతో గాని తప్పనిసరియని తలంచిగాని యవలంబింపరాదు. వారు మనభూమియందు పుట్టి ఐరిషుపౌరులుగా పరిగణింప బడుచున్నారు. గనుక వారుత్సాహవంతులగు ఐరిషుయువకులతో జేరి యీ కార్యమును సాధింపవలయును. తమ మాతృభూమికి స్వేచ్ఛయు నున్నతస్థానమును గలుగ జేయవల

యును. మనదేశములో ననేక తెగలవా రున్నారు. గనుక వీ రందరికిని ఐకమత్యమును గూర్చుటకై యందరును ఒక భాష నవలంబించుట ముఖ్యము.

కాని మనదేశములో నన్నిపార్టీలవారిని "ఐరిషువారు" అనుపేరు నొప్పుకొనుమని మనమడిగినపుడు వారికి ప్రియమగుసిద్ధాంతములను వీడి అందరును ఒకసిద్ధాంతమును ఒప్పుకోనవలెనను భయము చాలమంది ప్రజలమనములయందుగలదు. క్యాథలికులు, ప్రొటెస్టెంట్లు, డిస్సెంటర్లు వారివారి ధర్మములను వీడి నాల్గవపథము యేదో యొకదాని నవలంబించవలయునేమోయని వారిభయము. నేనిట్లుచేయుమని చెప్పుటలేదు. మనమందరము యిట్టి భయమును పారదోలవలయును. ఉత్తములెవ్వరు నీ మార్గము నొప్పుకొనరు. వారిట్టి యభిప్రాయములను గలిగియుండుట సమంజసమే. కాని యీవివిధశక్తులవారికిని సమాధానము కుదురు టెట్లు? మత రాజకీయ విషయములయందు వారి యభిప్రాయము లేవియైనను వారందరును సత్పౌరులనియు తమ పౌరధర్మమును చక్కగా నెరవేర్పవలయుననియు గ్రహించినయెడల సమాధానము కుదిరినట్లె తలంచవలయును. కావున మనము వారిని ఐరిషు పౌరులుగా నుండుమని కోరినప్పుడు వారికి ప్రియమగు సిద్ధాంతములను వీడవలయునని కోరుటలేదు. వారు కార్యశూరులని మనకు నమ్మకము గలుగజేయవలయును. వారిధర్మము సత్పౌరులుగా నుండుటకు సహాయభూతముగా నుండునని వారు చెప్పిదరు. అట్లుచేయుటకు వారికి సావకాశముల నిత్తము. ఈ

యవకాశములను వారుపయోగించికొని మన కాదర్శప్రా
యులగుదురుగాక!

ఈ సందర్భములో మరియొక విషయ మాలోచించ
వలెను. తమ యభిప్రాయభేదములను కప్పిపుచ్చుటకై తా
త్కాలిక సంధివలన లాభములేదు. పైపూతలవలన లాభము
లేదు. మనము చేయుకార్యములన్నియు, న్యాయము మీదను,
సక్రమమగు నధికారముమీదను ఆధారపడి యుండున
ట్టివిగా నుండవలయును. ఇట్టి సత్యమార్గమును కనుగొనుటయే
మనముఖ్యధర్మముగా నెంచవలయును. ఇప్పటి ప్రభుత్వము
లన్నియు నధర్మము మీదను, దౌర్జన్యము మీదను నాధార
పడియున్నవి. తమ పరాక్రమముచే ప్రభుత్వమును వణకించి
వారికి న్యాయము చేయునట్లు నిర్బంధించువారికి మాత్రమే
యవి న్యాయము చేయుచున్నవి. ప్రస్తుత ప్రజాప్రభు
త్వములు గూడ నిట్లే తమ శక్తిని ప్రదర్శించగలవారికే న్యాయ
ము చేయుచున్నవి. ఇవి ప్రజారాజ్యములెట్లగును? ఇవి నిరంకుశ
ప్రభుత్వము లని పిలువబడవలయును. న్యాయమైనప్రభుత్వము
తమ శక్తిని ప్రదర్శించగలవారికి మాత్రమేగాక బలహీ
నుల కోర్కులనుగూడ కొనసాగించ వలయును. బలహీలనుసు
హింసించు ప్రభుత్వములు క్రూరప్రభుత్వములు. ప్రస్తుత ప్ర
జారాజ్యములయం దిట్టి విషబీజములు నాటుకొని వృద్ధియగు
చున్నవి. ఈ విషయములను మన దేశస్థులు గమనించుట మి
క్కిలి యవసరము గనుక నింతదనుక వ్రాయుచుంటిని. ఈ
రాజ్యములు పడుచున్నగోతిలో మనము పడకూడదు. మనము

స్థాపించెడి ధర్మరాజ్యమునందు బలవంతులకును, బలహీనులకును, అధికసంఖ్యాకులకును, అల్పసంఖ్యాకులకును, సమానముగా న్యాయముచేయవలయును. దినదినాభివృద్ధినొందు చున్న మనబాహుశక్తికితోడు సత్యమును, ధర్మమును, నీతియు మన కుండెనేని యది సానబెట్టిన రత్నమువలె ప్రకాశించును. ఇట్టి ధర్మరాజ్యము శాశ్వతముగా నుండును. దుర్మార్గము దీని నడుంచజాలదు. నిరంకుశ ప్రభుత్వములు దీని నాశను చేయజాలవు.

మనము ధర్మమార్గమున నడచుటకు ప్రస్తుతలోక పరిస్థితులను గమనింపవలయును. ఇతరరాజ్యములు చేయుచున్న పొరపాటులను మనము చేయకుండ జాగరూకత వహించియుండవలెను. లోకములో నెల్లెడల నశాంతిప్రబలియున్నది. ప్రతి దేశమునందును అనేకకక్షలు అనేక సంఘములేర్పడి నారొండొరులతో కలహించుకొను చున్నారు. బలాధికులు బలహీనరాజ్యములమీాదికి దండెత్తివచ్చునను భయము గలదు. రాజకీయ, సాంఘిక విప్లవములు జరుగునను భయము మరియొకవంక గలదు. ఈ విషయములన్నియు చూచి మనము గుణపాఠముల నేర్చుకొనకుండుట ప్రమాదకరము. ఈ విపత్తులనుండి పూర్తిగా తప్పించుకొనుటకు మనకు శక్తి చాలక పోయినను ముందు రాగలవిపత్తులనుండి తప్పించుట కిప్పటి నుండియు మనబల మభివృద్ధి చేసికొనవలయును. ప్రపంచపరిస్థితులను చక్కబెట్టుట మనవశముకాదు. కాని మనదేశము నుద్ధరించుకొనుటకు మనము పాటుబడగలము. మన దేశప్రజ

లందరును కలిసి దేశభక్తిపూరితులై యీకార్యమునకుగడంగిన నిది సులభసాధ్యమగును. మనల నాదర్శప్రాయులనియు ఛాందసులనియు పిలుచుట సామాన్యమయినది. కాని నిజ మాలోచించినయెడల మనము ఛాందసులము గాము. సేనాబలముచే యంతఃకలహములను మాన్పుటగాని, యితర దేశప్రజల జాతీయభావమునడంచుటగాని సాధ్యమగు నని తలంచుటకంటె మన యభిప్రాయములు వెఱ్ఱివిగావు. మొన్న జరిగిన సమ్మెలో ఇంగ్లండు యొక్క దుస్థితి నాలోచించుడు. కార్మికసమస్య పరిష్కారము చేయబడలేదు. తాత్కాలికము విరమింపబడినది. యీసమస్య మరల తలచూపి దేశమును కలవరపరచుచున్నది. ఇంగ్లండొక్కటియే కాదు. అన్ని దేశములును యిట్టి దుస్థితియందే యున్నవి. ఈ దేశములు తాము పరిష్కరించవలసిన సమస్యలను పరిష్కరించక యెప్పటికో యాపి యుంచుచున్నవి. ఇట్టి పద్ధతులు నిరుపయోగములని వేరుగా చెప్పనవసరములేదు. ఈ పరిస్థితులయందు మంచి తరుణ మెప్పుడు గలుగునో యెవరికిని తెలియదు. మన శత్రువులు సంసిద్ధులుగా నుండనితరుణమున మన కనుకూలపరిస్థితులు గలిగెనేని మన యాశయములు నెరవేరక మానవు. త్వరలోనే యిట్టి తరుణము రావచ్చును. ఎవరేమి తలచినను మన గాఢ ప్రయత్నముల నాపరాదు. మనము చేయు మహాప్రయత్నమున కొన్ని సమయములయందు పొరబడవచ్చును. మన దేశమునకు దివ్యమగు పదవిని సమకూర్చుటకు మనము చేయు ప్రయత్నములు సంపూర్ణముగా ఫలించక పోవచ్చును.

మన యాశయము లున్నతములును గంభీరములునునై యున్న గాని యవి కొంతమట్టుకైన ఫలవంతమగుటకు నావకాశము గలుగదు. ఆకసము మీఁది కెగుర ప్రయత్నించిననే గాని కొండమీఁదికి చేరజాలము. మన సిద్ధాంతములను సంపూర్ణముగా నాచరించుటకు మనకు శక్తి చాలకపోయినను ఆ సూత్రము లోనంగు నుత్సాహమువలన మనకు వివేకము గలుగు ననుటకు సందియము లేదు. ప్రస్తుత ప్రభుత్వములు వివేకశూన్యములుగను కనికరము లేనివిగను నుండుటవలన మన మిట్టి మహాప్రయత్నములు చేయవలసి వచ్చినది. స్వాతంత్ర్యము ఐరిషుమానసికశక్తుల వికసింపజేసి, ఐరిషుభాష నుద్ధరించి, ఐరిషువారిని తమ హస్తములమీఁద నాధారపడి యుండినట్లు చేయఁగలదని సంశయాత్మలకును శీఘ్రకాలములో విదితము కాఁగలదు. మన యుద్యమ మిందుకొఱకే కొనసాగింపబడుచున్నదని వారెఱుంగవలెను. మన యుద్యమతత్త్వమును గ్రహించక సమయాసమయములు లేక మనలను దూషించుట గౌరవహీనమైన పని. ఐర్లండు దేశమాత తనపుత్రులనందరని తమ కత్యంత గౌరవనీయమగు జాతీయపతాకమును సంరక్షించుకొనుమని కోరుచున్నది. తమస్వభాష నుద్ధరించుకొనుటకును తమ జాతీయజీవనము క్రమమార్గముల నభివృద్ధి పరచుకొనుటకును నుద్బోధించుచున్నది. జాతీయజీవనము పవిత్రముగానున్న గాని పౌరులధర్మనిర్వహణమునకు నావకాశము లుండవు. వారి హక్కులు ప్రసాదింపబడవు. ఇతర రాజ్యములవలెగాక ఐర్లండునందు ప్రభుత్వము ధర్మము

మీదను, న్యాయము మీదను నాధారపడియుండవలయును. బలవంతులకును, బలహీనులకును న్యాయము సమముగా ప్రసాదింపబడవలయును. పశుధర్మము పరిత్యజింపబడవలయును. అప్పుడుగాని లోకమున కాదర్శప్రాయులమై పూర్వపు ఔన్నత్యము బడయజాలము.

# పదియవ ప్రకరణము

## సారస్వతము-స్వాతంత్ర్యము.

(ప్రచారసంబంధనాటకకర్త.)

వాఙ్మయము జాతీయహృదయమును ప్రతిఫలించును. జాతీయసంస్కారము సారస్వతమునందుతప్ప మరి యే చిత్రకళయందును సరిగా వర్ణింపబడజాలదు. స్వాతంత్ర్యము గడించవలసినవారు తమపోరాటము నతిదీక్షతోడను ఉత్సాహముతోడను కొనసాగించుచున్నది. ఉత్సాహము మధ్యమముగానున్నది. లేక యీవిషయమునందు శ్రద్ధ నేమియు వహించకున్నది. ఆజాతి సారస్వతమువలననే తెలియనగును. ఎట్టి సందర్భములయం దైనను ఉద్రేకపూరితులగు విజ్ఞానులు తమ సరసమైనట్టియు, గంభీరమైనట్టియు, వాగ్వైభవముచే ప్రజలలో నుద్రేకము గలిగించి వారిని స్వాతంత్ర్యప్రియులుగా చేయగలుగుదురు. ఈ కారణముచే వాఙ్మయము మన యుద్య

మమునందు మిక్కిలి సహకారి. వాఙ్మయము, స్వాతంత్ర్య దేవాలయము, దుర్గము, పతాకము శాసనమనందగును. ఈ దేవాలయమునందు దేశభక్తులు దేవారాధనలు సలుపుచుందురు. ఈ దుర్భేద్యమగు దుర్గమునుండి స్వాతంత్ర్య యోధులు వెడలి శత్రువుల నుగుమాడి జయభేరి మ్రోగించెదరు. ఈ పతాకము చుట్టును స్వాతంత్ర్యప్రియులు కూడి తమ ప్రాణములతో దేశగౌరవమును నిలిపెదరు. ఈ శాసనమునందు సువర్ణాక్షరములతో గంభీరముగా దేశీయుల హక్కులు చిత్రింపబడియున్నవి. వాఙ్మయమునకుగల మహాప్రభావము మరి దేనికిని లేదు. అందరును దానిశక్తి నొప్పుకొనియే యున్నారు. కాని ప్రస్తుత సమయమున దాని సదుపయోగములను గురించియు, ఉద్దేశ్యములను గురించియు తీక్ష్ణముగా వాదవివాదములు జరుగుచున్నవి. ఈ ప్రకరణమునందు వివాదపడుచున్న యిద్దరిని గురించిమాత్రము ముచ్చటించదలచియున్నాను. ప్రచారార్థము నాటకములు వ్రాయువారు (కళకొరకు కళ) చిత్రికారుడు. వీరి ప్రచారమును గురించి తెలిసికొనుట మన యుద్యమమునకు మిక్కిలి యవసరమై యున్నది. వీరిద్దరును తప్పుత్రోవల ద్రొక్కుట విచిత్రముగా నగుపడవచ్చును. వీరిద్దరును జీవితము నున్నదియున్నట్లు వర్ణింపజాలరు. నాటకకర్త యొకపక్షము వహించును. మరియొకడు దేనిపక్షమును వహింపను భయపడును. ఒకనికి యూహా తక్కువ, రెండవవానికి హృదయము శూన్యము. సత్యనిష్ఠ, వారి నేదో యొకమార్గము నవలంబింప ప్రోత్సహించునుగాని వారి తగవులలో నారిమార

ములనతిక్రమించి కేవలము విరుద్ధమార్గముల ద్రొక్కుచున్నారు. ఇట్లు విరుద్ధమార్గములను ద్రొక్కుటవలన వారి తప్పులు వారికి తెలియవు. కావున వీరిని గురించి కొంత తెలుపవలసియున్నది. మొదట నాటకకర్తనుగురించి కొంత చెప్పెదను. అతని గ్రంథములయందు మోసము స్పష్టముగా కనబడుచున్నది. ఏకారణముచేతనో యతడు ప్రతిపక్షులకు న్యాయముచేయ వెరచుచున్నాడు. మనకు మార్గదర్శకులుగా నున్న ఉత్తమోత్తములను అత డాక్షేపించుచున్నాడు. ఈమహాశయుల నతడందవికారముగా చిత్రించుచున్నాడు. వారి వ్రాతలనేకులను తప్పుత్రోవల నడిపించుచున్నవి. ఈ గ్రంథములను చదువు వా రనేకులు సత్యమార్గమును గ్రహించలేకున్నారు.

ఒక గ్రంథముయొక్క ప్రాశస్త్యము నిర్ణయించుటకొక ప్రమాణముగలదు. నాశరహితమును, సత్యమును నగు పదార్థమునుగురించి తెలియజేయునది సద్గ్రంథము. ప్రస్తుత సమయమున మాత్ర మాచరణయోగ్యమైన యంశములను గురించియు సత్యములో కొంతభాగముమాత్రమే ప్రతిబింబించు గ్రంథ మిట్టిదిగాదు. సత్యమును మాటుపరచి అసత్యమగుదానిని సత్యముగా వ్యాఖ్యానముచేసిన యెడల గ్రంథకర్త యుద్దేశ్యము లెట్టివైనను అతనిగ్రంథము దుష్టగ్రంథమనియే చెప్పవలసియున్నది. గ్రంథకర్తకును అతని గ్రంథమునకును నేను సూచించుచున్న విభేదమును పాఠకులు గ్రహింతురుగాక. ఒకానొక గ్రంథము చెడ్డదని చెప్పినప్పుడు సాధారణ

విమర్శకుడు గ్రంథకర్తను దూషించుచున్నాడని యనుకొనవచ్చును. కాని నాయుద్దేశ్య మిట్టిదిగాదు. ప్రస్తుతసమయమున సదుద్దేశ్యములుగలవారే యీనాటకములను రచయించుచున్నారని నేనెరుగుదును. కాని యీనాటకములో సత్యదూరమగు విషయము లనేకములు వర్ణింపబడుచున్నవి. ఈవర్ణనలే ప్రజలమనస్సులను పాడుచేయుచున్నవి. ఇటువంటి నాటకములనేకములు గలవు. వెస్టుబ్రిటనులను పరిహాసము చేయదలచుకొనినప్పుడు మనవారిట్టి గ్రంథములను వ్రాయుచున్నారు. ఈ కుకవులు తోలుబొమ్మలనుబోలు కొంతమందిని రంగము మీదికెక్కించి వారిచేగంభీరోపన్యాసముల నిప్పించుచున్నారు. ఇట్టి యసందర్భ ప్రలాపములెవ్వరికిని రుచింపవు. ఇటువంటి నాటకములవలన లాభ మేమాత్రమును లేదు. మితిలేని నష్టము కలుగుచున్నది. వీరు మనుష్యస్వభావమున్నదియున్నట్లు వర్ణించుటలేదు. వీరి గ్రంథములవలన మనజ్ఞానము కొంచెమైనను వృద్ధియగుటలేదు. పదరుపోతులకివి యానందకరముగానుండవచ్చును. కార్యశూరులు వీటినిచూచిన యసహ్యపడెదరు. మన జాతికి జరుగునష్టమునకంతటికి నిదియే మూలము. మనలో ననేకులొక సిద్ధాంతమునొప్పుకొని దానికొరకై కష్టములు పడవలసివచ్చినప్పుడుగాని, జాతీయగౌరవమును నిలువబెట్టవలసివచ్చినప్పుడుగాని ప్రతిపక్షులనుదూషించి తమవిధ్యుక్తమును నెరవేర్చుచున్నారు. ఇట్టి దురవస్థయందు సరియైన జాతీయప్రబోధ ముండజాలదు. మన మొకనాటకమును రచియించినయెడల నది జనులహృదయముల నాకర్షించ వల

యును. వారికి సత్యము యెడల నభిమానముగలిగించవలెను. వారికి జీవితమునందు ఆనందమును, ఉత్సాహమును గలిగించవలయును. కాని ప్రస్తుతసమయమున ప్రకటింపబడు చున్న నాటకము లీధర్మములలో నొక్కటియైన నిర్వర్తించు టలేదు. నాటకములలోని పాత్రలు తోలుబొమ్మలవలె హాస్యాస్పదముగా నుందురు. వారికి సంతోషముగాని ఉత్సాహముగాని లేదు. ఇట్టివర్ణనలవలన సంశయాత్ములు తమ యభిప్రాయములతో నేకీభవింతురని యీగ్రంథకర్తల యుద్దేశ్యము కాబోలు! కాని వివేకవంతులెవ్వరును యిట్టి యసంబద్ధపుకూతలకు లోబడరని నిశ్చయముగా నెరుంగవల యును.

రాజకీయోద్దేశ్యములకొరకు రచియించబడుచున్న నాటకము లింతకన్న యనర్థదాయకములుగా నున్నవి! స్వాతంత్ర్యమునందిష్టముగల ప్రతివాడును యిట్టి నాటక ప్రచారమును నిరసించుట తమ విధిగా నెంచవలయును. ఈ నాటకకర్తలు అసమాన ప్రజ్ఞావంతులగు స్వాతంత్ర్యయోధు లను, జాతీయనాయకులను అసహజముగాను నసహ్యాకరము గాను చిత్రించుచున్నారు. మన వీరులు, మనుష్యులు, నాటక ములలోనివారు కీలుబొమ్మలు. డేవిస్ (Davis), టోను (Tone), మిచ్చల్ (Mitchell) సహజమగు సంతోషము, కరుణ, హాస్యము కలిగియున్నారు. డేవిస్‌మహాశయునితో నతని యనుచరుడొకడు "మీరు ప్రేమించుట యన నేమో యెరుం గుదురా?" యని ప్రశ్నించెను. ప్రేయు నన్నెన్నడును వీడి

యుండలేదు. అని యతడు బదులుచెప్పెను. టోను మహాశయుడు సద్గుణములకు నిధి. అతని మనము ప్రేమించు టెందులకు? అతడు స్నేహపాత్రుడు. అతనివద్దనున్న యెడల మనకాలమానందముతో గడుపగలము. మిచ్చెల్ మహాశయుడొకసారి యొక తుపానులో బోవుచు ఆనందము తన హృదయారవిందమున తాండవింప చూపర కుత్సాహమును, ఉద్రేకమును నినుమడింప నొక మహాకవిచే రచియింపబడిన గీతము గానము చేసెను. అత డెల్లప్పుడును ఆనందస్వరూపుడై యుండెను. ఇందుకొరకే వారిని మనము ప్రేమించెదము. వారిని మన మనుసరించ ప్రయత్నించుచున్నాము. మన విశ్రాంతి సమయములయందు మనకానందము గొల్పువారియెడల మనకున్న గౌరవము ప్రజలకు రుచించని ధర్మోపన్యాసము లిచ్చువారియెడల నుండదు. మన దేశోద్ధారకులందరును నిట్టి సుగుణసంపత్తిగలవారే. వారి కుత్సాహము, ఆనందము, ఊహ, వివేకము, శృంగారము మెండు. తమతోడి మానవులను సహజన్ములవలె వారు ప్రేమించెదరు. ఇహలోక సౌఖ్యమునకు కారణభూతములగు వస్తుజాలమును వారు నిరసించరు. ఈ వీరులతో మనకు పరిచయముండెనేని వారు సాయంసమయములందు దినకరుడు పశ్చిమసముద్రమున గ్రుంకు సమయమున పర్వతాగ్రముల మీదికెక్కుచున్నట్లును ఆకాశమునంటుచున్న శిఖరములపైనుండి గంభీరస్వరమున తమ మాతృదేశమును కీర్తించుచున్నట్లును సూర్యరశ్మియందు జలాశయములయందు విహారము సలుపుచున్నట్లును ఆనందదాయ

కమును ప్రశాంతమును నగు యరుణోదయసమయమున పచ్చికబయళ్ళపై ప్రియసఖులనుగూడి విహారము సలుపుచున్నట్లును మన మూహించగలము. ఇట్టి యానందదాయకములగు సమయములయందే వారు తమ దేశమున కొనర్పవలసిన విధ్యుక్తమును నిర్ణయించుకొనుచున్నారు. తమ సిద్ధాంతములను దృఢపరుచుకొనుచున్నారు; స్వర్గమునకు సోపానములు కట్టుచున్నారు. కాని ప్రస్తుతసమయమున రచియించబడుచున్న నాటకములలో నీవీరులను గురించియు, వారి సుగుణములను గురించియు నేమియు వర్ణింపబడుటలేదు. మనము నాయకుల హృదయములను శోధించవలెనని కోరుచుందుము. కాని యీనాటకకర్తలు మనలను తృప్తిగొలుపజాలరు. మన కీనాటకములలో నేదోరసము కొరవడినట్లు తోచును. ఏది కొరవడినదో నిర్ధారణగా మనము చెప్పజాలము. కాని యీ విషయములన్నియు ననవసరమని తలచి దూరముగా తొలగియుందుము. నాటకకర్తయు నతడు చిత్రించిన పాత్రయు మనకు హేయముగా నగుపడును. మన నాటకకర్తలీవిషయములను గ్రహించవలయును. మన పాత్రలు మనుష్యులై యుండవలెను. మనము గంభీర విషయములను గురించి చెప్పదలచుకొనినారముగాన మన ముల్లాసమును వహించియుండవలెను. ఉల్లాసములేనిది మానసిక సమత్వముండజాలదు. మానవులు తమ ధర్మమును చక్కగా నెరవేర్చవలయుననిన వారికానంద ముండవలెను.

బాలురకు యీలవేయుట యెంతసులభమో సామాన్యజనులకు పక్షములు వహించు టంతసులభము. ఈ వ్యక్తిత్వములేని ప్రజలపై యీ నాటకకర్తలు చేయుచున్న హానికి మితిలేదు. పాఠకులకు చిత్తవిభ్రమణము కలుగుచున్నది. రాజకీయ, మత సారస్వతములందు యీనాటకకర్త సమానమైన హాని చేయుచున్నాడు. ఈతని యుపన్యాసములను వినినవారికి శాశ్వతముగా నుపన్యాసములయం దసహ్యము పుట్టుచున్నది. ఇది మనజాతికి మిక్కిలి యుపద్రవకరము. మన యుపన్యాసవేదికను సరియగు నుపయోగములకు పెట్టిననేగాని మనజాతి యభివృద్ధి చెందజాలదు. సారస్వతమునందును యిట్టులే. ధనస్వాముల కీనాటకకర్తలు యెట్టి మర్యాదలను చేయుచున్నారో మనకందరకు విదితమే. ఈనాటకములు మనలో ననేకులను మతభ్రష్టులనుగా జేయుచున్నవి. ఈ నాస్తికవాదుల పాత్రలు మిక్కిలిచిత్రముగా నుండును. మన దేశమునావరించిన చెడుగునుండి మనము తప్పించుకొనిననేగాని మనకు ముక్తి లేదు. ఈ యనుచితములను మాన్పజాలనిమొదల మనకు స్వాతంత్ర్యము లభించ జాలదు. దేశనాయకులనుగురించి మాట్లాడునపుడు గంభీరత్వముతో నుల్లాసము మేళవించిననే గాని వారి పరిమాణమును గ్రహించజాలము. నిజమైనకార్యశూరు లెపుడును ఉత్సాహవంతులై యుండెదరు. డాంబికుడెవ్వరికిని ఉత్సాహముగొల్పడు. మననాటకకర్త లతిశయోక్తులను మానిరేని సత్ప్రయత్నములయందున్న యానందము, ఉత్సాహము, చిత్రించగలుగుదురు. అప్పుడు మనకు స్వాన

యసంచలనము గలుగును. విప్లవనాయకులయందు హాస్యర
సము కొరవబడెనేని, విప్లవము లపజయము గాంచుననుటలో
సందియమేమియు లేదు.

మననాయకులకు హాస్యరసముండవలెనని చెప్పియుం
టిని. ఈ హాస్యము సాధారణమైనదిగా నుండినయెడల లాభ
ములేదు. అది మిక్కిలి యున్నతమైనదిగా నుండవలెను. గొప్ప
కవులును, తత్వజ్ఞులును, యెల్లరుదుగా నుందురో గొప్ప హా
స్యవేత్తలును నిట్లే యరుదుగా నుందురు. ప్రతివానియం
దును హాస్యరసముండును. అది యంత గొప్పది కాకపోవచ్చును.
మనము దాని నభివృద్ధి చేసికొనవలయును. గొప్ప హాస్య
వేత్త స్వంతగుణములను హాస్యము చేసికొనును. పరుల
గుణములను హాస్యము చేయడు. ఇతడు తన సోదరుల
యెడల మిక్కిలి మర్యాదతో మెలంగుచుండును. సాధారణ
హాస్యగాడు యితరుల నవమానపరచును. తాను గొప్పవా
డని యూహించుకొనుచుండును. శత్రువులను జూచి నవ్వి
వారిని పరిహాసము చేసి వారికి కోపము వచ్చునట్లు చేయును.
సభికులు నవ్వుచున్నారు. మానవులకు సహజముగు దుర్గుణ
ముల నతడు పరిహాసము చేయుచున్నాడని వారికి తెలియును.
కాని వారతని హాస్యమునకు నవ్వుచుండుట లేదు. వారతని యాష్య
క్తమునకును, బుద్ధిహీనతకును ఆశ్చర్యపడి నవ్వుచున్నారు.
మనము రెండు విషయములను జ్ఞాపకముంచుకొనవలయు
ను. మన యవగుణములను హాస్యముచేసికొనుట వివేకోద
యమునకు మొదలనియు శ్రేష్ఠముగు హాస్యమునందు మోటు

తనముగాని, పరనిందగాని యుండకూడదనియు తెలిసి కొన వలయును. ఇతరుల లోపములను కొండంతలుగా చేయుట తగని పని. ప్రపంచమునందు లోపములు లేనివాడెవడు? హాస్యగానికి మాత్రము లోపములు వేనవేలు లేవా! తనలోపములను గురించి తలపోసినయెడల యితరులకన్న తాను గొప్ప యను దురహంకారము మాయమగును. మన కందరకును సహజమగు నవగుణములను గురించి కలసి హాస్యము చేసికొందము. ఇట్లుచేయుటవలన ప్రజలాతురతతో హాస్యగానివద్దకు వచ్చి యాతని యభిప్రాయములను మిక్కిలి యానందముతో విను చుందురు. వారిపొట్ట చక్కలగునట్లు నవ్వెదరు; మొదట సదస్యులకు కొంత భ్రమగలిగినట్లగుపడును. కాని కొంతకాలమున కతనియందు నమ్మకముగలుగును. హాస్యవేత్త యితరులను దూషించుటలేదు. తన లోపములను హాస్యముచేసికొను చున్నాడు. కావున ప్రజ లతనియొద్దకువచ్చి వారి వారి కష్టసుఖముల నతనికి చెప్పుకొనెదరు. తమరహస్యములను గూడ దాచక వెలిబుచ్చెదరు. హాస్యవేత్తసలహాకొరకు నిరీక్షించుచుందురు. ఇట్టి హాస్యమే మానవహృదయముల నాకర్షించును. సారస్వతములో నిట్టి హృదయాకర్షణశక్తి యుండెనేని మనము తన్మయత్వము జెందెదము. కవి యిష్టప్రకారము ఆడెదము, పాడెదము, ఏడ్చెదము, నవ్వెదము, గంతులువైతుము. ఇట్టి రసజనకములగు భావము లున్నప్పుడే గ్రంథము శ్రేష్ఠమగునదని మన మెరుంగవలయును.

ప్రస్తుతము నాటకములయందు సత్య మస్పృశ్యమైనది. గనుక యీరచనలను మనము తిరస్కరించవలయును. నాటకకర్త యెల్లప్పుడును యేదోయొక పక్ష మవలంబించును. ఎప్పుడైనను నిష్పక్షపాతముగ మాట్లాడెనేని మనకు రుచించునట్లు చేయజాలడు. ఈతని తర్కము మన కుద్దేశము గొప్పను. కాని మనకవసరమైనది యుద్దేశమే. ఈ నాటకకర్త తన యుద్దేశ్యముల నెరవేర్చజాలకున్నాడు. ఈతని యసహజయములవలన మనపవిత్రోద్యమముకుగూడ నష్టము వాటిల్లును. మన యుద్యమమును వాని నాటకములవలె చైతన్యరహితమని మన మూహించెదము. ఇట్టికవులు దేశమునకు మేలు చేయజాలరు. మన యుద్యమము గొప్పదగుటకు మనమెప్పుడును ఉత్సాహమును ఆనందమును జూపుచుండవలెను. భావజ్ఞులగు మహాకవులుదయించి తమగ్రంథములను జీవకళాశోభితముగా నొనరించి జాతీయనాయకులను సహజముగా వర్ణించిననే గాని మన యుద్యమము త్వరలో ఫలప్రదమగుటకు వీలులేదు. గొప్ప నాటకకర్తలకు ఉన్నతోన్నతములగు గుణములుండవలెను. వివేకము, కరుణ, ఊహ, ధైర్యము, దూరదృష్టి యుండవలెను. ప్రస్తుతము గ్రంథములను వ్రాయువారి కిట్టి గుణములు లేవు. కావున మనము సత్యమును ప్రతిష్ఠించవలయును. సమయోచితముగ సత్యమును విరూపిగా చేయగూడదు. జీవితసమస్యల నెదుర్కొన భయపడువాడు నాటకకర్తగానుండుటకుగాని యొకరిపక్షము మాట్లాడుటకుగాని యొక దానిని గురించి వ్యాఖ్యానము చేయుటకుగాని యర్హుడు కాడు. ఎవ్వను నతని

విశ్వసింపరు. ఇతరుల కుత్సాహముఁ గలిగించువాఁడు తాను ఉత్సాహపూరితుఁడుగా నుండవలయును. ఉత్సాహమున కాకర్షణశక్తి గలదు. ఒకానొక సమయమున కష్టముల కోర్వలేక యతఁ డుత్సాహమును గోల్పోయినను యిది యతనికి సహజమని తలంచఁగూడదు. కడుశీఘ్రముగా నతఁడు సత్యమార్గము ద్రొక్కి మనలనందరను దాఁటి యుత్సాహమునందు ముంచుననుటలో సందియము లేదు. ఇట్టి సమయమున మన ముద్రేకపూరితులమై యుబ్బి గంతులు వైతుము. ఇట్టి సమయమున తర్కముతో మనకు పనిలేదు. వాదముతో పనిలేదు. దేశమునంతయు నావరించియున్న పొగ క్రమక్రమముగా రగులుకొని గొప్ప యగ్నియై దేశమును తేజోవంతముగా చేయును. మన దేశమున కున్నత స్థితి చేకూరును.

# పదునొకండవ ప్రకరణము

## సారస్వతము-స్వాతంత్ర్యము

(కళకొరకు కళ)

జీవమయుఁడైన యీశ్వరు
డీవిశ్వము దనదు కళగ సృజించునటుల్
భావజ్ఞుఁడైన కవియే
జీవకళాశోభితముగ జేయు కవనమున్.

(ఆంధ్రసంచిక)

"కళకొరకు కళ" విషయమై ప్రస్తుతకాలమున ప్రబలిన దురభిప్రాయములను ఖండించుట యావసరము. చిత్రకళను మిక్కిలియున్నతమును పవిత్రమును నగు కార్యముల కుపయోగింపవచ్చును. గొప్పపండితులు దానిని వృత్తిగా జూసి కేవలద్రవ్యాపేక్షచేగాక వాఙ్మయాభివృద్ధికై గ్రంథ రచనకు గడంగిరేని వారు జనానురాగమును బడసెదరు. మహాకవులని శాశ్వతకీర్తి గాంచెదరు. కాని జనోపయోగము నకై పాటుబడువారికి ఉదరపోషణనిమిత్తమైనను కొంత ద్రవ్యసహాయముచేయక తప్పదు. ఉదరపోషణనిమిత్తమైనను ద్రవ్యము లభించనిసమయమున ఆకార్యమునం దతనికి గల యభిరుచిచే ధనమున్నను లేకపోయినను యీకార్యము చేయక తప్పదు." అని యెవ్వడు తలచునో అతడు యీ యున్నతమును పవిత్రమును నగు యుద్దేశ్యమును నెరవేర్చుచున్నాడు.

ప్రస్తుతసమయమున నాటకములు రచించుచున్నవారు తమతరమువారికి హృదయసంచలనము గలుగజేయుచున్న యుద్రేకకరములగు విషయములను చిత్రించకుండుట శోచనీయము. వారొకపక్షము వహించుట ధర్మము కాదని నేనెఱుగుదును. కాని వారు త్సాహపూరితులగు మహాశయుల మానసిక ప్రవృత్తులను, హృదయములను మెరుంగనియెడల మహోదాత్తమతత్వములను వర్ణించజాలరు. వారికథానాయకులు ప్రాణరహితమగు బొమ్మలవలె నుందురు. వారి గ్రంథములయెడ నభిరుచి యెవ్వరికిని యుండజాలదు. ఏగ్రంథమైనను

మనహృదయముల నాకర్షించి మనల నున్నతభావపూరితు లుగా జేయవలయుననిన దానియందు చైతన్యముండవలెను. జీవకళ యుట్టిపడుచుండవలెను. ప్రస్తుతసమయమున రచి యింపబడుచున్న గ్రంథములలో గొప్పలోపము జీవకళ లేక పోవుటయే. అవి మన కింద్రియసౌఖ్యము నొసంగుచున్నవి. గాని నిజమగు బ్రహ్మానందము నొసంగజాలకున్నవి. కవు లీలో పమును కప్పిపుచ్చుటకై లక్షణము నాశ్రయించుచున్నారు. వారికవనము ఛందోయోగ్యముగను నిర్దుష్టముగనున్నను హృదయములేమింజేసి గొప్పదిగా పరిగణింపబడజాలదు.

నిజమగు కళయనిన నేమో తెలిసికొనుటకు 'కళ'కును "యుక్తి"కిని భేదము గ్రహించవలెను. సింజి (Synge) అను వాడు రచియించిన "నావికాయాత్ర," "ఆటగాడు" అను గ్రంథములను పరిశీలించినయెడల యీభేదము మనకు విశద ముకాగలదు. మొదట పేర్కొనబడిన గ్రంథమునందు కవి యొక్క భావములు హృదయమునుండి వెలువడినవి. కవి శవమును మోసికొనిబోవుచున్నపుడు బంధుజనులకు గలిగిన హృదయవేదనను దుఃఖమును వర్ణించియున్నాడు. అతడు శవ వాహకులనుజూచి వారి దుఃఖమును కన్నులార వీక్షించి యా దుఃఖమును తన గ్రంథమున వర్ణించియుండును. అందువల ననే యాతనివర్ణనలు మనకును దుఃఖమును గలుగజేయును. ఈ గ్రంథమును పఠించుచున్నపుడు గ్రంథకర్త మహాప్రభావ సంపన్నుడని మనకు తోచకమానదు. కాని యాతడు రచించిన రెండవ గ్రంథమునం దిట్లు కాదు. అతడు వర్ణించిన యంశ

ములు స్వయముగా చూచినవికావు. వినికిడివలన వ్రాసినవి. ఈగ్రంథము ప్రస్తుత సమయమున రచియింపబడుచున్న హీన జాతి గ్రంథములలో నొక్కటిగా పరిగణింపబడవలెను. విమర్శకులు దీనిని "కళ"యని పిలచిన పిలుతురుగాక. నేనట్లు పిలువను. దీనిలో వర్ణింపబడిన విషయములు ప్రకృతికి విరుద్ధముగా నున్నవి.

ఇదియొక యస్వాభావిక వర్ణనగా నున్నది. ఇట్టిదే మరియొకటి గలదు. ప్రస్తుతసమయమున దేశద్రిమ్మరులను వీరులవలె చిత్రించు దురాచారము ప్రబలియున్నది. గాన దీని విషయమై కొంచెము చెప్పవలసియున్నది. దేశద్రిమ్మరి తన ధర్మమును నెరవేర్పలేని యొకవ్యర్థుడు. జీవయాత్రయం దతడు పడవలసిన కష్టముల కతడు భయపడి పరుగెత్తుచున్నాడు. సంసారసాగరము నీదలేనను భయమతని నావరించియున్నది. అతడు త్యాగము చేయజాలడు. ఇట్టి భీరువులు యుద్ధరంగమున కాల్చివేయబడుదురు. కాని కుకవిశిఖామణులు వీరిని గొప్పగాచేసి వీరులని ప్రశంసించుచున్నారు. ఇది యనుచితము.

ప్రస్తుతము నాటకకర్త లిట్టి యనుచితములను బ్రబల జేయుచున్నారు గాన యీ చిత్రకళనుగురించి కొంత చెప్పెదను. ఈ "నాగరికత" ప్రబలుచుండుట మిక్కిలి యుపద్రవకరము. పాటలు, పద్యములు, నాటకములు, ఉపన్యాసములు, కళయనుపేర కొంతమందిని దూషించుటకును, కొంతమందిని భూషించుటకును రచియింపబడుచున్నవి. ముఖ్యముగా ధన

స్వాము లీనిందకు పాత్రులగుచున్నారు. ఈ చిత్రకారులకు ధనస్వాములను నిందించుటయందు గల సంతోషము మరి దేనియందు నుండదు. నాటకముజరిగిన తరువాత ధనస్వాములును యితరులును కలహపడుట, కొట్టుకొనుట, రక్తపాతము వారికి మిక్కిలియిష్టము. అనవసరములగు విషయములయందు కలహించుటయు, ధైర్యముగా తమప్రాణములనర్పించవలసిన స్థలములయందుపేక్షాభావము వహించి యూరకుండుటయు మిక్కిలి శోచనీయము. ధనస్వాములమనములందు భయము పుట్టించుటయే వీరియభిప్రాయము. తాము మిక్కిలిగొప్పవారను దురభిమానము వారినావరించియున్నది. సాధారణముగా వారు వ్రాయునదంతయు మిక్కిలిహీనముగా నుండును. కొన్ని సమయములయందు వారు కొంతయుద్రేకముతో వ్రాయబ్రయత్నింతురుగాని యది యస్వాభావికమని మనకు తెలియక మానదు. వారియధికప్రసంగపుమాటలు మనకు రుచింపవు. ఇట్టి మార్గములనుండి మరల యొక మంచిమార్గమును ద్రొక్కుట యవసరమైయున్నది. మనము చేయు కార్యమునందభిరుచియు నుత్సాహమునున్నగాని మనకార్యము తృప్తికరముగా నుండజాలదు. మనము పూర్తిగా ధనాశ వీడవలయును. లక్షణము మనకు సహాయము చేయజాలదు. ఇతరులను పరిహాసముచేయుటయు తగనిపని. మనకు సమస్తభూతములయందును వాత్సల్యము పుట్టవలెను. మనము వర్ణించు విషయములు హృదయమునుండి వెలువడవలెను. మనయుద్దేశ్యములు మంచివైనను మనమీవిషయములను పాటించకపోవుటచే మన మపజయము

గాంచవచ్చును. ఈయుపజయములవలననైనను యీ నాటకకర్తలు గుణపాఠముల నేర్చుకొనవలయును. నాటకకర్త, తాను చిత్రించుచున్న విషయములను వ్యాప్తతము చేసికొనవలయును. నవలాకారుని కతని కథయందభిరుచి యుండవలెను. కవి తాను రచియించిన పద్యములయందుగాని, గీతములయందుగాని లీనమై పోవలయును. అప్పుడుగాని మానవుల నైజగుణములు చక్కగా వర్ణింపబడవు.

మన మీ విషయములనుగురించి మాట్లాడుచున్నపుడు 'ఎబీ' ప్రదర్శనశాలను గురించి కొంతముచ్చటించు టవసరము. ఇచ్చట ప్రదర్శింపబడుచున్న నాటకముల నమితముగా ప్రజలు శ్లాఘించుచున్నారు. గాని యీ నాటకములను † షేక్స్పియరుమహాకవినాటకములను పరిపోల్చి చూచిన యెడల వీటి గుణాగుణములు సుసరు బోధకాగలవు. 'ఏబీ' ప్రదర్శనశాలయందు మన మల్పవిషయములను వినుటకలవాటు పడియుండుటచే యేవియైన కొంచెము మంచివిషయ

---

† షేక్స్పియర్ మహాకవి యింగ్లదేశమున ౧౬వ శతాబ్దాంతమునను ౧౭వ శతాబ్దారంభమునను జీవించియుండెను. మానవస్వభావమును వర్ణించుటలో నీకవి మిక్కిలి నిపుణుడు. పాశ్చాత్య నాటకకర్తలలో నగ్రగణ్యుడని పేరుగాంచినాడు. అతడు దాదాపు ౩౫ నాటకములను అనేక పద్యములను వ్రాసెను. ఒథెల్లో, హాంలెట్టు, మ్యాక్ బెత్, కింగ్ లీయర్; యీ నాలుగు నాటకములు మహానాటకములుగా పరిగణింపబడుచున్నవి. ఆయాకాలపు రాజకీయ, సాంఘిక, మతాచారముల నసమాన ప్రజ్ఞతో వర్ణించియున్నాడు. అతని కాలమున నంత ప్రఖ్యాతిగాంచకున్నను అతని మరణానంతరము జగత్ప్రఖ్యాతి గాంచెను.

ములు చూచినప్పుడు వానిని గొప్పగా తలచుచుంటిమి. ఈ శతాబ్దములో నొకటి రెండు గొప్పనాటకములుమాత్రము మనము చూచియుంటిమి. ఇందుకు మనము సంతసింప వలసినదే. కాని ప్రస్తుతసమయమున యొకగొప్ప నాటకమైనను చూచియుండలేదు. గొప్పయను పదమును సాధారణముగా నందరికి నుపయోగించకూడదు. షేక్స్పియర్, మోలియర్ మహాకవులకు మాత్రమే ఈ గుణము వర్తించును. తక్కినవారిని తెలివిగా వ్రాయగలవారనిగాని, యుక్తిచే జనులకు విషయ సౌఖ్యముల గూర్చువారనిగాని చెప్పదగును. షేక్స్పియర్ మహాకవి రచించిన నాటకములలోని కొన్ని రంగములను ప్రస్తుతము నాటకకర్తలు వ్రాయుచున్న నాటకములలోని రంగములు పోల్చి చూచినయెడల హస్తిమశకాంతరభేదము గానవచ్చును. షేక్స్పియర్ మహాకవి మనకు బ్రహ్మానందముగొల్పును. తక్కినవారు మన కింద్రియ సుఖము గలుగజేసెదరు. షేక్స్పియర్ మహాకవియు నుద్రేకకరములగు రంగముల ప్రదర్శించియున్నాడు. మల్లయుద్ధములు యుద్ధములు, రక్తపాతములు వర్ణించుటయందు షేక్స్పియర్ మహాకవి యద్వితీయుడు. వీనిని మిక్కిలినేర్పుతో నతడు వర్ణించెను. ఈతని వర్ణన లాకాలపునాటి ప్రజల నైజస్వభావములను ప్రతిబింబించెను. ౧౬వ శతాబ్దమునందు నివసించిన ప్రజ లుద్రేకపూరితులైయుండిరి. వారికి మల్లయుద్ధములు జగడములు సామాన్యకార్యములైయుండెను. మహాకవి యప్పటివారిని నిపుణత్వముతోడను, చాతుర్యముతోడను

జనులు బ్రహ్మానందముజెంది యానారాయనునట్లు వర్ణించి శాశ్వత కీర్తిగాంచెను. అతని పాత్రల గాంభీర్యము, సాహసము, పవిత్రత మన కిప్పటికిని యాశ్చర్యము గొల్పుచున్నవి. ఎన్ని యుగములు, ఎన్ని శతాబ్దములు గతించినను యాతని గ్రంథ ములు వాని సహజకోమలత్వమును, సౌందర్యమును, సౌర భమును వీడక 4 శతాబ్దములక్రింద నెట్టి యానందమును గొల్పెనో యట్టి యానందమునే గొల్పుననుటకు సందియము లేదు. మహాకవుల రచన లిట్టివి. ప్రస్తుతకాలమున నీ మహా కవిమార్గముల ననుసరించి గొప్పనాటకముల రచియించుట మిక్కిలి యవసరము. షేక్స్పియర్ మహాకవి వర్ణనలు ఉన్నతభావకల్పనములు, సత్యానురక్తి మనము నేర్చుకొన వలయును.

నాటకము గొప్పదిగా నుండవలయుననిన దానిలోని పాత్రలు గొప్పవారుగా నుండవలెను. ఇతరులెట్లున్నను నా టకములోని ముఖ్యపాత్రలైనను ఉన్నతాదర్శ పూరితులు గను గొప్పయుద్యమముల నడుపుశక్తిగలవారుగను నుండవల యును. వారి ప్రేమలు, ప్రయత్నములు, ఉత్సాహకరకృత్య ములు, ధర్మములు నారస్వతమును చైతన్యపూరితముగా జేయును. మానవహృదయములను, వారికష్టసుఖములను వారియుద్రేకములను గ్రహించలేనివా డీవిషయములను గురించి సరిగా చిత్రింపజాలడు. పాఠకమహాశయులు కోరు నది యీ పాత్రలవిషయమై కవి యేమితలచుచున్నాడోయని కాదు; నాటకములోని పాత్రలు తమ్ముగూర్చి తామేమి తల

చుచున్నారోయని యైయున్నది. నాటకకర్త భయముచేగాని
సంశయముచేగాని తనకార్యమును మొదలిడెనేని యది కొన
సాగజాలదు. రాజకీయవిషయములను తననాటకములలో
వర్ణించినయెడల నధికారు లేమనియెదరో యేమిప్రమాదము
గలుగునో యని సత్యమును వ్రాయ వెరచువాడు తాను నెర
వేర్చబూనుకొనినవిధిని తృప్తికరముగా చేయజాలడు. ఇట్టి
కార్యము వ్యర్థమని వేరుగా చెప్పనవసరము లేదు. ఐరిషు
విప్లవ మనేకతరములనుండియు బుద్ధిమంతులను, మేధావంతు
లను, ఉత్సాహవంతులను అనేకమంది నాకర్షించినది. ఈ వీ
రులను గురించి కవివ్రాయనియెడల ఐరిషు విప్లవముయొక్క
నిజస్వరూపమును వర్ణించజాలడు. సాధారణు డెవ్వడయిన
యీ సంగతులను వ్రాయకయే విప్లవమును గురించి వ్రాయ
బూనుట పరికరములేమియు లేకయే మహాసౌధమును
నిర్మింపబూనినట్లగును. విప్లవమునుగురించి బోధగాని, ప్రచా
రముగాని యవసరము లేదు. విప్లవహృదయమును వర్ణించిన
జాలును. అటుమీద యితర స్వల్పవిషయములను వర్ణించ
వచ్చును. మనకవులు, నాటక కర్తలు విప్లవమును గురించి
వ్రాయభయపడి దానిని సరిగా వర్ణించక జనుల మనముల
యందపోహల గలుగజేసినంత కాలము వారి రచనలు హీన
జాతివిగా పరిగణింపబడును. ప్రస్తుత సమయమున ఐర్లండు
దేశమునంతయు సంచలింపజేయుచున్నది విప్లవమొక్కటియే.
ఈ విప్లవ మనేక ధీరుల నుత్పత్తిజేసినది. ఇట్టి మహోద్య

మము యొక్క తత్త్వము వర్ణించుటయే గొప్ప. మనకవులందరు యీ కార్యమునకు బూనవలెను.

నిజమైన కవి సాధారణులవలె గంభీరవాక్యముల కొరకు తడవుకొనడు. అతనికి లక్షణమునందు దృష్టి లేక పోలేదు. అత డుపయోగించు చిన్నపదములలోనే యతని యర్థమంతయు నిమిడియుండును. సాధారణపదములే యతని వ్రాతకు ప్రాణము నొసంగును. ఈ కాలమునాటి కవులవలె సత్యమును వదలివేసి పదగుంభనకుమాత్రమే యత డాలోచించడు. అతడు వర్ణించుదానియందు లీనమైపోవుటవలన యెచ్చట యేపద మువయోగించబడవలయునో ఆపదమే యుపయోగింపబడును. అతనికి కల్పనాశక్తి యధికముగా నుండును. సాధారణ కవులు చూపలేని యున్నతభావ ప్రకర్షణ మతనికి సాధ్యమగును. మానవప్రకృతిని సరిగా గ్రహించి వారియుత్సాహమును ప్రతిబింబించిన యెడల వారి జయాపజయములను కష్టసుఖములను అతిశయోక్తిలేక వర్ణించినయెడల ప్రతివాడును గొప్పవాడగుటకు సందియము లేదు. ఈసమయమున నతడు ప్రసిద్ధికాంచకున్నను, ముందతడు జనానురాగము బడయగలడు. మహాకవులకు అహంకారముండదు. వా రేకాంతులై యుండక జనసామాన్యముతో కలసి మెలసియుందురు. పాఠకుల హృదయముల నాకర్షించి వారికి మితిలేని యానందము గలిగింతురు. వారికి గల కల్పనాశక్తివలన మానవహృదయములను వారివారి భావ భేదములను గ్రహించి చక్కగా వర్ణింతురు. స్వాతంత్ర్యము

సంపాదించవలసివచ్చినప్పుడుగాని లభించిన స్వాతంత్ర్యమును సంరక్షించుకొనుటకుగాని వారన్నివిధముల మనకు సాయముచేయగలరు. వారికి శత్రువుల నెదుర్కొను ధైర్యము మిక్కుటముగా గలదు. వారు కీడు చేయువారికి ప్రతీకారము చేయనెంచరు. లోకములో నెవ్వరును వారికి సమానులు కానేరరు. వారికి యుదారత్వము సహజగుణము. స్వాతంత్ర్యమునకై వారతిధైర్యముతో తమప్రాణముల నర్పించ సంసిద్ధులైయుందురు. వారు మిత్రుల నెన్నటికిని మఱువరు. శత్రువులను క్షమింతురు.

ఇట్టియుత్తములు అసమానులును నజేయులును నై యుందురు.

# పండ్రెండవ ప్రకరణము

## మతము

పూర్వమువలెనే యిప్పుడును మనలో భేదములు కల్పించి వైషమ్యములను వృద్ధిచేయుచున్న ముఖ్యవిషయములను పరిష్కరించుట మిక్కిలి యావసరమని ప్రథమమున మనము గ్రహించవలయును. వివిధకక్షలకును ముందెన్నడో యొడంబడిక కుదురుననునాశచే యీ సమస్యల నిప్పుడు పరిష్కరించకుండుట మిక్కిలి యాప్రశస్తము. ఇట్టి యాభిప్రాయ

ములు గలిగియుండుటయు వెట్టి. ఈ సమస్యలను ధైర్యముతో నెదుర్కొనవలయును. అప్పుడుగాని పరస్పరగౌరవము వృద్ధియై సమస్యాపరిష్కారము సులభసాధ్యముగాదు. మఱి యిట్టి సమస్యలలో ముఖ్యమైనది. అధిక సంఖ్యాకుల కిది తమయాంతరంగిక జీవనములతో సంబంధించిన విషయము. ఇందుచే ప్రజలు తమసిద్ధాంతముల నెవ్వరు నిందింతురో వారి నెదుర్కొని ప్రాణములనైన నర్పింప సంసిద్ధులైయుందురు. ఈ కలహములయందు చూపబడుచున్న ద్వేష మపారము గుటచే సదయ హృదయులగువారు మతవిషయికములుగాని కొన్ని సమాజములయందు యీ భేదాభిప్రాయములుగల వారి నాకర్షించి వారికి ప్రోత్సాహము నిచ్చుచున్నారు. ఇంతకాలమునుండియు సరిపడక మిక్కిలి తీక్ష్ణముగా వివాదపడిన జనుల నొకసమాజమున చేర్చుట కొంతయభివృద్ధి సూచకమని యొప్పుకొనక తప్పదు. కాని యిట్టి సమాజముల యందు ఒకతెగవారి వ్యక్తిత్వమును సంపూర్ణముగా నాశము చేయుట మనకు తగని పని. సాధారణములైన యుద్యమముల యం దిది కొంత సహకారియైనను స్వాతంత్ర్యపోరాటము వంటి మహోద్యమములయందు విఫలమగుననుటకు సందియము లేదు. అలక్ష్యభావమువలన నీసమస్యలు పరిష్కారము కాజాలవు. స్వాతంత్ర్య పోరాటమున జయముగాంచవలెననిన ప్రతివాడును తనమతమును రక్షించుకొనుటకు వెనుదీయరాదు. ఇట్లు చేయుటవలన హృద్గతమైన క్రోధములు అనుమానములు, బహిర్గతమై దేశము నల్లకల్లోలము చేయు

నను భయము గలదనుట నిశ్చయమే. ఈభయమును మనము పారద్రోలవలయును. నే నీ విషయము నెత్తుట యనేకమందికి యిష్టము కాకపోవచ్చును. వారీచర్చవలన పరస్పర వైరములు పెంపొందుననియు యిట్టివిభేదములు మనజాతికి ప్రమాదకరములనియు తలతురు. కాని మనము చేయుచున్న మహాపోరాటమున యీ యుపద్రవకరమగు సమస్యను పరిష్కారము చేయనిది మనము జయము గాంచెదమని తలచువారెవ్వరుందురు? కావున నీసమస్యను ధైర్యముతో నెదుర్కొని పరిష్కరించవలెను. నేను చెప్పబోవు విషయము లెవ్వరికిని కోపముగాని భయముగాని కలిగించ నవసరములేదు. పరస్పర విరోధములు కలిగించుటగాని కొంతమందిని ఉదారులనుగా చేయుటగాని నాయుద్దేశముగాదు. వారికి సద్భావము కుదురుటకును వారొండొరుల గౌరవించుకొనుటకును నే నీవిషయమును వ్రాయబూనితిని. శత్రుపక్షమువారి యభిప్రాయములను గౌరవించు ఉదారస్వభావులును తమవాదము నతిసమర్థతతో నెగ్గించుకొను శక్తిమంతులును మనకీసమయమున మిక్కిలి యవసరము. వివిధపక్షములవారి ధైర్యసాహసముల మీదను వివేకముమీదను మనదేశస్వాతంత్ర్య మాధారపడియున్నది. ఈ భావమే మనల కార్యసాధనకు పురిగొల్ప వలయును. ఈ సమస్యా పరిష్కారమునందు ఓర్పు, దయ గలిగి యుండుట యవసరము. కొంతమంది హృదయ దౌర్బల్యముచే ధర్మమైన తమపట్టును వదలివేయుట శోచనీయము. కొంతమంది ప్రతిపక్షులయెడల మిక్కిలి క్రూరత్వము జూపెదరు.

ఇట్టికూరత్వమువలన బలహీనులు తమ దుర్బలస్థితియందుండి తప్పించుకొనుటకు వీలులేకున్నది. ఈ సమస్యాపరిష్కారము నందు మనకగుపడునవన్నియు కష్టములే. నేనువ్రాయువ్రాతల యుద్దేశ్యములు ప్రస్తుతసమయమున నెరవేరక పోవచ్చును. కాని తప్పుత్రోవల ద్రొక్కకుండుటకై మన మనమాన ప్రజ్ఞయు వివేకమును దూరదృష్టియు జూపవలసియుండును.

తమ మతధర్మములయెడల నందరికిని సంపూర్ణవిశ్వాసముండవలెనని కోరుట విపరీతము గానేరదు. ఇతరుల కూరత్వమును అధర్మమును బట్టి మన ధర్మమును నిర్ణయించుకొనగూడదు. మన జీవితమును ధర్మసిద్ధాంతములమీద నాధారపడియుండునట్లు క్రమపరచుకొనవలయును. ఇది క్రొత్త విషయముకాదు. ఈసమస్యను మన మెంత సదుద్దేశముల తోడను నిష్కల్మషహృదయములతోడను విచారించినను అనేకమందికి కష్టముగాను కష్టముంటగాను నుండకమానదు. కాని యన్నిపక్షములవారును యీవిషయమై పొరబడినారని గ్రహించినపుడు యీస్థితి తొలగిపోకమానదు. ఇట్టియాసలే నన్నీ వ్యాసమును వ్రాయఁపురికొల్పినవి. క్యాథలిక్ పక్షము వారును ప్రొటెస్టెంటు పక్షమువారును యొండొరుల దూషించుకొనక తమలోపములను గ్రహించి వానిని చక్కబెట్టుకొన యత్నించవలయును. శూన్యవాదములు బలసిన యీ రోజుల లో సాంఘికవాదులు, సమిష్టివాదులు, నాస్తికవాదులు తమశత్రువులని తలచి వారిలోపములను కొండంతలుగా చేయుటకన్న ప్రథమమున క్రైస్తవులు తమగృహమును చక్కబెట్టు

కొనుట యావసరమని గ్రహించవలయును. శూన్యవాదులు తమ ధర్మముయొక్క ప్రాశస్త్యమును గురించి వాదించినప్పుడు వారిని దూషించక తమవాదములను బలపరచుటకై తామేకార్యమును చేసియుండలేదని వారికి తెలియజేయవలయును. ప్రతివాదును తప్పుత్రోవను దొక్కుచున్నారని సిద్ధాంతము చేయుటవలన పొత్తుకుదర నేరదని యానేకమంది తలచనవచ్చును. కాని యిది యాక్రమమైన కోరిక కాజాలదు. మనము వారి దృఢవిశ్వాసములను ఖండించుట లేదు. వారి సిద్ధాంతముల నాచరణయందుంచి వారి నిశ్చయమును వెల్లడిచేయుమని కోరుచున్నాము. ఈ మార్గమువలన కోరువారియందును కోరబడువారియందును సద్భావమును కార్యశూరతయు గలిగిన గలుగవచ్చును. ప్రజలందరును ఉన్నతాదర్శములు గలిగి తమజీవితములను ధర్మసిద్ధాంతములమీద నాధారము చేసికొనిన మొదల మానవులలో స్నేహము, వాత్సల్యము గలుగక మానవు.

ఇచ్చటయందరకును సంబంధించిన యొక ముఖ్యవిషయమును గురించి ముచ్చటించెదను. దీనివిషయమై యొకగొప్ప గ్రంథము వ్రాసిన వ్రాయవచ్చును. కాని యిచ్చట యంత దీర్ఘముగా విమర్శింప చోటుచాలదు. మతసంస్థాపనలు రానురాను తమయాధ్యాత్మికాదర్శములను విడి కేవల భౌతిక విషయములయందు పడియుండుట శోచనీయము. మతగురువులని పేరుబెట్టుకొని కొందరు పెద్దలు మతవిషయముల నాలోచించుట మాని వారియనుచరులసంఖ్య నభివృద్ధి చేయుటకు

నూతనమే ప్రయత్నించుచున్నారు. వారికి గొప్ప యుద్యోగములుగలవు. వారికి భోగాపేక్షగలదు. ఏవిధమునైనను ద్రవ్యము సంపాదించి దానిని పంచుకొనుటయందు వారు నిమగ్నులైయున్నారు. ప్రొటెస్టెంటు మతకక్షవారు గ్రంథములనువ్రాసి తమ మతమే ప్రశస్తమని నిర్ణయింతురు. తక్షణమే క్యాథలిక్ పక్షమువాడొకడు గ్రంథమువ్రాసి తన మతమే ప్రశస్తమని నిర్ధారణచేయును. ఈవాదవివాదములు తమకు మితిలేని యపఖ్యాతిని దెచ్చుచున్నవని వారెఱుంగరు. మతమనునది యాధ్యాత్మికవిషయములను బోధించి శ్రేష్ఠమగు మతధర్మముల ననుష్ఠించుటకు సహకారిగానియెడల దానివలన మనకేమియు లాభములేదు. “ధనమెచ్చటనుండునో యచ్చటనే నీబుద్ధి యుండును. ఎవ్వరును ధనమును దైవమును నొకేసారి గొల్వజాలరు” అనువాక్యములు ధనముయొక్క ఆకర్షణశక్తిని వ్యక్తపరుచుచున్నవి. భోగమునందు పడియున్న పురుషులు ఆధ్యాత్మికవిచారమునకు గడంగుదురనుట యసంభవము. ధనాపేక్షపీడుడని వారిని మనముకోరితిమేని “ మేము బ్రదుకుటెట్లు?” అని వారు ప్రశ్నించెదరు. సదుద్దేశ్యములుగలవారుగూడ తమ యున్నతాదర్శములను బూడిదపాలుజేసి ధనము సంపాదించుటయందు నిమగ్నులగుట శోచనీయము. ప్రతిమానవుడును తనజీవయాత్ర గడుపుకొనుటకు కొంతధన మార్జించుట యావసరమని నేనెఱుంగుదును. కాని మతము నాశ్రయించుకొని అనేక సంఘములును వ్యక్తులును ఉద్యోగముల సంపాదించి భోగపరాయణులై తమకాలమును వ్యర్థా

పుచ్చుచున్నారు. ఇది ప్రపంచమున కనర్థదాయకము. ఉత్తములను యీయధర్మచక్రమునందు పడి విముక్తిగాంచజాలకున్నారు. వారియుత్సాహము, తెలివి తప్పుత్రోవల బెట్టబడుచున్నవి. పరమాత్మ యీ తుచ్ఛమగు వస్తుజాలముకంటె నుత్కృష్టమగువానికై యుత్సాహము జూపుడని మనల ప్రేరేపించుచున్నాడు.

క్రీస్తుమతావలంబకుడు శూన్యవాదులయెడల జూపు భావముల నిచ్చట విమర్శించెదను. "ప్రపంచమంతయును మతభ్రష్టమగుచున్నది." అని యతడు మొరలిడును. కాని యీభ్రష్టత్వమునకు తానెంత కారకుడో యతడాలోచించుటలేదు. అతడు మతమునుగురించి విమర్శించునపుడు నాస్తికవాదము సాంఘికవాదము, మతభ్రష్టత్వమును గురించి యనిశ్చితాభిప్రాయములను వెలిబుచ్చుచున్నాడు. కాని యీగుణము లతని కంటనట్లును, తనయందు దోషములేవియు లేనట్లును తలచుచున్నాడు. నాస్తికులను గురించి చర్చించుటమాని, దృష్టి యంతర్ముఖము చేసినయెడల సత్యము బయటపడక తప్పదు. ప్రొటెస్టెంటు క్యాథలిక్ శాఖలలో ననేకులు నిజమయిన మతమన నేమోయెఱుంగరు. మతముయొక్క బాహ్యచిహ్నములన్నియు వారొప్పుకొనెదరుగాని నిజమయిన తత్వమదృశ్యమైనది. అతడు ప్రతిపక్షుల మతమును దూషించుటయు ఖండించుటయుమాత్రమే మతముగా పరిగణించుచున్నాడు. స్వేచ్ఛయనగా యతని యుద్దేశ్యములో త్రాగుట, చీట్లాడుట, జూదమాడుట, స్త్రీసౌఖ్యము ననుభవించుట. అతనికి

సుగుణము లేవియు లేవు. సుగుణముల యెడ నతని కసహ్యము. ఐనను నతడు నిష్ఠాపరుడుగా పరిగణింపబడుచున్నాడు. క్యాథలిక్ మతావలంబకుడు ఆదివారమునాడు దేవాలయమునకేగి దైవమును గొల్చునట్లు నటించును. అతనిచిత్తము భగవంతుని మీద నుండదు. అతడాలస్యముగావచ్చి ముందుగా వెళ్లిపోవును. ప్రొటెస్టంటుశాఖ క్రైస్తవుడు దేవాలయమునకు పోవుటకే యసహ్యపడును. 'ఆడువారు పోయి ధర్మోపన్యాసముల విని రానిమ్ము' అని యాతడు సెలవిచ్చును. తాను చాలగొప్పవాడని యతని కహంకారము మెండు. ఇట్టివారు రెండుపక్షములయందును ననేకులు గలరనుట మనకెల్లరకును దెలిసినవిషయమే. కాని వీరిద్దరును ప్రత్యేకముగాగాని కలిసిగాని నాస్తికవాదులను దూషించుటకు ముందంజవేయుచున్నారు. మనము మతవిషయిక సంస్థాపనలయందిట్టివారిని చేర్చి వారు మతోద్ధారకులని పొగడుటవలన వారు దురహంకార ప్రేరితులై నాస్తికులను ఖండించుటయే పనిగా బూనియున్నారు. ఈనాస్తికులు వీరివలె నీచులైయుండవచ్చును. క్రైస్తవమత ప్రచారకులను వారిట్లేదూషించుచుండవచ్చును. కాని వీరిలోగూడ కొంతమంది యుత్తమగుణములుగలవా రుండవచ్చును. వీరవలంబించు ధర్మమునకు పేరులేదుగాని వారిలో కొంతమంది కాధ్యాత్మికపారవశ్యము మెండుగానున్నది. వారు జాతీయౌన్నత్యమునకుగాని సాంఘికదురాచారములను రూపుమాపుటకుగాని యేత్యాగమునైనను చేయ వెనుదీయరు. వారు స్నేహపాత్రులు, విశ్వాసపాత్రులు, గుణోన్నతులు. ఇట్టివారిని

గూడ ప్రస్తుతసమయమునందు చేటుపాటు లెరుంగక దూషించు హీనస్థితియందు మనము పడియుండుట సంతాపకరము. మనసంఘము నాస్తికవాదులను దూషించుట కొప్పుకొనును గాని క్రీస్తుమతావలంబకులలో వారుభోతులను జూదరులను ఉన్మత్తులను యేమాత్రము ఖండించదు. వారిని మన స్వజనముగా పరిగణింతుము. నాస్తికవాది యీతుచ్ఛులను జూచి లోలోపల నవ్వుకొనును. నిష్ఠాపరుడుగా పరిగణింపబడు వారి నీచత్వము, హైన్యము నతడు బాగుగా నెఱుగును. క్రీస్తుమహాశయుని పవిత్రచరిత్రను వారు గీర్తించుచుందురుకాని వారా మహనీయుని సిద్ధాంతముల నాచరణయందుంచుట కేమాత్రమును ప్రయత్నించరు. ఈపవిత్రత బైబిల్ గ్రంథములో తప్ప మరెచ్చటను గానరాదు. ఇట్టివారు నాస్తికవాదులను శపించుటయు, గర్హించుటయు గలుగుచున్నది. అతని విషయమై యొక్క మంచిమాటయైనను పలుకుటలేదు. ఇట్లు చేయుటవలన నతడు క్రైస్తవులకు దుష్టశత్రువగుటయం దాశ్చర్యమేమున్నది! ఇంతదనుక క్రైస్తవుల యవగుణములను మాత్రమే వచించుచుంటిమిగాని వారి సుగుణముల దలపోయకుంటిమి. క్యాథలిక్, ప్రొటెస్టెంటు మతశాఖలలో సఘద్వేశ్యములు గలవారును, మతావేశపరులును ననేకులున్నారు. కాని వీరును నీచులవలె నాస్తికులను దూషించుటయందు పాల్గొనుచున్నారు. ఇది తగనిపని. వారిని మొదట తమయిల్లు చక్కబెట్టుకొనుమని కోరుచున్నాను. తమదేవాలయమునుండి వడ్డీ వ్యాపారులను దుష్టులను తరిమివేసి పవిత్రవంతముగా చేసికొన

వలయును. సారవంతములగు ఫలముల నివ్వని ప్రతివృక్షమును కొట్టి యగ్నిలో పారవేయవలయునను క్రీస్తుమహాశయుని వాక్యము ననుసరించి సస్యములను పాడుజేయుచున్న వేరు పురుగుల నాశనము చేయవలయును.

శూన్యవాదులనంబరగువారినిగురించి యొక్కింతచెప్ప వలసియున్నది. వారిలో నుత్తములును, సదాచార సంపన్నులతోను మాత్రమే మనకవసరము. హీనులనుగురించియు నధికప్రసంగులను గురించియు మనకవసరములేదు. వారు క్రైస్తవ మతావలంబకులలో తుచ్ఛులయవగుణములు మాత్రమే పరిగణింపగూడదు. ప్రతివిషయమునందును మంచి చెడ్డలు కలసియుండును. కాన మంచినిమాత్రమే గ్రహించవలయును. క్రైస్తవ మతావలంబకులలో త్రాగుబోతులను జూదరులను భోగపరాయణులను కొంతమందిని చూచినమాత్రమున వారిమతమును దూషణము చేయకూడదు. ఇట్లుచేయుట వలన క్రైస్తవమతబోధకులకును తమకును వాగ్వివాదములు కలహములు పుట్టుటయేగాని మరియేలాభమును గలుగనేరదు. కావునప్రతిపక్షులయందున్న మంచినిమాత్రమే గ్రహించవలయుననికోరుచున్నాను. ప్రతిసేనయందును భీరువులనేకులుందురు. సందిగ్ధసమయములయందు వారు పలాయనమగుదురు. ధీరులుమాత్రమే మిగిలెదరు. ఈ భీరువులను జూచి సేనయంతయు నిట్టిదేయని తలంచుట పొరబాటు. నీచులుకొంతమంది యుద్యోగములయందున్నమాత్రమున మతమంతయు భ్రష్టమయి పోయినదని తలచుట పొరపాటు. పురుషులలోను

స్త్రీలలోను పూర్వసాంప్రదాయములపీడని వా రనేకమంది. గలరు. న్యూమెను, [Newman Cardinel], ప్యాస్కల్ [Pascal] డాంటె [Dante], ఎరిజినా [Aerujina], ఈక్విసాస్ [Aequ enas] మహాశయులు మరణించినను వారి పవిత్రమార్గముల ననుస రించు మహాశయులనేకులు జీవించియున్నారు గిల్‌బర్టు చెస్టర్ టన్ [Gilbert Chesterton], ఫ్రాన్సిస్ థామస్ [Francis Thomas] మహాశయులు తీవ్రమగు మతావేశము గలిగియుండి రని మనమెరిగియే యున్నాము. కావున శూన్యవాద యీ విషయము గమనించితరువాత తనయుద్దేశ్యములను బహి రంగము చేయవలయును. అతనికనేక లోపములును, దురా చారములును నగుపడును. మతప్రచారకుల దంభముల విని విని వేసరినాడు. "మీమతములో నీదురాచారముల నేలసహించెద" రని యతడు మనల నడుగుచున్నాడు. కాని మనసమకాలికు లలోనే యనేకులు యీ స్వల్పవిషయముల కతీతులై యెన్ని కష్టములువచ్చినను భయపడక తమగమ్యస్థానము చేరుటకు ప్రయత్నించువారును నిజమయిన మతావేశపరులును ననే కులున్నారని వారెఱుంగవలయును.

పేరునకు మాత్రము క్రైస్తవులనియు నాస్తికులనియు పిలువ బడుచున్నవారు సత్యమును విచారించుటకొరకు నిమున మూగ వలయును. దురహంకారపూరితులగు క్రైస్తవులకును ఉద్రే కపూరితులగు నాస్తికవాదులకును వాదప్రతివాదములవలన క్రైస్తవధర్మముయొక్క నిజతత్వము మరుగుపడి యదియొక వేదాంతముగామాత్రము పరిగణింపబడుచున్నది. ఈ వాగ్వి

వాదములవలన క్రైస్తవమతమునకుగాని నాస్తికధర్మమునకు గాని యెంతమాత్రమును ప్రయోజనము లేదని యందరును గ్రహించవలయును. క్రైస్తవమత ముద్ధరింపబడవలయుననిన పూర్వము మతముకొరకై మహాధైర్యముతో తమప్రాణములనర్పించిన మహానుభావుల కార్యదీక్ష నిరాడంబరజీవనము మనమవలంబింపవలెను. రోమనుచక్రవర్తియగు నీరోను నాస్తికవాదియని ప్రజలు దూషించినట్లు యే చరిత్రకారుడును వ్రాయలేదు. కాని ప్రజలందరును సంతోషభరితాంతరంగులై మృదుస్వరముల పాడుచు నర్తనశాలకరుగుచున్నట్లు చరిత్రయందుగలదు. ప్రజల హృదయముల నాకర్షించుటకు ప్రేమయొక్క మహాప్రభావము గుర్తెరిగి పరనింద మానవలయును. ప్రథమమతకర్తల చారిత్రలు రసగర్భితములుగను ఆనందదాయకములుగను నుండుటచే యెవరయిన నామార్గముల నవలంబించిరేని వారిని "క్రొత్త వేదాంతు"లని పరిహాసముచేయరాదు. వారీమార్గము ననుసరించుట తమాషాకై గాదు. ప్రథమమతకర్తలు త్రొక్కినమార్గము మంచిదని వారు మనస్ఫూర్తిగా నమ్ముటవలన వారీమార్గము ననుగమించుచున్నారు. పూర్వకాలమను నంధకారమునకు యీమహాశయులు చంద్రబింబమువలె నున్నారు. లోకము నావరించియున్న యజ్ఞానతిమిరమును పారద్రోలి విజ్ఞానజ్యోతిని ప్రతిష్ఠించుటకు వారు ద్యుక్తులై యున్నారు. అపారమును శాశ్వతమునునగు మానవప్రపంచమునకు మనమతోద్ధారకులాదర్శప్రాయులై యున్నారు. ఈ మహానుభావుల పవిత్రచరిత్రలు వారి యాడంబర

రహితజీవనములు మానవకోటికై వారు తమ ప్రాణముల నర్పించుట విని హృదయము కరగని వాడెవ్వడుండును. చిత్రములును పవిత్రములును సంసారసాగరమునుండి తప్పించుటకు శక్తిగలవియునగు వారి దివ్యచరిత్రలు విని మన మాశ్చర్యమున దేలియాడుచుందుము. వసంతకాల సౌభాగ్యమును పుష్పవనములయందు గండుకోవెలల గానమాధుర్యమును పర్వతాగ్రముల మీది యావాతపరంపరల చల్లదనమును మన కీబ్రహ్మానందముతో సరిపోవజాలవు. ఈమహాశయుల పవిత్రజీవనములు మనయాత్మలను శుద్ధపరచి మనలను నిష్కల్మషులుగా చేసినతరువాత మన మన్నియుగములందును అన్నిదేశములయందును తమతమ ధర్మములకై యనేక కష్టముల బొందిన మహాశయులవంక మనదృష్టి సారింతుము. మన మెవ్వరిని నిరాకరించము. పవిత్రులగువారు మతభేదములను, జాతిభేదములను సరకుచేయరు. నేను "న్యాయమార్గము నందు ప్రవర్తించుచున్నవారిని పిలుచుటకు రాలేదు. పాపులను పిలుచుటకు వచ్చితిని" అనుక్రీస్తుమహాశయుని వాక్యములను జ్ఞాపకముంచుకొని స్వమతావలంబకులయెడలనే గాక నాస్తికుల యెడలను మతభ్రష్టుల యెడలను మనసానుభూతిని గనబరతుము.

నేను సూచించినమార్గమువలన తత్క్షణమే ఫలము సమకూరెనని చెప్పజాలము. కాని అన్నిపక్షములలో యోగ్యులగువారు తమ ప్రతిపక్షుల యోగ్యతలను గమనించుటవలన మనము ముందంజ వేసిన వారమగుదుమని నిశ్చయముగా చెప్ప

గలను. అనేక దురభిప్రాయములును కష్టములునుగల యీ మతవిషయమునందు నిర్బంధ మావంతయు నుండకూడదు. ఓర్పును ఉదారత్వమును నుండవలయును. క్రీస్తుమతావలంబకు లందరు నాస్తికులను దూషించుటయందు తమకాలమును వ్యర్థముచేయక స్వధర్మానుష్ఠానమునందు శ్రద్ధవహించవల యును. నాస్తికులను యితరమతములవారియెడల నిట్టి సహన భావమే గనుపరచవలయును. ఇతరమతములవా రవలంబించు మార్గము మంచిదికాదని వారు తలచవచ్చునుగాని వారి యెడల నసహ్యభావమును పోగొట్టుకొనవలయును. మత విష యమునం దనేకభేదాభిప్రాయములుండును. ఈయభిప్రాయ భేదములను పరిష్కరించుకొనుటకు వేరుమార్గములు తోచ నప్పుడు ప్రజలు యుద్ధమునకు గడంగెదరు. మనము మత సమస్య యొక్కటియేగాక స్వాతంత్ర్యసమస్యయు పరిష్కరిం చవలయునని మనము జ్ఞాపకముంచుకొనవలయును. ఇట్టి సమయమున మతవైషమ్యములతో గూడిన యంతఃకలహము లలో మనకాలము గడపినయెడల మనము భ్రష్టులమగుదుము. ఇందుకొరకే మనము మతసమస్యను మొదట పరిష్కరించ వలయును. ఈముఖ్యవిషయమునందు నిష్కపటముగా ప్రవ ర్తించుట మిక్కిలి యావసరము. మనము ధర్మమార్గముల నవ లంబించితిమని భయమేమియు నవసరములేదు. అనేకులు మనమార్గముల ననుసరించెదరు. ఉన్నతభావములయెడల నభి మానము చూపెదరు. ధైర్యస్థైర్యములు మాత్ర మావశ్యకము.

పైపూతలవలన నీసమస్యా పరిష్కారము చేయుబూనుట నిరర్థకము. ఈపద్ధతివలన వైర మభివృద్ధియగును. ప్రతివారి ధర్మమును రక్షించుట మన విధియై యున్నది. అట్లుచేయుటవలన పరస్పర విశ్వాస మభివృద్ధి యగును. మానవజాతియొక్క భావిదశ యసమాన సౌభాగ్యభాసురమై యొప్పగలదనుటకు సందియము లేదు.

---

# పదమూడవ ప్రకరణము

## మానసిక స్వాతంత్ర్యము.

యూరపుఖండమునం దెచ్చటను గనపడని మానసిక స్వాతంత్ర్యము ఇర్లండునందున్నదని నేను వచించుట కొంత యాశ్చర్యకరముగా నుండవచ్చును. కాని 'మానసిక స్వాతంత్ర్యము' అనుటవలన యేప్రమాణము నొప్పుకొనని "భావ స్వాతంత్ర్య" మని నాయుద్దేశ్యముగాదు. ఇట్టిది నిజమయిన మానసిక స్వాతంత్ర్యమని చెప్ప బడజాలదు. మూఢత్వమన వచ్చును. ఈవిషయమై యిచ్చట విశదీకరించుట, మనలో ప్రబలియున్న దురభిప్రాయము లన్నిటిని పారదోలి జాతీయ స్వాతంత్ర్యమునకు ముఖ్యావసరమగు నాధ్యాత్మిక స్వాతంత్ర్యము నడ్డుపెట్టుచున్న కొన్ని వాదములను ఖండించుటకు సహకారియగును.

ప్రస్తుత సమయమున "భావస్వాతంత్ర్యము" అను వాడబడుచున్న పదమును గురించి యిచ్చట చర్చించుట నా యుద్దేశ్యముగాదు. కాని మానసిక స్వాతంత్ర్యమును గురించి మాట్లాడుచున్నప్పుడు దీనివిషయమై కొంత చెప్పక తప్పదు. భావస్వాతంత్ర్యవాదులు ప్రజ లనేక విషయములందు తమ యిష్టమువచ్చిన యభిప్రాయములను గలిగి యుండుట కొప్పు కొనెదరుగాని మతవిషయమై స్వతంత్రాభిప్రాయముల నొసం గుట కొప్పుకొనరు. మతమువంటి ముఖ్య సమస్యలయందు రెండు పక్షములుండుట సహజము. వారు మిక్కిలితీవ్రముగా వివాదపడుచుందురు ఒకరియభిప్రాయములింకొకరికి సరిపడవు. ఒకరు "ఔను" అనిన రెండవవారు "కాదు" అనుచుందురు. ఇట్టి విషయమున యొకడు తనయిష్టము ప్రకారమొక సిద్ధాం తమునందు దృఢనమ్మకములు వెలిబుచ్చినయెడల భావస్వాతం త్ర్యవాదులని పేరుబెట్టుకొనిన వారు అతని స్వాతంత్ర్యము నకు భంగముకలుగజేయ ప్రయత్నించెదరు. వారికి తమ ధర్మమునందు పట్టుదలయుండుట సవ్యమని తలతురు. కాని యితరుల విషయమై వారిట్లు తలచకుండుట శోచనీయము. స్వాతంత్ర్యమనగా నొక సిద్ధాంతమునందు నమ్మకము లేకుం డుటయనియు, యేనియమములకును బద్ధుడై యుండక పోవుట యనియుగాదు. గాలివలె స్వేచ్ఛగా నుండుటయని వారు వాదు చుందురు. కాని గాలియు కొన్ని నియమములకు కట్టుబడి యున్నదని వారికి తెలియదు. మనోచాంచల్యము స్వేచ్ఛ

కానేరదు. మనకు ప్రియమైన సిద్ధాంతముల నాచరించి వానికై యే త్యాగమైనను చేయుట మానసిక స్వాతంత్ర్యమని యెఱుంగవలయును.

కావున నిజమయిన మానసిక స్వాతంత్ర్యమనగా నేమియో మనము తెలిసికొనవలెను. తన ప్రత్యేకాభిప్రాయములను గలిగి, ప్రత్యేకమార్గములను ద్రొక్కి గమ్యస్థానము చేరుట కవకాశములను గలుగజేయుట స్వాతంత్ర్యము. మన కార్యమును సాధించుకొనుటకు మనము కొన్ని నియమములను పాటించవలెను. ఒకనికి తనసిద్ధాంతముల యెడల గల భక్తియే, యతని స్వాతంత్ర్యేచ్ఛయొక్క పరిమాణమును విశదపరచును. నేనిట్లు వచించుట కొందర కసందర్భముగా గనపడవచ్చును. ఒక యుదాహరణమువలన నీవిషయము స్పష్టముకాగలదు. ఒకానొకడు పరికరము లేవియులేక సముద్రములో నొక నావయందున్నాడని తలంచుడు. అతడు నిస్సహాయుడు. అతనికి స్వాతంత్ర్యము లేదు. గాలికిని, అలలకును అతడు లోబడవలసి వచ్చును. అతనికి కావలసిన పరికరములు చుక్కాని, తెరచాప, తెడ్డు మొదలగు నవియొసంగితిమేని యుపద్రవములనుండి తప్పించుకొనుట కొక మార్గము ద్రొక్కగలడు. అతడు స్వాతంత్ర్యము పొందగలడు. కాని యీ యవకాశములన్నియు, పాడుజేసికొని యతని నావను మార్గము తప్పించి నడపుటకును నతనికి స్వేచ్ఛగలదు. ఇట్టిసమయములయందతని నావయు, అతడును సముద్రమధ్యమున భ్రష్టు

లగుదురనుటకు సందియము లేదు. అతడు స్వాతంత్ర్యము పొందవలె ననిన యతనిమార్గము స్పష్టముగ తెలిసికొని దాని నవలంబించవలెను.

ప్రస్తుతసమయమున ననేకమందిని భ్రమపెట్టుచున్న మఱియొక యభిప్రాయమును ఖండించవలయును. ఒకడు పక్షపాతరహితబుద్ధి నభినయించి యతని యభిప్రాయముల నితరుల యభీష్టములకై యాహుతిజేసెదనని వచించును. కాని తనసిద్ధాంతములను మనస్ఫూర్తిగా నమ్మినవాడు, తన ధర్మము నావలద్రోసి శత్రువులధర్మమునకు లొంగెదనని యనుట తాను భ్రమజెందియో, లేక యితరులను భ్రమపెట్టుటకో యైయుండును. పైకిమాత్ర మత డట్లగుపడవచ్చును. కాని యత డాచరించునదంతయు తన దృఢవిశ్వాసముల మీాదనే యాధారపడియుండును. అతని నమ్మకము లతని ఛాయవలె నతని నంటియుండును. అతని సిద్ధాంతములను సంపూర్ణముగా విడిచివేసినగాని యత డాభావములనుండి దూరముగా తొలగియుండజాలడు. తనసిద్ధాంతములనువీడి ప్రతిపక్షుల సిద్ధాంతములను సంపూర్ణముగా నొప్పుకొనెనేని చుక్కాని, తెడ్డు, తెరచాప మొదలగు పరికరములులేని నావికునివలె భ్రష్టుడగును. తనయాత్మకుగూడ యతనికి స్వాతంత్ర్యము లేదు. అతని కొక నిశ్చితాభిప్రాయ ముండదు. మరల నతడు పూర్వపు టౌన్నత్యము బొందుట యసంభవము. ఇట్లుకాక తనకు ప్రియమగు సిద్ధాంతముల నాచరణయందుంచిన

యెడల నతని భ్రమలన్నియు పూర్ణముగ తొలగిపోవును. తనసిద్ధాంతములు తాను ద్రొక్కవలసిన మార్గమును సూచించుట లేదని పలుకుట యబద్ధము. అది సాధ్యముకాదు. తనకు మాలినధర్మము లేదు. గావున పక్షపాత బుద్ధి లేనట్లు నటించుటకంటె ప్రథమమున తనధర్మమును రక్షించుకొనుటయు, తరువాత నితరుల ధర్మములను న్యాయదృష్టితో పరికించుటయు భావ్యము. ఇదియే ధర్మమార్గము. అతని కొక లక్ష్యమున్నప్పుడు ఆలక్ష్యమే యతని నడిపించుచుండును. ఈలక్ష్యమును వీడుట తనధర్మమును వీడుటయే యగును.

మానసిక స్వాతంత్ర్యమనిన నిదియే. దీనిని మనము సరిగా గ్రహించిన యెడల మానసిక స్వాతంత్ర్యము లేకపోవుట యనగా నేమో మనకు తెలియగలదు. మానవుల ధర్మములను మరగుపరచి వారిని వివేకశూన్యులనుగా చేయు దురాచారములును మూఢవిశ్వాసములును ననేకములు ప్రబలియున్నవి. కాలము గడచినకొలది నీధర్మసూత్రముల కన్న నీదురాచారములే యధికమై మానవకోటిని తప్పు త్రోవల త్రిప్పుచున్నవి. ఈ యధర్మములను ప్రతిఘటించి రూపుమాపుటకు బుద్ధిబలమును, సామర్థ్యమును మిక్కిలి యవసరమైయున్నవి. మన మీ దురాచారములను ప్రతిఘటించుట యనేకమందికి కష్టముగానుండును. వారీ పద్ధతిని నిరసింతురు. నిష్కళంకమగు ధర్మసిద్ధాంతముల చుట్టు కలుపు మొక్కలవలె ప్రబలుచున్న నీదురాచారములు సంఘమున కుపద్రవము కలుగ

జేయుచున్నవి. అవి విషతుల్యములు. ధర్మసిద్ధాంతములను నందన వనమునందీ విషబీజములు పుష్పరాజములను వృక్షములను ఫలములను నాశనము జేయుచున్నవి. ఈ విషబీజములను మొదలంట నిర్మూలము చేయుటకు సాధారణ ప్రజ్ఞయు, శక్తియు, నిరంతర కృషియు, ఉత్సాహము, ఓర్పు అవసరమై యున్నవి, మూఢావేశపరవశులగు వారు సహనభావమువీడి రోషము తోడను ఆవేశముతోడను, ధర్మప్రతిష్ఠాపనకు బూనకొనిన యోధాగ్రేసరులను ప్రతిఘటింతురు. సత్యపథమునుగ్రహించి యీ మూఢ విశ్వాసములను పారద్రోల ప్రయత్నించు వారిని విశ్వాసఘాతకులనియు, కృత్రిమ బుద్ధి గలవారనియు, అహంభావపూరితులనియు, వెఱ్ఱివారనియు దూషించుచుందురు. ఇట్టి కష్టము లెన్నిగలిగినను అతడు ధైర్యమువదలక, తనసిద్ధాంతముల నాచరణయందుంచ వలయును. అతనికి మనోధైర్యమున్నచో మానసిక స్వాతంత్ర్యము నతడు ప్రకటించును.

ఇంక భావస్వాతంత్ర్యముతోడను, మతముతోడను సంబంధించిన కొన్ని మూఢవిశ్వాసములను తెలిసికొనట యవసరము. మొదట భావస్వాతంత్ర్య వాదిననితలంచువారి విశ్వాసములను చెప్పనిండు. బర్నార్డుషాగారు కనుగొనినట్లు మతబోధకులు ప్రజలుతలచునంతటి దుర్మార్గులు కారని నే నభిప్రాయపడినప్పుడు నేను మానసిక స్వాతంత్ర్యవాదిని కానని యతడు నన్నుదూషించును. నే ననేక సంవత్సరములాలోచించి యీ నిశ్చితాభిప్రాయమును ప్రకటించుటకు నాకుగల హక్కులను

గూడ నతను గమనించను. నేను పూర్వ మొకయభిప్రాయ
మును గలిగియుండి దాని నిప్పుడు వదలి వేసితినని యతడు తెలిసి
కొనినయెడల నన్నాతడు పొగడును. నేను మానసిక హాని
సత్యమునుపీడితినని యాతడు తలచును. అతడు తికమకపడు
చున్నాడని యందరును గ్రహించగలరు. ఒకానొకడు
పూర్వము విశ్వసించుచుండిన దానిని యిప్పుడు వదలివేసి
క్రొత్తసిద్ధాంతము నొప్పుకొనుచున్నానని చాటుటకు మనో
ధైర్యమేమియు నవసరములేదు. దానియందు సారములేదని
గ్రహించినప్పు డతడట్లు చెప్పుటకు భయమొందులకు? తన
సంఘముయొక్క యున్నతికై యాత డొక మార్గమును ద్రొక్క
వలసి వచ్చినప్పు డిట్టిమనోధైర్య మవసరము. అతని
మత మనేక దురాచారములతో గూడియుండుట జూచి
యా దురాచారములు రూపుమాపి, ధర్మము ప్రతిష్ఠింపపోరా
డినయెడల తన యాంతరంగిక స్నేహితులుగూడ యాతని
దూషింతురు. ఇట్టిసందర్భములయం దతడసమాన ప్రజ్ఞను
జూపవలసివచ్చును. ఇదియే మనోధైర్యము.

మతము నాపరించియున్న దురాచారములను రూపు
మాపుట మిక్కిలి కష్టము. నాస్తికవాదులను ఖండించుట
వలన మనకుగల్గు లాభమించుకయు లేదు. అన్ని పక్ష
ములయందును దుర్మార్గులుందురు. మనము వివేకము జూపి
ప్రతిపక్షములోను సత్పురుషు లెవ్వరో గమనించవలయును.
మన సిద్ధాంతములయెడలగల నమ్మకములు, ప్రతిపక్షులను

దూషించుటవలనగాక, కార్యదీక్షవలన ప్రతిష్ఠించవలయును. ప్రతిపక్షమునుండియు మాయలమారులను, కపటవేషధారులను తోసివేయుట మనధర్మమైయున్నది అప్పుడే మనపక్షమునందు సత్పురుషులెవ్వరో తెలియగలదు. స్వజనులను పవిత్రులనుగా చేసికొనుట యెల్లరకును ధర్మమైయున్నది. క్రీస్తుమతావలంబకులు మృత్యుముఖమును ప్రవేశింప శంకించని మన మతకర్తల మార్గము నవలంబించవలయును. మతముకొరకై ప్రాణముల నర్పించవలసిన రోజులు పోయినవని వారనవచ్చును. ఈరోజులలోగూడ నిట్టి మహాత్యాగము చేయుటకవసరము గలదు. కాని మనము సంసిద్ధులమై యుండలేదని వ్యక్తమగుచున్నది. కష్టములు పడలేక మనకు దొరకు నావకాశములన్నియు విడనాడెదము. ప్రతిపక్షులను తీవ్రముగా నిందించెదము. ఇట్టి కపటవేషధారులతో నేమాత్రము సంబంధము నుంచుకొనగూడదు. తనధర్మమును గుర్తెరింగిన కార్యశూరుడు, తన ప్రతిపక్షులయెడల నుదారస్వభావుడును, దయాళువునై ప్రవర్తించును. అతడు సంశయాత్ములు వేయు ప్రశ్నలన్నిటికిని సావధానముగా ప్రత్యుత్తరమిచ్చును. ప్రశ్నలువేయువారి యెడల చికాకుగాని, కోపముగాని, వహింపడు. సందేహము లన్నియు నివృత్తి చేసికొనుటకు ప్రశ్నలు వేయవలసి యున్నదని గుర్తెఱుంగును. న్యూమన్ మహాశయు డిట్లు వ్రాయుచున్నాడు. సందేహము లున్నయెడల నవితీరుటెట్లు? సంశయములను నివృత్తి చేసికొనుటకు ప్రశ్నలు వేయనియెడల తన మూఢత్వముతో తృప్తినొం

దిన వాడగును. కావున ప్రశ్నలు వేయువారిని నిరుత్సాహపరచక వారు వేయు ప్రశ్నలను నిష్కల్మషహృదయములతోడను, ధైర్యముతోడను ప్రత్యుత్తర మిచ్చుటయే గాక, యింక ప్రశ్నలు వేయుటకు ప్రోత్సాహ పరచవలయును. అచ్చటచ్చట కొన్ని ప్రశ్న లడుగుచుండవలయును. ఈవిధముగా ప్రజలు నడచుకొనిన యెడల వారు శత్రుపక్షములకు జెందినవారైనను వారి కొండొరుల యెడ గౌరవమును, సద్భావమును గలుగుననుట నిస్సంశయము. ఇదియే స్వాతంత్ర్యము. ఈ యున్నతాదర్శమునకై ప్రతివాడును శక్తివంచనలేక పాటుబడవలయును. వాచాలత, పరుషత్వము, క్రోధము, ప్రతీకారము, ఒండొరుల బాధించుకొనుట మొదలగు క్రూరకర్మములు మూఢత్వమువలన జనించినవి. ఇవన్నియు ధర్మసూత్రములను కలుపుమొక్కల విధంబున బాధించుచుండును. ఇవన్నియు, మానసిక యస్వాతంత్ర్యమును ప్రకటించుచున్నవి. ఎచ్చట భగవంతునియొక్క. నిష్కళంకమును నిర్మలమును నగు తేజస్సు ప్రకాశించునో యదియే స్వాతంత్ర్యమని యెఱుంగ నగును.

కావున స్వేచ్ఛకై గాఢప్రయత్నములు చేయుటయు, యితరుల నడ్డుపెట్టకుండుటయు, మనముఖ్యధర్మమై యున్నది. ఇతరుల నస్వతంత్రులనుగా జేయుటగాని వారిని తమమార్గమునకు బలవంతముగా త్రిప్పుకొనుటకు ప్రయత్నించుట గాని ధర్మము కానేరదు. బలవంతపెట్టుటవలన యితరులు తనయాభి

ప్రాయమునకు వత్తురని తలచుట భ్రమ. తన హృదయము నందు నమ్మకమేమియు లేకయే నోటిమాటలతో నొక సిద్ధాంతము నొప్పుకొనుటవలన కూడ ప్రయోజనమేమియు గలుగదు. ఇందువలన నుపద్రవము కూడ సంభవించవచ్చును. కావున తాను ధర్మమని గాఢముగా నమ్మినదాని నవలంబించుట యావశ్యక కర్తవ్యము. తా నవలంబించు సిద్ధాంతముల యందేదియైన దోషముండెనేని తనకు గలిగిన యనుభవముచే దానిని దోషరహితముగా చేసికొనవలయును. సత్పురుషుల కిదియొకటియే మార్గము. ఈమార్గము నెవ్వరు నిరోధించరాదు. ప్రతివానికిని స్వధర్మము కాపాడుకొనుట విధియైయున్నది. జీవయాత్రయందు స్థైర్యము, నిశ్చలత్వము, దూరదృష్టిగల వారు ముందు నడచెదరు. పురుషప్రయత్నములేనిది భగవంతుడు సాయపడడు. తనసామర్థ్యము కొరతపడునేమో యని దానినుపయోగించని శక్తివాడెచ్చటనైన నుండునా? అట్టివాడెవడైన నుండిన నతడు నరకమునకు బోవును. భక్తిశ్రద్ధలు గల వానికేదియు నసాధ్యముగాదు. ఊరక వాదవివాదములు పడుటకంటె తమసిద్ధాంతముల నాచరణయందుంచి చూపుడని కోరుట యనేకమంది కాశ్చర్యముగొల్పవచ్చును. నేను వ్రాసినవ్రాతవలన భావస్వాతంత్ర్యవాది తాను పోవలసినంత దూరము పోవుటలేదని తెలిసికొనుట కాశ్చర్యపడును. నేను సూచించిన పరీక్ష యాతనికి మిక్కిలి కఠినముగా నుండునుగాని యిదియొక్కటియే నిజమైన పరీక్ష. తనశరీరము నశించినను ఆత్మ నాశముకాదని నమ్మినవాడును, అనేకకష్టముల కోర్చి

ష్మైనను మొక్కలి పట్టుదలతో కృషిచేసినయెడల తరతరముల వారును తమకీర్తి గానముచేయుదురని నమ్మినవాడును తన ధర్మమును చక్కగా నెరవేర్చును. కష్టములనుకోరక తన మార్గమునందనేక యుపాయములున్నవని వెరువక, తనవిధిని ధైర్యముతో నెరవేర్చు నావికశిఖామణులచందమున ప్రతివాడును తనవిధిని నెరవేర్చవలెను. ఇతరుల వాక్కులనుగాని, సిద్ధాంతములనుగాని యతడు నిరోధించకుండవలెను. శాశ్వతమును, ప్రశస్తమునునగు మార్గము నవలంబింపుడని వారిని ప్రబోధించుచున్నాను. చాలమంది నిష్ఠాపరులును, సత్యమగు మతావేశముగలవారును యీవిధముగా నాలోచించుట కలవాటుపడియుండలేరు. మరియు అరాజకులు, నాస్తికులు, కాఫరులు, చండాలురు విచ్చలవిడిగా సంచరించి మతమును భ్రష్టుచేయుచున్నారని రోదనముచేయువారును, అనేకమంది యుందురు. ఇది సత్యముకాదని మనము ఖండించవచ్చునుగాని కొంచెముసేపిది నిజమనియే తలంతము. క్రైస్తవమతము బోధించుచున్న యున్నతధర్మముల నాచరణయందుంచుట క్రైస్తుమతావలంబకుల ధర్మముకాదా? ఇట్టియవసరము మనకగుపడుచున్నను ఆసిద్ధాంతముల నాచరణయందుంచరేల? నాస్తికులకు యిట్టిధర్మములు విధించబడి యుండలేదు. క్రైస్తవులకిట్టివి నిర్దేశింపబడియున్నవి. అతడీ ధర్మముల నవలంబించక యేల యుపేక్ష చేయుచున్నాడు? మానవదౌర్బల్యమని యతడనిన మన మొప్పుకొనవచ్చునుగాని యిట్లు చెప్పక తమ దుర్గుణములను గొప్పజేసికొనుట యసహ్యకరముగా నున్నది.

మన వేదాంతమునం దెన్నియో మంచివిషయములున్నవి. కాని వానిని తలచినవాడే లేడు. మానవులు తమకు నిర్ణయించిన విధులను సరిగా నెరవేర్చిన యెడల విప్లవములతోడను, యుద్ధములతోడను నవసరమే లేక యుండును. శాంతియుతమును సవ్యము నగు విప్లవములు మననీచభావములను పారద్రోలి మనలను పవిత్రులనుగాఁ జేయును. కాని ప్రస్తుతసమయమున మనమొక యెడారిలో త్రోవ తెలియక వెతుకులాడుచున్నాము. ధర్మయుగము చూపుమేరలో నెచ్చటను గానుపించుట లేదు. కావున యీవిషయములను విశాలదృష్టితో చూడవలయును. మనకు గాఢమగు భక్తియు శ్రద్ధయు నున్న యెడల ధర్మమార్గము నరిగట్టిన దురాచారములన్నియు నదృశ్యమగు ననుటకు సందియము లేదు. కాని యీకార్యమునందు మనకు భక్తిశ్రద్ధలు చాలకపోవుటచే భీతచిత్తులమై యున్నతరి 'భయపడకుము, విశ్వసింపుము' అను గంభీరపదములు మనకు ధైర్యోత్సాహములొసంగవలెను.

# పదునాల్గవ ప్రకరణము

## సైనిక వ్యవస్థ

స్వాతంత్ర్యము సంపాదించుకొనుటకు గాని సంపాదించిన స్వాతంత్ర్యమును రక్షించుకొనుటకుగాని, యుద్ధము చేయుటకు ప్రసిద్ధులమై యుండవలెను. చరిత్రయందీ సత్యమే వెల్లడియైనది. ఇప్పుడును, యిదియే వెల్లడి కాచున్నది. కాని యీ సమయమున వివిధజాతుల సైనిక వ్యవస్థలు, ప్రతిజాతికిని హానిగలుగు యుద్ధమున కాటంకము గలుగజేయుచున్నవి. మరియు తప్పక పోయినపుడు స్వతంత్రులగు ప్రజలు దౌర్జన్యమునకు దిగక తప్పదని మనము సిద్ధాంతీకరించినప్పుడు దౌర్జన్య మార్గమునకు ప్రతికూలముగా తీవ్రవాదములు బయలుదేరుచున్నవి. యుద్ధముయొక్క నీతినిగురించి మనము చర్చించుటకు ముందు మనలో కొంతమందిని భ్రమపెట్టుచున్న యంశములను గురించి స్పష్టముగా తెలిసికొనుట యావసరము. సైనిక పరిపాలనముయొక్క దుర్మార్గమునుగురించి మనకేమియు సందేహముండ నవసరములేదు. కాని సైన్యవాదమునకు ప్రతికూలముగా ప్రబలుచున్న యభిప్రాయములను మనము తెలిసికొనిన యెడల యెట్టి విరుద్ధ భావములు ప్రకటింపబడుచున్నవో వ్యక్తము కాగలదు. ప్రస్తుత సమయమున ప్రబలియున్న భావములను పాఠకుల నిమిత్తమై బట్టబయలు చేయుట యావసరమని తలచితిని. నేను వ్రాయు

వంశములవలన బలవంతులగు ప్రజలు బలహీనజాతుల నడం చుటకు మాయోపాయములు బన్నప్రయత్నించుచున్నట్లు వ్యక్తముకాకమానదు. ఈవిషయమై రెండుగ్రంథములలో సూచించినభావములను పాఠకులకు విశదపరచుచున్నాము. ఒకటి నార్మన్ యాంజెల్ (Norman Angell) గారు రచించిన 'గొప్పభ్రమ' యనుపుస్తకము. రెండవది జేక్సునోవికొ (Jaques Novikov) గారు రచియించిన 'యుద్ధము, దానివలన లాభములు.' యాంజెల్ రచియించిన గ్రంథమునందు బలవంతులు బలహీనజాతుల నడంచెడు విధమునుగురించియు నోవికొగారి గ్రంథమున సైనికవ్యవస్థకు ప్రతికూలవాదములను గురించియు తెలుపబడియున్నవి. నోవికొగారి యభిప్రాయములతో మన మేకీభవించగలము. స్వాతంత్ర్యవాదులందరును, నోవికొ ప్రభృతులు సూచించెడు యభిప్రాయములను తెలిసికొని యుండుట శ్రేయస్కరము. వారిలో మనకనుకూలురగు వారు పెక్కుమందిగలరు. యాంజెల్ గారి గ్రంథమట్టిదిగాదు. అది మనవాదముల కన్నిటికిని ప్రతికూలముగానున్నది. అతని వ్రాతలలో ముఖ్యవిషయము లివి. నీతియొక్క మూలము స్వార్థపరత్వము. బలవంతమగు జాతులొండొరులతో యుద్ధము చేసి నాశమయినయెడల లాభమేమియు లేదు. వారందరును బలహీనజాతుల స్వతంత్రులుగాచేసి వారిదేశముల నాక్రమించుకొని, వానిని తమసేనలతోడను, రక్షకభటులతోడను కాపాడుకొనవలయును. రాజ్యకార్యధురంధరులకును ధనస్వాములకును భేదాభిప్రాయములు గలిగినప్పుడు, ధనస్వాము

లకు ప్రతిదేశమునందును పలుకుబడి యుండుటచే రాజనీతిజ్ఞులకన్న నెక్కుడు బలవంతులుగనుక, ధనస్వాములు వారి నొప్పించవచ్చును. దేశభక్తులీ వ్రాతలప్రధానతను గుర్తెరింగి ధనస్వాముల దుర్నయములను విఘాతము చేయవలయును. ఇట్లు చేసినచో యాంజెల్ ప్రభృతులు గొప్పభ్రమయందు పడియున్నారని నిరూపించగలము.

ఈ గ్రంథమును గురించి విస్తరించి వ్రాయుటకు చోటులేదు. ముఖ్యవిషయములు పాఠకులకు బాగుగా బోధ యగునట్లు కొన్ని భాగముల నెత్తివ్రాసెదను. ఈగ్రంథములో వ్రాయబడిన యంశములు మిక్కిలి ప్రమాదకరములగుటచే జాగరూకతతో విమర్శించుచున్నాను. పాఠకులు మూలమును పూర్తిగా చదువుట యావసరము. నేను కొన్ని వాక్యములను వానిసందర్భముల నుండి విడదీసితినేమో యని పాఠకు లభిప్రాయపడనవసరము లేదు. నే నుల్లేఖించు వాక్యములన్నిటిలోను ఒకటే భావము వెల్లడి యగుచుండుటచే, పాఠకుల మనములయందు సంశయము లేమియు నుండనవసరము లేదు. నేనీ గ్రంథములోని విషయములను మూడుభాగములుగా విభజించుచున్నాను.

౧ సాంఘిక ధర్మము.

౨ ధనముయొక్క శక్తి.

౩ పంచుకొనుట.

## (౧) సాంఘిక ధర్మము.

స్వార్థమే సాంఘిక ధర్మముయొక్క మూలము. (గొప్ప

భ్రమ, ౩ సంపుటము పేజీ ౬౬.)

'స్వార్థరహితమగు దేశభక్తి ప్రస్తుతసమయమున స్వార్థపరత్వముయొక్క యొత్తిడిచే మారిన ట్లనేకసూచనలు గనబడుచున్నవి. సముద్రముమీద యోడలను కొల్లగొట్టుట ఘనకార్యమే. అందుకు సందేహము లేదు. 'కాని యది వ్యవహారము కాదు.' (ఇవి యాంగ్లేయదేశమును పాలించిన డేన్సు రాజులను గురించి చెప్పినమాటలు. ౨౪౫ పేజీ)

'శాంతివాదుల ప్రచారము, అపజయము పొందినందుకు ముఖ్యకారణము, భౌతికవిషయముల కంతప్రాముఖ్యత యొసంగనందులకే. (పేజి ౩౬౧)

(౨) ధనముయొక్క శక్తి.

ప్రస్తుత ఆర్థికసమస్యలవలన గలిగిన చిక్కులచే లండన్ నగరముమీద న్యూయార్కు, ప్యారిస్ మీద లండన్, బెర్లిన్ నగరముమీద ప్యారిస్ పూర్వముకన్న నెక్కుడుగ నాధారపడి యుండవలసివచ్చినది. (పేజీ ౪౭)

'ఈసమయమున బ్రిటిషు ధనమునకుగల పలుకుబడి యంతయు బ్రిటిషు ప్రభుత్వమునకు ప్రతికూలముగా తిరుగకుండినయెడల మిక్కిలి యాశ్చర్యకరముగా నుండును. (హాంబర్గు పట్టణమును ఆంగ్లేయులు పట్టుకొనినారని తలచినపుడు చెప్పినవి.)

'నిరంకుశచక్రవర్తులలో మిక్కిలి ఘనులును, ధనికులను లోబరచుకొనజాలరు. (పేజీ ౨౨౬) ప్రతిదేశమునం

దును ధనవంతులు గొప్ప పలుకుబడి గలిగియున్నారు. కాన వేరుగా వారిపక్షమున కృషిచేయుటకు సంస్థాపన లవసరము లేదు. (౨౬౯)

(3) పంచుకొనుట.

యాల్జీరియాను జయించుటవలన ఫ్రాన్సు దేశమును, భారతదేశమును జయించుటవలన ఇంగ్లండును, చాలలాభము పొందినవి. ఈ దేశములలో ప్రజలను తమవశము చేసికొనుట కాయుధము లుపయోగింపబడక పోయినను, జయించబడిన దేశమును రక్షించుకొనుట కుపయోగపడినవి.

'జర్మనీదేశములో సామ్రాజ్యవాదులు, తమదృష్టిని కెనడావైపున కెప్పుడును త్రిప్పియుండలేదు. వారు గపి.రూ మైనర్ మీదా కన్నువేసియుండిరి. ఇప్పటికిని యట్లే చేయుచున్నారు.

'ఏషియామైనర్ దేశము, జర్మను యేర్పాటులను గాని, చట్టములనుగాని యొప్పుకొనని స్వతంత్రరాజ్యముగా నుండుటకంటె, జర్మను చట్టములకును, ఆజ్ఞలకును విధేయత జూపు అస్వతంత్ర రాజ్యముగా నుండుట మనకు లాభకారి!'

సర్ హెన్రీ జాన్‌స్టన్ (Sir Henry Johnston) అను నాతడు ౧౯౨౦ డిసెంబర్‌నందు ప్రకటింపబడిన నైన్‌టీంత్ సెంచరీ (Nineteenth Century) అను పత్రికయందు యీ యభిప్రాయముల తత్వమును గ్రహించి యిట్లువ్రాసెను. "ప్రపంచములో బలహీనజాతులవారిపక్షము వహించుట

మాధర్మమని మేమెఱుంగుదుము." వీరెరింగిన ధర్మమేదియో పాఠకులు గ్రహింతురుగాక! బలహీనజాతులను బలాఢ్యు లెట్లు పీడించుచున్నది లోకమెరిగిన విషయమే. ఈమాటలలో కపటము స్పష్టముగా కనబడుచున్నది.

నేసీతని గ్రంథమునుండి యుల్లేఖించిన యీయంశములు పాఠకులకు సందర్భములను స్పష్టముచేయక మానవు. బలహీన జాతులను బలాఢ్యులు 'రక్షించుట' యనుట యేమియో మన మెరింగినదే. తేట తెలుగునందు దీనిని దోపిడియన వచ్చును. సామ్రాజ్యక స్వరాజ్యమును బడసిన కెనడా, ఆస్ట్రేలియా, మొదలగు రాజ్యములు, యీపద్ధతుల నొప్పుకొనవు. యాంజెల్ వ్రాసిన మరియొక వాక్యము జూడుడు. వారి యిష్టమువచ్చినట్లు చేయనిచ్చినయెడల వారిని జయించుటవలన మనకేమి లాభమో యోచింపుడు. దక్షిణ ఆఫ్రికానుగురించి యతడీనిర్దయాత్మకమగు భావమును వెలిబుచ్చుచున్నాడు.

"ప్రస్తుతము ట్రాన్సువాల్ ప్రభుత్వము బోయరువారి హస్తగతమైయున్నది. జర్మనీదేశము ట్రాన్సువాల్ దేశమును జయించదలచుకొనినయెడల, బ్రిటిషువారవలంబించుచున్నపద్ధతి దాక్షిణ్యమువలన నవలంబింపబడినదిగాదనియు, అనేకయనుభవములను బొందినమీదట యాంగ్లేయులట్లుచేసిరనియు, జర్మనులు గ్రహించవలయును." ఈతని యభిప్రాయములు మనకు తెలియుచునేయున్నవి. ఈవిషయమై మనమతనికి కొన్నిగుణపాఠముల నేర్పవలసియుందుము. ఐర్లండు విషయమై

యీగ్రంథకర్త మఱచిపోలేదు. మార్నింగుపోస్టువార్తాపత్రికలో నొక డీయభిప్రాయమును వెలిబుచ్చెను. 'తాము ధర్మమనినమ్మిన సిద్ధాంతముల నాచరించనీయక, యనేక నిర్బంధములను పెట్టినను దౌర్జన్యము నుపయోగించి తమ్మణగద్రొక్కవలెనని ప్రయత్నించినను లొంగక మిక్కిలి ధైర్యముతో త్యాగముచేయువారు ప్రతిజాతియందును నుండుట మానవస్వభావముయొక్క గంభీరతను,ఉత్కృష్టతను, చాటుచున్నది.' ఈవాక్యమును యాంజెల్ చూచి క్రోధముతో నిట్లువిమర్శించెను. 'మార్నింగ్ పోస్టుపత్రికలో నీవాక్యములు గనబడుట యాశ్చర్యకరముగా దోపకమానదు. ప్రస్తుతసమయమునందు ఈజిప్టు ఐర్లండు దేశములయందును, భారతదేశమునందును, ఇంగ్లండునకు వ్యతిరేకముగా జరుగుచున్న యాందోళనము నీ పత్రిక యొప్పుకొనుచున్నట్లు యీవాక్యము వ్యక్తముచేయుచున్నది.' ఈతడు వ్రాసినదానిని నేను విమర్శించను. ఈయెత్తిపొడుపుమాటలు మనకు స్పష్టముగుచునే యున్నవి. ఈపుస్తకమెన్నిసార్లు చదివినను సదుద్దేశ్యము గానరాకున్నది. ఈదుర్నయములను ఖండించినగాని, యీభావములవలన లోకమునకు గలిగెడి యుపద్రవములు తొలగిపోవు. ఈ 'వెనుకపడియున్న జాతులలో' స్వార్థమెరుగని జాతియొకటిగలదు. (ఐర్లండు) రస్కిన్ మహాకవి మరియొకసందర్భమున వచించినట్లు తమ యాత్మబలప్రకర్షణముచే నీధనస్వాముల దుర్నయములను విచ్ఛిన్నముచేసి, యాంజెల్ ప్రభృతుల నీజాతి భంగపరచునని నేను నమ్ముచున్నాను.

సైనిక వ్యవస్థకు ప్రతికూలముగా యభిప్రాయము నొసంగిన మహాశయుల యోగ్యతను, వారి భావముల సత్య మును మనము మఱువరాదు. నోవికోగారి గ్రంథమునకు 'యాంజెల్' ఉపోద్ఘాతము వ్రాయుట వింతగానున్నది వా రిద్దరును శతుపక్షములకు జెందినవారని వారి యభిప్రాయ ములు వ్యక్తము చేయుచున్నవి. నోవికో "వెనుకపడియున్న జాతులను రక్షించుట" యనెడు కపటరాజ్యతంత్రము నొప్పు కొనడు. అతడు వంగదేశీయుల నిట్లు ప్రశంసించు చున్నాడు. 'వారి హక్కులకు భంగము కలుగజేయని యెడల వారుతల లెత్తి తిరిగెడివారే. వారికి ధైర్యగాంభీర్యాది గుణము లుండె డివే. వారి పతాకముగూడ యాంగ్లేయుల జయపతాకము వలె నున్నతముగా నెగురు చుండెడిదే.' అతడొకొక్కచోట యితరులను హాస్యముచేయుచుండెడిను యితరుల సుగుణము లను పొగడుట యందుగూడ సమానముగు నుత్సాహ మున్నది. ఇంకొకచోట యతడే గంభీరభావమును వెలి బుచ్చు చున్నాడు. "ప్రతిజాతియు, ముఖ్యముగా ఫ్రెంచి వారు, తమహక్కులను, ప్రాణత్యాగము చేసియైనను రక్షించు కొనవలెను. నే నాక్షేపించినది తమధర్మమును రక్షించుకొను వారినిగాదు. ఇతరుల హక్కులను భంగ పరచువారినై యున్నది." (పేజి ౭౦) అతడు నైతికావశ్యక తను యావల ద్రోయడు. 'రాజకీయ పారతంత్ర్యము ప్రజ లయం దనేక యధర్మములను పుట్టించును' అనియాతడు వ్రాసెను. పవిత్రోద్యమములలో తమ ప్రాణములను గో

లోఁబోయిన వారివిషయమై యతఁ డిట్లు చెప్పుచున్నాఁడు. "అవమానము పొందుటకంటె మరణమునొందుట కొప్పుకొనిన వీరులకు నాహృదయపూర్వక సానుభూతిని తెలియఁబరచుచున్నాను." ఇవి మిక్కిలి ప్రశంసనీయమగు వ్రాఁతలు. లోకశాంతికొఱకై వ్రాయు ప్రతివాఁడును నిట్టివిషయములే వ్రాయును. ఎమర్సన్ (Emerson) 'యుద్ధము' అను వ్యాసమునందు శాంతికొఱకై ప్రజల నుద్బోధించుచున్నాఁడు. కాని యీవ్యాసము నం దీక్రింద పొందుపరపబడిన వాక్య మగుపడుచున్నది.

'భోగపరాయణుల నిమిత్తముగాని, భీరువుల నిమిత్తముగాని శాంతి నెలకొల్ప ప్రయత్నించితిమేని, మనము నెలకొల్పగల శాంతి నిజమయిన శాంతిగానేరదు. ఇదివట్టిభ్రమ. తుచ్ఛమైనది. ఈశాంతి నిలువనేరదు. యుద్ధమే యింతకన్న మంచిది.' ఇంకొకచోట రాజకార్యములను గురించి ముచ్చటించుచు నతఁడిట్లు వ్రాయుచున్నాఁడు.

"ప్రజలందరును కలసి స్వాతంత్ర్యము బడయవలెనని ప్రయత్నములు సల్పినయెడల; వారు తమ ప్రయత్నములయందు సఫలమనోరథులగుదురు. అతిజాగ్రతగా ప్రవర్తించువారును, సంశయాత్ములును, భంగపడెదరు. ప్రజలసామర్థ్యమునకు మించిన ఫలముచేకూరును." మన ఐకమత్యమువలన స్వాతంత్ర్యము చేకూరునని నిరూపించెదము.

# పదునైదవ ప్రకరణము

## సామ్రాజ్యము

సామ్రాజ్యస్థ స్వరాజ్యము నొసంగెదమని యాంగ్లేయులు వాగ్దానము చేసినపుడు ఆంగ్లేయ సామ్రాజ్యము లోకము లో నితర సామ్రాజ్యము లన్నిటికంటె శ్రేష్ఠమయినదని పొగడువా రనేకులు బయలుదేరినారు. శీఘ్రముగా హోంరూలు లభించుటయు కొంతమేలే. మనకిది లభించినతరువాత మునుపటికంటె నతితీక్షణముగా సామ్రాజ్యముతో ముఖాముఖిని పోరాడవలసివచ్చును. ఇంతదనుక మనముచేసిన పోరాటము యొక్క తత్వము స్పష్టముగా బోధపడినట్లు గనపడదు. హోంరూలుకొఱకై పోరాడుచున్న మహాశయులు తాము సామ్రాజ్యముతో పోరాడుచున్నామని గమనింపలేకపోయిరి. హోంరూలు చూపుమేరలో నున్నది గనుక, అది లభించినతరువాత, ఐరిషుజాతికిని, ఆంగ్లేయసామ్రాజ్యమునకును మరియొకపోరు జరుగనున్నది. అప్పుడు మనకు సంపూర్ణస్వాతంత్ర్యము లభించక తప్పదు. కానిప్రస్తుతసమయమున సామ్రాజ్యమువిషయమై యనేకయసత్యములును, బూటకములును చెప్పబడుచుండుటచేత సామ్రాజ్యముయొక్క ముఖ్యోద్దేశమును బట్టబయలు జేసి దాని నిరంకుశస్వరూపము, క్రూరత్వము లోకమునకు వెల్లడిపరచి

యితరజాతులను కూడ నిట్లే లోబరచుకొనుటకు వారి పన్నాగము లన్నియు ఖండించవలయును. మనకు గల యీనుభవమువలన సామ్రాజ్యముతో సంబంధము మనకేమియు లాభకారి కాదని వ్యక్తమగుచున్నది. సామ్రాజ్యము మన కనర్థదాయకము. మనము దానినుండి తప్పించుకొనుటకు ప్రయత్నించుటయే గాక, దానివలలో ముందెన్నడును పడకుండునట్లు జాగరూకులమై యుండవలెను. ప్రపంచములో మనవలె సామ్రాజ్యములతో పోరుచున్న ప్రతిజాతికిని చేయూత నొసంగ వలయును.

మాక్యవెల్లీ (Machievalle) యనునతడు యీసామ్రాజ్యస్వరూపము నొకగ్రంథములో చక్కగా వివరించి యున్నాడు. ఈగ్రంథమును పఠించుటవలన యీవిషయమై మనలో ననేకులకు గల భ్రమలన్నియు తొలగిపోవును. సామ్రాజ్యమును పొగడి దాని నుద్ధరించుటకు ప్రయత్నించువారు మాక్యివెల్లీ తనగ్రంధమునందు వెలిబుచ్చిన యభిప్రాయములను జూచి యసహ్యపడినట్లు నటింతురు. మెకాలేయభిప్రాయములను గురించి ముందువ్రాసెదను. కాని యీ కపటవేషములవలన మనము మోసపోవకూడదు. మాక్యివెల్లీ రచియించిన 'రాజకుమారుడు'(The Prince)అను, గ్రంధమును పఠించనివారు నేనిక్రిందనుల్లేఖించువాక్యములను జాగరూకతతో పరిశీలింతురుగాక. ఈవిషయమువలన ఐర్లండుదేశములో నాంగ్లేయ పరిపాలనాస్వరూపము మనకు తేటపడగలదు. మరియు సామ్రాజ్యములు మిక్కిలి యుప

ద్రవకరములనియు, నధర్మ భూయిష్ఠములనియు తెలిసికొని, మిక్కిలి యుత్సాహముతోడను, ధైర్యముతోడను, యెడతెగని కార్యదీక్షతోడను, కృషిజేసి భూతభేతాళ పిశాచగణమును పారదోలుటకు మనమెంత పట్టుదలతో ప్రయత్నించెదమో, యంతి పట్టుదలతో ప్రయత్నించి రూపుమాపవలయునని వ్యక్తముకాకమానదు. ప్రప్రథమమున రాజకుమారు డితరరాజ్యములమీదికి దండెత్తి వారిదేశము నాక్రమించుకొను విధమును వర్ణించుచున్నాడు. "ఇట్టిసమయములయందు సాధారణముగా ననుసరించెడు పద్ధతియిది. ఒకానొక రాజ్యమున విదేశీయప్రభువు ప్రవేశించినప్పుడు ఆ దేశములో బలహీనులును, తమరాజుపై ద్వేషభావము గలవారును, యీప్రభువుపజ్జజేరి యీతనికి కావలసిన సహాయము చేయుదురు. ఇట్టివారిని తనపక్షమున చేర్చుకొనుటకు యీప్రభు వెన్నిప్రయత్నముల నైనను జేయవలసియుండును వీరందరును కలిసి ప్రతిపక్షుల నోడించినప్పుడు దేశ మాప్రభువునకు వశమగును. ఈతనికిసహాయము చేసినవారును అణగద్రొక్కబడుదురు. దేశమును జయించినవాడు, తనకుసాయముచేసినవారు బలవంతులు కాకుండ కనిపెట్టియుండవలెను. వారికి గొప్పయధికారము నివ్వకూడదు. ఇట్లు చేసెనేని తనసైన్యముల సహాయములచే పరరాజ్యములను గూడ జయించును. తానుజయించిన రాజ్యములయందు నిరంకుశ ప్రభువుగా నొప్పుకొనబడును." ఈక్రింది వాక్యములయందు కలహములనుబెట్టి రాజ్యము చేయుపద్ధతి విశదీకరింపబడినది.

“ఒక దేశమునందు ప్రవేశించుటకై యేదియైన నెపముండుట మంచిది; మార్క్యవెల్లీమతము నాశ్రయము జేసికొని దేశము ప్రవేశించు ప్రభువునుగురించి యాంగీకారముజూపియున్నాడు. ఆదేశమును ప్రవేశించినతరువాత యాతడు తీవ్రచర్యల ననుసరించవలెను. నిరంకుశముగా ప్రవర్తించవలెను. ‘ఏదేశమునైనను అపహరించినవాడు తత్క్షణమే యాతని కవసరమని తోచు క్రూరచర్యల నన్నిటిని, నిర్దాక్షిణ్యచిత్తముతో నవలంబించవలయును.” ఇది చదువునప్పుడు ‘క్రాంవెల్ జ్ఞాపకము వచ్చుచున్నాడు. “ఒకప్రభువు, తాను నిర్దాక్షిణ్యుడని ప్రజలాడుకొను వాక్యములను గమనింపకూడదు. వారిని తనకు లోబడియుండునట్లుచేసికొనుటయొక్కటియే యాతనికర్తవ్యము.

“స్వేచ్ఛ ననుభవించుచున్న యొకపట్టణమును జయించి, దానినెవ్వడు ధ్వంసముచేయడో యాతడు గొప్పతప్పితమును జేసినవాడగును. అతడే నాశమైపోగలడు. ఏలనన, యానగరవాసు లాతని పరిపాలనకు తిరుగుబాటు గావించదలచుకొనిన మొదటి స్వాతంత్ర్యమును మిషనో, లేక వారి పూర్వయాజమాన్యమును దలచియో తిరుగబడెదరు. ఈభావములు దాక్షిణ్యమువలన నెన్నడును నాశముకాజాలవు ప్రజలను సంపూర్ణముగా నాశముచేయజాలని పక్షమున వారిని లోబఱచుకొనుట కింకొకమార్గముగలదు. ప్రజలను బుజ్జగించి, ముఖస్తుతులతోడను, తియ్యని మాటలతోడను, వశపరచుకొనవలయును” ఈవాక్యములు ఐరిష్ప్రజలను బిరుదులవలనను లంచములవలనను, అధికారులు లోబరచుకొనువిధమును జ్ఞాపకము

దెచ్చుచున్నవి. మరల నతఁడిట్లు చెప్పుచున్నాఁడు. “అనాది నుండియు స్వాతంత్ర్యము ననుభవించుచున్న పట్టణమును ఆపౌరుల సహాయముచేతనే లోఁబరచుకొనవలయును గాని వేరు మార్గమున నిది సాధ్యముకాదు.” ఉద్యోగములకై ప్రయత్నములు సలుపుట, రాజుగారియాగమనము, వారి కొసఁగు సన్మానపత్రములు మొదలగునవి మనకు జ్ఞాపకమువచ్చుచున్నవి. జయించినదేశమును భద్రముగా నుంచుకొనుట కతఁడీపద్ధతినిసూచించుచున్నాఁడు. “ఒకానొకఁడొక క్రొత్తదేశమును జయించి స్వదేశమును కలుపుకొనినపుడు, తనకు సాయముచేసిన వారినితప్ప తక్కినవారి నందరను, ఆయుధరహితులుగా చేయవలయును. ప్రజలను క్రమక్రమముగా దుర్బలులుగను, సోమరులుగను జేసి నిస్సహాయస్థితికి దేవలయును. దేశమంతయు నతనిమీద యాధారపడి యుండునట్లు చేయవలయును. ఈవాక్యములు ఆయుధశాసనములను, మనదేశపు దుర్బలస్థితినిజ్ఞప్తికిదెచ్చుచున్నవి. కొంతమందినిఆయుధరహితులనుగాజేసి, మరికొందరను లంచములవలన లోఁబరచుకొనినతరువాత వీరిరువురను విశ్వాసఘాతము చేయవచ్చును. “వివేకియగు ప్రభువు తాను జేసినవాగ్దానములు తనకు హానికరములుగా నున్నపుడును, అతనియుద్దేశ్యము లదివరకే నెరవేరినప్పుడును, తనవాగ్దానములను పాటించగూడదు. అతనియభిప్రాయములను స్పష్టము చేయక, కపటవర్తనగలవాడుగా నుండుట యావసరము” సంధిషరతులనుపాటించక పోవుటయు, యితర విశ్వాసఘాతుకములును జ్ఞాపకమువచ్చుచున్నవి. మనము గౌరవనీయులవలె

నటించవలెను. ఈవిషయమున నతడిట్లు వ్రాయుచున్నాడు. "మైత్రిగాను, దాక్షిణ్యముగాను, నిష్కాపట్యముగాను, మర్యాదతో ప్రవర్తించువాడుగను నగుపడుట మిక్కిలియావసరము. ఇట్లునడుచుకొనుట మంచిదిగాదని నేను చెప్పుటలేదు. కాని యావసరమయినయెడల దానికివ్యతిరేకముగా నడుచుకొనుటకు వెనుదీయగూడదు. తనయవగుణములవలన నపకీర్తిపాలైనను దానినేమాత్రమును లక్ష్యముచేయరాదు. ఈ కపటము మోసము, అతని రాజ్యమునిలుపుకొనుట కవసరములు."

ఇంతవరకు మాక్యవెల్లిగారి తత్వమును వ్రాయుచుంటిని. 'అనాగరిక జాతులవారికి' నాగరికత ప్రసాదించెదమని కపట వాక్యములను పల్కు సామ్రాజ్యవాదుల మాటలువినుట కసహ్యపడినట్లగుపడుదురు! కాని వీరికాపట్యము మనకు బాగుగా తెలిసియేయున్నది. ఐర్లండుదేశమునందు, ఆంగ్లేయపరిపాలనమును చక్కగపరిశీలించి, యాసిద్ధాంతములమీద నీగ్రంథమును మాక్యవెల్లి మిక్కిలి చతురతతోడను, హృదయమునాకర్షించుశైలిని వ్రాసినట్లు మనకు గోచరించకమానదు. ఈ యభిప్రాయములకు మాక్యవల్లిమహాశయునికి మనమెంతయో కృతజ్ఞులముగా నుండవలయును. అతడు రాజకుమారునికి చేసిన యుపదేశమువలన యాతనికాలములోజరుగుచుండిన కుట్రలు, ద్రోహములు మొదలగునవి మనకు తెలియుటయేగాక, ప్రస్తుతసమయమున సామ్రాజ్యముల స్వరూపము గూడ విశదమగుచున్నది.

మాక్యవల్లిమహాశయుడు నాలుగుశతాబ్దముల క్రిందట, ఇటలీదేశములో బ్రతికియుండెను. అతడు రచియించిన "రాజకుమారుడు" ప్రస్తుతసమయమునకు సరిగా యతికియుండుటచే మన మొకనీతిని నేర్చుకొనవలయును. సామ్రాజ్యములన్నియు నిశ్శేషముగ నొరిగి, యాంగ్లేయ సామ్రాజ్యముతో నేసంబంధమును కలిగియుండకూడదు. పూర్వము చేయబడిన దురాగతములేవియు నీకాలమున చేయబడవని మనము తలచకూడదు. మన దేశములో బయలుదేరుచున్న సామ్రాజ్యవాదులు, తా మేదేశమునైన పరిపాలించుచున్నయెడల, న దేశములో నిట్టి క్రూరచర్య లవలంబించిరేని, తమకు మితిలేని యప్రతిష్ట గలుగునని వారెరుంగవలయును. మనకు స్వాతంత్ర్యము లభించిన తరువాత, యితరులను మనకు లోబరచుకొన ప్రయత్నించము. అస్వాతంత్రులగు ప్రజలను స్వాతంత్ర్యమునకై ప్రయత్నింపుడని కోరెదము. ఇట్లుచేయుటకు ముందుమనము పోరాడవలసి వచ్చినను మన కుత్సాహము మెండుగానున్నది. మనము నీచులకు లొంగవలసి వచ్చినది. కనుక మానయస్వతంత్రత మిక్కిలి సంతాపకరముగా నున్నది. ఘనుల చేతిక్రింద పడియుండుటయు మనకు దుఃఖమును గలిగించును. కాని నీచుల నిరంకుశాధికారము దుర్భరము. *క్రాంవెల్ చేసిన క్రూరకార్య

---

* క్రాంవెల్ (రాజ్యాధికారి ౧౬౪౯-౧౬౫౮)

ఆంగ్లేయులు తమరాజగు ఛార్లసు ఫస్టును యురిదీసిన తరువాత క్రాంవెల్ రాజ్యకార్యములకు ప్రధాన నేతయయ్యెను. ౧౬౪౯-౧౬౫౮ సంవత్సరముల నడుమ ఇంగ్లండునందు రాజు లేడు. రాజకుమారుడు ఫ్రాన్సు

ములు తొందరగా మఱపునకువచ్చును. కాని మెకాలేవ్రాసిన దుర్మార్గపు వ్రాతలు మఱచిపోవుట కష్టము. ఈతని వ్యాస ములను కొన్ని మనము చదిపినప్పుడు మనపరాభవాగ్ని ప్రజ్వ లించును. ఈయగ్ని ప్రతిపక్షుల వాదములను ముక్కలు ముక్కలుగా ఖండించినదాక చల్లారదు. మిల్టన్ మహా కవినిగురించిన వ్యాసమున ౧౬౪౯ సంవత్సరమున, ఇంగ్లండు దేశమున జరిగిన విప్లవమును గురించి వ్రాయుచు, మెకాలే యీభావమును వెలిబుచ్చుచున్నాడు. 'మన సామ్రాజ్యములో మిక్కిలి దురదృష్టవంతమగు దేశమొకటి యుండెను. ఆసమ యమున మన సౌభాగ్యమునకు వారి దౌర్భాగ్యమును, మన స్వాతంత్ర్యమునకు వారి యస్వాతంత్ర్యమును, అవసరమా యెను.' అహంకారమునం దీవాక్యమునకు సాటివచ్చునది మరియొకటి లేదు. పాఠకులు దీనిని బాగుగా గమనించవల యును. ఈవేదాంతము సామ్రాజ్యమును నిర్వహించు ప్రతి దేశమునకును సహజమే యైయున్నది. క్రాంవెల్ చేసినట్లు కృతజ్ఞత ప్రకటించుచు మనగొంతులు కోసినయెడల ముందు

---

దేశమునకు పారిపోయెను. క్రాంవెల్ మిక్కిలిదక్షుడు. ఈతనికాలమున ప్రజా రాజ్యము లేర్పరచుట కనేక ప్రణాళికలు తయారుచేయబడెను. కాని యవి చాలకాలమువరకు నిలువలేదు. వీనిలో Instrument of Government అను నదిముఖ్యము. తరువాత క్రాంవెల్ నిరంకుశ ప్రభువై సైనిక ప్రభుత్వ మతిదక్షతతో నిర్వహించెను. ఆంగ్లేయులపేరుప్రతిష్ఠల నిలిపెను.

సంతతులవారు కోపగించుకొందురు గాని. *మెకాలేగారి వాక్యములు మనజాతి యున్నంతవరకు మరపునకురావు. అవి తరతరములవారిని వేధించుచుండును. మెకాలే మాక్యవెల్లీ రచియించిన గ్రంథమును జూచి కోపగించుకొనినాడు. మాక్యవెల్లీని గురించి యీవిధముగా వ్రాసియున్నాడు. "ఇటలీదేశపు చరిత్రను, సారస్వతమును, బాగుగనెరింగిన ప్రతివాడును, మాక్యవెల్లిచే రచియింపబడిన గ్రంథము నేవగింపుతోడను, ఆశ్చర్యముతోడను చదువుచున్నాడు. ఈగ్రంథము మాక్యవెల్లీకి మితిలేని యపవాదము గలిగించినది. తడిగుడ్డలతో గొంతుకుకోయు పద్ధతులను నేర్పునవియు, నేర్పరితనమున నితరులను వంచించు విధములను బోధించునవియు నగు నీవాక్యములు మాక్యవెల్లీ వంటివాడు సిగ్గులేక బహిరంగముగా వ్రాయుటజూచి యాశ్చర్యపడనివాడెవ్వడుండును? ఈవ్రాతలు మనము చదివినప్పుడు మానవుడొకడు వ్రాయుచున్నాడని తోచదు. ఈభావముల నొక పిశాచము వెలిబుచ్చుచున్నదని తోచును." ఈవ్యాసమునందే మెకాలే యొకానొకచోట యీభావమును వెలిబుచ్చుచున్నాడు. "అప్పుడు సాధారణముగా వాడుకలోనున్న భావములనుతీసి, క్రమపరచి, చాతుర్యముగను, గంభీరమగు వాక్సరణిని, యసమానముగను వ్రాసియున్నాడు." ఇచ్చట మెకాలేయొక్క నిజమయిన భావము వ్యక్తమగు

* మెకాలే ౧౯వ శతాబ్దమున ఆంగ్లేయ వాఙ్మయాభివృద్ధికి మెకాలే యసమానమైన కృషిసల్పెను. మేధావంతుడు, శక్తివంతుడు భారతదేశములో లామెంబరుగా కొన్నిసంవత్సరము లుండెను, ఇండియను పీనలుకోడుకు కారకుడు.

చున్నది. మాకియవెల్లిదోషము, యీయభిప్రాయములు కలిగియు న్నందుకు కాదు. ఈయభిప్రాయములను చాతుర్యము గను, అతిసమర్థతతోడను వెలిబుచ్చినందులకు అనగా సామ్రాజ్యముల నిజస్థితి బహిరంగ పరచినందులకు.

ఇప్పుడు మెకాలేగారి యాసవ్యాము, ఆశ్చర్యమును గురించి యాలోచింతము. ఈ వ్యాసమునందే యాలెడిట్లు వ్రాయుచున్నాడు. 'లోకజ్ఞానముగలవాడెవ్వడును జనులందరకు నొకసిద్ధాంతమాచరణీయమని తలంచడు. అదిమంచిదియు, నీతిని బోధించినదియు గావచ్చును. అది బీదబాలుర కను సరణీయమైనకావచ్చును. కాని రాజనీతిజ్ఞుల కది యనుసరణీయముగాదు.' నీతిధర్మములను మెకాలే యెంతచులకన జేయు చున్నాడో చూడుడు! ఇవి రాజనీతిజ్ఞులకు గావట, పిల్లలకట! పరిహాసమునకై యాతడిట్లనినాడని కొంతమందితలచవచ్చును. ఇది పరిహాసముగాదు. పరిహాసమనుకొన్నను, యీపరిహాస మునందు యీవ్యక్తియొక్క నీచత్వము, అద్దములోని ఛాయ వలె ప్రతిఫలించుచున్నది. ఈ నీచత్వమే యాంగ్లేయప్రభువులకు సహజగుణము. ఆంగ్లీయు లీనీచత్వమున కలవాటుపడినారు. నీచత్వమును వారు సహింతురు. ఐరిషుప్రజ లిట్టివారు గారు. ఇట్టినీచత్వమువారెన్నడును సహించరు. పూర్వము మనకు జరిగిన యావమానములను, దుండగములను మనసులోపెట్టు కొను స్వభావముగలవారముగాము. కాని యీవిషయములను గ్రంధములలో వ్రాసి మనల నెత్తిపొడుచుటచేతను ప్రస్తుత సమయమున క్రూరాత్ములై మనల నవమానము చేయుటచే

తను, మనలోన న్నకోపజ్వాల ప్రజ్వలింపజేసి, మనలను క్రోధపూరితులుగా జేయుచున్నారు. ఈకోపదవానలము, ఆంగ్లేయ సామ్రాజ్యముతో మనకు సంబంధమున్నంతకాలము, మనలను, మనశత్రువులను దహించుచుండును. సంబంధము తెగిన మరునాడు యిది చల్లారును.

ఇంగ్లండు దేశములో నెవ్వరును మెకాలే వ్రాసిన వ్రాతలవలన భ్రమపడువారుండరు. కాని బర్నార్డుషా, జాన్ స్టూవర్టుమిల్లు, వ్రాసిన కొన్నికొన్ని వాక్యములలో చాలా అపాయమున్నది. మనము పంచకుల స్వభావము నెరుంగుదుముగాన, వారివ్రాతలు మనలను మోసగించజాలవు. సముద్దేశ్యములుగలవారు వ్రాసినవిషయములు మనలకలవర పెట్టును. బలవంతులగువారు బలహీనులదేశము జయించుట కొరకు సాకుకై వెదకికొందురు. ఇట్టివాకుల యెడమోసపోకుండ మనము జాగరూకులమైయుండవలెను. మిల్లుమహాశయుడు వ్రాసిన 'స్వేచ్ఛ'యను గ్రంథమున యీక్రిందిభావము గలదు. "అనాగరికజాతులను పరిపాలించుటకు, నిరంకుశప్రభుత్వమే యుత్తమమయినది. కాని యీపరిపాలన పాలితులయభివృద్ధికి తోడ్పడవలయును" బుల్సు అదరు ఐలండు (Bulls other Island) అను గ్రంథమునందు బర్నార్డుషా యిట్లు వ్రాయుచున్నాడు. "నాయంతర్జాతీయధర్మమును టిబెట్ వారు గౌరవించకపోయినయెడల నేను టిబెట్ దేశమును అణగద్రొక్కుటకు సంసిద్ధుడనైయున్నాను." బర్నార్డుషా గారిట్లుచెప్పుట సమంజసముగాలేదు. మనదేశములో ప్రజలనొక సిద్ధాంతము

నాచరింపుడని కోరుట ధర్మముగాని యితరదేశములవారిని బలాత్కారముగా నొకసిద్ధాంతమును నొప్పించుట ధర్మము కానేరదు. బర్నార్డుషాగారికి యాంగ్లేయులుచేసిన డెన్‌షావాయి దౌర్జన్యములనుగురించి చాలకోపముగలిగినది. అతడీ కార్యములను తనగ్రంథమున మిక్కిలి తీవ్రముగను, ఆవేశముతోడను ఖండించెను. కాని యింకొక వాక్యమునందు, ఫ్రాన్సు, ఇటలీ, రష్యా, జర్మనీ, ఇంగ్లండు దేశములతో కలసి, ట్రిపోలీ, సైబీరియా, ఆఫ్రికా దేశములను 'నాగరకజాతులుగా' జేయుట కొప్పుకొనుచున్నాడు. తనదేశస్థు లితరదేశమునాక్రమించుటకుప్రోత్సహించినంతకాలము, తనప్రజలు శాంతముగానుందురు. ఒకవంక సదోపిదులను ప్రోత్సాహపరచుటయు నింకొకవంక డెన్‌షవాయిహత్యలను ఖండించుటయు పరస్పర విరుద్ధములుగా నగుపడుచున్నవి. అతి ఘోరపాతకములను ఖండించుట నిస్సారముగను, నిరర్థకముగను నున్నది. అతడు తీవ్రముగా ఖండించిన క్రూరకార్యములను జేసిననే గాని యనాగరిక జాతులను నాగరికులుగా' జేయుటకు వీలులేదు. బర్నార్డుషాగారివంటి మహాశయు లీవాక్యములను వ్రాసిన పిమ్మట సామ్రాజ్య నిర్మాతలు తమ యంతరంగములలోపల నవ్వుకొనుచుందురు. సామ్రాజ్యము నుత్సాహముతో పొగడుకొనుచు నతడీ క్రిందివాక్యములను వ్రాయుచున్నాడు. "తన మాతృదేశము యొక్క పవిత్రతను భావించి, యా భావమునే యితరజాతులయెడల గనబరచువాడు యా వ్రాతలను జూచి యేవగించుకొనును." పాపము బర్నార్డుషాగారు

సామ్రాజ్యవాదులందరును యితరజాతుల యెడల ప్రేమ గలిగి తమ దేశమువలెనే యితర దేశములును పవిత్రములని యెంతురని తలపోయునుగాబోలు! 'ప్రజా ప్రతినిధి పరిపాలనము' అను గ్రంథమున జాన్‌స్టూవర్టు మిల్లుగూడ యిట్టి భావముతో వెలిబుచ్చుచున్నాడు. 'ప్రస్తుతము ప్రపంచములో నన్ని జాతులలో నాంగ్లేయులే స్వాతంత్ర్యమననేమియో తెలిసినవారు. పూర్వము ఇంగ్లండు చేసిన తప్పిదము లేవియైనను ప్రస్తుతసమయమున నితరజాతులను పరిపాలించుటయందు, ధర్మశక్తిమీదను, ఆత్మబలము మీదను నాధారపడియున్నది. ఇతరదేశము లేవియు, యీపద్ధతు లాచరణీయము లనిగాని, ప్రశస్తమైనవనిగాని నమ్మినట్లు గనపడదు.' వీరు అనాగరిక జాతులను నాగరికులుగా చేయుట డేక్ షహాయి ఘోర దుండగములవంటి కార్యముల వలననే. వారి వ్రాతలయందు గూడ మెకాలేకు సహజమగు నహంకారము కనబడుచున్నది. ఈ వ్రాతలు మనకు కోపము, సంభ్రమము, ఆశ్చర్యము నొక్కసారిగా గలిగించుచున్నవి. ఈసమస్యనుగురించి యనేకు లొసంగిన యభిప్రాయములను జదువుచున్నప్పుడు మనకు క్రోధమును, అసహ్యమును గలుగునుగాని కొన్ని వాక్యములు జదివినప్పుడు కడుపు చెక్కలైపోవునట్టు నవ్వుపుట్టును. మిల్లువ్రాసిన యీ వాక్యమునుజూడుడు. "ఉద్యోగములకై పెనుగులాడుకొనుట యాంగ్లజాతికి నైజగుణముగాదు. వారుదానియెడల నభిమానముజూపరు." ఆంగ్లేయులలో నుత్తము డనందగువాడే యిట్టియాశ్చర్యకరము

లగు నభిప్రాయములను వెలిబుచ్చిన నితరు లేమన నెదరు? ఈవిషయమై మనమందరము మిక్కిలి జాగరూకతతో మెలంగవలయును. సామ్రాజ్యమును గురించి యీ వ్యాసములలో సూచించిన యభిప్రాయములే గాక యింకయనేక విపరీతాభిప్రాయములు, అసందర్భపు మాటలు—— నీచభావములు ప్రకటింప బడుచున్న యీసమయమున మనము మిక్కిలి శ్రద్ధతో నీసమస్య నాలోచించి వివేకవంతులమై యుండవలయును.

ఇంక హోంరూలు పక్షము వారి కొక మాట చెప్పుట యవసరము. హోంరూలు లభించినతరువాతి ఐర్లండు దేశము సామ్రాజ్యమునకు విధేయతజూపునని వీరూహించుట పరిహాసాస్పదముగానున్నది. ఆంగ్లేయు లిట్టి యభిప్రాయములను గలిగియున్న గలిగియుందురుగాక! ఐరిషువారిలో నింత వెఱ్ఱివా రెవరైన నుందురా? దేశచరిత్రయు, అనుభవమును యీయూహను ఖండించుచున్నవి. హోంరూలుపక్ష నాయకులు తాము యిరువది ముప్పది సంవత్సరములు మాత్రమే దేశసేవ చేయగలరనియు, ఆకాలములో హోంరూలుకన్న నెక్కుడు స్వాతంత్ర్యము లభించదనియు వారు తలచెదరు కాబోలు! కాని హోంరూలు లభించెడు సమయమాసన్నమైనప్పుడు, మనజాతికి ధైర్యమును, శక్తియుగలుగును. సంపూర్ణ స్వాతంత్ర్యముకొరకై మన ప్రయత్నములప్పుడు ప్రారంభమగును. అప్పుడు మన పోరాటమును కొనసాగించుటకు నంసిద్ధులమగుదుము. ప్రస్తుతమింతకన్న నెక్కువగా చెప్పనవ

సరము లేదు. సమయము గడచినకొలది మనయాశయములును మారుచుండును. గడచినతరమువారి యాశయములు మన కాలమున మారిపోయినవి. ఈయాశయములను కొనసాగించుకొనుటకు మనశక్తి చాలదని సంశయించెడివారు మనదేశ చరిత్రను బాగుగా గమనింతురుగాక! మనలను జయించి నాశముజేయు పద్ధతులవలన లాభములేక మనలను మంచి మాటలతో సమాధానపరచుటకు ప్రయత్నములు జరిగెను. స్వల్పసంస్కరణ శాసనములు గొప్పవాటికి దారిజూపెను. అధికారులు ఐరిషుభూసమస్యను పరిష్కరించక తప్పదాయెను. ఒక * భూమిచట్టము తరువాత నింకొక చట్టముచేయబడెను. ప్రజలు క్రమక్రమముగా తమహక్కులను గమనించిరి. ఆంగ్లేయప్రభుత్వము నిరంకుశచర్య లవలంబించి హోంరూలు ఆందోళనమును చంప సమకట్టెనుగాని యీపద్ధతులువిఫలమయ్యెను. ఐర్లండుదేశమునం దంతటను స్థానికప్రభుత్వములు స్థాపింపబడెను. స్థానికప్రభుత్వములబల మభివృద్ధియైనతరువాత హోంరూలు నివ్వకతప్పదాయెను. ఇప్పుడు హోంరూలు లభ్యమైనది గనుక గమ్యస్థానము చేరకతప్పదని నిర్ధారణయగుచున్నది. ఐరిషుదేశ చరిత్రను, ఐరిషుప్రజల యభివృద్ధిని గమనించి యీయనుభవ మొసంగెడి గుణపాఠమును త్రోసివేయని ప్రతివాడును, హోంరూలు లభ్యమగుట సంపూర్ణస్వాతంత్ర్యము లభ్యమగుటకొరకే యని గ్రహించవలయును.

---

* Irish Land Laws

# పదునారవ ప్రకరణము

## యుద్ధము (ఉపోద్ఘాతము)

శ్లో॥ స్వధర్మ మపిచావేక్ష్య నవికంపితు మర్హసి
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోన్యత్ క్షత్రియస్య నవిద్యతే॥

తా॥ కుంతియా కాదు. నీవు స్వధర్మము విచారించినను యీ యుద్ధము విడువరాదని యేర్పడును. ఏలననగా, యీ ధర్మయుద్ధముకంటె మఱియొకటి మేలు గలిగించు కార్యము క్షత్రియునకు లేదు. —భగవద్గీత.

స్వాతంత్ర్యమును గూర్చి మనము చర్చించునప్పుడు, యుద్ధముసంగతి వ్రాయుటతప్పదు. ప్రజలకోర్కెలు ధర్మము మీదను, సత్యము మీదను నాధారపడియున్నవని ఋజువు చేయుట మాత్రమే స్వాతంత్ర్య సంపాదనకు చాలియుండిన యెడల, లోకములో నిరంకుశ ప్రభుత్వము లుండనే యుండవు. నిరంకుశ ప్రభుత్వములు సత్యధర్మములను సరకు చేయకుండుట వలన, హేతువాదము లేవియు వారిమనసును కరిగించజాలవు. ఇందుకొరకే యధర్మ ప్రభుత్వములను దౌర్జన్యముతో నెదుర్కొనుట యావసరమగుచున్నది. కావున విప్లవముల యొక్క ధర్మమును గురించి చర్చింతెము.

ప్రతియుడుగునను యిది యాచరణీయమా కాదా యని యాలోచించు మకొక్కపిరియగు విమర్శకుడు క్రోధముతో మన చర్యల ఖండించును. ఐర్లండులో యుద్ధమును గురించి

యాలోచించుట యేమి ప్రయోజనము? మనము యుద్ధము చేయనెంచినను సాధ్యము కాదు. ఇదికాక మనలో నెవ్వరును యుద్ధము చేయుట కిష్టపడరు. నిన్ను మొదలు పెట్టకుండ నెవ్వరడ్డుపెట్టుచున్నారు అని మనల నెత్తిపొడుపు మాటలాడును. ఈ యాలకవలన లాభమేమియులేదు. కాని ఇంగ్లండునకును మనకును యనాదినుండియు జరుగుచున్న పోరాటమును యుద్ధముచేసి పరిసమాప్తి నొందించవలయు నను వాదమును మనము గమనించవలసి యున్నది. వారుకూడ తిరుగుబాటొనరించుట సాధ్యముకాదనియే తలచుచున్నారు. ఈసందర్భమున మనము కొన్నిసంగతులు జ్ఞాపకముంచుకొనవలయును. అనేక సమయములయందు మనము మనకన్న బలాధికులతో పోరవలసివచ్చినది. ఇప్పుడును మనమట్లుచేయుటకు శక్తివంతులమైయున్నాము. ప్రస్తుతసమయమున ఐర్లండు, దుర్బలస్థితి యందున్న దనియు, ఇంగ్లండు నోడించుట యసంభవమనియు తలచుటకువీలులేదు. ఇంగ్లండు ఆ సమయమున మనలనంతిసులభముగా జయింపజాలదు. ప్రస్తుతసమయమున మనమూరకుంటిమేని (మనమాంగ్లేయులచేతిక్రిందనుండుటచే) ఇంగ్లండు చేయవలసియున్న యుద్ధములలో మనముగూడపాల్గొనవలసివచ్చును. మనకు రెండుపద్ధతులు గలవు. ఐర్లండు కొరకైనను యుద్ధము చేయవలయును; స్వాతంత్ర్యమునకైనను యుద్ధముచేయవలయును. ఇంగ్లండుతో సంబంధమున్నంత కాలము మనము తటస్థముగానుండజాలము. కావున యుద్ధము చేయుట యావశ్యమాచరణీయమై యున్నది. ఇంగ్లండునకు

సంభవించు విపత్తులలో మనమా దేశముతో కలిసియుండుట యెంతయుపద్రవకరమో సంపూర్ణ స్వాతంత్ర్యము బడయుటకు ప్రయత్నించుటయు నంతే యుపద్రవకరము. పరిస్థితులుమనకు మిక్కిలియననుకూలముగా మారినవి. ఇంగ్లండునకు లోపలినుండియు బయటినుండియు నుపద్రవముగలుగనున్నది. కార్మిక సమస్య దేశమును కలవరపరచుచున్నది. అది యెక్కడికిలాగునో మనమూహించజాలము.*ఇంకొక సమస్యయధికారులకుమితిలేనిభయము నుగొల్పుచున్నది. ఇందువలన యాంగ్ల దేశప్రధానామాత్యుడు రషియా చక్రవర్తి వలె యతి జాగరూకతతో నెప్పుడు తనప్రాణమునకు మోసముగలుగునోయని మెలగుచున్నాడు. లోకములో ప్రబలియున్న యశాంతి మనమనస్సుల నల్లకల్లోలపెట్టుచున్నది. ఇంగ్లండులోనేగాక ప్రపంచములో నన్ని దేశములయందును యిట్టికలవరములే జరుగుచున్నవి. అంతఃకలహములు, విదేశములతోయుద్ధములు దేశములనన్నిటిని కలవరపరచుచున్నవి. కావున నీసందర్భములలో మనమూరకుండుటకువీలులేదు. ఇతరులకొరకుగాని స్వదేశముకొరకుగాని యుద్ధముచేయవలసియున్నది. ఇతరుల పక్షము వహించి పోరనేల? మన దేశమునకే పాటుబడెదము. ఇది యెట్లున్నను ప్రస్తుత ప్రళయసమయమున తిరుగుబాటుచేయుట యొక్క ధర్మాధర్మములను చర్చించుటకెవ్వరును నభ్యంతరపెట్టరు.

---

*Militant sufferagate movement.
స్త్రీలు వోట్లు పొందుటకై యుద్యమము. దౌర్జన్య సహితము.

ఈసమస్య చర్చనీయమని తలచువారు మనదేశములో
కొంతమంది లేకపోలేదు. కావున నీవిషయమై తీవ్రముగ
చర్చ కొనసాగించవలయును. ఇట్టి చర్చయందు ధైర్యమును
ఓర్పును చూపవలసియుందుము. తొందరపడి యితరులను
దూషించుటచే మనపక్షమునకు బలముతగ్గును. సంశయాత్ము
లగువారు మనపక్షమునకు వచ్చుటకు మారుగా మనకు ప్రతి
కూలురగుదురు. అనేకమంది సందేహముల వలననో భయ
మువలననో మనలో చేరక యుపేక్షా భావము వహించి
యున్నారు. సత్యమువారికి తెలియజేసి వారికి తర్ఫీదు, శిక్ష
ణొసంగితిమేని, వారు మనపక్షమువహించి మిక్కిలియుత్సా
హముతో పోరుదురనుట నిశ్చయము. ఎమర్సన్ మహాశ
యుడు కాంకార్డుపట్టణమున సైనికుల జ్ఞాపకచిహ్నము యెదుట
నుపన్యసించుచు యమెరికాలో జరిగిన యంతఃకలహము
లలో నొకయువకుడు చూపిన ధైర్యమును గురించి ప్రస్తుతిం
చెను. ఈయువకుడు తానుముందు భీరువగునేమోయని భయ
ముచె చిన్నప్పటినుండియు నపాయముల నెదుర్కొనుట కల
వాటుచేసికొనెను. అభ్యాసమువలన నీతడు కొంతకాలమునకు
భయమును పూర్తిగా జయించెను. అతడు న్యూయార్కు
నగరములో నొకపదాతిగా చేరి యుద్ధరంగమునకుబోయి
మిక్కిలి ధైర్యసాహసములతో బోరి దేశమునకై తనప్రాణ
ముల నర్పించెను. ఈయువకుని జీవితచరిత్ర మన కొకగుణ
పాఠమును నేర్పవలయును. ఇట్టి యుత్సాహ పూరితులగు
వారి చరిత్రలను స్మరించి వారిననుసరించుటచేత మనధైర్య

సాహసములు హెచ్చును. మనలో ననేక వీరపురుషు లుత్పన్న మయ్యెదరు. కాని సైనికులకు కాయిక శిక్షమాత్రమే యొసం గుటతో సంతృప్తి నొందకూడదు. మానసిక శిక్ష యొసంగుట యందును మిక్కిలి జాగరూకత వహించవలసియున్నది. శారీరక సాధనములవలనను డ్రిల్ మొదలగు వ్యాయామ క్రీడలవలనను యొక సమూహమును సుశిక్షితులుగా జేసి నిస్సహాయులగు వారికిధైర్యము గొల్పెదము. మానసిక శిక్షవలన మనోధైర్యము లేనివారికిని, భీరువులకును, ముక్కోపులకును మనోనిగ్రహ మును, ఆత్మవిశ్వాసమును గలిగించెదము. మానసిక శిక్ష లేనిది శిక్ష యసంపూర్తియగును. కాయిక మానసిక శిక్ష సమానముగా నెవ్వరి కివ్వబడునో వాడే వీరుడనందగును. ఎమర్సన్ మహాశయుని కోరికలప్పుడే నెరవేరును. ఇట్టివీరులు ధైర్యముతో ముందునడచి శత్రువులనుజయించి దేశమునకై తమప్రాణముల నర్పింప సంసిద్ధులైయుందురు. కావున సం యాత్రుల నందరను, మృదువచనములతో మనపక్షమునకు ద్రిప్పుకొనవలయును. మనము సమత్వము వీడక దాక్షిణ్య చిత్తములతో ప్రతియంశమును విచారించ వలయును. శరీ రముమీద మనమెంత శ్రద్ధవహించెదమో మనస్సుమీద గూడ నంతే జాగరూకత వహించవలయును.

మన మీ యంశములను గురించి మాట్లాడునప్పుడు తిరుగుబాటొనరించుటకు మతమొప్పుకొనుచున్నదా, లేదా? యని విచారించవలయును. మతవిషయికచర్చయందు సంశ

యములును, భయములును మనకు మితిలేని వ్యధను కలిగిం
చును. మన మీకష్టముల నెదుర్కొని దాటవలయును. స్వతం
త్రజాతులు యుద్ధము చేయవచ్చును. దాని నభ్యంతరపెట్టు
వారెవ్వరు నుండరు. కాని తిరుగుబాటుగావించు హక్కు
అస్వతంత్రజాతుల కీయబడుటలేదు. ఐర్లండు దేశములో
మనకీ హక్కు లేదు. కావున మన ప్రతిపక్షులను మెల్లమెల్లగా
మనవైపునకు త్రిప్పుకొనవలెను. కాని స్వాతంత్ర్య సమస్య
తార్కిక విషయముగా పరిగణింపబడగూడదు. ఇది తర్కమున
కతీతమైయున్నది. యుద్ధము జరుగవలసిన సమయమువచ్చిన
ప్పుడు మనము సంశయాత్ములమై యుండక యేదోయొక నిశ్చి
తాభిప్రాయమును వెలిబుచ్చెదము. ఇందుకొరకే మనమీ
విషయమును బాగుగా తర్కించి యొకయభిప్రాయమునకు
రావలెను. తర్కము మాత్రము మనలను సంతోషపెట్టజాలదు.
ఐనను వాదములో ప్రతిపక్షులకన్న నెక్కుడు ప్రజ్ఞ చూప
గలమని నా నిశ్చితాభిప్రాయము. ఈకారణముచే నేను తిరుగు
బాటుచేయుటకై మన హక్కునుగురించి చర్చించుచున్నాను.
ఇతరదేశముల ప్రజలకీవిషయముల వలనగలుగులాభా
లాభములను నేను చర్చించుటలేదు. ఐర్లండు దేశమునకీ సమస్య
యెట్లువర్తించునో తెలియజేయుచున్నాను. ఈవిషయమును
గురించి యొకగ్రంథము వ్రాయదగును. కాని లాభములేని
యీచర్చనువదలి మనకు ప్రస్తుతమవసరమగు విషయములను
మాత్రము చెప్పెదను. క్యాథలిక్ మతమువారికీ విషయమెట్లు
వర్తించునో మొదట చెప్పెదను. గతశతాబ్దమున ఐర్లాండు దేశ

మున మతవిషయమై ప్రమాణముగ నెంచబడిన డాక్టరు మత్తైగారు యీక్రిందివిధముగా వ్రాసియున్నారు.

'మనమతము యీవిషయమై యేమియు నిర్ధారణగా చెప్పక వదలివేసినది. అనేకమంది వేదాంతు లీవిషయమై వ్రాసియున్నారు. వారిలో నధికసంఖ్యాకు లేమియుచెప్పలేదు.'

ఈవిషయమును గమనించవలెను. వేదాంతులు పక్షములు వహించి కొంతమందియొక పక్షమునను, మరికొందరింకొకపక్షమునను వాదించిరిగాని, మతాధికారు లీవిషయమై యేమియు నిర్ధారణగా చెప్పియుండలేదు. క్యాథలిక్ ప్రమాణమునందుకు వ్రాసితినో యిచ్చట విశదీకరించ నవసరము లేదు. ఏనను చెప్పెదను. ఐర్లండులో సైనికులలో నధికసంఖ్యాకులు క్యాథలిక్ శాఖవారైయుందురు. మునుపొకసారి క్యాథలిక్ గ్రంథకర్తలుకొందరు మతసంబంధమయిన యాక్షేపణలు చెప్పుటవలన చాలకష్టము సంభవించినది. ఈసమస్యమిక్కిలి క్లిష్టమును, సున్నితమునునై యున్నది. ఈకారణముచే మనమీ సమస్య నావు జేయుట తగదు. యుద్ధరంగమున మన తెలివి తేటల ననుసరించి ఎత్తులు వేయవలసివచ్చును. మనకు వీలైనప్పుడు శత్రువులమీదపడుటయు, సమయ మనుకూలించనప్పుడు పారిపోవుటయునవసరమగును. కాని సిద్ధాంతములలో నెత్తులు పనికిరావు. ఒక్కమార్గమే గలదు. ఈధర్మపథమునుండితొలగక మనసిద్ధాంతముల నాచరించుటొక్కటియే న్యాయమార్గము.

# పదునేడవ ప్రకరణము

## యుద్ధము — శాసనముయొక్క నిజమైనయర్థము.

అధర్మపుటధికారమును మనమాక్షేపించినప్పుడు, ప్రథమమున ధర్మమైన యధికారమన నేమియో నిశ్చయించు కొని దానినే మనమంగీకరించవలయును; 'శాసనము' అను పదమునకు నిజమైనయర్థమేమియో మనము స్పష్టముగా నెఱుంగవలయును. దానినిట్లు నిర్వచింపవచ్చును. శాసన మనునది వివేకముయొక్క నిర్ణయము. అది రాజ్యాధికారులచే ప్రచురింపఁబడును. దానియొక్క యుద్దేశ్యము జనసామాన్యము యొక్క క్షేమమే. కొందరి అభిప్రాయముల నిచ్చట పొందుపరచెదను. వివేకము ననుసరించియుండని యెడల మనుష్య ప్రతిపాదితమగు చట్టము శాసనమని చెప్పఁబడనేరదు. ఇట్లగుటచే నీశాసనములు శాశ్వతమైనచట్టములనుండి యుత్పన్నమైన వని తెలియఁగవలయును. ఈ యధర్మ శాసనములను గురించి సెయింటు థామస్ (Saint Thomas) యీవిధముగా చెప్పియున్నాడు. 'ఇవి శాసనములుగావు. ఇవిప్రజలను బలాత్కారముగా తమకు లోబరచుకొనుటకు చేయు కార్యములు.' సెయింటు అగస్టస్ 'ధర్మబద్ధముకాని శాసనము శాసనమే కాదని వచించియున్నాడు.' (ఎక్స్యైనాన్ ఎథికస్) బాలంమెజ్ అనువాడు యీవిధముగా చెప్పియున్నాడు. 'శాసనములు వివేకమువలన కలుగును. వివేకము ననుసరించియుండును. సంఘము వృద్ధి చేయుటకవి వివేకముతో నుపయోగింపఁబడును' ఈప్రక

రణమునందే. మరియొకచోట యీతడు సెయింటు థామస్ వెలిబుచ్చిన యభిప్రాయముల నొప్పుకొనుచున్నాడు. ‘రాజ్యము రాజుయొక్క యుపయోగమునకై గాదు. రాజు రాజ్యమునకై యేర్పడి యున్నాడు. ప్రభుత్వములన్నియు సంఘముయొక్క క్షేమమునకై స్థాపింపబడియున్నవి. కావున ప్రభుత్వాధికారులీవిషయమును గమనించి జనోపయోగములగు కార్యములను చేయుచుండవలెను’. ‘ప్రజాప్రతినిధి పరిపాలనము’ అనుగ్రంథమున మిల్లు మహాశయుడు స్పష్టపరచిన యభిప్రాయములుగూడ ప్రభుత్వముయొక్క యుద్దేశ్యము పాలితులక్షేమము కొరకనియే. క్రీస్తుపూర్వము బ్రతికియున్న ప్లేటోమహాశయుని యభిప్రాయముగూడనిదియె. ‘రిపబ్లికు’ అనుగ్రంథమునందు ప్లేటో ఆదర్శప్రాయమగు నగరమున పౌరులందరు సుఖముగా నుండవలయునని వ్రాసియున్నాడు. (రిపబ్లిక్. ౪ అధ్యా) కాల్డర్ వుడ్ అనువాడు యిట్లు వ్రాయుచున్నాడు. ‘ప్రజలయొక్క హక్కులను, ధర్మములను పవిత్రములుగా నెంచిన గాని యేప్రభుత్వమును న్యాయమైనదనియెంచగూడదు.’ (నవీన వేదాంతము. ౪ సెక్షను) ఈవిషయమున నందరు నేకాభిప్రాయులై యున్నారు. కావున మనదేశ ప్రభుత్వము యీపద్ధతులమీద నాధారపడి యుండనంతకాలము దానితో మనము పోరాడ వలసినదే. స్వాతంత్ర్యమగు ఐరిషుప్రభుత్వము స్థాపింపబడిన తరువాత దానికి మనము విధేయత జూపెదము. అప్పుడు ప్రభుత్వమువారు చేయుశాసనములు నిజమైన శాసనములుగ పరిగణింపబడును.

ప్రభుత్వముయొక్క శాసనములను ధిక్కారము జేయుట
కింకను మనము తలపడలేదు. కాని హక్కులేనివారు అధికా
రము వహించుచున్నారనియు, హక్కులేని యీ ఆంగ్లేయ
ప్రభుత్వమునకు మనము విధేయత జూపమనియు చాటు
చున్నాము.

"ఎటువంటి ప్రభుత్వమైననుసరే, దానికి మనము విధే
యతజూపవలెను" అనువారి అభిప్రాయములను ఖండించవల
యును అని బాల్ మెజ్ వ్రాసియున్నాడు. (యూరపియన్ నా
గరికత) ఈస్పెయిన్ దేశపుమతప్రచారకుని కన్న విప్పిచెప్పజా
లము. ఇట్టిఅభిప్రాయములు వెలిబుచ్చువారికి యీయన
యిచ్చిన ప్రత్యుత్తరమే తగియున్నది. "అధర్మపు టధికారము
అధికారమేకాదు. ప్రభుత్వముచేయుటకు పాలకులకుహక్కుం
డవలయును. ఈహక్కులేనిది దీనిని పశుబలమనిగాని, దౌర్జ
న్యమనిగాని పిలువవచ్చును. బాహుబలముచే నొక జాతిని
తనకు లోబరచుకొనినవాడు ఆరాజ్యమునకు హక్కుదారుడు
కాడు. అన్యాయముచేసి, పౌరులనందరను దోపిడిచేసి, అనవ
సరములగు పన్నుల విధించి, వారిహక్కులను గమనించక,
నిరంకుశముగా పరిపాలన నెరపుటకు సేనా బలమున్నంత
మాత్రమున నతడుచేయుకృత్యములన్నియు న్యాయములనిసమ
ర్థించుకొన నేరడు." ఈ గ్రంథకర్త యింక కొన్ని అభిప్రాయ
ములను స్పష్టముగాను, విపులముగాను వ్రాసి యున్నాడు.
ఉన్నతోద్యోగములలో నున్నవారు ఈభావములకు విరుద్ధ
ముగా చెప్పెడి విపరీతవచనములు మనకు బాగుగ తెలిసియే

యున్నవి. ఈగ్రంథమునందే మరియొకచోట బాల్‌మెజ్ యొక్కనిదర్శనముచూపి, దానికి తగినసమాధాన మొసంగి యున్నాడు. "డాన్ ఫెలిక్సు ఎమాట్ (Don Felix Amat) పాల్‌మీర మతగురువు ఐడియా ఆఫ్ ది చర్చ్ మిలిటంటు (Idea of the Church Militant)అనుగ్రంథమున యీభావములను వెలిబుచ్చుచున్నాడు. "సీసరునకు చేయవలసినపనులు సీసరునకు చేయుడు." అని క్రీస్తుస్పష్టముగా చెప్పియుండుటచే నెట్టిప్రభుత్వమునకైనను ప్రజలువిధేయులుగానుండవలయునని తేటపడుచున్నది." ఈతనిగ్రంథము రోమునగరమున మతగురువులచే నిషేధింపబడెను. ఇట్లునిషేధించుటకు కారణములేవైనను, ఇట్టిసిద్ధాంతములను ప్రతిపాదించు గ్రంథమును, ప్రజలందరును బహిష్కరించి మన మతగురువుల శాసనమును పాలించవలయును. ఇప్పుడు అమలులోనున్న ప్రభుత్వములను గురించియింతచాలును.ఇవి రాజ్యమునపహరించెననుట సత్యము. వానిబల మభివృద్ధి చేయబడుటచే అవిధర్మమయినవని తలచకూడదు. ఈప్రభుత్వములు చేసిన శాసనములను మన మెదిరించనంతమాత్రమున అవి ధర్మసిద్ధాంతములని మనమొప్పుకొనినట్లుగాదు. వానినొప్పుకొనినట్లు నటించుటయు మనకు సాధ్యముకాదు. ఈశాసనములనుధిక్కరించుటకుసమయ మింకనురాలేదు. ఇట్లాలసించుటకూడ యుద్ధములోనియెత్తే.

ఐర్లండులో నాంగ్లేయ ప్రభుత్వము అక్రమముగా స్థాపింపబడినదిగాన దానియధికారమును మన మంగీకరించము. కాని మొదట అక్రమముగా స్థాపింపబడినను, క్రమక్రమ

ముగా ప్రజలాయధికారమునకు సమ్మతిజూపిరనియు, అందు వలన ధర్మసమ్మతమయినదిగా పరిగణింపబడవలయు ననియు, వాదించువారికి మనమిచ్చు ప్రత్యుత్తరము స్పష్టమే. మనము ఇంగ్లండుయొక్క పరిపాలనకెప్పుడును సమ్మతి జూపియుండ లేదు. ఐరిషుచరిత్ర నొకమారు గమనించినయెడల యీ స త్యమే వెల్లడియగును. ఈయభిప్రాయముతో నేకీభవించని వారికి మరియొక విషయము మనవిచేయుచున్నాను. ఆంగ్లే యుల యధికారము మొదల ధర్మముమీద నాధారపడి యుండినను, అది ప్రస్తుతము, తన యధికారమును దుర్విని యోగము చేయుచుండుటచేతను, ఐర్లండునకు మితిలేని నష్ట ములుగ జేయుచుండుటచేతను, మనము దానితో ప్రతిఘ టించి పోరవచ్చును. ఆంగ్లేయుల యధికారము అక్రమముగా స్థాపింపబడినదనియే యింకను నేను నిశ్చయముగా నమ్ముచు న్నాను. డాక్టరు మర్రెగారు యీవిషయమై చర్చించి తన దృఢాభిప్రాయములను స్పష్టముగా తెలిజేయుచున్నాడు. ఆక్షే పణలన్నియు, యీయన యొసంగిన ప్రత్యుత్తరమువలన ప్ర తిహతమగును. ఆతడీ క్రింది విధమున వ్రాయుచున్నాడు. "ప్రస్తుతము మనము విచారించవలసిన విషయము ఒక ప్రభు త్వ మక్రమముగా స్థాపింపబడినను, అది దాని యధికారమును దుర్వినియోగము చేసికొనినయెడల, దానికి మనము తిరుగు బాటు చేయవచ్చునా?" యని. మన వేదాంతులలోనే ననేకుల యభిప్రాయము, యుద్ధముచేసి యిట్టి యధర్మప్రభుత్వమును రూపుమాపుట ధర్మసమ్మతమనియే. అవసరమయినయెడల,

ఆ దేశపు ప్రభువునుగాని, ప్రభువులనుగాని, పదభ్రష్టులుగా చేయవచ్చును. కాని యీక్రిందియంశములు నెరవేరియుండ వలెను.

౧. నిరంకుశ ప్రభుత్వముయొక్క చర్యలు మిక్కిలి దారుణముగా నుండవలయును.

౨. వివేకవంతులకును, ధర్మబుద్ధికలవారికిని, యీ నిరంకుశాధికారము విశదము కావలెను.

౩. ఈకఠారిర ప్రభులచే నొనర్పబడిన యధర్మకార్యముల ఫలితము, ఆతని ప్రతిఘటించి పోరి పదభ్రష్టునిచేయుట వలన గలిగిన ఫలముకంటె నెక్కువ హానికరముగా నుండ వలెను.

౪ ఈనిరంకుశాధికారమును తొలగించుటకు వేరు మార్గములేమియు లేకుండవలెను.

౫ జయముగలుగునని నైతికనిశ్చయ ముండవలెను.

౬ ఈవిప్లవము జనసామాన్యముచే నొప్పుకొనబడినదిగాను, వారిచే నడుపబడినదిగాను నుండవలయును. దేశములో స్వల్పసంఖ్యాకులు వీరితో చేరకపోయినను ప్రజల తిరుగుబాటు ధర్మరహితము కానేరదు. (వేదాంత వ్యాసములనుండి).

ఈషరతులలో కొన్నిటిని మర్రిగారు విపులముగా వ్రాసినారు. నేనిచ్చట ముఖ్యమైనవానిని మాత్రమే యెత్తి వ్రాసితిని. ఐరిషు దేశపరిస్థితుల కివియెట్లు తగియున్నవో ప్రతి

వానికిని బోధకాకమానదు. తిరుగుబాటొనరించుటకు కొన్ని షరతుల నియమించుడని మనము కోరినయెడల, మననాయకు లీషరతులకంటె కఠినమగు నియమముల నేర్పరతు రనుటకు సందియములేదు. వారిలో కొందరు జయముగలుగునను నైతిక నిశ్చయముతో తృప్తిపడరు. వారు జయముగలుగునని సంపూర్ణ విశ్వాసముండినగాని కార్యసాధనకు గడంగరు. యుద్ధమునం దిట్టి నమ్మకముండుట యసంభవము.

ఒకానొక ప్రభుత్వము అధర్మభూయిష్ఠ మగుటచే నాశమై పోయినప్పుడు దాని స్థానమున మరియొక ప్రభుత్వ మును స్థాపించుటకు సివిల్ ప్రభుత్వము యొక్క యుత్పత్తిని గురించి మనకు తెలిసి యుండవలయును. ఈకాలమున రాజు లు దైవాంశ సంభూతులనియు వారు చేసిన తీర్పులెట్టివైనను జను లు శిరసావహించవలయుననియు చెప్పువా రెవ్వరు నుండరు. కాని ఈవిషయమున ప్రజలకును ప్రభువులకును జరిగిన సంఘర్ష ణవలన, శాశ్వతమగు ప్రభుత్వమును గురించి కొంతజ్ఞానము మనకు లభించినది. మధ్యయుగముల వేదాంతచరిత్రయందు డీవులుఫ (De Wolf) అనువాడు యిట్లు వ్రాయుచున్నాడు. "రా జులు దైవాంశసంభూతు లను సిద్ధాంతమునకు వ్యతిరేకముగా, ప్రజలనుండియే సర్వాధికార ముద్భవించె నను సిద్ధాంతమును సూరెజ్ ప్రప్రథమమున ప్రకటించెను. ప్రజలసమ్మతివలన సివిల్ ప్రభుత్వ ముత్పన్న మయ్యెనని యాతడు రుజువుపరచెను. ఇట్టి ప్రభుత్వసర్వాధికారమును ఖండించుచు తమమీద నుంచినసమ్మక మును చెడగొట్టుకొనిన రాజులను ప్రజలు పదభ్రష్టుల

చేయవచ్చునని యతఁ డొప్పుకొనెను. (డి వుల్ఫ్ మధ్యయుగముల వేదాంత చరిత్ర.) యాంగ్లికనుల సిద్ధాంతములను సూరెజ్ చేసిన ఖండన సర్వజనాంగీకారము బడసినది. (యాంగ్లికనులు రాజులు దైవాంశ సంభూతులనియు, అతడేమి చేసిన నది మనమొప్పుకొన వలెననియు వారు నమ్మిరి). సుప్రసిద్ధ చరిత్రకారుడగు హాలమ్ యీవర్ణన సంక్షేపము విశదము, నిష్పక్షపాతము నని ప్రశంసించియున్నాడు. ఆంగ్లేయ మతగురువులను ఖండించుట కీతని యభిప్రాయములనే యుదహరించి యున్నాడు. ఈ యధికార మొకనిదిగాదు. సంఘమున కంతయు జెందియున్నది. ఈవిషయము మనకు ప్రామాణ్యులగు గ్రంధకర్త లందరచేతను నొప్పుకొన బడియున్నది. సెయింటు థామస్, సివిల్ చట్టములు, సుప్రసిద్ధ శాసన నిర్మాతలు దీని నంగీకరించియే యున్నారు. ప్రజలచే నొసంగబడిన యధికారముచే ప్రభువు శాసనములు చేయవచ్చునని గూడ నందరు నంగీకరించిన విషయమే. ప్రజలందరకును సమాన హక్కులుగలవు. కావున నొకనికి యింకొకనిమీద రాజ్యాధికారము చేయుటకు హక్కు లేదు. ఒకడు మరియొకని నేలపరిపాలించ వలయునో మన మూహింపజాలము. (యూరపియన్ సారస్వతము). డాక్టరు మత్రెగారు యాంగ్లికన్ పక్షమువారి సిద్ధాంతములను ఖండించిన వారిలో మెకంటాష్ గారు ముఖ్యులని వ్రాసియున్నాడు. ఈ మెకంటాష్ (Dr. Mackentash) "ప్రభుత్వ స్వరూప మేదియైనను దానికి మనము విధేయత జూపవలెనని పలుకుట విపరీతము"

అని వ్రాసియున్నాడు. డాక్టరు మత్త్రెగారతని గ్రంథమున (సివిల్ సర్వాధికారము నకు ప్రతిఘటన యను గ్రంథము) మెకంటాష్‌గారి గ్రంథమునుండి పెద్దవాక్యమును వ్రాయుచు ఆవ్రాతల నెక్కువగా ప్రశంసించి యున్నాడు. ఈవాక్యములో చాలవరకు జయము గల్గుట కాటంకములును, అపజయము వలన గలుగు నుపద్రవములను గురించియు నైయున్నది. నేను యిదివరకు వ్రాసిన వ్రాతలు కష్టములను, ఉపద్రవములను, దాచక నిర్భయముగా వ్రాసియుంటిని. కాని తిరుగు బాటుచేయుట యావసరమనియు, తప్పదనియు మనకుతోచి నప్పుడు, డాక్టరుమత్త్రెగారిప్రసిద్ధ వాక్యముల నందరును యొప్పుకొని తీరవలయును.

ప్రభుత్వమువారి యక్రమములకును, హింసలకును తాళజాలక ప్రజలుతిరుగబడిరేని యది ధర్మకార్యమనియే తలంచవలయును. కాని జయముగలుగునను నానుమాత్రి ముండవలెను. తిరుగుబాటొనరించుట యనేక కష్టములతోడను, అపాయములతోడను నిండియుండుటచే నత్యంతశ్లాఘనీయమై యున్నది.” మనము చేయుచున్న ప్రయత్నములయందు మనకు సంపూర్ణజయముగలిగెనేని యీప్రభుత్వస్థానమున మరియొకప్రభుత్వమును స్థాపించి నిర్వహించు బాధ్యతలు ప్రజలవైయున్నవి.

కాని క్రమముగా స్థాపింపబడి ప్రజాసామాన్యము యొక్క యభివృద్ధికి తోడ్పడిననేగాని ప్రభుత్వము న్యాయ

మైనదని చెప్పుటకు వీలులేదు. అక్రమములగు నాక్రమణల నెదుర్కొనుటయే మనకర్తవ్యము. ఒకానొకసమయమున ధర్మమునిూద నాధారపడియున్న ప్రభుత్వము ప్రస్తుతము నిరంకుశముగాను, క్రూరముగాను ప్రవర్తించెనేని దాని నెదుర్కొనిపదభ్రష్టులచేయవచ్చును. అధర్మమునిూదనాధా రపడియుండుటవలనను, మిక్కిలి క్రూరకార్యములు చేయు చుండుటవలనను, ఒకానొకప్రభుత్వము నాశమైనయెడల దానిస్థానమున మరియొకప్రభుత్వమును స్థాపింపవలెను. కొన్ని సమయములయందు యేమరుపాటున 'అరాజకస్థితినుండి స్వే చ్ఛవెడలు'నని చెప్పుటసామాన్యమైయున్నది. కాని యిదిసత్య ముకానేరదు. అరాజకస్థితినుండి నిరంకుశప్రభుత్వము బయ లుదేరును. ఒకయల్లరిమూకనడంచుటకు బలవంతుడగు ప్రభు వవసరము. కాని క్రమశిక్షయు, దృఢసత్త్వయమును గల ప్రజలు యీరెంటిలోనేదియుకోరక, స్వాతంత్ర్యమునకై గాఢప్రయత్నములు చేసిరేని వారు ప్రకృతి కనుగుణముగా ప్రవర్తించుచున్నారు. టర్నర్ గారు, స్యెంటు థామస్ గారి గ్రంధమునుండి తీసివ్రాసిన సిద్ధాంతమిట్లున్నది.

"నిరంకుశాధికారుల పరిపాలనమునుండి ప్రజలు పొందదగిన విముక్తి, యొక్కవ్యక్తిచే సాధింపబడనేరదు. అనేకమంది ప్రజ లొకసంఘముగా జేరి, తాత్కాలికముగా నింకొక ప్రభుత్వముస్థాపించి, శాసనములుచేసికొని, వాని ప్రకారమునడుచుకొనుటవలనగాని స్వాతంత్ర్యముబడయవీలు లేదు. అవివేకులును, ఛాందసులును నగుప్రజలు, అధికారుల

నధిక్కరించుటనుగురించి మాట్లాడునప్పుడు, మనము శాంతము వహించి, నిజమయిన యధికారమునకు మూలమగు సత్యమును గ్రహించగలమనియు, స్వాతంత్ర్యముయొక్క నిజతత్వమును గ్రహించగలమనియు, మనము నిరూపించవలయును.”

---

# 18 ప్రకరణము

## యుద్ధము—ఆక్షేపణలు

ప్రతిఘటనయొక్క అవశ్యకతనుగూర్చి యింతకుముందు ముచ్చటించి యుంటిని. దీనికి ప్రతికూలవాదములనుగూడ విమర్శించుట సంభావ్యము. మన సిద్ధాంతమును స్పష్టముగా తెలియజేయుటచేతనే సంశయాత్మకుల సంశయములను పారద్రోలి వారి మనములకు సంతృప్తి కలుగజేయగలము. కాని మనపద్ధతులయందు దూరదృష్టి యేమాత్రమును కనబడుటలేదనియు, అవి అనాచరణీయమనియు, మనము విప్లవము కలుగజేసి దేశమునకు మితిలేని హానికలుగజేయు చున్నామనియు,యిత్యాది వాదములు వారిని డోలాయమాన మానసులనుగా జేయుచున్నవి. సాధారణముగా జనసామాన్యము నాకర్షించునవి కండ్లయెదుట గనుపించుచు ప్రమాదకరముగా దోచెడు కష్టపరంపరలును, వాసిని జయించుమార్గములును, గానట్టి శాశ్వతములును పవిత్రములును, నగు సిద్ధాంతములు గావు. ఇట్టివారందరికిని యెత్తులు, యుక్తులు, మరి యితర శా

తాత్కాలిక ఉపాయములకన్న, జనుల కాదర్శముగా నుండి నట్టియు, ఉండదగినట్టియు సిద్ధాంతములు యొక్కడు ముఖ్య మను భావము వారికినచ్చజెప్పిన యెడల మనస్థానమును మరింత బలపఱచుకొనినవార మగుదుము.

మనలను వివేకముతో ప్రవర్తింపుడని చేయుచుద్బో ధనలు వివేకమునందు అఖండముగా కొరవడియున్నవారే చేయుచుండుట సమంజసముగాలేదు. కష్టములకోర్వలేక, తప్పించుకొని తిరుగుటకే యెప్పుడును ప్రయత్నించుచు, తమ లోపములను బయల్పడకుండుటకై ఓర్పును బోధించుమహా శయులు తమమూఢత్వమువలన ఆచరణశూరులెంత యుప హ్యంచుకొందురో తెలిసికొందురుగాక! ఇట్టిప్రయత్నములవలన "ఓర్పు" అను పదము అర్థవిరహితమగుటయేగాక యపవిత్రము గూడనగును. ఈవాదమునకు మన ప్రతిపక్షులు చేతగానియాభ్యం తరములచెప్పుదురు. "ఇదియంతయు సిద్ధాంతరూపమున బాగు గానేయున్నది. కాని దాని నాచరణయందుంచునప్పుడు మాన వులనేక ఘోరముల చేయుచున్నారు. ఇట్లుచేయుట హాని కరము "అని చెప్పెదరు. ఇట్టివాదములను ఖండించుచు" వేదాంత వ్యాసములు" అను గ్రంథమునందు డాక్టరుమత్రెగారు యీవిధ ముగా వ్రాసియున్నారు. "ఒక ధర్మసూత్రమును అల్పబుద్ధులు దుర్వినియోగము చేయుదు రను నెపమున ఆసూత్రమునే పూర్తిగా ఖండింపబూనుట హేతుయుక్తముగాదు. ఏదో రకపు మనుష్యులకు యేవో ప్రత్యేక సందర్భములలో బహి రంగముగా బోధించినచో హానికలుగునని వానిని అపతే

బోధించరాదనుట తప్పు." ఇది చక్కనిజవాబు. బాల్ మెజ్ యీవిధముగా వ్రాయుచున్నాడు. "ప్రజలకు దూరదృష్టి, వివేకమును బోధించునప్పుడు, వానిని కృత్రిమ సిద్ధాంతముల చాటున మరుగుపరచకుందుముగాక! విపత్పరంపరలవలన గలిగిన ఆందోళనను చల్లార్చుటకై సంఘమును గూర్చియు ప్రభుత్వములను గూర్చియు, ఉపద్రవకరములగు భావములను వెలిబుచ్చకుందుము గాక!" (యూరపియను నాగరికత, ౫౫ అధ్యాయము). ముఖ్యములగు సమస్యలను పరిష్కరింప వెరచువారిని గూర్చి బాల్ మెజ్ యీ క్రింది విధముగా వ్రాయుచున్నాడు. "వారి వివేచనాశక్తి పూర్తిగా నశించినదనియు, వారి జాగ్రతియు, వివేకమును నిష్ప్రయోజకములనియు, నుడువుటకు సాహసించుచున్నాను. ఈసమస్యలు వారు పరిష్కరించినను, లేక మానినను వారికి మనస్తాపము గల్గినవిధమున నవి యెవరిచేతనో పరిష్కరింపబడుచునే యున్నవి. ఆందోళనలు సాగుచునేయున్నవి. నిర్ణయములు జరుగుచునేయున్నవి." పూర్వపు ఫ్రాన్సు దేశమును గూర్చియు, ఆనాటి ప్రజలఅసంఖ్యాకములగు తీవ్రకష్టములను గూర్చియు టర్గను అను నాతడు వ్రాసిన యీక్రింది విషయములను గూడ పైవానికి తోడుగ చదువదగియున్నవి. "న్యాయమును, ధర్మమును ప్రజలయందు పురికొల్పవలసినవారగు మతాధికారులు ప్రజలకు భయోత్పాతము గలుగజేయు

నట్టియు, వారి కేమాత్రమును గిట్టనిదియు నగు నిరంకుశ పాలకవర్గముతో కలిసి పోయెనని ప్రజలు భావించిరి. (History of Philosophy—Chapter 56.)

ఈవాక్యముల నుండి మనము నేర్చుకొన వలసిన నీతి యొకటి గలదు. అధర్మము విచ్చలవిడిగా చెలరేగుచున్న పుడు కృత్రిమ సమాధానములతో సంతృప్తులమై దానిని సమర్థింపకూడదు. అధర్మ కార్యములను సుగుణ పుంజము లని తలంచ కూడదు. మనము వెంటనే ప్రతిఘటింప శక్తి చాలనంత మాత్రమున అధర్మమును నిరసించుట నేరముకా నేరదు. తీవ్రముగ ఖండించుట మన కర్తవ్యమే యగును. ఈవిషయములను జ్ఞప్తియం దుంచుకొనక చరించుటయే వివేక రాహిత్యము. ఇట్టి వివేకశూన్యత మనయందు లేదని మన వట్టుకు మనమైనను లోకమునకు చాటెదము గాక!

'విప్లవకారుడు' అను పదమునకు విపరీతార్థములు చేయుట తటస్థించినది. కృత్రిమము వలనను, దౌర్జన్యము వలనను, ఒకానొక జాతియొక్క స్వాతంత్ర్యము కొల్లగొట్ట బడి, తమ పూర్వాభ్యుదయమును నాశమొనర్చు నిర్బంధ విధానము వారిదేశమున సాగ నారంభించినచో నదియొకవిప్లవ మే యగును. కాని అది దుష్టవిప్లవము. క్రూరపాలనకు లోబడియుండి, ప్రభువుల నిరంకుశత్వమునకు తాళజాలక, నానాటికి కృశించుచున్న యొకజాతి, సహజస్థైర్యము తోడను సాధనసంపత్తి తోడను అట్టెలేచి తమపూర్వ స్వాతంత్ర్య

మును గడించుటకును, న్యాయబద్ధమగు ప్రభుత్వమును పునః ప్రతిష్ఠించుటకును ప్రబల ప్రయత్నము లొనర్చుచో నదియు మరియొక విధమయిన విప్లవమే. ఈ రెంటిలో నియ్యదియే జనాంగీకారమగు సహజవిప్లవము. విప్లవకారుల ఉద్దేశములను, సాధనములను,ఆదర్శములను బట్టియే మనము వారి యోగ్యతాయోగ్యతల నిర్ణయింపవలసి యుండును. సరియైన కారణములు గలవని తేలుచో అతనితిరుగుబాటులు సంఘమునకు సత్కార్యములనియే చెప్పబడవలయును. అట్టితిరుగుబాటు ఆనాటిని యథార్థమగు గౌరవస్థానమున పునః ప్రతిష్ఠించు ననుటకు సందియము లేదు.

బోసే (Bosseuih) అనుఫ్రెన్సు దేశపు వేదాంతి యిచట సమర్థింపబడిన వాక్యములను ఖండించువారలలో నొకడుగ గన్పించునని బాల్ మెజ్ నుడివియున్నాడు. ఐనను బోసె మరియొక సందర్భమున నీవిషయమును గూర్చి వ్రాసిన కొన్ని వాక్యములు పఠింప దగియున్నవి. "సామ్రాజ్యములలో జరుగు విప్లవములు ప్రభువుల గర్వభంగమునకై దైవప్రేరితములు." స్వాతంత్ర్యమునకై ప్రయత్నించు కార్యములనుండి మనలను వారింపదగిన వాక్యముగా దీనిని పరిగణింపగలమా? ఈశీర్షిక క్రిందనే ఆయనవ్రాసినవాక్యములనింకను పఠించుచో, అలనాటి గ్రీసుదేశస్థులును, రోమనులును ప్రదర్శించిన స్వాతంత్ర్య ప్రీతిని ధైర్యసాహసములను, మెట్టివారికైనను స్వాతంత్ర్యమునకు పురికొల్పగల మనోహరవాణి యందు

దర్శనమొనర్పగలము. స్వతంత్రమై అజేయమై చెన్నొందిన రీతి యుండిన ప్రాచీనగ్రీసుదేశమును గురించి ఆయన యిట్లు నుడివియున్నాడు.

'గ్రీసును అంతటిదివ్యప్రతిభతో ప్రకాశింప జేసినవి, పటిష్ఠమును, దూరదృష్టిసమన్వితమును నగుదివ్యశక్తి యే. దేనినిత్యజించవలెనో దేనినిరక్షించుకొనవలెనో సకాలమున తెలిసికొనివ్యవహరింపగల వివేకమే; దానికి దుర్జేయతను సమకూర్పగలిగిన మహత్తరవిషయములు దేశభక్తియు స్వాతంత్ర్యానురాగమును, ధైర్యసాహసశక్తులును నై యున్నవి.

ఉచ్ఛస్థితియందుండిన రోమునగరమును గూర్చియు, అందలి పౌరుల స్వాతంత్ర్యానురక్తిని గూర్చియు నీ మహాశయుడే యిట్లు నుడివియున్నాడు. "భూమండలమందలి ధనరాసులన్నిటికంటె వారు స్వాతంత్ర్యమును ఘనమైనదిగా దలచుచుండిరి. రోముయొక్క నామధేయమును స్వాతంత్ర్యభావమును వేర్వేరు పదార్థములు కావనితలంచుటయే ఆప్రజాస్వామికమునందు ప్రధానాశయముగా నుండెను." వారిపట్టుదల యీవిధముగ వర్ణింపబడియున్నది. "రోమనుల ఓపికయొక్క మహత్ఫలితమిదె కనుగొనుడు. కష్టములకలవడి విపత్పరంపరలచే మొండిబారిన ప్రజలు ఆశనొక దానిని విడనాడకుండిరేని ఎల్లహక్కులను రక్షించుకొనగలరని తలంచుటయందు విరుద్ధమేమియులేదు. మిక్కిలి హీన దశయందుండియును అధైర్యపు ఆలోచనలు వారెన్నడును చేసెడివారుకారు."

సనాతనములగు యిట్టి స్వతంత్రజాతుల యశస్సును గూర్చి యీమనోహర వర్ణనలను చదువుచుండ మనస్వాతంత్ర్య కాంక్ష యతిశయించి, మనదివ్యసాంప్రదాయముల యందు సహజముగ నిమిడియున్న ఉత్సాహవహ్నిని యింకను ప్రకాశవంతముగ ప్రజ్వరిల్లజేసి మన కర్ణపుటములయం దెల్లప్పుడును "శత్రుదల వహింపుడు, జయింపుడు. ఈనాడుమనకు బద్ధవైరులుగా నున్నవారు మనము విజయలక్ష్మిని గాంచినప్పుడు మన ఉత్తమస్తోత్రపాఠకులుగా పరిణమింతురు, లెండు" అనికార్యోత్సాహమును పురిగొల్పు చుండగలవు.

సర్వకాలములకును వర్తించు సిద్ధాంతములను మనము స్థాపించితిమనియు వివరములుమాత్రము యెప్పటికప్పుడు మారుచుండుననియు యెల్లరును గ్రహించియే యుందురు. ఈ విషయమును గూర్చి యించుక ప్రసంగించి యింతటితో యీ అధ్యాయములు ముగింతును. స్కాలాస్టిసిజమ్ ఓల్డుఅండ్ న్యూ (Scolasticism, Old and New) అనుతనగ్రంధమున డీవుల్ఫ్ అనునతడు యిట్లు నుడివియున్నాడు. "ఆధునిక కాలమున నెక్కుడు శ్రద్ధతో పరిశీలింప బడుచున్న చారిత్రిక, సాంఘిక శాస్త్రములు, సాంఘిక పరిస్థితులు దేశకాలముల ననుసరించి మారుచుండునని నిర్ధారణ చేసియున్నవి. మానవ హక్కులనుగూర్చి విమర్శించు శాస్త్రము (The Science of Natural Right) మానవుని నైతికాదర్శములను గూర్చి సూత్రప్రాయముగా లిఖించుటయే గాక, అందుతో బాటు ఆసిద్ధాంత

ముల సమలులో బెట్టవలసిన తత్కాలిక పరిస్థితులను గూర్చి కూడ విచారింప వలసియుండును." ఇత్యాది యాథార్థము. ఎట్లన, మనము సిద్ధాంతముల నాచరణలో బెట్టుట రేపటి దినమైనచో, వానిని యీనాటి పరిస్థితులను బట్టి నిర్ణయింప చుట యసందర్భమని తోచక మానదు. నిన్నటికిని నేటికిని ఆశ్చర్యకరములగు మార్పులు జరుగుట మనము ప్రత్యక్షముగా చూచుచునేయున్నాము. ఇరువది సంవత్సరములలో ఐర్లండు దేశస్థితి యెంతవిచిత్రముగ మారినది యీనడుమ జరిగిన సంగతులే రుజువు చేయగలవు. 1848 సంవత్సరములో ఐర్లండు దేశము అఖండమగు క్షుద్బాధను సహించియు, తిరుగుబాటొనరించి, విఫలమనోరథమై, పాదాక్రాంతమై క్రుంగెను. మరల తిరుగుబాటొనర్చు నావకాశములు యీపర్యాయముతో పూర్తిగా నశించినవని యెల్లరకును తోచెను. కాని ఐర్లండు దేశమునందలి యింగ్లీషు ప్రభుత్వపు బునాదులను గడగడ వడకించిన తిరుగుబాటొకటి యిరువదియేండ్లు ముగియక పూర్వమే బయలువెడల గలిగెను. సాంఘిక శాస్త్రము, మానవులహక్కులను గురించిన యభిప్రాయములను మార్చి వేసినదని డిఫుల్ఫ్ వ్రాసియున్నాడు. ఈమార్పులను బట్టి మనమాలోచించినచో రేపటినిగూర్చి యెవడు విచారించునో వాడే వివేకియని తోచకమానదు. ఎప్పటికప్పుడు మారుచుండు పరిస్థితులను మనముశ్రద్ధతో గమనింపవలయుననియు, ప్రతిపాంశమును యిట్టినూతన పరిజ్ఞానముతోడను, చరిత్రానుభవముతోడను సమన్వయ మొనర్చి విచారింపవలయునే

గాని, కేవలము నేనుకండ్లకగుపడు విషయములబట్టియే నిర్ణ
యము లొనర్పరాదనియు, డివుల్ ఫు నొక్కి చెప్పియున్నాడు.
ఈయన యభిప్రాయమును మనము మనః పూర్వకముగా
నామోదింపవలసియుండును. బ్రిటిషు సామ్రాజ్యమునుండి
ఐర్లండు విడిపోవలెనని యెల్లపుడును కోరుచుండినవారిని
గూర్చి యీ క్రిందివిధముగా నడువవచ్చును. చారిత్రిక ప్రమా
ణములను యెల్లపుడును ఆధారముగచూపి హారివాదములను
బలపరుచుకొనినది వారొక్కరే; ఆనిమిషపు పరిస్థితులు సర్వ
దా నిలిచియుండవని గుర్తెరింగిచరించినదియు వారొక్కరుమా
త్రమే. ముందురానున్న మార్పులనుగూర్చి యిప్పటినుండియు
విచారించుటకు మరువనిద్దియు వారొక్కరు మాత్రమే. సమ
యోచితముగ ప్రవర్తింతమని వాదించినవారెల్లరు, ఆనిమిషపు
పరిస్థితులనుచూచి మోసపోయిరి. కాని వేలకొలది సంవత్స
రముల ప్రమాణముగల యొకజాతియొక్క జీవితచరిత్రి
యందు ఐరిషుప్రజాస్వాతంత్ర్యమే ఆచంద్రతారార్కమగుశా
శ్వతసూత్రము. బ్రిటిషు అధికారము,దానియందొక తాత్కా
లిక పు సంఘటనము మాత్రమే.

---

# పందొమ్మిదవ ప్రకరణము.

## ముగింపు.

మనసిద్ధాంతముల నన్నిటిని స్థాపించితిమి. ఆక్షేపణ
లన్నిటిని ఖండించితిమి. ఇంకొక పనిమాత్రము మిగిలియున్నది.

మానవకోటి కాదర్శప్రాయులును, ఉత్తమోత్తములునునగు మహాపురుషులనుగురించి కొంతనుడువవలసియున్నది. వారు పొరబడుటలేదు, వారిదేసత్యమార్గము. వారిహృదయములలో సంకోచము లేవియు లేవు. సత్యమువారిలో మూర్తీభవించినదని చెప్పవచ్చును. తత్క్షణమే జయము సంప్రాప్తముకానియెడల వారుసాధారణపురుషులవలె నిరుత్సాహము జెందరు. ప్రజలందరును వారితో నేకీభవింతురని వారెన్నడును తలచరు. ఈధీరులు, యీపురుషసింహులు, తాము పూనిన కార్యమునందపజయము గాంచినను నిరాశజెందక, యనేక కష్టముల కోర్చి, శత్రువుల నెదుర్కొనెదరు. ప్రజల నావరించియున్న మూఢ విశ్వాసములను పారదోల వారు ప్రయత్నించెదరు. వారు స్వార్థము నెరుగరు. ప్రజలు మరచిన యొకానొక సత్యమును ప్రతిష్ఠించుటకును, తమదేశమునకు కీర్తియు, ప్రతిష్ఠయు, దెచ్చుటకును వారు తనప్రాణముల ధారబోయుదురు. ప్రస్తుతము ప్రజలు నిస్సహాయులై యుండినను, ముందుముందు వారు తమ మార్గమునకు వత్తురని వారికి దెలియును. తాము సత్యమునకును, ధర్మమునకును పోరుటవలన తమ్మెదుర్కొను వార లీపదునాల్గు జగముల యందెవ్వరును లేరని వారు దృఢముగా నమ్మియుందురు. తామనేక కష్టములకు లోనుగావలసి వచ్చినను కొంచెమైనను ఖేదము నొందరు. వారికి చావనిన లక్ష్యము లేదు. ఇట్లనుట వలన వారు బ్రదుకుట కష్టమని యెంచి ప్రాణత్యాగము చేయుదురని తలచగూడదు. ప్రపంచ సుఖములను వారికంటె నెక్కువగా ననుభవించిన వారె

వ్వరును లేరు. జీవితము యొక్క గభీరత వారికి బాగుగా తెలియును. వారుజీవించినంత కాలము బ్రహ్మానందము ననుభవించిరి. నిరంతరము స్వాతంత్ర్యమునకై పాటుబడు చుండిన జీవికి మృత్యువు విశ్రాంతి యొసంగు నని వారు తలచుచుందురు గాని మృత్యువు వారి కేమాత్రమును భయము గొలుపదు. ధర్మమునకై ప్రాణత్యాగము చేయ భయపడువాడు జీవించ నర్హుడుగాడు. ఈభావముననే వారుభయమును విడి ప్రాణముల నర్పించిరి. కష్టములన్నియు, వారిపాలనేబడి, నిస్సహాయులై యున్నతరి వా రసమానమగు ధైర్యమును ప్రకటించిరి. ఇట్టి సందర్భములయందును, సద్భావము, ప్రేమ, దాక్షిణ్యము వారని వీడలేదు. వారితరుల మెప్పులకుగాని, నిందలకుగాని కొంచెమైనను లక్ష్యపెట్టరు. ప్రజల గాఢ దేశాభిమానమువలనను, సుశిక్షవలనను ఉత్సాహము వలనను, దేశమభ్యుదయము జెంది, స్వాతంత్ర్యము కరతలామలకమయినపుడు, ప్రజలు పొందగలిగిన జయము యీమహాపురుషులు చేసిన కృషివలననే యని లోకము గ్రహింతురుగాక!

ఈలోకోత్తర పురుషులను గురించి, ప్రపంచములో నద్వితీయుడనియు నసమానుడనియు,పేరుగాంచిన వక్త డేమాస్థనీస్ మహాశయుడు, అతని సహజ గంభీరవాగ్ధోరణిని, ప్రశంసించి యున్నాడు. ఈ మహాశయుని వాక్యరత్నములను జదివినపుడు మనహృదయములుప్పొంగక మానవు. డెమాస్థెనీసునకు ప్రతిపక్షుడగు ఎస్కైన్సు (Easchînes)అనువాడు, ఎథీనియనులకు డెమాస్థనీ సొసంగిన సలహావలన వారి కపజయము

గలిగెనని యూహించి తీవ్రముగా ఖండించెను. ఈయాక్షేపణకు ప్రత్యుత్తర మొసంగుచు డెమాస్థనీ సిట్లుపన్యసించెను.

"మన కార్యముల ఫలితము మనకు ముందుగా తెలిసియుండినను, ఎథెన్సుప్రజాస్వామ్యము దాని విధ్యుక్త ధర్మము నుండి యొకయడుగైనను తొలగియుండదు. ధర్మమార్గము నుండి తొలగుట మనప్రతిష్టకును, మనపూర్వుల గౌరవమునకును, ముందుసంతతులవారి క్షేమమునకును భంగము కలుగజేయును. మనముచేసిన ప్రయత్నములు విఫలములైనట్టు మన కగపడవచ్చును. కాని మనము చేయునది లేదు. ఇది మానవుల కందరకును సహజమే. జయాపజయములు దైవాధీనములు"

ఎథీనియనుల నతడి ట్లుద్బోధించుచున్నాడు.

"మనపూర్వులు జయార్థులై యెన్నికష్టముల కైనను వెనుదీయరైరి. వారు మొదలుపెట్టిన మహాపోరాటమును మనము విరమించితిమేని మనలను ఛీ యని పిలువనివారెవ్వరునుండరు."

ఆమహాశయుడు నీచత్వమున మునిగియున్న విదేశీయులనుగురించి ముచ్చటించుచు యిట్లుపలికెను.

"పూర్వము మనవారు స్వదేశరక్షణార్థమై నీచత్వమున కెన్నడును పాల్పడియుండలేదు. తమయాత్మ గౌరవమును ప్రతిష్ఠించుట కెన్నడును యుద్ధముచేయ వెరువలేదు."

మఱియు ఎథీనియనుల స్వాతంత్ర్య ప్రియత్వమును గురించి యిట్లు చెప్పుచున్నాడు.

“బలిష్ఠములైన యధర్మరాజ్యములకు లోబడియుండున ట్లెవ్వరును, ఏసమయమునందును మన ప్రజాస్వామికము నొప్పింపలేకపోయిరి. ప్రతి యుగమందును మన దేశమాత యాధిక్యతకొరకును, గౌరవముకొరకును, స్వాతంత్ర్యముకొరకును వారు తీవ్రప్రయత్నములు చేయుచుండిరి.”

థేమిస్టాకిలిస్ (Themestocles) అనునతని జ్ఞాపకార్థమై ముచ్చటించుచు గొప్పయుద్దేశ్యములతో కృషిచేసిన తమపూర్వులనుగురించి యాతడిట్లు ప్రశంసించు చున్నాడు.

“ఆరోజులలో ఎథీనియనులు తమయస్వతంత్రతకు సహాయభూతులు గాగల వక్తలకొరకుగాని, సేనాధిపతులకొరకుగాని వేచియుండలేదు. స్వాతంత్ర్యము లేనిజీవనము వారు హేయముగజూచిరి”

మఱియు సభికుల నీవిధముగా ప్రశంసించు చున్నాడు.

“ఈపవిత్ర సిద్ధాంతములు మీరుతప్ప మరెవ్వరును నాచరణయందుంచలేరని చెప్పుట కెంతయు గర్వపడుచున్నాను. నాజీవిత కాలములోనే మన ప్రజా స్వామికము యొక్క యుద్దేశ్యము లివియేయని నేను నిరూపించగలను.”

ఈవాక్యములతో తృప్తిజెందక, గాంభీర్యమునకును,ఔన్నత్యమునకునీడులేని యీభావములను వెళ్ళిబుచ్చుచున్నాడు.

"ఓ, ఎథీనియనులారా! మనయందరి స్వాతంత్ర్యమునకును, క్షేమముకొరకును, పోరాడుటకై దీక్షబూనుట యధర్మము కానేరదు. నేను మనపితరుల సాక్షిగా చెప్పుచున్నాను. మ్యారథాన్ యుద్ధరంగమున పర్షియనుల కెదిరి, తమస్వాతంత్ర్యమును రక్షించుకొనుటకై హోరాహోరిగా పోరాడిన మహాశయులును, ప్లాటియా యుద్ధరంగమున తమ ప్రాణముల ధారబోసిన శూరశిఖామణులును, సెల్యామిసి నావికా పోరాటమున ధైర్యోత్సాహములతో బోరిన వీర సైనికాగ్రణులును ఆర్టిమీసియమ్ మున్నగు మహాస్థలముల యందు తమ మాతృభూమికై ప్రాణత్యాగమొనరించిన యోధాగ్రేసరులును ఇంకయనేక రణరంగములయందు నిహతులైనవారును, తమ పోరాటమునందపజయముగాంచినను మనకత్యంత గౌరవనీయులై యున్నారు."

ఐరిషు దేశనాయకులును, వీరులును నగు టోను, ఓనెల్లు, ఓడానెల్, మిచ్చెల్ మొదలగు వారును యిటువంటివారే. వీరి పవిత్రచరిత్రలను చదువునప్పుడు మన కుద్రేకము గలిగి హృదయము ఉప్పొంగక మానదు. వీరిఘనకార్యములను తలపోసిన కొలది, వారియందు మనకు గౌరవమును, వారిపజయములకు లెక్కసేయక తమమాతృదేశమున కొనరించిన కృషి కానందమును, గలుగుచున్నది. మనమందరము యీమహాపురుషుల మార్గమును పట్టుదలతో ద్రొక్కితిమేని మనకు జయము సమకూరక మానదు. ఈసందర్భమున,

నాకు ధర్మాపొలే యుద్ధరంగమున పడిన వీరుల జ్ఞాపకార్థమై చెక్కబడిన శాసనముమీది మాటలు జ్ఞాపకము వచ్చుచున్నవి. "పాంథుడా! లెసిడిమోనియనుల యాజ్ఞల శిరసా వహించి మేమిచ్చట విశ్రమించియున్నామని, వారికెరింగించుమా." గాంభీర్యమునం దీశాసనముతో సమానమయిన దెచ్చటనులేదని రస్కిన్‌మహాకవి పొగడియున్నాడు. మిచ్చల్ మహాశయునిచరిత్ర వ్రాసినవాడును యీవాక్యములు మిచ్చలుమరణశాసనముమీద సువర్ణాక్షరములలో చెక్కబడుట కర్హము లయినవని ప్రశంసించి యున్నాడు. ఈవాక్యముల భావమును గుర్తెరింగిన వాని కపజయ మన నేమియో తెలియదు.

మనకాదర్శప్రాయులగు మహాశయులనుగురించిప్రశ్వసించునప్పుడు స్వవిషయముకొంత చెప్పకతప్పదు. మనపూర్వులచే పరంపరానుగతముగా నొసంగబడిన వైభవమునకు వారసులమని గమనించి వారిచే నున్నతముగా స్థాపింపబడిన ఐరిషు స్వాతంత్ర్య పతాకముయొక్క వైభవమును చాటుటయేగాక మనమును యీపతాకమును గలిగియుండుట కర్హులమని లోకమునకు వెల్లడిచేయవలెను. జాతీయపతాకముయొక్క గౌరవాగౌరవములు, దానివిషయమై మనకుగల భావముల మీద నాధారపడియుండును. దాని సన్నిధ్ధలములయందును, అన్నిసమయములయందును, మన ప్రాణముల నర్పించియైన రక్షింపబూనితిమని దానికి పేరుప్రతిష్టలు గలుగును. ఇట్లు

గాక పతాకమును విడనాడితిమేని దానికిమితిలేని అపయశము గలిగించినవారమగుదుము. ఈరోజులలో మన పూర్వులను పొగడుటయు, వారి స్వాతంత్ర్యాదర్శములను నిరసించుటయు ప్రబలుచున్నదిగాన మన మీయంశములను జ్ఞాపకముంచుకొనవలయును. ఇట్టి యాదర్శములను, మనపూర్వులయుత్సాహమును గలిగియుండి, మన పోరాటమునందు సంపూర్ణజయము గలుగునని యాసించు మనలను పిల్లలనియు, అవివేకులనియు, ఆదర్శప్రియులనియు, పిలుచువా రనేకులుందురు. ఈయాక్షేపణలకు మన మీయవలసిన ప్రత్యుత్తర మొక్కటియే. ఈప్రత్యుత్తరము, మన పతాకమునెడలను, చరిత్రయెడలను, ధర్మములయెడలను గౌరవమును, భక్తిని చాటునదిగా నుండవలెను. మన పతాకములను దూషించువారును, జాలిదలచునట్లు నటించువారును, వారిపతాకములనుగూడ మనమిట్టి భావములతోనే చూచెదమని గ్రహించెదరుగాక! మన మాడంబరరహితులముగా నున్నంతమాత్రమున, అశక్తులము గామనియు, స్వాతంత్ర్యము లభించిన తరువాత, నున్నతపదవుల నాక్రమించి, వారికంటెమిన్నయై యుండెదమనియు, వారు గ్రహించెదరుగాక! మానవజీవితమును, సారస్వతమును, అస్వాభావికముల తోడను, టక్కుల తోడను, డంబములతోడనుగూడియున్న యీసమయమున, మనముమిక్కిలి జాగరూకులమైయుండుటయవసరము. ఇంకను, అవ్యక్తమున పడియుండుట సమంజసముకానేరదు. మనము, ఆత్మవిశ్వాసముతో మనకు సహజమగు మర్యాదను మేళవించి,

జాతీయపతాకముయొక్క గౌరవమును రక్షించవలయును. భీరుత్వమును, నీచత్వమును జూపి పతాకమునకపఖ్యాతి దేగూడదు. శత్రువులు దానికగౌరవము కలుగ జేసినప్పుడును, పతాకమునకు హీనదశసంప్రాప్తమైనప్పుడును, మనప్రాణములనర్పించియైన దానినుత్తమముగా ప్రతిష్ఠించవలయును. దానికున్నతదశ సంప్రాప్తమైనయెడల దానికీర్తిని గానము చేయవలయును. దానికొరకై సర్వకాలసర్వావస్థలయందును సంతోషముతోడను పట్టుదలతోడను ప్రయత్నించవలయును. మనపూర్వులు చేసినఘనకార్యములను స్మరించుచు, ప్రజలనుత్సాహమునకు బురికొల్పుచు, అందరను ఏకీభవించి కార్యసాధనకు గడంగవలయును. అప్పుడు అపజయమనునది యుండనేరదు. స్వాతంత్ర్యములభించదనిసందియము లేమియు నుండకూడదు. మన మెల్లప్పుడును "స్వాతంత్ర్యములభించును" అనిదృఢనిశ్చయము గలిగియుండవలయును. కాని "స్వాతంత్ర్యములభించునా" యనిసంశయాత్మకులమైయుండగూడదు. ఈ కాలమునగూడ నిరుత్సాహపడువారనేకులున్నారు. వారికి సంశయములు మెండు. మనదృఢవిశ్వాస మీసంశయములన్నిటిని పటాపంచలు చేసినది. భవిష్యత్కాలము దీనిని నిరూపించగలదు. స్వాతంత్ర్యము లభించిన తరువాత, ఐరిషుదేశచరిత్రను వ్రాయువారు మనముచేయుచున్న మహత్కార్యమును మిక్కిలియాశ్చర్యముతో ప్రశంసించెదరు. గ్రీసు రోమకరాజ్యముల ప్రాభవమును వైభవమును మించినమనదేశవైభవము, లోకమునకంతటికిని ఆనందము గొలుపుననుటకు సందియములేదు.